# శ్రీమదాంధ్ర

# వేదాంత పంచదశి

## కళ్యాణామృత వ్యాఖ్యాసమేతము

తృతీయ సంపుటము

## ఆనందపంచకము

రచయిత:
రాయప్రోలు లింగనసోమయాజి

ప్రచురణ
తిరుమల తిరుపతి దేవస్థానములు తిరుపతి
**2012**

**SRIMADANDHRA VEDANTA PANCHADASI**
**volume - III - Ananda Panchakamu**

**By**
**Rayaprolu Linganasomayaji**

**Edited by**

Prof.Ravva Sri Hari

Vidwan Mudivarti Kondamacharyulu

T.T.D. Religious Publications Series N0-243

© All Rights Reserved

First edition : 2012

Copies : 1000

Published by:
**Sri.L.V. Subramanyam I.A.S.**
Executive Officer,
Tirumala Tirupati Devasthanams,
Tirupati.

D.T.P. Type Setting
**Office of the Editor-in-Chief TTD, Tirupati.**

Cover design:
**B. Gurukumar Reddy**

Printed at :
Tirumala Tirupati Devasthanams Press
Tirupati.

## ముందుమాట

సామాన్యులకు సైతం సులభంగా అర్థమయ్యేటట్లు వేదాంతాన్ని గూర్చి సమగ్రంగా తెలిపిన గ్రంథాల్లో "వేదాంతపంచదశి" ఒకటి. సారళ్యమూ, పండితామోదమూ, శాస్త్రీయతా కల్గిన ఈ గ్రంథం 1. వివేకపంచకం 2. దీపపంచకం 3. ఆనందపంచకం అని మూడు విభాగాలుగా విభజించ బడింది. ఒక్కొక్క భాగంలో ఐదు ప్రకరణాలున్నాయి. మొత్తం గ్రంథంలోని ప్రకరణాలు పదిహేను. పంచదశి అనే పేరు దీనికి కల్గడానికి కారణమిదే. ఇందులోని శ్లోక సంఖ్య 1485. ఈ గ్రంథాన్ని పారాయణం చెయ్యడమే గొప్ప ఆధ్యాత్మిక సాధనమనీ, ఒక్కొక్క ప్రకరణాన్ని మనసుకు పట్టించుకొని చదివినట్లయితే గ్రంథం పరిసమాప్తమయ్యేటప్పటికి అద్వైత వేదాంతం హస్తామలకం కాక తప్పదని విద్వాంసుల అభిప్రాయం.

విజయనగర సామ్రాజ్యస్థాపనకు (1336) మూలకారకుడైన మాధవ విద్యారణ్యస్వామి సంస్కృతంలో ఈ పుస్తకాన్ని రచించారు. వీరి జననకాలం 1302 ప్రాంతమనీ 1387 ప్రాంతంలో బ్రహ్మైక్యాన్ని పొందారనీ, తన ఎనుబదవయేట భారతీతీర్థుల అనంతరం శృంగేరి పీఠాధిపత్యాన్ని స్వీకరించారనీ, పూర్వాశ్రమంలో విజయనగర పాలకుడైన హరిహరరాయలకు గురువూ, హితబోధకుడూ మంత్రిసత్తముడూ అని చారిత్రకుల నిర్ణయం.

విద్యారణ్యులు శ్రౌతస్మార్త వేదాంత ఛందో వ్యాకరణ మీమాంసాది శాస్త్రాల్లో అఖండ ప్రజ్ఞా ధురంధరుడు. హిందూ ధర్మానురక్తీ, రాజనీతి చతురతా, దేశభక్తీ ఈ మహనీయుని పాండిత్య ప్రతిభకు వన్నెపెట్టాయి. శతాధిక గ్రంథకర్తయైన ఈయన రచనల్లో వేదార్థప్రణాళిక. జైమిని న్యాయమాల, పరాశర మాధవీయం, సర్వదర్శన సంగ్రహం, జీవన్ముక్తి వివేకం, శంకరవిజయం, అనుభూతి ప్రకాశిక, వేదాంత పంచదశి మున్నగునవి సుప్రసిద్ధాలు. ఈ మహామనీషి తన తమ్ముడైన సాయణునితో కలిసి చేసిన మహాకార్యాల్లో సాయణభాష్యమనే పేరుగల వేదభాష్యరచన యొకటి.

శ్రీ జగద్గురు కళ్యాణానంద భారతీమాంతాచార్యవర్యుల ఆదేశంతో విద్యారణ్యుల సంస్కృతవేదాంత పంచదశికి సుప్రసిద్ధ విద్వాంసులు శ్రీరాయప్రోలు లింగన సోమయాజిగారు కల్యాణామృతం అనే పేరుతో తెలుగున వ్యాఖ్యానం వ్రాశారు. ఇందులోని ప్రతిపదార్థం, భావవివరణం, క్లిష్టస్థల స్పష్టత కోసం సంక్షేపార్థరచనం కారణంగా ఈ గ్రంథం సర్వజన సుబోధకమై విలసిల్లుతూ వుంది. భారతీయ సంస్కృతి ప్రచార కార్యక్రమ నిర్వహణలో భాగంగా తిరుమల తిరుపతి దేవస్థానాలు ఈ ఆంధ్రవేదాంత పంచదశిని పాఠకుల సౌకర్యార్థం మూడు సంపుటాలుగా ప్రచురించింది వాటిలో ఇది రెండవసంపుటం. ఆధ్యాత్మిక తత్త్వజిజ్ఞాసువుల ఆదరాభిమానాలను ఈ పుస్తకం పొందగలదని నమ్ముతున్నాను. ఈ గ్రంథాన్ని పారాయణచేసిన భక్తకోటికి ఆ దేవదేవుని కృపా కటాక్షములు సమృద్ధిగా లభించాలని ప్రార్థించుట నా భాగ్యము.

తిరుపతి
తేది:29.12.2011

(ఎల్.వి.సుబ్రహ్మణ్యం)
**కార్యనిర్వహణాధికారి**
తిరుమల తిరుపతి దేవస్థానములు

# విషయసూచిక

## 11. యోగానందప్రకరణము


| విషయము | శ్లో |
|---|---|
| బ్రహ్మానందము సుఖహేతువు | 1 |
| బ్రహ్మానందము త్రివిధము | 11 |
| బ్రహ్మమానంద స్వరూపము | 12 |
| సుఖస్వరూపత్వము స్వప్రకాశత్వము ఆనందలక్షణములు | 22 |
| సౌషుప్తికసుఖ స్వరూపము | 29 |
| సౌషుప్తికసుఖము బ్రహ్మానందము | 66 |
| సుషుప్తియం దానందమయుని బ్రహ్మానందానుభవము | 67 |
| గురుశాస్త్రములు బ్రహ్మానందసాధనములు | 78 |
| ఆనందభేదనిరూపణము | 85 |
| జాగరితమునందు బ్రహ్మానందోపాయము | 89 |
| వాసనానందస్వరూపము | 94 |
| సమాధియందు నిజానందానుభవము | 99 |
| బ్రహ్మానందమునందసాతత్యము | 120 |
| జాగరితమునందు బ్రహ్మానందానుభవము | 126 |
| స్వప్నమునందు బ్రహ్మానందము | 132 |

## 12. ఆత్మానందప్రకరణము


| విషయము | శ్లో |
|---|---|
| మందప్రజ్ఞునికి ఆత్మానందము | 1 |
| ఆత్మకొరకు సర్వము ప్రియము | 6 |
| ఆత్మకామ శ్రుతివిచారణ | 7 |
| ప్రీతిస్వరూపవిచారణ | 21 |
| ఆత్మకామశ్రుతి యుక్త్యనుభవసిద్ధము | 30 |
| గౌణముఖ్య మిథ్యాత్మలు | 39 |
| ఆత్మనిరతిశయ ప్రేమాస్పదము | 55 |
| ఆత్మ పరమానందరూపము | 72 |
| చిదానందముల భేదము కల్పితము | 78 |
| జ్ఞానయోగముల సామ్యవిచారణ | 81 |


## 13. అద్వైతానందప్రకరణము


| విషయము | శ్లో |
|---|---|
| ఆనందము జగత్కారణము | 3 |
| ఉపాదానకారణత్రైవిధ్యము | 6 |
| శక్తిశక్తపార్థక్యము | 11 |
| శక్తిస్వరూపము | 28 |
| శక్తి కార్యస్వరూపము | 33 |
| వాచారంభణశ్రుతివిచారణ | 38 |
| కారణసత్యత్వము | 44 |
| ఆరంభాది వివరణము | 49 |
| కారణాంశము బోద్ధవ్యము | 53 1/2 |
| సర్వవిజ్ఞానశ్రుతితాత్పర్యము | 60 |
| కార్యకారణస్వరూపము | 62 |
| ఆకాశస్వరూపవిచారణ | 67 |
| స్వరూపసుఖలక్షణము | 72 |
| నామరూపములు కల్పితములు | 79 |
| నామరూపముల యవజ్ఞ | 81 |
| బ్రహ్మాభ్యాసస్వరూపము | 83 |
| మాయాశక్తివికార కారణము | 85 |
| నామరూపముల నుపేక్షచే బ్రహ్మజ్ఞాన సిద్ధి | 93 |
| నామరూపావగమనమునకు బ్రహ్మజ్ఞానమవశ్యము | 101 |
| ప్రకరణఫలకథనము | 104 |

## 14. విద్యానందప్రకరణము


| విషయము | శ్లో |
|---|---|
| విద్యానంద స్వరూపము | 1 |
| విద్యానంద చాతుర్విధ్యము | 3 |
| జ్ఞానికి ఆముష్మికదుఃఖాభావము | 12 |
| జ్ఞానికి కామావాప్తి | 18 |
| కృతకృత్యత | 38 |
| ప్రాప్తప్రాప్యత విచారణ | 58 |


## 15. విషయానందప్రకరణము


| విషయము | శ్లో |
|---|---|
| విషయానందము బ్రహ్మానందద్వారము | 1 |
| మనోవృత్తిత్రైవిధ్యము | 3 |
| సర్వవృత్తులయందు చిద్రూపప్రతిబింబము | 5 |
| ఘోరమూఢవృత్తులయందు సుఖానుభవము | 13 |
| శాంతవృత్తియందు సుఖానుభవము | 17 |
| సచ్చిదానందస్ఫురణస్థలములు | 19 1/2 |
| మాయాత్రయ స్ఫురణస్థలములు | 23 |
| మిశ్రబ్రహ్మధ్యానము | 25 |
| విద్యాస్వరూపము | 31 |


శ్రీ గురుభ్యో నమః


# శ్రీమదాంధ్ర వేదాన్తపంచదశి

## కళ్యాణామృత వ్యాఖ్యాసమేతము

### * 11 బ్రహ్మానందము - యోగానంద ప్రకరణము *

అ॥ తృప్తిదీపము 33వ శ్లోకములో నుదాహరింపబడిన నిరంకుశ తృప్తిఫల మఖండమగు బ్రహ్మానందము. ఇట్టి బ్రహ్మానందస్వరూపము గ్రంథముయొక్క చివర ప్రకరణ పంచకమున వివరింపబడినది. ఆనందము బుద్ధివృత్తిరూపము, తదన్య మని రెండు విధములు. బుద్ధివృత్తిరూపమగు ఆనందము విషయాధీనము. బుద్ధివృత్తిరూపము కాని యానందము నిర్విషయము. ఆనందద్వయమున కవాంతరభేదమున్నను రెండు నొకజాతిలో చేరినవగుటచేత ఆనందములన్నియు బ్రహ్మానందమను ప్రకరణ పంచక మున వివరింపబడినవి. బుద్ధివృత్తిరూపమగు ఆనందము విద్యానందము, విషయానందమని రెండు విధములు. బుద్ధివృత్తిరూపమగు యానందము బ్రహ్మానందము, ఆత్మానందము, అద్వైతానందమని మూడు విధములు, ఈ మూడును వరుసన 11-12-13 ప్రకరణములలో విచారింప బడినవి. పదునొకండవ ప్రకరణము యోగానందమను శీర్షికతో ననుస్యూత ముగ వ్యవహరింపబడుచున్నది. గ్రంథమునందట్టి పేరు కనబడుటలేదు. యోగానందమను నామముతో బరుగుచున్న పదునొకండవ ప్రకరణము బ్రహ్మానందం వక్ష్యామి యని ప్రారంభింపబడినది. ప్రకరణ మంతయు బ్రహ్మానందమునే వివరించుచున్నది. పదునొకండవ శ్లోకములో నుదాహరింపబడిన యానందత్రైవిధ్యమున బ్రహ్మానంద ముదాహరింప బడినది గాని యోగానంద ముదాహరింపబడలేదు. 87వ శ్లోకమున ఆనందములు మూడు విధములనియు, మరియొక యానందము జగత్తున లేదనియు దృఢము చేయబడినది. ఈ మూటిలో యోగానందము చెప్పబడలేదు. ఈ మూడానందములే 12-1 శ్లోకములో తిరిగి చెప్పబడినవి.

గనుక బ్రహ్మానందము కంటె భిన్నమగు యోగానంద మనునది లేదు. విద్యానంద విషయానందములు 14-16 ప్రకరణములలో వివరింపబడినవి. ఇట్లానంద మైదువిధము లగుచున్నది. పూర్వగ్రంథము వలన, ఆనంద స్వరూప మెట్టిదను శంక గలుగుచున్నది. ఆ శంక కీ ప్రకరణపంచకమున సమాధానము చెప్పబడి యుండుటచేత, పూర్వపర గ్రంథముల కేకవాక్యత గలుగుచున్నది, ఇచట దిగువకోష్ట మనుసంధేయము,




అ॥ చదువరుల కాసక్తిని కల్పించుటకై మున్ముందు బ్రహ్మానందము సర్వానర్థనివారకమగు సుఖహేతు వగుచున్నదని దాని అత్యంత ప్రయోజ నము నుదాహరించుచున్నారు.

**బ్రహ్మానందం ప్రవక్ష్యామి జ్ఞాతే తస్మిన్నశేషతః,**
**ఐహికాముష్మికానర్థ వ్రాతం హిత్వా సుఖాయతే॥** 1

టీ॥ బ్రహ్మ ఆనందం= బ్రహ్మముకంటె వేరుకాని ఆనందముయొక్క (సత్) సద్రూపమును, ప్రవక్ష్యామి= పుష్కలముగ చెప్పుచున్నాను. ఎందుకన, అశేషతః తస్మిన్ జ్ఞాతే= సంపూర్ణముగ నది తెలియబడుచుండగ, ఐహిక, ఆముష్మిక, అనర్థ, వ్రాతం= ఆధ్యాత్మిక, ఆధిభౌతిక, ఆధిదైవికములగు నిహలోక పరలోక సంబంధములు నగు అనర్థసమూహములను, అశేషతః



హిత్వా= సంపూర్ణముగ నశింపజేసి, సుఖాయతే= ముముక్షువు నిరతిశయ సుఖము ననుభవించును.

తా॥ వి॥ 'ఆనందో బ్రహ్మేతి వ్యజానాత్' (తై3-6) అనుటచే బ్రహ్మ మానందస్వరూపము. సాధన చతుష్టయ సంపత్తి పూర్వకమగు సంపూర్ణ వైరాగ్యము గలిగిన గాని బ్రహ్మజ్ఞానము కలుగనేరదు. జ్ఞానికి ఇహ పరలోక సుఖదుఃఖములు లేవు. గనుక బ్రహ్మజ్ఞాని నిర్విషయ సుఖమును పొందును. అందువలన బ్రహ్మజ్ఞాన మిచట వివరింపబడు చున్నది.

అ॥ ఇందు రెండు ప్రమాణముల తాత్పర్యమును 'బ్రహ్మవిత్' అని ఉదాహరించుచున్నారు.

**బ్రహ్మవిత్పరమాప్నోతి శోకం తరతి చాత్మవిత్,**
**రసో బ్రహ్మ రసం లబ్ధ్వాఽఽనన్దీ భవతి నాన్యథా॥** 2

టీ॥ బ్రహ్మవిత్= అద్వితీయ బ్రహ్మమును తెలిసికొన్నవాడు, పరం= సర్వోత్కృష్టమగు బ్రహ్మభావమును, ఆప్నోతి= పొందుచున్నాడు. ఆత్మవిత్= ఆత్మ స్వరూపమును తెలిసికొనినవాడు, శోకం= సంసారదుఃఖమును, తరతి= దాటుచున్నాడు, రసః= ఆనందరసము, బ్రహ్మ= బ్రహ్మ స్వరూపము, రసం లబ్ధ్వా= అట్టి రసమును పొంది, ఆనందీ భవతి= నిరతిశయానందము గలవాడగు చున్నాడు. అన్యథా న= ఆనన్దమును పొందుటకు బ్రహ్మజ్ఞానము తప్ప మరియెక మార్గము లేదు.

తా॥ వి॥ ఈ శ్లోకము ప్రథమ పాదమునందు 'బ్రహ్మవిదాప్నోతి పరం" (తై 2-1) బ్రహ్మమును తెలిసికొనినవాడు ఉత్కృష్టఫలమగు బ్రహ్మ భావమును పొందుచున్నాడు. అను శ్రుతి ఉదాహరింపబడినది. ఫలమును గుర్తెఱుంగ కెవరును ప్రవర్తింపరు. అందువలన ముముక్షుజనమునకు బ్రహ్మజ్ఞానమునందు, ప్రవృత్తిని కలిగించుటకై మున్ముందుగనే పరం అని నిశ్శ్రేయసావాప్తి రూపమగు నుత్కృష్టఫలము చూపబడినది. ఈ ఫలమును పొందువాడు బ్రహ్మజ్ఞాని యనుటచేత, బ్రహ్మజ్ఞాన, మీ ఫలమునకు సాధనమని చూపబడుచున్నది. బ్రహ్మజ్ఞానముచే బ్రహ్మ తెలియబడును. ఏ వస్తువు జ్ఞానముచే అదియే చేయును ఇట్లు బ్రహ్మను తెలిసికొనుటయే

బ్రహ్మజ్ఞాన ఫలము. ఈ ఫల ముత్కృష్ట మగుటచే పరం అని వర్ణింపబడినది. బ్రహ్మవిత్ అనుటచే బ్రహ్మభావమును పొందుట కధికారి బ్రహ్మవేత్త అనియు, అందుకు బ్రహ్మజ్ఞానము సాధన మనియు, బ్రహ్మభావము ఫల మనియు, అధికారిప్రయోజనసాధనములు మూడును చెప్పబడినవి. బ్రహ్మ భావమును పొందుటకంటె నెక్కుడు ఫలము లేదు గనుక ఈ శ్రుత్యర్థమును విని ముముక్షువు ఫలాపేక్షచే బ్రహ్మవిచారణమునకు ప్రవర్తించును.

బ్రహ్మశబ్దముచే నిత్యశుద్ధబుద్ధముక్తస్వభావము, భేదత్రయ శూన్యము నగు పరబ్రహ్మము చెప్పబడుచున్నది. ఇట్టి పరబ్రహ్మను తెలిసికొనిన వాడు బ్రహ్మవిత్తనిపించుకొనును. ఈ బ్రహ్మమును తెలిసి కొనుటకు మనస్సు సాధనము. 'మన సైవాఽనుద్రష్టవ్యం నేహ నానాస్తి కించన' (కఠ 4-11) అని శ్రుతి చెప్పుచున్నది. కాని బ్రహ్మమునకు ఫల వ్యాప్యత్వము 790వ శ్లోకమున నివారింపబడినది. దేహాదులాత్మయను అజ్ఞానము నశించిన స్వస్వరూప సాక్షాత్కారము కలుగును. ఇదియే బ్రహ్మ జ్ఞానమున కర్థము. బ్రహ్మమును తెలిసికొనిన వాడు స్వయముగా బ్రహ్మమే యగుచున్నాడు గాని బ్రహ్మను పొందినవాడుకాడు. 'యోహవై తత్పరమం వేద బ్రహ్మైవ భవతి' (ముండ 3-2-9) అని శ్రుతి చెప్పుచున్నది. 'బ్రహ్మ విత్పరమాప్నోతి' అని తైత్తిరీయశ్రుతిలో బ్రహ్మజ్ఞాని బ్రహ్మను పొందుచున్నాడని వినబడుచున్నది. ఈ రెండు శ్రుతులు విరుద్ధములుగా కనబడుచున్నవి. విచారించిన నవి రెండును విరుద్ధార్థబోధకములు కావు. తానెల్లపుడును బ్రహ్మ స్వరూపుడే. కాని ఈ సంగతి నజ్ఞానముచేత గ్రహింపలేకున్నాడు. తాను జీవుడు, ఈ సుఖదుఃఖములు తనవి, పుత్ర దేహాదులు తాను అను అజ్ఞానమున బడుటచేత తాను బ్రహ్మ యనుజ్ఞానము కుదురుట లేదు. ఈ అజ్ఞానమును గురుశాస్త్రముల చేత పోగొట్టుకొనినపుడు తాను బ్రహ్మయే యను జ్ఞానము స్వయముగ కలుగును. అజ్ఞానము పోయి జ్ఞానము కలుగుటయే ప్రాప్నోతి అను శబ్దమున కర్థము. ఇట్టి జ్ఞానము కలుగు మార్గము తత్త్వవివేకప్రకరణమున వివరింపబడినది. తన కంఠమున నున్న మణిని గుర్తెఱుంగక పోయినదని విలపించుచు నాప్తునిచేత చూపబడి తన కంఠమునందే మణిని పొందుచున్నాడు. అటులనే పదియవవాడు



చనిపోయి నట్లు రోదనము చేయుచున్న తానే ఆప్తవాక్యముచేత పదియవ వాడగు చున్నాడు. ఇట్లు తెలియని దానిని తెలిసికొనుటయే ప్రాప్నోతి యను శబ్దమునకు గౌణార్థము చెప్పబడుచున్నది. కాని దానికి ముఖ్యార్థమగు అలబ్ధలాభమును చెప్ప వీలులేదు.

ఆత్మజ్ఞానము గలవాడు సంసారమును దాటునని 'తరతి శోకమాత్మ విత్' (చాం 7-1-3) అను శ్రుతి చెప్పుచున్నది. సంసారమును దాటుటయే బ్రహ్మమగుట. ఇది ఆత్మజ్ఞానము వలన కలుగుచున్నది. బ్రహ్మ భావము బ్రహ్మజ్ఞానమువలన కలుగుచున్నది. గనుక ఆత్మజ్ఞానము బ్రహ్మజ్ఞానము రెండు నొకటియే యగుచున్నది. ఇట్లాత్మ బ్రహ్మల కనన్యత్వము చెప్పబడు చున్నది. బ్రహ్మ మన ఆనందరసఘనము బ్రహ్మజ్ఞాన ఫలమగు నిరతిశయ సుఖ మానందస్వరూపము. ఈ యానందము వేదాంత వాక్యజన్యమగు మనోవృత్తి రూపజ్ఞానముచేత, నా స్వాదనాయోగ్య మగు చున్నది. ప్రీతిపూర్వక మగు రసగ్రహణమే యాస్వాదన మనిపించు కొనును. బ్రహ్మము జిజ్ఞాసువుల చేత ప్రీతిపురస్సరముగ నాస్వాదింప బడుచున్నది. అందువలన బ్రహ్మా నందము రనశబ్దముచేత వర్ణింప బడుచున్నది. బ్రహ్మజ్ఞాని నిరతిశయానందమునుబొంది, 'ధన్యోఽహం ధన్యోఽ హం కర్తవ్యం మే నవిద్యతే కించిత్ ధన్యోఽహం ధన్యోఽహం ప్రాప్తవ్యం సర్వమద్య సంపన్నం' అని నిరతిశయానందమున పొరలు చుండును. ఇట్టి యానందము బ్రహ్మజ్ఞానైకలభ్యము.2

అ॥ బ్రహ్మజ్ఞానము సర్వానిష్టనివారకమని 'ప్రతిష్ఠాం' అని అన్వయ వ్యతిరేకములచే చూపుచున్నారు.

**ప్రతిష్ఠాం విందతే స్వస్మిన్ యదా స్యాదథ సోఽభయః,**
**కురుతేఽస్మిన్నన్తరం చేదథ తస్య భయం భవేత్॥** 3

టీ॥ యదా= ఎప్పుడు, స్వస్మిన్= స్వస్వరూపమునందు, ప్రతిష్ఠాం= స్థైర్యమును, విందతే= పొందునో, అథ= అప్పుడు, సః= ఆ ముముక్షువు, అభయః= ద్వితీయము లేనందున, ఏ భయము లేని వాడు, స్యాత్= అగును, అస్మిన్= అద్వితీయ బ్రహ్మమునందు, అంతరం= స్వల్పముగా నైనను

భేదము, కురుతే చేత్= చేసినయెడల, అథ= అపుడు, తస్య భయం భవేత్= అతనికి భయము కలుగును.

తా॥ వి॥ ఈ శ్లోకముయొక్క పూర్వార్థము 'యదాహ్యేవైష ఏతస్మిన్నదృ శ్యేఽనా త్మ్యేఽ నిరుక్తే ఽ నిలయ నేఽ భయం ప్రతిష్ఠాం విందతేఽథ సోఽ భయం గతో భవతి (తై 2-7) అను శ్రుత్యర్థమును పలుకుచున్నది. సంశయవిపర్యయ విరహితము దృఢమునగు నద్వితీయ బ్రహ్మ జ్ఞానము వలన స్థిరమగు బ్రహ్మనిష్ఠ కుదురును. అట్టి యద్వితీయ బ్రహ్మమునం దుపాసకోపాస్యాది భేదభావమెంత స్వల్పముగానున్నను నది భయకారణ మగును. ఈ యుత్తరార్థమే 'యదాహ్యేవైష ఏతస్మిన్నుదర మన్తరం కురుతేఽథ తస్య భయం భవతి' (తై 2-7) అను శ్రుతిచేత బోధింపబడుచున్నది.

అ॥ అద్వితీయబ్రహ్మమునం దేమాత్రము భేదబుద్ధి యున్నను నది భయకారణమగుచున్న దనుటకు 'వాయుః' అని యుదాహరణము నిచ్చుచున్నారు.

**వాయుస్సూర్యో వహ్నిరిన్ద్రో మృత్యుర్జన్మాన్తరేఽన్తరమ్।**
**కృత్వా ధర్మం విజానన్తోఽ ప్యస్మాద్భీత్యా చరన్తి హి॥ 4**

టీ॥ వాయుః, సూర్యః, వహ్నిః, ఇన్ద్రః మృత్యుః= వాయుసూర్యాగ్నీన్ద్ర మృత్యు దేవతలు, జన్మ, అన్తరే= పూర్వజన్మములందు, ధర్మం విజానన్తః అపి= విధివిహితమగు తమ తమ ధర్మములు నెరింగియున్నవా రైనను, వీరు, అన్తరంకృత్వా= ప్రత్యక్పరమాత్మలకు భేధమును భావించి, ఆకారణమువలన, అస్మాత్ జగన్నియమనకర్తయగు బ్రహ్మమువలన, భీత్యా= భయముచేత, చరన్తి హి= సంచరించుచున్నారు గదా!

తా॥ వి॥ 'భీషాస్మాద్వాతః పవతే భీషోదేవ సూర్యః' మృత్యుర్ధావతి పంచమః (తై 2-9, కఠ 2-6) అను శ్రుతి చెప్పిన ట్లద్వితీయ బ్రహ్మమునకు భేదము కలిగించుటచేత స్వధర్మాచరణనిపుణులగు వాయ్వాదు లీజన్మమున నతని యాజ్ఞకు లోబడి యతనికి భయపడవలసివచ్చినది.



అ॥ 'తరతి శోకమాత్మవిత్' (ఛాం 7-1-3) అను శ్రుత్యర్థమును 'ఆనన్దం' అను మరియొక శ్రుత్యర్థముచేత బలపఱచుచున్నారు.

**ఆనన్దం బ్రహ్మణో విద్వాన్ న బిభేతి కుతశ్చన,**
**ఏవమేవ త పేన్నై షా చిన్తా కర్మాగ్ని సంభృతా॥ 5**

టీ॥ బ్రహ్మణః ఆనన్దం విద్వాన్= ఆనందస్వరూపుడగుపరబ్రహ్మమును తెలిసికొనిన వాడు, కుతశ్చన న బిభేతి= దేనివలనగూడ భయమొందడు, కర్మ, అగ్ని, సంభృతా= కర్మయను అగ్ని చేత సంపాదింప బడిన, ఏషా చిన్తా= ఈ చింత, ఏవం న తపేత్ ఏవ= ఇతనిని తపింప చేయనే లేదు.

తా॥ వి॥ బ్రహ్మసాక్షాత్కారము పొందిన వానికి, 'కిమహం సాధునాకరవం కిమహం పాపమకరవమ్ (తై 2-9) అను భయబాధ యుండనేరదు. కర్మాచరణపరుని కట్టి సంతాపము కలదు. ఏ దేవతకైన నపచారము చేసితినా, ఏ కర్మ విధానమున నేలోపము చేసి యెట్టి ప్రాయశ్చిత్తముల పాలబడుదునా యను భయ మతనికుండును.

అ॥ 'ఏవం విద్వాన్' అని కర్మకృతమగు సంతాప మాత్మజ్ఞాని కేల యుండదో చూపుచున్నారు.

**ఏవం విద్వాన్ కర్మణీ ద్వే హిత్వాఽఽత్మానం స్మరేత్సదా।**
**కృతే చ కర్మణీ స్వాత్మరూపేణై వైష పశ్యతి॥ 6**

టీ॥ ఏవం= కర్మ సంతాపహేతువని తెలిసికొనుట వలన, ద్వే కర్మణీ= పుణ్యపాపకర్మల రెంటిని, హిత్వా= అణచివేసి; సదా= ఎప్పుడును విద్వాన్= ఆత్మజ్ఞాని, ఆత్మానం స్మరేత్= ఆత్మనే చింతించుచుండును. మరియుకృతే కర్మణీ= ఆచరింపబడిన పుణ్యపాపకర్మలను, స్వాత్మరూపేణ ఏవ= స్వస్వరూపము చేతనే, పశ్యతి= భావించుచుండును.

తా॥ వి॥ పుణ్యపాపకర్మలు రెండును ఫలప్రదములే యగుచున్నవి. ఆప్తకాముడగు బ్రహ్మజ్ఞానికి కర్మతో గాని కర్మఫలముతో గాని పనిలేదు. కరచరణాదు లెప్పుడు నేదో యొక కర్మ నాచరించుచుండును. గనుక నతడు ఫలేప్స లేక దానిని పరమాత్మస్వరూపమున ననుసంధానము చేసికొను

చుండును. బ్రహ్మజ్ఞాని కీవిధమున కర్మఫలము లేదు గనుక తత్కృతమగు సంతాపము లేదు. 'ఉభే హ్యేవైషఏతే ఆత్మానగ్ం స్పృణుతే' (తై 2-9) అను శ్రుత్యర్థ మిచట అనుసంధేయము.

అ॥ అనంతములగు ప్రాక్తనకర్మములయొక్క ఫలము భోగము చేతను మాత్రమే నశించుచుండగా దాని చింతనము దురంతము కాకుండు టెట్లను శంకకు 'భిద్యతే' యని సమాధానము చెప్పుచున్నారు.

**భిద్యతే హృదయగ్రన్థి శ్ఛిద్యన్తే సర్వసంశయాః,**
**క్షీయన్తే చాస్య కర్మాణి తస్మిన్ దృష్టే పరావరే॥ 7**

టీ॥ తస్మిన్ పరావరే దృష్టే= ఆ పరబ్రహ్మము సాక్షాత్కారమగు చుండగా, హృదయగ్రన్థిః= హృదయములోని కామనాత్మకమగు ముడి, భిద్యతే= వీడిపోవును; సర్వ సంశయాః= సంశయములన్నియు, ఛిద్యన్తే= ఛేదింపబడుచున్నవి. అస్య కర్మాణి= ఈ జ్ఞాని యొక్క కర్మలు, క్షీయన్తే చ= నశించును.

తా॥ వి॥ ముండకములోని 2-2-8 మంత్ర మిచట శ్లోకరూపమున నుదాహరింపబడినది. ఉత్కృష్టతమమని తలంపబడుచున్న అభ్యుదయ మెవనికంటె నికృష్టమగుచున్నదో, యెవడు పరావరుడు- నిశ్శ్రేయసాత్మకమగు పరమాత్మ అతని సాక్షాత్కారముచే నవిద్యావాసనానిచయము నశించును. అవిద్యచే నాత్మయం దధ్యస్తమగు నన్యోన్యాధ్యాస చిరంతన మగుటచే విడదీయ శక్యము కాకున్నది. అందువలన దానిని పీటముడి యని చక్కనిరూపకముచే వర్ణించినారు, ఈ శ్రుత్యర్థవిచారణము 6-259-269 శ్లోకములలో చేయబడినది. సద్వస్తు వనునది ఉన్నదా? లేదా? ఈ యాత్మ ఎవరు? దేహాతిరిక్తుడా కాడా? జీవుడొకడా అనేకులా? ఆతనికి కర్తృత్వ భోక్తృత్వములు రెండును కలవా? వానిలో నన్యతరము మాత్రమే కలదా? జగజ్జీవేశ్వరులు సత్యములా, అసత్యములా? ఈ మొదలగు సంశయము లన్నియు జ్ఞానముచే విడిపోవును. సాక్షాత్కారము నొందినవాని ప్రారబ్ధముతప్ప మిగిలిన కర్మజాలమంతయు నశించును. ప్రారబ్ధ మనుభవముచేతనే నశించును. కాని దాని ఫలముచే నత డసంస్పృష్టు డగుచున్నాడు.



అ॥ 'కుర్వన్నే వేహ కర్మాణి జిజీవిషేచ్ఛతగ్ం సమాః' (ఈశ-2). 'విద్యాం చావిద్యాం చ యస్త ద్వేదోభయగ్ సః అవిద్యయా మృత్యుం తీర్త్వా విద్యయామృతమశ్ను తే' (ఈశ 1-11). ఈ మొదలగు శ్రుతులు కర్మ స్వయముగాగాని జ్ఞాన సముచ్చితమైనప్పుడుగాని ముక్తి హేతు వగుచున్నదని యుద్ఘోషించుచుండగా 'ఏత మేవ తపేన్నైషా చింతా కర్మాగ్ని సంభృతా' అని 5వ శ్లోకమున చెప్పినది సరికాదను ఆక్షేపణకు 'తమేవ' యని సమాధానము చెప్పుచున్నారు.

**తమేవ విద్వానత్యేతి మృత్యుం పన్థా న చేతరః,**
**జ్ఞాత్వా దేవం పాశహానిః క్షీణైః క్లేశై ర్న జన్మభాక్॥ 8**

టీ॥ విద్వాన్= బ్రహ్మజ్ఞాని, తం మృత్యుం= ఆ మృత్యువును అత్యేతి= జ్ఞానాదేవతుకై వల్యం' అను శ్రుతిబలముచేత తనజ్ఞానమువలన దాటుచున్నాడు. మోక్షమునకు, ఇతరః పన్థా= జ్ఞానముకంటె వేరొక మార్గము, న చ= లేనేలేదు. 'జ్ఞాత్వా దేవం సర్వ పాశహానిః' అను శ్రుత్యర్థము నిచట (శ్వేత 1-11) పలుకరించుచున్నారు. దేవం= స్వప్రకాశస్వరూపుడగు పరబ్రహ్మను, జ్ఞాత్వా= తెలిసికొనినపుడు, పాశహానిః= అవిద్యాస్మిత రాగ ద్వేషాభినివేశరూపములగు బంధములయొక్క వినాశము కలుగును. క్షీణైః క్లేశైః= క్షీణించినట్టి ఐహికాముష్మికానర్థములచేత, జన్మభాక్ న= తిరిగి జన్మ ననుభవించువాడు కాడు.

అ॥ జ్ఞానికిగూడ ఇష్టమునందు ప్రవృత్తి, అనిష్టమునుండి నివృత్తియు కనపడుచున్నందున, ఆత్మజ్ఞాని శోకమును దాటుననుట శాస్త్ర ప్రసిద్ధమైనను అనుభవసిద్ధముకాదను యాక్షేపణను 'దేవం'అని పరిహరించుచున్నారు.

**దేవం మత్వా హర్షశోకౌ జహాత్యత్రైవ ధైర్యవాన్,**
**నైనం కృతాకృతే పుణ్యపాపే తాపయతః క్వచిత్॥ 9**

టీ॥ ధైర్యవాన్ = ధీరుడగువాడు, దేవం= పరమాత్మను, మత్వా= తెలిసికొని, అత్ర ఏవ= ఈ జ్ఞానమునందే, హర్షా, శోకౌ= సుఖదుఃఖములను, జహాతి= వదలిపెట్టు చున్నాడు. ఏనం= ఈ జ్ఞానిని, కృత, అకృతే= చేయబడి

నట్టియు, చేయబడనట్టియు, పుణ్యపాపే= పుణ్యపాపములు, క్వచిత్ ఒకప్పుడును, న తాపయతః= తపింపచేయ నేరవు.

తా॥ వి॥ హర్ష శోకాదికారణములున్నను మనస్సు వికారము నొంద కుండుట ధైర్యము. అది కలవాడు ధీరుడు. స్థితప్రజ్ఞుడని యర్థము. కృతాకృతములే ఆరబ్ధానారబ్ధములని గూడ చెప్పబడుచున్నవి. 'నైనం కృతాకృతే తపతః' (బృ 4-4-22) 'అధ్యాత్మయోగాధిగ మేన దేవం మత్వాధీరో హర్ష శోకౌ జహాతి (కఠ 1-2-12) అను శ్రుతిద్వయముయొక్క అర్థమిచట పఠింపబడుచున్నది.

అ॥ బ్రహ్మజ్ఞానమువలన అనర్థహానియు, ఆనందరూప మోక్షా ప్రాప్తియు బహుశ్రుతి స్మృతిపురాణ సమ్మతమని 'ఇత్యాది' అని ఉదాహరించుచున్నారు.

**ఇత్యాదిశ్రుతయో బహ్వ్యః పురాణైః స్మృతిభిస్సహ,।**
**బ్రహ్మజ్ఞానేఽనర్థహానిమానందం చాప్యఘోషయ౯ ॥ 10**

టీ॥ పురాణైః స్మృతిభిః సహ= పురాణములతోను స్మృతులతోను గూడ ఇత్యాదిశ్రుతయః బహ్వ్యః= కేన 2-5 బృ 1-4-10 కఠ 1-3-15 మొదల గుననేకశ్రుతులు, బ్రహ్మజ్ఞానే= బ్రహ్మజ్ఞానము కలుగుచుండగా, అనర్థహానిం= అనర్థములయొక్క నాశనమును, ఆనన్దంచ అపి= ఆనన్దము కలుగుటను గూడ, అఘోషయ౯ = దృఢముగా పలుకుచున్నవి.

అ॥ 'ఆనన్దః' అని ఆనన్దముయొక్క త్రైవిధ్యవిచారణ మారంభించు చున్నారు.

**ఆనన్దస్త్రివిధో బ్రహ్మానన్దో విద్యాసుఖం తథా,**
**విషయానన్ద ఇత్యాదౌ బ్రహ్మానన్దో వివిచ్యతే ॥ 11**

టీ॥ బ్రహ్మానన్దః, విద్యాసుఖం, తథా విషయానన్దః ఇతి= బ్రహ్మానన్దము, విద్యానన్దము, అటులనే విషయానుదమని ఆనన్దః త్రివిధః= ఆనందము మూడు విధములు, వీనిలో, ఆదౌ= ముందు, బ్రహ్మానన్దః వివిచ్యతే= బ్రహ్మానందము వివరింపబడును.



అ॥ మున్ముందు బ్రహ్మానందమును విచారించిన భృగు వల్ల్యర్థ విధానమగు 'భృగుః' అని యనుసరించుచున్నారు.

**భృగుః పుత్రః పితుః శ్రుత్వా వరుణాద్బ్రహ్మలక్షణమ్,**
**అన్నప్రాణమనో బుద్ధీస్త్యక్త్వాఽఽనన్దం విజిజ్ఞివా౯ ॥ 12**

టీ॥ పుత్రః భృగుః= కుమారుడైన భృగువు; పితుః వరుణాత్= తండ్రి అయిన వరుణునివలన, బ్రహ్మ లక్షణం శ్రుత్వా= బ్రహ్మ లక్షణమును విని, అన్న, ప్రాణ, మనః, బుద్ధీః= అన్న మయ ప్రాణమయ మనోమయ విజ్ఞానమయకోశములను, త్యక్త్వా= అనాత్మభావముచే పరిత్యజించి, చివరకు విచారణపూర్వకముగ, ఆనన్దం విజిజ్ఞివా౯= బ్రహ్మ మానంద స్వరూపమని తెలిసికొనెను.

తా॥ వి॥ బ్రహ్మస్వరూపమును తన కుపదేశింపుమని ప్రార్థించిన కుమారుడగు భృగువునకు తండ్రియగు వరుణుడు 'యతో వా ఇమాని భూతాని జాయంతే, యేన జాతాని జీవన్తి యత్ప్రయంత్యభిసంవిశన్తి తద్విజిజ్ఞాసస్వ తద్బ్రహ్మ' (తై 3-1)- అనగా దేనివలన జగత్తులోని యీ భూతకోటి యుత్పత్తి చెందుచున్నదో, జన్మించిన జీవకోటి దేనివలన జీవించుచున్నదో, దేని యందు తిరిగి లయమగు చున్నదో అది బ్రహ్మమని యుపదేశించెను. ఇందువలన జగదుత్పత్తి స్థితిలయములు బ్రహ్మ లక్షణములని తెలియుచున్నవి. పైన వాలియున్న కాకిచేత నిల్లు గుర్తింపబడినయ ట్లారోపితలక్షణముచే బ్రహ్మము లక్షింపబడుచున్నది. కాకిచే నింటిలో మార్పు లేనటుల నీ లక్షణముచే బ్రహ్మమునం దేవికారము కలుగ నేరదు. తాత్కాలికముగ నీ లక్షణము తటస్థ మగుటచే నది తటస్థలక్షణమని చెప్పబడుచున్నది. దేహాదిపంచకోశములే యాత్మయను భ్రాంతితో పాటుబడుచున్న యజ్ఞులకీభ్రాంతిని తొలగించకుండగనే ముందుగ సత్యజ్ఞానానంతాది యథార్థ బ్రహ్మలక్షణము చెప్పిన నది సుగమము కానేరదు. కావున భ్రాంతి నివారకమగు తటస్థ లక్షణముచే బ్రహ్మము బోధింపబడినది. వరుణుడుపదేశించిన బ్రహ్మముయొక్క జగజ్జన్మ స్థితిలయ హేతుత్వరూపమగు లక్షణము. అన్న ప్రాణమనో విజ్ఞానములందు పట్టుచున్న ట్లాపాతతః కనిపించుటచే నవియే బ్రహ్మయే బ్రహ్మమైనట్లు తోచుచున్నవి.

కాని వీని యన్నిటి యందును బ్రహ్మము యొక్క ముఖ్య లక్షణమగు నిత్యత్వము కన్నట్టుటలేదు. ఈ ప్రకారమున విచారించి నశ్వరములగుటచే నన్నాదికోశములు బ్రహ్మము కానేరవని వానిని త్రోసి పుచ్చి చివరకు నిరుక్తలక్షణము నిత్యత్వముగూడ నానందము నందగు పడుటవలన ఆనందమే బ్రహ్మమని భృగువు నిశ్చయించెను. ఇట్టి నిశ్చయమునకు భంగకరమగు కారణము కలుగలేదు.

అ॥ ఇట్లు ఆనన్దమే బ్రహ్మమను భృగునిశ్చయమును తెలుపుచున్న 'ఆనన్దాద్యేవ ఖల్విమాని భూతాని జాయన్తే, ఆనన్దేన జాతాని జీవన్తి, ఆనన్దం ప్రయన్త్యభిసంవిశన్తి, (తై 2-6) అను శ్రుతియొక్క తాత్పర్యమును 'ఆనన్దాదేవ' యని తెలుపుచున్నారు.

**ఆనన్దాదేవ భూతాని జాయన్తే తేన జీవనమ్,।**
**తేషాం లయశ్చ తత్రాతో బ్రహ్మానన్దో న సంశయః ॥ 13**

టీ॥ ఆనన్దాత్ ఏవ భూతాని జాయన్తే= ఆనందమువలననే భూతములు పుట్టుచున్నవి. తేన జీవనం= దాని వలననే వానికి జీవనము కలుగుచున్నది. తత్ర తేషాం లయః చ= దానియందే వానికి లయముగూడ గల్గుచున్నది. అతః= అందువలన, ఆనన్దః బ్రహ్మ= ఆనన్దమే బ్రహ్మము, న సంశయః= సంశయము లేదు.

తా॥ వి॥ ప్రతిదినము సర్వేన్ద్రియములు సుషుప్తియందు లయమై కేవలానందమే యనుభూతమగుచున్నది. నిద్రలేచి సుఖముగా నిద్రించితినని మనము చెప్పుచున్నాము. (1-5)13

అ॥ 'యత్ర నాన్యత్పశ్యతి, నాన్యచ్ఛృణోతి నాన్యద్విజానాతి స భూమా' (ఛాం 7-24-1) అను శ్రుత్యర్థపఠనముచే బ్రహ్మశబ్దమును 'భూతోత్పత్తేః' అని వ్యుత్పాదనము చేయుచున్నారు.

**భూతోత్పత్తేః పురా భూమా త్రిపుటీద్వైతవర్జనాత్,।**
**జ్ఞాతృజ్ఞానజ్ఞేయరూపా త్రిపుటీ ప్రలయే హి నో ॥ 14**

టీ॥ భూతఉత్పత్తేః పురా= ఆకాశాదిభూతపంచకము, వాని కార్యములగు సర్వప్రాణిజాతములు నామరూపములచే నభివ్యక్తము



కాకపూర్వము త్రిపుటీద్వైతవర్జనాత్ = జ్ఞాతృజ్ఞానజ్ఞేయరూపమగు ద్వైతము లేకపోవుటచేతను, భూమా= దేశకాలవస్తువులను త్రివిధభేదముచే నపరిచ్ఛిన్న మగు పరబ్రహ్మమొకటిమాత్రముండెను. జ్ఞాతృజ్ఞానజ్ఞేయరూపా త్రిపుటీ= జ్ఞాత, జ్ఞానము, జ్ఞేయము అను భేదస్వరూపముగల ద్వైతము ప్రలయే నోహి= ప్రలయమునందుగూడ లేదు గదా!,

తా॥ వి॥ జగత్తుపుట్టుటకు పూర్వము ప్రలయమునందును గూడ జ్ఞాతృజ్ఞానిజ్ఞేయభేదము లేనిదియు దేశకాలవస్తు పరిమితము కానట్టియు బ్రహ్మము మాత్రమున్నది. జ్ఞాతృజ్ఞానజ్ఞేయభేదమున నొప్పుచున్న ద్వైతము జగదుత్పత్తి నాశములకు మధ్యకాలమున మాత్రము కలుగుచున్నది. బ్రహ్మ శబ్దమునకు బృఙ్ అనుధాతువు వలన కలుగుచున్నది. బృఙ్ శబ్దమునకు వృద్ధి నిరతిశయమని యర్థము; అనగా దేశకాలవస్తుభేదములచే పరిమితముగాని యనంతమని తాత్పర్యము భూమశబ్దమునకు నిదియే యర్థము. జ్ఞాత్రాది త్రిపుటీభేదము లేని పరబ్రహ్మమొకటియే యున్నదనుట చేత నది జ్ఞేయపదార్థము కాదని తెలియచున్నవి. విజ్ఞాతారమదే కేన విజానీయాత్ (బృ 4-5-25) అను శ్రుతి యీ యర్థమునే చెప్పుచున్నది.

అ॥ జ్ఞాతృజ్ఞాన జ్ఞేయములన నేమియో, విజ్ఞానమయయని వివరించుచున్నారు.

**విజ్ఞానమయ ఉత్పన్నో జ్ఞాతా జ్ఞానం మనోమయః,।**
**జ్ఞేయాః శబ్దాదయో నైతత్త్రయముత్పత్తితః పురా॥ 15**

టీ॥ ఉత్పన్నః విజ్ఞానమయః = బుద్ధియే యుపాధిగాగల చిరాభాసుడగు విజ్ఞానమయుడు, జ్ఞాతా= తెలుసుకొనువాడగు చున్నాడు. మనోమయః= మనోమయకోశము, జ్ఞానం= జ్ఞేయాకారాకారితమగుటచేత జ్ఞానమగుచున్నది, శబ్దాదయః= శ్రోత్రాదులకు విషయములగు శబ్దాదులు, జ్ఞేయాః= తెలిసికొనబడు విషయము లగుచున్నవి. ఏతత్ త్రయం= ఈ మూడును, ఉత్పత్తేః పురా= జగత్తభివ్యక్తము కాకపూర్వము,న= లేవు.

తా॥ వి॥ శబ్దాదివిషయములను ఛక్షురాది జ్ఞానేన్ద్రియములద్వారా గ్రహించి తదాకారమును బొందుటచే మనస్సు జ్ఞానమనబడుచున్నది.

విషయాకారమును బొందిన మనస్సును ప్రకాశింపచేయు చిదాభాసుడు బుద్ధిగతమై విషయములను తెలిసికొనుచున్నాడుగనుక, విజ్ఞానమయుడు జ్ఞాతయగుచున్నాడు. విభిన్నములగు నీ మూడుపదార్థములును జగదన్తఃపాతితములగుట చేత జగత్తు పుట్టుకపూర్వ మని లేవు.

అ॥ ఈమూడును లేనపు డద్వైతానందము మాత్రముండునని 'త్రయాభావే' యని చెప్పుచున్నారు.

**త్రయాభావే తు నిర్ద్వైతః పూర్ణ ఏవానుభూయతే,**
**సమాధి సుప్తిమూర్ఛాసు పూర్ణః సృష్టేః పురా తథా ॥ 16**

టీ॥ సమాధి సుప్తిమూర్ఛాసు= సమాధి సుషుప్తిమూర్ఛలయందు, త్రయ, అభావే= సర్వేన్ద్రియము లుపరమించియున్నందున, జ్ఞాత్రాది భేదత్రయము లేకపోవుచుండగా, నిర్ద్వైతః= దైతవిహీనమగునట్టియు, పూర్ణః ఏవ= పరిపూర్ణుడగునట్టియు పరమాత్మయే, అనుభూయతే= అనుభవింపబడుచున్నది. సృష్టేఃపురా= జగత్సృష్టికి పూర్వముగూడ, విజ్ఞానమయ మనోమయా త్మకమగు జ్ఞాతృజ్ఞానములు, జ్ఞేయములగు తద్విషయములు గూడ లేనందున, తథా= అదేవిధముగ నిర్ద్వైతానందమే అనుభవింపబడుచున్నది.

తా॥ వి॥ సమాధి సుషుప్తి మూర్ఛలయందు జ్ఞేయములున్నను వానిని గ్రహించు మనోమయ విజ్ఞానమయులు నిర్వ్యాపారు లగుటచే జ్ఞేయముల యొక్క జ్ఞానము కలుగుట లేదు. సృష్టికిపూర్వ మివి యేవియు లేకుండుటచే వాని జ్ఞాన మసంభవము. నిర్వ్యాపారములగు మనోమయ విజ్ఞానమయు లున్నను లేనటులనే యెంచతగును. సమాధియందీ యద్వైతానందానుభవము యోగులచేత తెలియబడుచున్నది. సుషుప్తియందు తెలియబడకపోయినను, నిద్రలేచిన తరువాత స్మరింపబడుచున్నది. మూర్ఛయందలి యనుభవ మతిమందము గనుక ఆ సమయమున గాని తరువాతగాని తెలియబడుట కవకాశము లేకున్నది.

అ॥ పరబ్రహ్మముయొక్క నిరతిశయ సుఖస్వరూపము నన్వయ వ్యతిరేకములచేత చూపగోరి 'యో వై భూమాతత్సుఖం' (ఛాం 7-23-1) అను' శ్రుత్యర్థమును 'యో భూమా' అని పఠించుచున్నారు.



**యో భూమా స సుఖం నాల్పే సుఖం త్రేధా విభేదినీ,**
**సనత్కుమారః ప్రాహైవం నారదాయాఽతిశోకినే॥ 17**

టీ॥ యో భూమా= ఏది పరిమితముగాని వృద్ధి స్వరూపమగు వస్తువో, సః= అది, సుఖం= సుఖస్వరూపము, త్రేధా విభేదినీ= జ్ఞాత్రాది త్రివిధభేదము గలిగి, అందుచేత, అల్పే= అల్పమైన ద్వైతమునందు, సుఖం న= సుఖములేదు. ఏవం= ఈ ప్రకారము, అతిశోకినే నారదాయ= మిక్కిలి శోకించుచున్న నారదుని కొఱకు, సనత్కుమారఃప్రాహ= సనత్కుమారు డుపదేశించెను.

అ॥ సర్వశాస్త్రములు తెలిసినను ఆత్మజ్ఞానము లేకపోవుటయే 'సపురాణా౯' అని నారదుని శోకకారణమని చూపుచున్నారు.

**స పురాణా౯ పంచవేదా౯ శాస్త్రాణి వివిధాని చ,**
**జ్ఞాత్వాప్యనాత్మవిత్త్వేన నారదోఽతిశుశోచ హ॥ 18**

టీ॥ సపురాణా౯ పంచవేదా౯ = పురాణములతో కలసి అయిదైనట్టి నాలుగు వేదములను, వివిధాని శాస్త్రాణి చ= వివిధములగు శాస్త్రములను, జ్ఞాత్వాఽపి= తెలిసికొని గూడ, అనాత్మవిత్త్వేన= ఆత్మజ్ఞానము లేకపోవుటచేత, నారదః అతిశుశోచ హ= నారదుడు విస్తారము దుఃఖించెను.

అ॥ కేవల శాస్త్రవైదుష్య మేల దుఃఖహేతువో 'వేదాభ్యాసాత్' అని చూపుచున్నారు.

**వేదాభ్యాసాత్పురా తాపత్రయమాత్రేణ శోకితా,**
**పశ్చాత్త్వభ్యాసవిస్మారభంగగర్వైశ్చ శోకితా॥ 19**

టీ॥ వేద, అభ్యాసాత్ పురా= వేదము నభ్యసింపక పూర్వము, తాపత్రయ మాత్రేణ శోకితా= ఆధిభౌతికాది తాపత్రయముచేతను మాత్రమే దుఃఖించుట సంభవించును. పశ్చాత్ తు= వేదాభ్యాసము తరువాతనో, అభ్యాస, విస్మార భంగ, గర్వైః చ= మరపు రాకుండుటకై తిరిగి తిరిగి పఠించుట, అట్లు చేసినను గ్రంథము మఱపు తగులుట, అందు వలన సభలలో గల్గుపరాభవము, లేక జయించుటచే గల్గు గర్వము, వీనిచే, శోకితా= దుఃఖము కలుగుట సంభవించుచున్నది.

అ॥ బ్రహ్మజ్ఞానమే యపారశోకమునకు సంతరణోపాయమని నారదో దాహరణమును 'సోఽహం' అని ఇచ్చుచున్నారు.

**సోఽహం విద్వన్ ప్రశోచామి, శోకపారం నయాఽత్ర మామ్,।**
**ఇత్యుక్తః సుఖమేవాస్య పారమిత్యభ్యధాదృషిః॥** 20

టీ॥ విద్వన్= బ్రహ్మజ్ఞానివగు ఓ సనత్కుమార, సః అహం= బహు శాస్త్రవేత్తనైన నేను, ప్రశోచామి= ఆత్మజ్ఞానము లేమి వలన కడు దుఃఖించుచున్నాను. అత్ర= ఇట్టి దుఃఖదశలో, మాం శోకపారం నయ= నన్ను దుఃఖమునుండి దరిజేర్చుము. ఇతిఉక్తః= ఇట్లు నారదునిచేత చెప్పబడిన వాడై, అస్య= ఈ సంసారదుఃఖముయొక్క, పారం= సరిహద్దు లేక ఒడ్డు, సుఖం ఏవ= బ్రహ్మానందమే యని, ఋషిః= మననశీలుడగు సనత్కుమారుడు, అభ్యధాత్= పలికెను.

తా॥ వి॥ ఇచట ఛాందోగ్యము ఏడవ అధ్యాయమునందలి సనత్కుమారుడు నారదునికి చేసిన బ్రహ్మోపదేశవివరణము ప్రస్తుతమగు చున్నది. మనుజు డాత్మజ్ఞానముచే సర్వశోకములు దాటునని నారదుడు పెద్దలవలన విని తన కట్టి జ్ఞానము లేదని దుఃఖించి దుఃఖపారమును తనకు చూపుడని సనత్కుమారుని ప్రార్థించెను. అపుడు సనత్కుమారుడునార దునకి ట్లుపదేశమును చేసెను. ఏ తత్త్వమునందు మరియొక సాధనము చేత చూడతగినది మరియొకటి లేదో, తెలిసికొనదగినది, వినతగినది లేదో అది భూమము. సాధనముచే చూడతగినది, వినదగినది యల్పము. ఆ భూమమే నిరతిశయసుఖము. ఇతరసుఖములు సాతిశయములు. అల్పములు. అవి దుఃఖహేతువులు.

అ॥ బ్రహ్మానందముకంటె భిన్నములగు సుఖము లనిత్యములగు విషయముల నపేక్షించుటవలన అల్పములు అవాస్తవములని బోధించు 'యదల్పం తన్మర్త్యం' (ఛాం 7-24-1) అను శ్రుత్యర్థమును 'సుఖం' అని పఠించుచున్నారు.

**సుఖం వైషయికం శోకసహస్రేణావృతత్వతః।**
**దుఃఖమేవేతి మత్వాఽహా నాల్పేఽస్తి సుఖమిత్యసౌ॥** 21



టీ॥ వైషయికం సుఖం= విషయసంబంధమగు సుఖము, శోక సహస్రేణ ఆవృతత్వతః= అనేక శోకములచే నావరింపబడుటవలన, దుఃఖం ఏవ ఇతి మత్వా= దుఃఖమే యని తలంచి, అల్పే= విషయ పరిమితమగు ఆనందమునందు, సుఖం న అస్తి= విషయములున్నంత కాలము మాత్రమే యుండుట చేతను, విషయములుపోయినపుడు దుఃఖహేతు వగుటచేతను, వాస్తవమగు సుఖమచట లేదని, అసౌ ఆహ= సనత్కుమారుడు పలికెను.

అ॥ ద్వైతమునందు సుఖము లేకపోవు గాక! అద్వైతమునందు గూడ నది లేదు గదా యను శంకను 'మాస్తు' అని త్రోసివేయుచున్నారు. ద్వైతమునందు సుఖము లేక పోవచ్చుగాక! అద్వైతమునందుగూడ సుఖము లేదుగదాయను అక్షేపణకు సమాధానము 'నను' అని చెప్పుచున్నారు.

**నను ద్వైతే సుఖం మాభూదద్వైతేఽప్యస్తి నో సుఖమ్,**
**అస్తిచేదుపలభ్యేత తథాచ త్రిపుటీ భవేత్॥** 22

టీ॥ నను= ఓయిసిద్ధాంతీ!, ద్వైతే= ద్వైతమల్పమగుటవలన, అచట, సుఖం= నిర్విషయిక సుఖము, మాభూత్= లేకుండుగాక! తథా= ఆరీతిగనే, అద్వైతే= అద్వైతమునందుగూడ, సుఖం= నిర్విషయిక సుఖము నో అస్తి= లేదు గదా! అస్తిచేత్= ఉన్నదంటిరేని, ఉపలభ్యేత= అనుభూతము కావలెను. తథా చ= అనుభూతమైన పక్షమున, త్రిపుటీ భవేత్= సంభవించును.

తా॥ వి॥ విషయనిమిత్త మగు సుఖము పరాధీనమగుటవలన నది నిజమగు సుఖము కానేరదు. విషయములున్నంత కాల మదియుండును. విషయములతోపాటు నదిగూడపోవును. కనుక అది తాత్కాలికము. అంతియుకాదు. సుఖహేతువులగు విషయములు చిక్కనపుడు దుఃఖముకూడ సంప్రాప్తమగుచున్నది. పుత్రవిత్తాదులు ప్రియములు, సుఖ కారణములు నగుచున్నవి. కాని ఆ సుఖమాపేక్షికసుఖము. మనకవి సుఖకారణము లగుటచే నవి మనకు ప్రియములగు చున్నవి. మన యందు మనకుగల ప్రేమ సహజము. అట్టిప్రేమకు మరియొక కారణములేదు. పుత్రవిత్తాదులు లేనపుడును, ఒకానొక సమయములయందున్నను

దుఃఖకారణము లగుచున్నవి. కనుక ద్వైతవిశిష్టమగుసుఖము నిజమగు సుఖము కాదని సిద్ధాంతి యాక్షేపింప, ద్వైతవాదియిట్లు తిరిగి యాక్షేపించు చున్నాడు. ద్వైతమునందు నిజమగు సుఖము లేకుండుగాక! అద్వైతము నందుగూడ నట్టి సుఖముకానరాదు. ఉన్నచో ననుభూతము కావలెను. కాని యట్టినిర్విషయిక సుఖ మనుభూతమగుటలేదు. అనుభూతమయినచో నద్వైతమునను భంగముకలుగును. నిర్విషయిక సుఖమను భూతమైనచో, నపు డనుభవించు భోక్తయొకడు, అనుభూతమగు సుఖమొకటి, అనుభవించుటయను క్రియ యొకటి- యిట్లు సుఖానుభవము త్రిపుటీవిష్ట మగుచున్నది. అనగా మూడుభాగములగుచున్నది. కర్తృక్రియాకారకము లద్వైతవిరుద్ధములు, భోక్తృభోగ్యభోగములు. ఉపస్యోపాసకోపాసనలు మొదలగునవి ద్వైతలక్షణములుగాని యద్వైత లక్షణములుగావు. కనుక నద్వైతసుఖ మనుభూతముకాదు గనుక యున్నది యని చెప్పవీలులేదు. అనుభవయోగ్యమైనచో, నపుడు భోక్తృభోగ్య విశిష్టమగు ద్వైతమే సిద్ధమగుచున్నదిగాని యద్వైతము సిద్ధముకానేరదు. ఇది పూర్వవాది యాక్షేపణ.

**మా స్త్వద్వైతే సుఖం కింతు సుఖమద్వైతమేవ హి,।**
**కిం మానమితి చేన్నాస్తి మానాకాంక్షా స్వయంప్రభే॥** 23

టీ॥ అద్వైతే సుఖం మా అస్తు= అద్వైతమునందు సుఖము లేకుండు గాక! సుఖం అద్వైతం ఏవ హి= అద్వైతము కేవలసుఖస్వరూపము, కిం మానం ఇతి చేత్= ఇందుకు ప్రమాణ మేమనిన, స్వయంప్రభే= స్వయం ప్రకాశమునకు, మాన, ఆకాంక్షా న అస్తి= ప్రమాణావశ్యకత లేదు.

తా॥ వి॥ అద్వైతము సుఖస్వరూపము గాని సుఖసాధనము కాదు. సుఖస్వరూపమగుటచే నది మానసికవృత్తి రూపము కాదు. స్వయంప్రకాశ మగుటచే దానిని ప్రకాశింపజేయు నితరప్రకాశము లక్కఱ లేదు. దీపమును తెలియుటకు కన్నులు కావలెను కాని దీపాంతర మక్కఱలేదు.

అ॥ అద్వైతము స్వప్రకాశమనుటకు మాత్రమేమి ప్రమాణము కలదు? అను ప్రశ్నకు 'స్వప్రభత్వే' యని ప్రత్యుత్తరము చెప్పుచున్నారు.



**స్వప్రభత్వే భవద్వాక్యం మానం యస్మాద్భవానిదమ్,।**
**అద్వైతమభ్యుపేత్యాస్మిౕ సుఖం నాస్తీతి భాషతే॥** 24

టీ॥ స్వప్రభత్వే= అద్వైతము స్వప్రకాశమనుటకు, భవద్వాక్యం మానం= నీమాటయే ప్రమాణము. యస్మాత్= ఎందువల్లననగా, అద్వైతం అభ్యుపేత్య= అద్వైతము నంగీకరించి, అస్మిన్ సుఖం న అస్తి ఇతి భాషతే= దీని యందు సుఖము లేదని నీవు చెప్పుచున్నావు.

తా॥ వి॥ నీయందు ప్రకాశించుచున్న యాత్మపదార్థము స్వప్రకాశము కానియెడల, మేము చెప్పుమాటను నీవు గ్రహించుటగాని అందుకు ప్రత్యుత్తరము చెప్పుటగాని నీకు సాధ్యము కాదు. ఇట్లు నీవు చేయుచున్న ప్రశ్నప్రతివచనములకు కారణము నీలోని ఆత్మ స్వప్రకాశముతప్ప మఱి యొకటికాదు. కనుక ఆత్మ స్వప్రకాశమనుటకు ప్రయాణ మక్కరలేదనుటకు నదే ప్రమాణము.

అ॥ ఇంతమాత్రముచేత నీయద్వైతమును నే నంగీకరించుట లేదు. నీవు చెప్పుదానియందు దోషమును మాత్రము చూపుచున్నానను. పూర్వపక్షి యొక్క ప్రతివచనమును 'నాభ్యుపైమి' యని తెలియచేయు చున్నారు.

**నాభ్యుపైమ్యహమద్వైతం తద్వచోఽనూద్య దూషణమ్,।**
**వచ్మీతి చేత్తదా బ్రూహి కిమాసీద్ద్వైతతః పురా॥** 25

టీ॥ అహం అద్వైతం న అభ్యుపైమి= నే నద్వైతము నంగీకరించుట లేదు. తద్వచః= అద్వైతము సుఖస్వరూపమను నీ మాటను, అనూద్య= పురస్కరించుకొని, దూషణం వచ్మి ఇతి చేత్= దానియందు దోషమును మాత్రము నేను చెప్పుచున్నానంటివేని, ఇట్టి పూర్వపక్షి ప్రతివచనమునకు సమాధానము నారంభించుచు మున్ముం దతనిచే నద్వైత మంగీకరింప జేయుటకై యతని నడుగుచున్నారు. ద్వైతతః పురా= ద్వైతసృష్టికాకపూర్వము కిం ఆసీత్= ఏమి యుండెనో, బ్రూహి= చెప్పుమా!,

అ॥ పై ప్రశ్నను 'కిమద్వైతం' అని విపులము చేయుచున్నారు.

**కిమద్వైతముత ద్వైతమన్యో వా కోటిరన్తిమః,।**
**అప్రసిద్ధో న ద్వితీయోఽనుత్పత్తేః శిష్యతేఽన్తిమః॥** 26

టీ॥ సృష్టికి పూర్వము, కిం అద్వైతం= అద్వైతమా, ఉత= లేక, ద్వైతం= ద్వైతమా, లేక అన్యఃవా= ద్వైతాద్వైతామా! ఈ మూటిలో ఏదియున్నది? ఈ మూటిని వితర్కించి తానే ప్రతివచనము చెప్పుచున్నారు! అన్తిమః కోటిః= చివరిపక్ష మగు ద్వైతాద్వైతము, అప్రసిద్ధః= ప్రసిద్ధమైన విషయముకాదు. అనువృత్తేః, నద్వితీయః= తాను పుట్టుటకు పూర్వము తానుండ నేరదు గనుక, సృష్టికిపూర్వము రెండవపక్షమగు ద్వైతము సంభవముకాదు. రెండవ మూడవపక్షములు నిలువనపుడు, ఆశ్రమః శిష్యతే= మొదటిపక్షమగు ద్వైతమే మిగులుచున్నది. అనగా సృష్టికిపూర్వ మద్వైతమే యుండితీరవలెను.

అ॥ అద్వైతమును యుక్తిచే సాధించుదురు గాక, అది యనుభవ సిద్ధము మాత్రము కాదను ఆక్షేపణను 'అద్వైతసిద్ధిః' అని పరిహరించు చున్నారు.

**అద్వైతసిద్ధిర్యుక్త్యైవ నానుభూత్యేతి చేత్ వద।**
**నిర్దృష్టాన్తా సదృష్టాన్తా వా కోట్యన్తరమత్ర నో॥** 27

టీ॥ అద్వైతసిద్ధిః= అద్వైతసిద్ధి, యుక్త్యా ఏవ= యుక్తిచేతను మాత్రమే సంభవించును; అనుభూత్యా న= అనుభవముచేత సిద్ధించుట లేదు; ఇతి చేత్= అంటి రేని, సమాధానము. మీరు చెప్పు యుక్తి, నిర్దృష్టాన్తా సదృష్టాన్తా వా= దృష్టాన్తసహితమా, తద్రహితమా, వద= చెప్పుము. అత్ర= ఇచట, కోటి అన్తరం న= మూడవ పక్షము లేదు కదా!

తా॥ వి॥ అద్వైతము యుక్తి,సిద్ధమని గదా నీవు చెప్పుచున్నావు. యుక్తి యన నేమి? యుక్తి యన అనుమాన ప్రమాణము. పూర్వాను భవముచే తెలిసికొనిన విషయమును తెలియచేయు చిహ్నములను బట్టి యీ విషయము మరియొక చోట నున్నట్లు ప్రత్యక్షముగ చూడకున్నను బుద్ధిచే నూహించుచున్నాము. పొగ యున్న చోట నెల్ల అగ్ని యున్నదని ప్రతిదినము వంటయింటిలో ననుభవసిద్ధము. పొగ వహ్నికి చిహ్నమని అనుభవముచే తెలియును. దూరము నుండి పర్వతముమీద పొగను చూచి యచట వహ్నియున్నదని యూహించి యిట్లు చెప్పుచున్నాము. పొగ యున్న చోట నెల్ల వహ్నియుండును. పర్వతముమీద పొగయున్నది. గనుక నచట



వహ్నికలదు. ఇందుకు దృష్టాంతము వంటయిల్లు. ఇది అనుమాన రచనావిధానము. ఇందుకు దృష్టాంతము ముఖ్యమగుచున్నది. గనుక అద్వైతమును యుక్తిచేత సాధింపవచ్చునంటివేని, నీ యుక్తికి దృష్టాంతము కలదా? లేదా? సృష్టికి పూర్వపుస్థితి నెవరును చూడలేదు. కాబట్టి ఆ సమయమున అద్వైతమున్నదని యూహించుటకు దృష్టాంతములేదు. గనుక అనుమానరచన కుదరనేరదు.

అ॥ అద్వైతము అనుభవసిద్ధముకాదు. దృష్టాంతము లేదు. గనుక యుక్తిసిద్ధము కాదను వాదమును 'నానుభూతి' అని యపహసించుచున్నారు.

**నానుభూతిర్న దృష్టాన్త ఇతి యుక్తిస్తు శోభతే,।**
**న దృష్టాన్తత్వపక్షే తు దృష్టాన్తం వద మే మతమ్॥** 28

టీ॥ అద్వైతమును గూర్చి, అనుభూతిః న= అనుభవము లేదు. దృష్టాన్తః న= దృష్టాన్తము లేదు. ఇతి యుక్తిః తు శోభతే= అను యుక్తి యెంతయు శోభాకరముగా నున్నది. సదృష్టాన్తత్వ పక్షే= దృష్టాన్తమున్నదను పక్షమునందు, మే మతం= నాకుగూడ సమ్మతమగు, దృష్టాన్తం వద= దృష్టాంతమును చెప్పుము.

అ॥ సుషుప్తియందువలెనే ప్రలయమునందు ద్వైతజ్ఞానము లేకుండుటచే అద్వైతము ప్రలయావస్థయే యగుచున్నదని సదృష్టాంతముగ ప్రతివాదిచేసిన యనుమానరచనను 'అద్వైతః' అని ఖండించుచున్నారు.

**అద్వైతః ప్రలయో ద్వైతానుపలంభేన సుప్తివత్।**
**ఇతి చేత్సుప్తిరద్వైతే తత్ర దృష్టాన్తమీరయ ॥** 29

టీ॥ అద్వైతమునందు, సుప్తివత్= సుషుప్తియందు వలెనే, ద్వైత అనుపలమ్భేన= ద్వైతజ్ఞానము లేకుండుటచేత, అద్వైతః ప్రలయః= అద్వైతము ప్రలయమగును. ఇతిచేత్= అని అనినచో, అద్వైతే= అద్వైత పక్షమునందు, సుప్తిః= సుషుప్తి ఉదాహరణమగుటకు, తత్ర= సుషుప్తి యందు ద్వైతరాహిత్యజ్ఞానమున్నదనుటకు, దృష్టాంతం ఈరయ= దృష్టాంతమును చెప్పుము.

తా॥ వి॥ అద్వైతమన ప్రలయము, అచట ద్వైతజ్ఞానాభావముండుట చేత ప్రలయమని ఇందుకు దృష్టాంతము సుషుప్తి, అద్వైతము, అను మానముచేత సాధించుటకు పూర్వపక్షి ఈ ప్రకార మనుమానరచనను చేయగా దానిఖండన మిట్లు చేయబడుచున్నది. మీరు చెప్పిన సుషుప్తి దృష్టాంత మిచట కుదరదు. సుషుప్తియందు ద్వైతజ్ఞానాభావ మనుభవ సిద్ధము కాదు. అదియు ననుమానముచేతనే నిశ్చయింపబడవలసి యున్నది. గనుక దీనికి తిరిగి దృష్టాంత మావశ్యకమగుచున్నది. సుషుప్తియందు ద్వైతజ్ఞానాభావమున కేమి దృష్టాంతమును చెప్పుదురు? అను మానరచన యందలి దృష్టాంతము ప్రత్యక్షసిద్ధముగా నుండవలెను. గాని మరియొక యనుమానముచే నూహ్యము కాకూడదని భావము.

అ॥ సుషుప్తి స్వసుషుప్తి యా పరమసుషుప్తియా యని వికల్పించి తన సుషుప్తిని తాను తెలిసికొనలేడు గనుక నది దృష్టాంతము కానేరదని నిశ్చయించి పరుసుషుప్తి దృష్టాంతమును 'దృష్టాన్తః' అని యపహసించు చున్నారు.

**దృష్టాన్తః పరసుప్తిశ్చేదహో తే కౌశలం మహత్।**
**యః స్వసుప్తిం న వేత్త్యస్య పరసుప్తౌ తు కా కథా॥ 30**

టీ॥ పరసుప్తిః= ఇతరుల సుషుప్తి, దృష్టాంతః చేత్= దృష్టాంత మనినచో, అహో తే కౌశలం మహత్= ఆహా! ఏమి నీ బుద్ధి సూక్ష్మము! యః= ఎవడు, స్వసుప్తిం న వేత్తి= తన సుషుప్తి నెరుగడో, అస్య= ఇతనికి పరసుప్తౌతు కా కథా= ఇతరుల సుషుప్తినిగూర్చి ఏమిచెప్పవలెను.

అ॥ ఇతరుడు సుషుప్తియందున్నాడు, నిశ్చేష్టు డగుట వలన, నేనున్నటులనే అని, ఈ విధముగ పరసుషుప్తి ననుమానముచేత సాధించు చున్నానుగాని యనుభవముచేత గాదని ప్రతివాది చెప్పిన సమాధాన మద్వైతసాధకమే యని 'నిశ్చేష్టత్వాత్' అని ప్రతివాదమును త్రోసిపుచ్చు చున్నారు.

**నిశ్చేష్టత్వాత్పరః సుప్తో యథాహమితి చేత్తదా।**
**ఉదాహర్తుస్సుషుప్తేస్తే స్వప్రభత్వం బలాద్భవేత్॥ 31**



టీ॥ నిశ్చేష్టత్వాత్= చలనము లేక పరుండియున్నందున, యథా అహం= నావలెనే, పరః సుప్తః= పరుడుగూడ సుషుప్తియం దున్నాడు, ఇతిచేత్= అని అనినచో, తథా= అపుడు, ఉదాహర్తుః= ఉదాహరణముగా చెప్పబడుచున్న, తే= నీయొక్క, సుషుప్తేః= సుషుప్తికి స్వయంప్రభత్వం= స్వప్రకాశత్వము, బలాత్= బలాత్కారముగా నైనను, భవేత్= కలుగును.

తా॥ వి॥ నేను నిద్రించునపుడు నిశ్చేష్టుడుగానున్నాను గనుక పరుడుగూడా నట్లే యుండవలెనని పరసుషుప్తిని నీవు యూహించుచున్నావు. ఆత్మ స్వప్రకాశము గాక సుషుప్తి యందలి నీ నిశ్చేష్టతాజ్ఞానము నీకు కలుగనేరదు. ఆ సమయమున నితరావయవము లన్నియు విరమించి యుండుటచే నా జ్ఞానము వానివలన కలిగినదని చెప్పవీలులేదు. గనుక నీవాదము వలననే ఆత్మస్వప్రకాశస్వరూపమని యొప్పుకొనక తప్పదు.

అ॥ స్వప్రభత్వమును బలాత్కారముగానైనను ఏల యొప్పుకొనక తప్పదో 'నేన్ద్రియాణి' యని చూపుచున్నారు.

**నేన్ద్రియాణి న దృష్టాన్తస్తథాప్యంగీకరోషి తామ్।**
**ఇదమేవ స్వప్రభత్వం యద్భానం సాధనైర్వినా॥ 32**

టీ॥ సుషుప్తియందు, ఇంద్రియాణి= ఇంద్రియములన్నియు లయావస్థయందుండుట చేత నవి లేనట్లే. గనుక సుషుప్తినిగూర్చి ప్రత్యక్ష జ్ఞానము కలుగనేరదు. దృష్టాన్తః న= అందువలన స్వసుషుప్తి గాని పరసుషుప్త గాని దృష్టాంతము కానేరదని 30 శ్లోకమున చూపబడినది గనుక స్వప్రభత్వమునుగూర్చి అనుమానముచే జ్ఞానముకలుగవీలులేదు. తథా అపి= జ్ఞానసాధనము లేకున్నను, తాం= ఆ సుషుప్తియున్నటుల, అంగీకరోషి= నీ వంగీకరించుచున్నావు. కాబట్టి, సాధనైః వినా= జ్ఞాన సాధనములు లేకయే, యత్ భానం= ఏ ప్రకాశముకలదో, ఇదం ఏవ= ఇదియే, స్వప్రభత్వం= స్వయంప్రకాశము.

తా॥ వి॥ ప్రత్యక్షప్రమాణముగాని యనుమానప్రమాణముగాని లేక యే సుషు ప్తిజ్ఞానము కలుగుచున్నది. సాధనములులేక ఏ స్వయంప్రకాశము భానమగుచున్నదో అదియే అద్వైతము. సాధనముచేత భానమగునది ద్వైతము.

అ॥ అద్వైతము నిరతిశయసుఖస్వరూపమని నిరూపించుటకు 21 శ్లోకమున ప్రారంభించిన ప్రకరణమున అద్వైతము స్వయం ప్రకాశ స్వరూపమగుటచేత ప్రత్యక్షానుమానాది ప్రమాణములచే దానిని తెలిసికొన సాధ్యముకాదని చూపుచు ప్రసక్తానుప్రసక్తముగ సంభవించిన అద్వైతము యొక్క స్వయంప్రభత్వమును 23-33 శ్లోకములలో సాధించిరి. ఇక ప్రకరణ విషయమగు నానందస్వరూపమును స్తామద్వైతః అనిసాధింపబోవుచున్నారు.

**స్తామద్వైతస్వప్రభత్వే వద సుప్తౌ సుఖం కథమ్,।**
**శృణు దుఃఖం తదా నాస్తి తత స్తే శిష్యతే సుఖమ్॥ 33**

టీ॥ సుప్తౌ = సుషుప్తియందు అద్వైతప్రభత్వే= 14-16 శ్లోకముల యందు వివరించిన ప్రకార మద్వైతము 22-33 శ్లోకములయందు వివరించిన ప్రకారము స్వయంప్రభత్వము స్తాం= ఉండుగాక; అపుడు సుఖం కథం= ఆనంద మెట్లుండునో, వద= చెప్పుము, అని పూర్వపక్షి ప్రశ్న, ఇందుకు సమాధాన మారంభము చేయుచున్నారు. శృణు= చెప్పెదను వినుము. తదా= ఆ సుషుప్తిసమయమునందు, దుఃఖం న అస్తి= దుఃఖము లేదు. తతః= అందువలన, సుఖం శిష్యతే= సుఖమే మిగిలి యుండును.

తా॥ వి॥ ద్వైతజ్ఞానసాధనములగు నింద్రియములు సుషుప్తియందు లయమగుటచేత సుషుప్తియందు ద్వైతానుభవముగాని తత్ఫలమగు దుఃఖానుభవముగాని లేదని ఈ శ్లోకమునకు సామాన్యమగుతాత్పర్యము. దుఃఖ మన్తఃకరణస్వభావము. సుషుప్తియం దంతఃకరణము లయమగుటచే నచట దుఃఖము లేదు. సుఖము మాత్రమే అనుభూతమగుచున్నది. నిద్రలేచి ప్రతివాడును సుఖముగా నిద్రించితినని చెప్పుచున్నాడుగాని నిద్రలో దుఃఖించితి నని యెవడును చెప్పుట లేదు. గనుక సుఖవిరోధి యగు దుఃఖము సుషుప్తిలో లేదు.

అ॥ ఈ విషయమును శ్రుత్యనుభవములచేత, 'అన్ధః' అని సమర్థించుచున్నారు.

**అన్ధస్సన్నప్యనన్ధస్స్యాద్విద్ధోఽ విద్ధోఽథ రోగ్యపి।**
**అరోగీతి శ్రుతిః ప్రాహ తచ్చ సర్వే జనా విదుః॥ 34**



టీ॥ జాగ్రదవస్థయందు అన్ధః సన్= గ్రుడ్డివాడైనను సుషుప్తియందు, అనన్ధః స్యాత్= అంధుడు కాడు. యుద్ధము నందు, విద్ధః అపి= కొట్టబడినను, గాఢనిద్రయందు, అవిద్ధః= కొట్టబడనివాడే అగుచున్నాడు. మేల్కొనినపుడు, రోగీ అపి= రోగపీడితుడైనను నిద్రయందు, అరోగీ ఇతి= రోగము లేని వాడే యని, శ్రుతిః= 'తత్రాన్ధః సన్ననన్ధో భవతి, విద్ధస్సన్న విద్ధో భవత్యుపతాపీ సన్ననుపతాపీ భవతి' (ఛాం 8-4-2) అను శ్రుతి, ప్రాహ= చెప్పినది. తత్ చ= ఈ విషయమును, సర్వే జనాః= సమస్తజనులు, విదుః= అనుభవముచేత నెఱుగుదురు.

తా॥ వి॥ జాగ్రదవస్థయం దెంత కష్టము ననుభవించినను దానినంతయు సుషుప్తియందు మఱచిపోవుటయు నిద్ర లేచి విశ్రాంతి చెందితినని నిద్రాసుఖమును వ్యక్తీకరించుటయు సర్వజనానుభవసిద్ధము.

అ॥ సుషుప్తియందు దుఃఖానుభవము లేదు గనుక సుఖానుభవ మున్నటుల యూహించుట న్యాయము కాదు. శిలాదుల యందట్టి సుఖానుభవములేదు కదా యను శంకకు 'న దుఃఖాభావమాత్రేణ' యని సమాధానము చెప్పుచున్నారు.

**న దుఃఖాభావమాత్రేణ సుఖం లోష్టశిలాదిషు।**
**ద్వయాభావస్య దృష్టత్వాదితి చేద్విషమం వచః॥ 35**

టీ॥ దుఃఖాభావమాత్రేణ= దుఃఖము లేనంత మాత్రముచేత, సుఖం= సుఖమున్నదనుట, న= సరికాదు. ఏలయన? లోష్టశిలాదిషు= మట్టిపెళ్ల, రాయి మొదలగు వానియందు, ద్వయ, అభావస్య దృష్టత్వాత్= సుఖదుఃఖములు రెండును లేకపోవుట కనపడుచున్నందున, ఇతి చేత్= అని అన్నచో, విషమం వచః= ఈ మాట సరికాదు.

అ॥ ఏల సరికాదో 'ముఖదైన్య' అని చెప్పుచున్నారు.

**ముఖదైన్యవికాసాభ్యాం పరదుఃఖసుఖోహనమ్।**
**దైన్యాద్యభావతో లోష్టే దుఃఖాద్యూహో న సంభవేత్॥ 36**

టీ॥ ముఖదైన్యవికాసాభ్యాం= మనుష్యుని ముఖమునందగపడు దీనత్వము, ప్రసన్నతల వలన, పర, దుఃఖ, సుఖ, ఊహనం=

ఇతరులయొక్క దుఃఖమును, సుఖమును ఊహించుట సంభవించును. లోష్టే= లోష్టశిలాదుల యందు, దైన్య, ఆది, అభావతః= దీనత్వము, ప్రసన్నత మొదలగునవి లేక పోవుటచేత, దుఃఖ, ఆది, ఊహః న సంభవేత్= దుఃఖా దుల నూహించుట సంభవించదు.

అ॥ సౌషుప్తికసుఖ మనుమేయము గాని యనుభావ్యము కాదని చేయువాదమున కతడు చూపిన శిలాదృష్టాంతమునందలి దుష్టహేతుత్వమును మాత్రము పైశ్లోకమున చూపిరి. కాని సుఖానుభవ మనుమేయమను ప్రతివాది వాదమును తామంగీకరించుట లేదని చూపుటకై సుఖానుభవ మనుభవైకవేద్యము కాని పరకీయానుభవదృష్టాంతముచే ననుమేయము కాదని 'స్వకీయే' అని తెలియజేయుచున్నారు.

**స్వకీయే సుఖదుఃఖే తు నోహనీయే తతస్తయోః।**
**భావో వేద్యోఽనుభూత్యైవ తదభావోఽపి నాన్యతః॥ 37**

టీ॥ స్వకీయే సుఖదుఃఖే తు= స్వీయములగు సుఖదుఃఖము లయితే, న ఊహనీయే= ముఖదైన్యవికాసములవలన నూహించతగ్గ పరకీయ సుఖదుఃఖములను బట్టి యూహింపతగినవి కావు. తతః= అందువలన తయోః= వానియొక్క, భావః= ఉనికి, తదభావః అపి= వాని లేమియు, అను భూత్యా ఏవ= స్వానుభవముచేతనే, వేద్యః= తెలిసికొన తగినది. అన్యతః న= మఱియొకవిధముగా కాదు. 37

అ॥ ప్రస్తుతము, సుషుప్తియందు దుఃఖాభావ మనుభవైక వేద్యమైనటుల సుఖానుభవము గూడ ననుభవైక వేద్య మని 'తథా సతి' యని చూపుచున్నారు.

**తథా సతి సుషుప్తౌ చ దుఃఖాభావోఽనుభూతితః।**
**విరోధిదుఃఖరాహిత్యాత్సుఖం నిర్విఘ్నమిష్యతామ్॥ 38**

టీ॥ తథా సతి= సుఖదుఃఖములయొక్క భావాభావము లనుభవ వేద్యము లగుటవలన, సుషుప్తౌ చ= సుషుప్తియందును, దుఃఖ, అభావః= దుఃఖము లేకపోవుట, అనుభూతితః= అనుభవమువలన తెలియుచున్నది. అటులనే, విరోధిదుఃఖరాహిత్యాత్= సుఖమునకు



విరోధియగు దుఃఖము లేకుండుటచేత, సుఖం= సుఖముండుట, నిర్విఘ్నం ఇష్యతాం= నిర్విఘ్నముగా నంగీకరింపవచ్చును.

తా॥ వి॥ ఎవరును నిద్ర లేచి దుఃఖము ననుభవించితి నని చెప్పుటలేదు. అందువలన సుషుప్తియందు దుఃఖాభావ మూహింప బడుచున్నది. స్వప్రకాశమగు సుఖస్వరూపమునకు దుఃఖాదివిరోధ్యవరోధము లేనంతవఱకు అది భాసించుచునే యుండును. తిరస్కరణి లేనంతవఱకు దీపకాంతి భాసించుచునే యుండును. 33 శ్లోకార్థము నిట్లిచట ధ్రువపఱచు చున్నారు. 61-62 శ్లోకముల నిచట చూడదగును.

అ॥ మఱియు సుషుప్తియందు సుఖానుభవమే లేని యెడల సుషుప్తి సాధకములగు సుఖశయ్యాదికమునకై ప్రయత్నమే చేయబడదు గనుక సుషుప్తియందు సుఖానుభవ మూహించతగునని 'మహత్తర' యని చూపుచున్నారు.

**మహత్తరప్రయాసేన మృదుశయ్యాదిసాధనమ్।**
**కుతః సంపాద్యతే సుప్తౌ సుఖం చేత్తత్ర నో భవేత్॥ 39**

టీ॥ సుప్తౌ= సుషుప్తియందు, సుఖం నో భవేత్ చేత్= సుఖాను భవమే లేని యెడల, తత్ర= దానియందు, మహత్తర, ప్రయాసేన= విస్తారమగు శ్రమచేత, మృదుశయ్యాదిసాధనం= మెత్తనగు పరుపు, దిండు మొదలగు నిద్రపట్టు సాధనము, కుతః, సంపాద్యతే= ఏల సంపాదింప బడును.

అ॥ శయ్యాదులు దుఃఖనివారకములు మాత్రమే కాని సుఖ సాధనములు కావను సందేహమును 'దుఃఖనాశ' యని సమాధానము చెప్పుచున్నారు.

**దుఃఖనాశార్థమేవైతదితి చేద్రోగిణస్తథా।**
**భవత్వరోగిణస్త్వేతత్సుఖాయైవేతి నిశ్చిను॥ 40**

టీ॥ ఏతత్= ఈ మృదుశయ్యాదిసంపాదనము, దుఃఖనాశార్థం ఏవ ఇతి చేత్= దుఃఖము పోవుటకు మాత్రమే అంటిరేని, రోగిణః తథా భవేత్=

రోగి కది దుఃఖనివారణమగుగాక! అరోగిణః= రోగము లేని వానికి, ఏతత్= ఇది, సుఖాయ ఏవ= సుఖము కొఱకే, ఇతి= అని, నిశ్చిను= నిశ్చయించుము.

అ॥ శయ్యాదిసంపాదితమగు సుఖము వైషయిక సుఖమగుటచే నది యద్వైతసుఖము గానేరదను శంకకు 'తర్హి' అని సమాధానము చెప్పుచున్నారు.

**తర్హి సాధనజన్యత్వాత్సుఖం వైషయికం భవేత్।**
**భవత్వేవాత్ర నిద్రాయాః పూర్వం శయ్యాసనాదిజమ్ ॥ 41**

టీ॥ తర్హి= అటులైన, సుఖం= నిద్రాసుఖము, సాధన జన్యత్వాత్= సాధనముచేత సంపాదిత మగుటచేత, వైషయికం భవేత్= విషయసంబద్ధ మగుచున్నది. ఈ యాక్షేపణ కొకింత యంగీకారమును చూపుచున్నారు. విషయ జన్యసుఖము, నిద్రాయాః పూర్వం= నిద్రాసుఖమునకు పూర్వరంగమునందు శయ్యాసన, ఆదిజం= మృదువగు శయ్య, దిండు ఆసనము మొదలగు వానివలన పుట్టినట్టియు, నిద్రాసుఖముకంటె విలక్షణమైనట్టిదియు, భవతు= అగుగాక!

తా॥ వి॥ నిద్రాసుఖమునకు పూర్వకాలిక సుఖము వైషయిక సుఖమగుగాక, నిద్రాసుఖము మాత్రమట్లుగాదు.

అ॥ శయ్యాసుఖముకంటె నిద్రాసుఖము నందుగల వై లక్షణ్యమును 'నిద్రాయాం' అని ప్రదర్శించుచున్నారు.

**నిద్రాయాం తు సుఖం యత్తజ్జన్యతే కేన హేతునా।**
**సుఖాభిముఖధీరాదౌ పశ్చాన్మజ్జేత్పరే సుఖే॥ 42**

టీ॥ నిద్రాయాం తు యత్ సుఖం= నిద్రయం దే సుఖము గలదో, తత్= అది, కేన హేతునా జన్యతే= ఏ హేతువుచేతను బుట్టినదికాదు. శయ్యా సుఖమువలె నది యనుభూతము కాకుండుటకు కారణము చెప్పుచున్నారు. జీవుడు, ఆదౌ= మొదట, సుఖ, అభిముఖధీః= సుఖము నిచ్ఛగించుచున్న బుద్ధివృత్తిగలవాడు, భవతి= అగుచున్నాడు. పశ్చాత్= తరువాత, పరేసుఖే= అద్వితీయ సుఖమునందు, మజ్జేత్= మునిగిపోవును.



తా॥ వి॥ జీవుడు నిద్రాసుఖమునుకోరి మృదుశయ్యాదుల నమర్చుకొని శయ్యాసుఖమును ముందనుభవించును. ఈ సుఖము బుద్ధివృత్తిరూపము. సుషుప్తియం దీబుద్ధివృత్తి లయమగుటవలన నచట అనుభవించువాడు, అనుభూతమగు సుఖము, దానియనుభవము - ఇట్టి త్రిపుటీభేద ముండనేరదు. కాబట్టి సుషుప్తియందు వైషయికసుఖాను భవముగాని తత్కారణమగు శయ్యాదిజ్ఞానము గాని యనుభూతముగాదు. కేవల నిర్విషయిక సుఖానుభవము మాత్ర మపుడుండును.ఇట్లు నిద్రా సుఖమునకు పూర్వ మనుభూయమానమగు సుఖము వైషయిక సుఖము. నిద్రాసుఖము నిర్విషయము.

అ॥ ఈ యర్థమునే విచారించుచు శయ్యాసుఖప్రకారమును 'జాగ్రత్ అని విపులము చేయుచున్నారు.

**జాగ్రద్వ్యావృతిభిః శ్రాన్తో విశ్రమ్యాథ విరోధిని।**
**అపనీతే స్వస్థచిత్తోఽనుభవేద్విషయే సుఖమ్॥ 43**

జాగ్రత్, వ్యావృతిభిః= జాగ్రదవస్థయందలి వ్యాపారములచేత, శ్రాన్తః= శ్రమ చెందినవాడై, జీవుడు, విశ్రమ్య= విశ్రాన్తిని బొంది, అథ= అనంతరము, విరోధిని అపనీతే= వ్యాపారశ్రమ దుఃఖము విశ్రాన్తిచేత పోగొట్టబడినదగు చుండగా, స్వస్థచిత్తః= నిర్వ్యాపారమగు చిత్తముగలవాడై, విషయే సుఖం అనుభవేత్= మృదుశయ్యాదిసుఖ మనుభవించును.

అ॥ శయ్యాదిసుఖము, త్రిపుటీప్రయుక్త మగుటచేత నచటగూడ శ్రమయుండుటను 'ఆత్మాభిముఖ' యని చూపుచున్నారు.

**ఆత్మాభిముఖధీవృత్తౌ స్వానన్దః ప్రతిబిమ్బతి।**
**అనుభూయైనమత్రాపి త్రిపుట్యా శ్రాన్తిమాప్నుయాత్॥ 44**

టీ॥ ఆత్మ, అభిముఖ, ధీవృత్తౌ= సుషుప్తి సుఖమును కోరి శయ్యాగతుడైనవాని బుద్ధి వృత్తియందుస్వానన్దః= స్వస్వరూపానందము ప్రతిబిమ్బతి= ప్రతిఫలించును. ఏనం= ఈ ప్రతిఫలితసుఖమును, అను భూయ= అనుభవించి, అత్ర అపి= ఈ శయ్యాసుఖమునందుగూడ,

త్రిపుట్యా= అనుభవింపబడు సుఖము, అనుభవము- ఈ మొదలగు త్రిపుటీభేదముండుటచేత, శ్రాంతిం ఆప్నుయాత్= ఖేదమును పొందును.

అ॥ ఇట్టి త్రిపుటీనిబద్ధమగు సుఖము వలన కలిగిన ఖేదమును పోగొట్టుకొనుటకై జీవుడు పరమాత్మయందైక్యమును బొంది నిర్విషయ సుఖస్వరూపమును బొందుచున్నాడని 'తచ్ఛ్రమస్య' అని చెప్పుచున్నారు.

**తచ్ఛ్రమస్యాపనుత్త్యర్థం జీవో ధావేత్పరాత్మని।**
**తేనైక్యం ప్రాప్య తత్రత్యో బ్రహ్మానన్దః స్వయం భవేత్॥ 45**

టీ॥ తత్, శ్రమస్య అపనుత్తి, అర్థం= శయ్యాసుఖము నందలి త్రిపుటీసంజనిత ఖేదమును తొలగించుకొనుటకై జీవః= జీవుడు, పర, ఆత్మని ధావేత్= పరమాత్మను గూర్చి పరుగులిడును. తేన ఐక్యం ప్రాప్య= సుషుప్తియం దతనితో నైక్యమును జెంది, తత్రత్యః బ్రహ్మ ఆనన్దః= ఆసుషుప్తి యందుండెడి బ్రహ్మానందము, స్వయం భవేత్= తానేయగును.

తా॥ వి॥ జాగ్రదవస్థయందలి వ్యాపారశ్రమమునుంచి విశ్రాన్తి కోరి మృదుశయ్యాదులయందు జీవుడు కొంతసుఖ మనుభవించును. ఈ సుఖము బ్రహ్మానందసుఖప్రతిఫలన మగుటచేత త్రిపుటీవిశిష్టమై ఖేదకారణ మగుచున్నది, విషయసుఖమైనను, బ్రహ్మానందజాతిలోచేరినందున నది సుఖకారణమగుచున్నది. ఈ శయ్యాసుఖము నిద్రాసుఖమునకు పూర్వ రంగము. త్రిపుటీనిబద్ధమగు శయ్యాసుఖముచే సంజనితమగు ఖేదమును పోగొట్టుకొనుటకై జీవుడు శీఘ్రముగా సుషుప్తిని చేరును. అచట శయ్యాది సాధనజ్ఞానముగాని శయ్యా సుఖబుద్ధి వృత్తి గాని యుండదు, దుఃఖములేదు. కాబట్టి యవరోధము లేక ప్రకాశించుచున్న బ్రహ్మానన్దములో నీ జీవు డైక్యమును బొంది కేవలసుఖస్వరూపుడే యగుచున్నాడు. ఇట్టి యనుభవ మునే సుషుప్తినుండి లేచి యతడు స్మరించుచున్నాడు. ఇదియే గత శ్లోకత్రయముయొక్క తాత్పర్యము.

అ॥ ఈ యర్థమును బోధించు ననేకదృష్టాంతములను 'దృష్టాన్తాః' అని యుదాహరించుచున్నారు.

**దృష్టాన్తాః శకునిః శ్యేనః కుమారశ్చ మహానృపః**
**మహాబ్రాహ్మణ ఇత్యేతే సుప్త్యానన్దే శ్రుతీరితాః॥ 46**



టీ॥ శకునిః= పిట్ట, శ్యేనః= డేగ, కుమారః= పిల్లవాడు, మహానృపతిః= మహారాజు, మహాబ్రాహ్మణః= బ్రహ్మజ్ఞాని, ఇతి ఏతే= అను వీరు, సుప్తి, ఆనన్దే= సుషుప్తి సుఖమునందు, దృష్టాన్తాః= దృష్టాన్తములుగ, శ్రుతి, ఈరితాః= శ్రుతి చేత చెప్పబడినవి.

అ॥ క్రమముగా నీయైదు దృష్టాన్తములను వివరించుచు, మొదట "సయథా శకునిః సూత్రేణ ప్రబద్ధో దిశందిశం పతిత్వాఽ న్యత్రాఽఽ యతన మలబ్ధ్వాబన్ధనమేవోపశ్రయతే" ఛాం (6-8-1) అను శ్రుతిబోధితమగు శకుని దృష్టాంతమును 'శకునిః' అని వివరించుచున్నారు.

**శకునిః సూత్రబద్ధః సన్ దిక్షు వ్యాపృత్య విశ్రమమ్।**
**అలబ్ధ్వా బన్ధనస్థానం హస్తస్తమ్భాద్యుపాశ్రయేత్॥ 47**

టీ॥ శకునిః= పక్షి, సూత్రబద్ధఃసన్= దారముచేత కట్టబడినదై, దిక్షు వ్యాపృత్య= నలుదిక్కుల నెగిరి. విశ్రమం అలబ్ధ్వా= విశ్రాన్తిని కానక, హస్తస్తమ్భ ఆది బంధన స్థానం= హస్తమో, స్తంభమో మొదలగు తన కట్టుడు స్థానమును, ఉపఆశ్రయేత్= ఆశ్రయించి విశ్రమించును.

అ॥ దృష్టాన్తార్థమును 'జీవోపాధి' యని దార్ష్టాన్తికమున సమన్వ యము చేయుచున్నారు.

**జీవోపాదిమనస్తద్వద్ధర్మాధర్మ ఫలాప్తయే,**
**స్వప్నే జాగ్రతి చ భ్రాన్త్వా క్షీణే కర్మణి లీయతే॥ 48**

టీ॥ జీవ, ఉపాధి మనః= జీవుని కుపాధియగు మనస్సు, తద్వత్= సూత్రబద్ధమగు శకునివలెనే, ధర్మ, ఆధర్మఫల, ఆప్తయే= సుకృతదుష్కృత ఫలానుభవము కొఱకు, స్వప్నే జాగ్రతి చ= స్వప్న జాగరితములందు తిరిగి, కర్మణి క్షీణే= అనుభవముచే కర్మమునశించుచుండగా, భ్రాన్త్వా= భ్రాంతి చేత, లీయతే= అజ్ఞానమునందు నశించును.

తా॥ వి॥ సుకృత దుష్కృత ఫలము ననుభవించుటకు జాగ్రత్స్వప్న ములయందు భ్రాంతిచే నచ్చటచ్చట దిరిగి తిరిగి జీవుడు చివరకు, అనుభవముచే కర్మ నశించగా తన కుపాదానమగు మనస్సుతోగూడ

నజ్ఞానమున లయమగును. ఉపాధి నశించినపుడు జీవత్వముగూడ నశించును. జీవత్వము నశించిన స్వస్వరూపమే మిగులును. జీవుడిట్లు సుషుప్తియం దానందైక్యమును పొందును.

అ॥ శ్యేన దృష్టాంతమును, శ్యేనః అని వివరించుచున్నారు.

**శ్యేనో వేగేన నీడైకలంపటః శయితుం వ్రజేత్ ।**
**జీవః సుప్త్యై తథా ధావేద్బ్రహ్మానందైకలంపటః ॥ 49**

టీ॥ శ్యేనః= డేగ, నీడ, ఏక, లంపటః= శ్రమను దీర్చుకొనుటకు గూటి నొక్కదానిని మాత్రము కోరినదై, శయితుం వేగేన వ్రజేత్= విశ్రమించుట కతివేగముగ పరుగెత్తును. తథా= ఆప్రకారమే, జీవః= జాగ్రద్వ్యాపారముచే నత్యంతము డస్సినవాడగు జీవుడు, బ్రహ్మానంద, ఏక, లంపటః= బ్రహ్మానందము నొకదానిని మాత్రము కోరుచున్నవాడై, సుప్త్యై ధావేత్= సుషుప్తి కొఱకు పరుగెత్తును. ఇచట 'తద్యథాఽస్మిన్నాకాశే శ్యేనో వా సుపర్ణో వా విపరిపత్య శ్రాన్తః సంహత్య పక్షౌ స్వాలయాయైవ ధ్రియత ఏవ మేవాఽయం పురుష ఏతస్మా ఆనందాయ ధావతి యత్రసుప్తో న కంచన కామం కామయతే న కంచన స్వప్నం పశ్యతి' (బృ 4-3-19) అను శ్రుత్యర్థమును సంపుటి చేయవలెను.

అ॥ తరువాత కుమారదృష్టాంతమును అతిబాలః అని వివరించు చున్నారు.

**అతిబాలః స్తనం పీత్వా మృదుశయ్యాగతో హసన్ ।**
**రాగద్వేషాద్యనుత్పత్తేరానందైకస్వభావవాన్ ॥ 50**

టీ॥ అతిబాలః=చంటిబిడ్డ, స్తనం పీత్వా= తల్లిపాలు త్రాగి, మృదు, శయ్యా, గతః= మెత్తటి పక్కను పొంది, హసన్= నిర్విషయానన్ద మందహాసము చేయుచూ, రాగ, ద్వేష ఆది, అనుత్పత్తేః= రాగద్వేషాదులు పుట్టకుండుట వలన. ఆనన్ద, ఏక, స్వభావవాన్ = బ్రహ్మానంద మొకటి మాత్రము స్వభావముగా గలవాడగుచున్నాడు,

బ్రహ్మానందము సహజసిద్ధమనియు దానికి రాగ ద్వేషాదులు ప్రతిబంధకములనియు నర్థము.



ఇక మహారాజుదృష్టాంతమును 'మహారాజః' అని వివరించు చున్నారు.

**మహారాజః సార్వభౌమః సంతృప్తస్సర్వభోగతః।**
**మానుషానన్దసీమానం ప్రాప్యానన్దైకమూర్తిభాక్॥ 51**

టీ॥ సార్వభౌమః మహారాజః= సమస్తభూమి నేకచ్ఛత్రముగ నేలెడు చక్రవర్తి, సర్వభోగతః= సమస్తభోగముల ననుభవించుటవలన సంతృప్తిః= తృప్తిని బొందిన వాడై, మానుషానన్దసీమానం= మానుషానన్దముయొక్క సరిహద్దును, ప్రాప్య= పొంది, ఆనన్ద, ఏక, మూర్తిభాక్= ఆనన్దము నొక్క దానిని మాత్ర మనుభవించుచున్నాడు.

తా॥ వి॥ తస్యేయం పృథివీ సర్వా విత్తస్య పూర్ణాస్యాత్ (తై 2-8) అని మానుషానన్దము నిర్వచింపబడినది.

అ॥ మిగిలిన బ్రహ్మజ్ఞాని యుదాహరణమును 'మహావిప్రః' అని వివరించుచున్నారు.

**మహావిప్రో బ్రహ్మవేదీ కృతకృత్యత్వలక్షణామ్,**
**విద్యానన్దస్య పరమాం కాష్ఠాం ప్రాప్యావతిష్ఠతే॥ 52**

టీ॥ బ్రహ్మవేదీ మహావిప్రః= ఆత్మజ్ఞానియగు మహా బ్రాహ్మణుడు, కృతకృత్యత్వలక్షణాం = కృతకృత్యతయే స్వరూపముగా గల, విద్యానందస్య పరమాం కాష్ఠాం= బ్రహ్మజ్ఞానము వలన గలిగిన తృప్తియొక్క యుత్కృష్టావధి యగు జీవన్ముక్తిని, ప్రాప్య= పొంది, అవతిష్ఠతే= చరించును. కృతకృత్యునితృప్తి 7-251-252 శ్లోకములలోను జ్ఞానియొక్క సర్వనియమా భావమగు ప్రవృత్తిస్వరూపము 7-257 తరువాత శ్లోకముల లోను వర్ణింపబడినది. ప్రారబ్ధక్షయము నెదురుచూచుచుండునని అవతిష్ఠతే యను శబ్దముయొక్క అర్థము.

అ॥ ఈ యుదాహరణపంచకము యొక్క పలితార్థమును 'ముగ్ధ' యని క్రోడీకరించుచున్నారు.

**ముగ్ధబుద్ధాతిబుద్ధానాం లోకే సిద్ధా సుఖాత్మతా ।**
**ఉదాహృతానామన్యే తు దుఃఖినో న సుఖాత్మకాః॥** 53

టీ॥ పైన చెప్పిన నయిదు దృష్టాంతములలో ముగ్ధ బుద్ధాతి బుద్ధానాం= వివేకము లేనివారలలో బాలుడు, వివేకులలో చక్రవర్తి, జ్ఞానులలో జీవన్ముక్తుడు- ఇట్లు బాల భూపాలాత్మకుశలులకు, లోకే= లోకమునందు, సుఖాత్మతా= ఆనందస్వరూపము సిద్ధా= సిద్ధించినది. ఉదాహృతానాం= పైన ఉదాహరింపబడిన వారికంటె, అన్యే= ఇతరులయితే, దుఃఖినః= దుఃఖితులు న తు సుఖాత్మకాః= సుఖవంతులు మాత్రము కారు.

తా॥ వి॥ శకునిదృష్టాంతము సుషుప్తియందు సర్వ వ్యాపార శూన్యత్వమును చెప్పును, శ్యేనదృష్టాంతము విషయిక సుఖశ్రమాపనోదము నందాస్థను చూపుచున్నది. అతిబాల దృష్టాంతము రాగద్వేషాదులు లేని సహజస్థితి యానంద స్వరూపమని బోధించుచున్నది. సమ్రాట్ దృష్టాంతము బ్రహ్మానంద మన్యానంద సంకలితము కాదని తెలియజేయుచున్నది.జీవన్ముక్తి దృష్టాంతము సుషుప్త్యనుభూయమానమగు ఆనందము బ్రహ్మానందమని సిద్ధము చేయుచున్నది.

అ॥ జీవునియొక్క యానందపరత్వమును 'కుమారాదివత్' అని శ్రుతి సిద్ధము చేయుచున్నారు.

**కుమారాదివదేవాఽయం బ్రహ్మానందైకతత్పరః।**
**స్త్రీ పరిష్వక్తవద్వేద న బాహ్యం నాపి చాన్తరమ్॥** 54

టీ॥ కుమార, ఆదివత్= బాలభూపాలాత్మకుశలుల వలె, అయం జీవః= ఈ జీవుడు, బ్రహ్మ, ఆనంద ఏకతత్పరః= సుషుప్తియందాత్మానందాసక్తుడు మాత్రమే, స్త్రీ పరిష్వక్తవత్ = భార్యచే నాలింగనము చేయబడిన కాముకుని వలె, బాహ్యం న వేద= బాహ్యవ్యాపారము నెఱుంగడు. అన్తరం చ అపి న వేద= ఆంతరంగిక వ్యాపారమును గూడ నెఱుంగడు.

తా॥ వి॥ తద్యథా ప్రియయా స్త్రియా పరిష్వక్తో న బాహ్యం కించన వేద నాన్తరమేవాయం పురుషః ప్రాజ్ఞేనాత్మనా సంపరిష్వక్తో న బాహ్యం కించన వేద నాన్తరం' (ఛా 4-3-21) అను శ్రుత్యర్థ మిచట అనుసంధేయము. పరస్పర దృఢానురాగనిబద్ధమగు దంపతుల నిర్వ్యాజప్రేమ రసైక నిమగ్నత కూడ



నిర్విషయానందజాతిలో చేరి రెంటికి ననన్యత్వము సమానధర్మ మగుటచే నిట్టి యుపమాన మిచట నుదాహరింపబడినది.

అ॥ శ్రుతిగతమగు బాహ్యాభ్యంతరశబ్దార్థమును 'బాహ్యం' అని స్వయముగనే వివరించుచున్నారు.

**బాహ్యం రథ్యాదికం వృత్తం గృహకృత్యం యథాన్తరమ్।**
**తథా జాగరణం బాహ్యం నాడీస్థః స్వప్న ఆన్తరః॥** 55

టీ॥ కాముకుని పక్షములో, రథ్యాదికం వృత్తం= వీధిలో జరుగు వ్యావహారికము, బాహ్యం= బాహ్యమగును. గృహకృత్యం= గృహములో చేయతగినది, అన్తరం= ఆన్తరంగికము యథా= ఎటులనో, తథా= అటులనే, జీవుని పక్షమున జాగరణం= జాగ్రదవస్థ, బాహ్యం= బాహ్యము; నాడీస్థః= జాగ్రద్వాసనాబలముచేత గోచరమగుచున్న, స్వప్నః= స్వప్నము, ఆన్తరః= ఆంతరము.

తా॥ వి॥ జీవునికి సుషుప్త్యానందానుభవము కలుగుచుండగా జాగ్రత్స్వప్నముల యందు భానమగు బాహ్యాభ్యంతర ద్వైత మతనికి గోచరము కాదని భావము.

అ॥ ఉపాధినిమిత్తమగు ఖేదము పోయి సౌషుప్తికానందము ననుభవించు చున్న జీవునియొక్క వాస్తవస్వరూపమును 'అత్ర పితాఽపితా భవతి' (బృ 4-3-20) అను శ్రుత్యర్థముచే ప్రదర్శించుచున్నారు.

**పితాఽపి సుప్తావపితేత్యాదౌ జీవత్వకారణాత్,**
**సుప్తౌ బ్రహ్మైవ నో జీవః సంసారిత్వాసమీక్షణాత్ ॥** 56

టీ॥ సుప్తౌ= సుషుప్తియందు, పితాఅపి= తండ్రి కూడ, అపితా= తండ్రిభావము పోయినవా డగుచున్నాడు. ఇతిఆదౌ= అని మొదలగునవి చెప్పు శ్రుతివాక్యమునందు, జీవత్వకారణాత్= జీవునికి జీవభావము నిషేధింపబడుట వలనను, సంసారిత్వాసమీక్షణాత్= ఆ సమయమునందతనికి సంసారిభావము గోచరము కాకుండుటవలనను, సుప్తౌ= సుషుప్తి యందు, జీవః= జీవుడు, బ్రహ్మ ఏవ= బ్రహ్మయే గాని, న జీవః= జీవుడు గాడు.

తా॥ వి॥ జీవునికి సంసారమంతయు మానసికమని 4-18-35 వరకు వివరింపబడినవి. పితృపుత్రాదిసంబంధ మంతయు సంసారకల్పితము. సుషుప్తియందు మానసిక వృత్తులు లేవుగనుక మనఃకల్పితమగు సంసారము గాని తత్సంబంధమగు పితృపుత్రాదివ్యవహారముగాని లేవు. సంసారమే జీవలక్షణము. సుషుప్తియందు సంసారము పోవుటచేత జీవభావము నశించు చున్నది. జీవభావము నశించగానే స్వతఃసిద్ధమగు బ్రహ్మభావము ప్రకాశించుచున్నది. వేషము పోయినపుడు, వేషధారి స్వస్వరూపమున భాన మగును.

అ॥ 'సంసారిత్వాసమీక్షణాత్' అను దాని యర్థవివరణమునకు గాను, 'పితృత్వాది' యని పైశ్రుతియొక్క యుత్తరార్ధము నుదాహరించు చున్నారు.

**పితృత్వాద్యభిమానో యః సుఖదుఃఖాకరస్స హి ।**
**తస్మిన్నపగతే తీర్ణః సర్వాన్ శోకాన్ భవత్యయమ్॥ 57**

టీ॥ పితృత్వ, ఆది, అభిమానః= తండ్రి కుమారుడు మొదలగు నభిమాన మేది కలదో, సః= అది, సుఖదుఃఖ, ఆకరః= సుఖదుఃఖములకు గనివంటిది, తస్మిన్ అపగతే = ఆయభిమానము తొలగినదగుచుండగా, అయః = ఈ జీవుడు, సర్వాన్ శోకాన్ =సమస్తదుఃఖములను, తీర్ణఃభవతి= దాటినవా డగును.

తా॥ వి॥ 'పుణ్యేనాస్వాగతం పాపేన తీర్ణో హి తదా సర్వాన్ శోకాన్ హృదయస్య భవతి' అనువాక్యము పై శ్రుతియొక్క ఉత్తరార్ధము.

అ॥ ఇచట 'సుషుప్తికాలే సకలే విలీనే తమోऽభిభూతః సుఖరూపమేతి." (కై 1-13) అను శ్రుత్యర్థమును 'సుషుప్తికాలే' యని పఠించుచున్నారు.

**సుషుప్తికాలే సకలే విలీనే తమసాऽऽవృతః,**
**సుఖరూపముపైతీతి బ్రూతే హ్యాథర్వణీ శ్రుతిః॥ 58**

టీ॥ సుషుప్తికాలే= సుషుప్తిసమయమున, సకలే విలీనే= మాయా కల్పితమగు జాగ్రత్స్వప్న ప్రపంచమంతయు తనకు కారణము, తమః ప్రధానమునగు ప్రకృతియందు (1-15) లయమగుచుండగా, తమసా, ఆవృతః= అజ్ఞానముచేత నావరింపబడిన జీవుడు, సుఖరూపం ఉపైతి= ఆనన్దస్వరూప మును పొందుచున్నాడు. ఇతి= అని, ఆథర్వణీ శ్రుతిః= అథర్వణ వేదాన్తర్గత మగు కైవల్యోపనిషత్తు, బ్రూతే హి= చెప్పుచున్నది.



అ॥ ఈ శ్రుత్యర్థము సర్వానుభవసిద్ధమగుటను 'సుఖమస్వాప్సం' అని చూపుచున్నారు.

**సుఖమస్వాప్సమత్రాహం న వై కించిదవేదిషమ్,**
**ఇతి సుప్తే సుఖాజ్ఞానే పరామృశతి చోత్థితః॥ 59**

టీ॥ ఉత్థితః= సుషుప్తినుంచి లేచిన పురుషుడు, అత్ర= ఈ గాఢనిద్రయందు, అహం సుఖం అస్వాప్సం= నేను సుఖముగా నిద్రించితిని, కించిత్ న వై అవేదిషం= నిశ్చయముగా నా కేమియు తెలిసియుండ లేదు. ఇతి= అని, సుప్తే= సుషుప్తి యందు, సుఖఅజ్ఞానే= అనుభవింపబడిన సుఖమును అజ్ఞానమును గూడ, పరామృశతి= స్మృతిపూర్వకముగ విమర్శించు చున్నాడు.

అ॥ ఇట్టి స్మృతి 1-5 శ్లోకమున వివరింపబడిన రీతి అనుభవపూర్వక ముగనుక సుషుప్తియందు సుఖానుభవ మవశ్య మంగీకరింప వలయునని చెప్పుచున్నారు.

**పరామర్శోऽనుభూతేऽస్తీత్యాసీదనుభవస్తదా,**
**చిదాత్మత్వాత్స్వతో భాతి సుఖమజ్ఞానధీ స్తతః॥ 60**

టీ॥ పరామర్శః= సుషుప్తియందలి సుఖానుభవముల యొక్క స్మృతిరూపకమగు విమర్శనము, సుషుప్తియందలి, అనుభూతే అస్తి ఇతి= అనుభవమునం దాధారపడియున్నదను హేతువుచేత, తదా= సుషుప్తి యందు, అనుభవః= ఆనందాజ్ఞానములయొక్క అనుభవము, అస్తి= కలదు. చిదాత్మత్వాత్= చైతన్యస్వరూపమగుట చేత, సుఖం= బ్రహ్మానన్దము, స్వతః భాతి= ప్రమాణాంతరము లేకనే స్వయముగా ప్రకాశించుచున్నది. తతః= కేవలసుఖమే భానమగుటచేత, అజ్ఞానధీః= ఇతర మేమియు తెలియ లేకుండుటయు, భాతి= ప్రకాశించును.

అ॥ సౌషుప్తికానందము బ్రహ్మస్వరూప మనుటకు 'బ్రహ్మవిజ్ఞానం' అని ప్రమాణము నుదాహరించుచున్నారు.

**బ్రహ్మవిజ్ఞానమానందమితి వాజసనేయినః।**
**పఠన్త్యతః స్వప్రకాశం సుఖం బ్రహ్మైవ నేతరత్॥ 61**

టీ॥ 11-45 శ్లోకములో నుదాహరింపబడిన, బ్రహ్మవిజ్ఞానం ఆనన్దం ఇతి= బ్రహ్మవిజ్ఞాన మానందస్వరూపమే యని, వాజసనేయినః= 'విజ్ఞాన మానన్దం బ్రహ్మ' (బృ 3-9-18) అను బృహదారణ్యకశ్రుత్యనుయాయులు, పఠన్తి= చెప్పుచున్నారు. అతః= అందువలన, స్వప్రకాశం సుఖం= స్వయం ప్రకాశమగు సుఖము, బ్రహ్మ ఏవ, ఇతరత్ న = బ్రహ్మమే కాని ఇతరము కాదు.

అ॥ 'సుఖమస్వాప్సం న కించిద వేదిషం' అని విజ్ఞానమయుడగు జీవుడు స్మరించుచున్నాడు. అనుభవించినవారే స్మరించుట న్యాయము. అందువలన ఆనందానుభవము విజ్ఞానమయునికే కలుగవలెను. గాని మీరు చెప్పుప్రకారము ఆనందమయునికి కలుగనేరదని పూర్వపక్షమును 'యదజ్ఞానం' అని యనువదించుచున్నారు.

**యదజ్ఞానం తత్ర లీనౌ తౌ విజ్ఞానమనోమయౌ।**
**తయోర్హి విలయావస్థా నిద్రాజ్ఞానం చ సైవ హి॥ 62**

టీ॥ యత్, అజ్ఞానం= సుషుప్తియం దే 'అజ్ఞానము కలదో, తత్ర= దానియందు, తౌ విజ్ఞాన మనోమయౌ= ఆ విజ్ఞాన మనోమయులిద్దరును, సుషుప్తియందు, లీనౌ= లయమును బొందియున్నారు. తయోః= ఆ రెంటి యొక్క, విలయ, అవస్థా= విలయావస్థయే, నిద్రా= నిద్రయగుచున్నది. సాయేవ= ఆ లయావస్థయే, అజ్ఞానం హి= అజ్ఞాన మనబడును.

తా॥ వి॥ విజ్ఞానమయుడు ప్రమాత, మనోమయము, ప్రమాణము, అనగా జ్ఞానసాధనము. సుషుప్తియం దీ రెండు నజ్ఞానములో లయమును జెందుచున్నవి. 'విజ్ఞానవిరతిః సుప్తిః' అని చెప్పబడుచున్నది. జీవభావకారణ మగు విజ్ఞానమయ కోశము నిద్రయందు లయమగుచుండగా జీవభావము తొలగిపోవుచున్నది. నిద్రయే అజ్ఞానమనబడును. కనుక నిద్రావస్థయందు



సుఖాజ్ఞానములను జీవు డనుభవించుట శక్యము కాదు. అందువలన నిద్రయందు జీవుడు సుఖాజ్ఞానముల ననుభవించుటగాని, నిద్రమేల్కొని స్మరించుటగాని సాధ్యముగాదు అని పూర్వపక్షము.

అ॥ 'విలీన' యని సమాధానమును చెప్పుచున్నారు.

**విలీనఘృతవత్పశ్చాత్స్యాద్విజ్ఞానమయో ఘనః,**
**విలీనావస్థ ఆనందమయ శబ్దేన కథ్యతే॥ 63**

టీ॥ విలీనఘృతవత్= కరగిన నేతివలె, పశ్చాత్= నిద్రలేచినతరువాత, విజ్ఞానమయః= విజ్ఞానమయుడు, ఘనఃస్యాత్= ఘనీభూతుడగుచున్నాడు. విలీన, అవస్థః= నిద్రయందు లయావస్థయే, ఆనందమయశబ్దేన= ఆనందమయశబ్దముచేత, కథ్యతే= చెప్పబడుచున్నది.

తా॥ వి॥ నెయ్యి ఉష్ణస్పర్శచే కరగి శీతస్పర్శచే తిరిగి గట్టిపడును. జీవుడు జాగ్రదవస్థయందు కర్మఫల మనుభవించుచు దానిచే శ్రాంతుడై శ్రమను మఱచి సుఖానుభవముకొఱకు సుషుప్తిని జేరుచున్నాడు. (44-45 శ్లోకములు చూడుడు.) ఇట్లు జీవుడు సుషుప్తిని జేరుటయే యతని లయ మనబడుచున్నది. విజ్ఞానమయకోశముయొక్క చిక్కదనము పోయి యుష్ణస్పర్శకలిగిన ఘృతమువలె పలుచనగుటయే విజ్ఞానమయునికి లయమగుచున్నది. చిక్కదనము పోయి పల్చబడిన విజ్ఞానమయుడే ఆనందమయు డగుచున్నాడు. ఆనందమయావస్థయందు సుఖాజ్ఞానాను భవము కలుగుచున్నది. తిరిగి మేల్కాంచినప్పుడు సుషుప్తి యందు సంభవించిన పలుచదనము పోయి శీతస్పర్శ తగిలిన ఘృతమువలె ఘన భావము కలిగి తిరిగి విజ్ఞానమయావస్థ సంప్రాప్తమగుచున్నది. ఇ ట్లొకడే సుషుప్తియం దానందమయుడై సుఖాజ్ఞానములు ననుభవించు చున్నాడు. జాగ్రదవస్థయందు విజ్ఞానమయుడై సుషుప్త్యనుభవమును స్మరించు చున్నాడు. అవస్థాభేదముచేతను, కాలభేదము చేతను స్మృత్యను భవములు ఆతనికే కలుగుచున్నవి.

అ॥ 'విలీనావస్థయే' యానందమయుడను విషయమును 'సుప్తి' యని స్పష్టము చేయుచున్నారు.

**సుప్తిపూర్వక్షణే బుద్ధివృత్తిర్యా సుఖబిమ్బితా,**
**సైవ తద్బింబసహితా లీనానన్దమయస్తతః॥ 64**

టీ॥ సుప్తి పూర్వక్షణే= సుప్తికి పూర్వక్షణమునందు, సుఖబిమ్బితా= 11-44 శ్లోకములో నుదాహరింపబడిన రీతిని తనయందు ప్రతిఫలించిన సుఖానంద ప్రతిబింబముతో నున్న, యా బుద్ధిః= ఏ బుద్ధికలదో, సా ఏవ= అదియే, తత్‌బింబ సహితా= ఆ ప్రతిబింబముతో గూడిన దగుచు, తతః= అనంతరము, లీనా= కరగినదై, ఆనందమయః= ఆనందమయుడని, ఉచ్యతే= చెప్పబడుచున్నది.

తా॥ వి॥ సుఖమును కోరి మృదుశయ్యను జేరిన బుద్ధి వృత్తియందు బ్రహ్మానందము ప్రతిబింబిత మగుచున్నది. ఈ ప్రతి బింబితముతో గూడిన విజ్ఞాన మయాత్మకమగు బుద్ధివృత్తి సుషుప్తియందు ప్రవేశించుచున్నది. విజ్ఞానమయుని పటుత్వ మక్కాలమున విలీన మగుటచే జీవత్వము, దానితో పాటు సంసారజ్ఞానము పోవుచున్నవి. ఇట్లు సర్వసంసారజ్ఞాన విహీనమై బ్రహ్మానంద ప్రతిబింబముతో గూడి సుఖేచ్ఛచే సుషుప్తిని ప్రవేశించిన విజ్ఞానమయాత్మక మగు బుద్ధివృత్తి విలీనమై యానందమయు డగుచున్నది. ఇదియే యానందమయ స్వరూపము.

అ॥ సుఖేచ్ఛచే సుషుప్తిని బ్రవేశించిన బుద్ధి వృత్తిరూపమగు ఆనన్దమయుని బ్రహ్మానందానుభవమును 'అన్తర్ముఖ' యని వర్ణించు చున్నారు.

**అన్తర్ముఖో య ఆనందమయో బ్రహ్మసుఖం తదా।**
**భుఙ్క్తే చిద్బింబయుక్తాభి రజ్ఞానోత్పన్నవృత్తిభిః॥ 65**

టీ॥ అన్తర్ముఖః= సంసారజ్ఞాన విహీనమై, సుఖ ప్రతిబింబసంస్కార సంయుతమై సుఖేచ్ఛచే సుషుప్తిని ప్రవేశించిన బుద్ధివృత్త్యాత్మకమగు, యః ఆనందమయః= ఏ ఆనందమయుడు కలడో అతడు, తదా= ఆ సుషుప్తి యందు, బ్రహ్మసుఖం= బ్రహ్మసుఖమును, చిత్‌బింబయుక్తాభిః= చైతన్య ప్రతిబింబమగు చిదాభాసునితో గూడిన, అజ్ఞాన, ఉత్పన్నవృత్తిభిః= అజ్ఞానము వలన బుట్టిన వృత్తులచేత, భుఙ్క్తే= అనుభవించుచున్నాడు.



అ॥ సుషుప్తియందనుభవింపబడుచున్న సుఖ మజ్ఞాన సహితమగు బుద్ధి వృత్తులవలన కలుగుచున్నది.జాగ్రదవస్థ యందలి యనుభవముగూడ నటులనే బుద్ధి వృత్తిజన్యమై నే ననుభవించుచున్నానను నభిమానముతో గూడినదగుచున్నది. జాగ్రదవస్థయందువలెనే సుషుప్తియందుగూడ నీయభిమాన ముండదా? యను ప్రశ్నకు 'అజ్ఞాన', అని సమాధానమును చెప్పుచున్నారు.

**అజ్ఞానవృత్తయః సూక్ష్మా విస్పష్టా బుద్ధివృత్తయః,**
**ఇతి వేదాన్త సిద్ధాన్తపారగాః ప్రవదంతి హి॥ 66**

టీ॥ అజ్ఞానవృత్తయః= సుషుప్తియందలి అజ్ఞాన వృత్తులు, సూక్ష్మాః= అతిసూక్ష్మములు గనుక నచట అభిమానమున కవకాశము లేదు. బుద్ధివృత్తయః= జాగ్రద్బుద్ధి వృత్తులు, విస్పష్టాః= స్ఫుటములగుటచే నచట అభిమానము కలుగుచున్నది. ఇతి= అని, వేదాన్త సిద్ధాన్త పారగాః= వేదాంతశాస్త్రమును దరిచూచినవారు, ప్రవదంతి హి= చెప్పుచున్నారు.

అ॥ ఆనందమయుడే, సౌషుప్తికానందము ననుభవించుచున్నాడని 'మాండూక్య' యని ప్రమాణములను చూపుచున్నారు.

**మాండూక్యతాపనీయాదిశ్రుతిష్వేతదతిస్ఫుటమ్,**
**ఆనందమయభోక్తృత్వం బ్రహ్మానందే చ భోగ్యతా॥ 67**

టీ॥ ఆనందమయ, భోక్తృత్వం= ఆనందమయుడుభోక్తయగుట, బ్రహ్మానందే భోగ్యతా చ= అనుభవింపబడునది బ్రహ్మానందము, ఏతత్= ఈ విషయము, మాండూక్య తాపనీయాదిశ్రుతిషు= మాండూక్యము, నృసింహోత్తరతాపనీయము మొదలగు శ్రుతులయందు, అతిస్ఫుటం= మిక్కిలి స్పష్టమగుచున్నది.

అ॥ ఉదాహృతములగు నుపనిషత్తులయందు 'సుషుప్తస్థాన ఏకీభూతః ప్రజ్ఞానఘన ఏవానన్దమయో హ్యానందభుక్ చేతో ముఖః'' (మాం 1-5) అను మాండూక్యశ్రుత్యర్థమును 'ఏకీభూతః' అని వ్యక్తపఱచుచున్నారు.

**ఏకీభూతః సుషుప్తస్థః ప్రజ్ఞానఘనతాం గతః।**
**ఆనందమయ ఆనందభుక్చేతోమయవృత్తిభిః॥ 68**

టీ॥ సుషుప్తస్థః= సుషుప్త్యభిమానియు, ఏకీభూతః= విజ్ఞానాద్యు పాధు లుపరమము చెందుటచేత ఏకాకారమును బొందిన ఆనందమయః = ఆనందమయుడు, ప్రజ్ఞానఘనతాం= విజ్ఞానములయొక్క సమష్టి భావ మును, గతః= పొందినవాడై, చేతోమయ వృత్తిభిః= చైతన్య ప్రతిబింబితము లైన వృత్తులచేత, ఆనందభుక్ భవతి= ఆనందము ననుభవించు వాడగును.

అ॥ శ్రుతిగతములగు, ఏకీభూతః, ప్రజ్ఞానఘనః చేతో ముఖః అను పదములు 'విజ్ఞానమయ' అను మూడు శ్లోకములచే క్రమముగా వివరింపబడుచున్నవి.

**విజ్ఞానమయముఖ్యైర్యో రూపైర్యుక్తః పురాఽధునా।**
**స లయేనైకతాం ప్రాప్తో బహుతండులపిష్టవత్॥ 69**

టీ॥ పురా= జాగ్రత్స్వప్నములయందు, యఃఆత్మా= ఏ ఆత్మ, విజ్ఞానమయముఖ్యైః రూపైః= బుద్ధిచే లక్షింపబడిన విజ్ఞానమయ మనోమయ ప్రాణమయాదిరూపములతో, యుక్తః= కూడియున్నాడో, సః= ఆ ఆత్మ, అధునా= సుషుప్తియందు, లయేన= విజ్ఞానమయాద్యుపాధులు లయ మగుటచేత, ఏకతాం ప్రాప్తః= ఏకాకారమును బొంది, బహు తండులపిష్టవత్ భవతి= బియ్యపుపిండివలె అగుచున్నాడు.

అ॥ 'ప్రజ్ఞానాని' అని ప్రజ్ఞాన ఘనశబ్దార్థమును వివరించుచున్నారు.

**ప్రజ్ఞానాని పురా బుద్ధివృత్తయోఽథ ఘనోఽభవత్।**
**ఘనత్వం హిమబిందూనాముదగ్దేశే యథా తథా॥ 70**

టీ॥ ఉదక్ దేశే= ఉత్తర దేశమునందు, హిమబిందూనాం ఘనత్వం= మంచుబిందువులు గడ్డకట్టుట, యథా= ఎటులనో, తథా= అటులనే, పురా= జాగ్రత్స్వప్నములయందు, ప్రజ్ఞానాని= ప్రజ్ఞానములని చెప్పబడు, బుద్ధివృత్తయః= బుద్ధివృత్తులు, అథ= సుషుప్తియందు, ఘనః అభవత్= చిద్రూపముచే నేకమయ్యెను.

అ॥ సకలవృత్తుల యేకీభూతరూపమే ప్రజ్ఞానఘనత్వమని 'తద్ఘనత్వం' అని లౌకికవైదిక వ్యవహారముచేత చూపుచున్నారు.



**తద్ఘనత్వం సాక్షిభావం దుఃఖాభావం ప్రచక్షతే।**
**లౌకికాస్తార్కికా యావద్దుఃఖవృత్తివిలోపనాత్॥ 71**

టీ॥ తద్ఘనత్వం= ప్రజ్ఞానములయొక్క ఘనభావమగు, సాక్షిభావం= సాక్షిత్వమును, లౌకికాః తార్కికాః= శాస్త్ర పరిజ్ఞానములేని లౌకికులు తార్కికులును, యావత్ దుఃఖవృత్తి విలోపనాత్= అశేషదుఃఖవృత్తులు లయమును పొందుటచేత, దుఃఖాభావం ప్రచక్షతే= దుఃఖము లేకపోవుట యని చెప్పుచున్నారు.

అ॥ చేతోముఖశబ్దమున కర్థమును అజ్ఞానయని చెప్పుచున్నారు.

**అజ్ఞానబింబితా చిత్ స్యాన్ముఖమానన్దభోజనే ।**
**భుక్తం బ్రహ్మసుఖం త్యక్త్వా బహిర్యాత్యథ కర్మణా॥ 72**

టీ॥ ఆనందభోజనే= సౌషుప్తిక బ్రహ్మానందానుభవము నందు, అజ్ఞాన ప్రతిబింబితా చిత్= అజ్ఞానమునందు ప్రతిబింబించిన చైతన్యము అనగా చిదాభాసుడు, ముఖం స్యాత్= సాధన మగును. కర్మణా= పాప పుణ్యకర్మములచేత, భుక్తం బ్రహ్మసుఖం= అనుభవింపబడిన బ్రహ్మ సుఖమును, త్యక్త్వా= పరిత్యజించి, అథ= తరువాత జీవుడు, బహిః యాతి= మేల్కొని జాగ్రదాద్యవస్థను పొందును.

తా॥ వి॥ సమాధిసుషుప్తులయం దనుభూయమానమగునది యానందము (11-21). అది స్వయం ప్రకాశము, సుఖ స్వరూపము. (22-28) సౌషుప్తిక సుఖము కేవల మనుభవైకవేద్యము కాని దానిని తెలియజేయు ప్రమాణములు లేవు. (29-38) సౌషుప్తిక సుఖ మద్వితీయమగు నిర్విషయ సుఖము గనుకనే దానిని కోరి మృదుశయ్యాది సాధనమును మనుజుడు సంపాదించుకొనుచు పూర్వరంగము నాయత్తము చేసికొనుచున్నాడు. కర్మ ఫలానుభవరూపమగు జాగ్రద్వ్యాపారముచే శ్రమజెందిన బుద్ధి నిద్రా సుఖోన్ముఖమై శయ్యాసుఖము ననుభవించి కొంత సేదదీర్చుకొనును. నిద్రానందాభిముఖమగు బుద్ధివృత్తియందాత్మానందము ప్రతిఫలితమగు చుండుట వలన శయ్యాసుఖము ననుభవించినను శయ్యాది సాధన జన్యమగు నిద్రా సుఖమునందుగూడ శ్రమ కలుగుచున్నది. (39-44) ఇట్టి

నిద్రాపూర్వ సుఖజన్యమగు శ్రమను పోగొట్టుకొని త్రిపుటీవిరహితమగు నిర్విషయానందమును కోరి జీవుడు సుషుప్తిని ప్రవేశించును. సుషుప్తియందు విజ్ఞానమయుడు పలుచబారి యానందమయస్వరూపమును బొందుట చేత శయ్యాదిసాధనజ్ఞానము గాని దుఃఖజ్ఞానము గాని యచట లేదు. ఆ సమయమున పితృపుత్రాదిభేదజ్ఞానము లేక కేవలాజ్ఞానము మాత్రము భాసించును. మేల్కాంచి సుఖముగా నిద్రించితిని నా కేమియు తెలియలేదని పురుషుడు చెప్పుచున్నాడు. గాని నేను దుఃఖముననుభవించితినని చెప్పుట లేదు. నిద్రానుభూతివిషయము సుఖమనియు అజ్ఞాన మనియు సుప్తోత్థితుడైన వానిచేత స్మరింపబడుటచేత, సుషుప్తియందు సుఖాజ్ఞానములే అనుభవింపబడి నట్లూహింపబడుచున్నవి. (45-61).

ఇట్లు సుషుప్తియందనుభవింపబడు యానందము బ్రహ్మానందమే అగును. దాని ననుభవించు వాడానందమయుడు. నిద్రయందు విజ్ఞానమయముయొక్క చిక్కదనము పోయి కరగిన నెయ్యివలె పల్చబడును. అదియే లయావస్థ. ఇట్లు పల్చపడిన అవస్థయే ఆనందమయుడగుచున్నాడు. ఆనందమయావస్థయందు విజ్ఞానమయపాటవము తగ్గిపోవుటవలన సాంసారిక జ్ఞానములేదు. అందుచేత దుఃఖానుభవముకూడ లేకుండును. కేవలాజ్ఞానము, దానితో పాటు నిద్రాసుఖానుభవసమయమున కలిగిన బ్రహ్మానందప్రతిబింబము ఈ రెంటితో గూడిన బుద్ధి వృత్తి మాత్రము మిగులుచున్నది. జాగ్రదవస్థయందలి యజ్ఞాన వృత్తులు నిస్పష్టములగుటచే నచట అహ మాకారకాభిమాన ముత్పన్నమగుచున్నది. నిద్రయం దీవృత్తులు సూక్ష్మములుగ నుండుటచే నీయభిమాన మనుభవింపబడుట లేదు. సుషుప్తియందు జాగ్రత్స్వప్నదృష్టమగు కామాది ద్వైతము గోచరముకాదు. పగటియందు వివిధాకారాములుగ గన్పట్టు వస్తువులన్నియు రాత్రి యందు చీకటిచేత కప్పబడి ఏకీభూతములై యొకటిగా కనబడును. అందువలన జాగ్రత్స్వప్నావస్థలయం దుపాధిభేదముచేత భిన్నములుగా కన్పట్టుచున్న ఘటపటాదివివిధజ్ఞానములు సుషుప్తియం దుపాధినశించుటచేత నేకీభూతములగుచున్నవి. ఇట్లేకీభూతములైన వివిధ జ్ఞానములయొక్క సౌషుప్తికావస్థ ప్రజ్ఞానఘనమనబడు చున్నది. ఇచట 'ప్రజ్ఞానంబ్రహ్మ' అను



మహావాక్యము యొక్క 1-54 శ్లోకమునందలి యర్థవివరణ మవలోకించదగును. ఉపాదిభేదముచేత భిన్నములుగగోచరించుచున్న జ్ఞానములన్నియు ఉపాధినశించినపు డేకీభవించి స్వస్వరూపమగు ఆత్మయేయగుచున్నవి. అట్టి ప్రజ్ఞానఘనవిలక్షణమగు సౌషుప్తికావస్థయందు ఇది విషయము, ఇది విషయి అనుభేదము స్ఫురించుట లేదు. గనుక తజ్జన్యమగు దుఃఖము లేదు. నిర్విషయమై అత్యంతానాయాసరూపమగుటచే నీ స్థితి కేవలానన్దావస్థయే యగుచున్నది. ఇట్టియానందమును బుద్ధి ప్రతిబింబిత చేతనాత్మకుడగు చిదాభాసు డనుభవించుటచేత నతడానందభుక్ అని వర్ణింపబడినాడు. సుషుప్తియందున్నను, భూతభవిష్యద్విషయములను సర్వవిషయములను తెలిసికొను శక్తి యతనికుండుటచే నితడు ప్రాజ్ఞుడనిపించుకొనుచున్నాడు. జాగ్రత్స్వప్నములయందు కర్మానుభవశ్రాంతుడైన జీవుడు సుఖలిప్సచే సుషుప్తినిజెంది కొంతకాలమానందము ననుభవించుచున్నాడు. కాని యీ అనుభవమతనికి తాత్కాలికము. తిరిగి యనుభవించవలసిన కర్మచే ప్రేరితుడై సుషుప్తినుంచి మేల్కొని జాగ్రదవస్థను పొంది కర్మఫలము ననుభవించుచున్నాడు. సుషుప్త్యవస్థను వదలి తిరిగి జాగ్రదవస్థను పొందుటకు చేతస్సు ద్వారమగుటచేత నతనిని చేతో ముఖః అనియు చెప్పినారు. (62-72) 72

అ॥ ఈ కడపటి విషయమును 'కర్మజన్మాన్తరే' యను కైవల్య శ్రుత్యర్థముచే స్థిరము చేయుచున్నారు.

**కర్మ జన్మాన్తరేఽభూద్యత్తద్యోగాద్బుధ్యతే పునః,**
**ఇతి కైవల్యశాఖాయాం కర్మణో బోధ ఈరితః॥** **73**

టీ॥ జన్మఅన్తరే= పూర్వజన్మమునందు, యత్ కర్మ అభూత్= ధర్మాధర్మరూపమగు శేషకర్మ ఏది కలదో, తత్యోగాత్= దాని సంబంధము వలన, పునః= తిరిగి, బుధ్యతే= సుషుప్తినుంచి మేల్కొని జాగ్రత్తునకు వచ్చును, ఇతి= అని, కర్మణః= కర్మవలన, బోధః= సుషుప్తినుంచి మేల్కొనుట కైవల్యశాఖాయాం ఈరితః= కైవల్యోపనిషత్తులోని 'పునశ్చ జన్మాంతరకర్మ యోగాత్స ఏవ జీవః స్వపితి ప్రబుద్ధః (కై 1-14) అను వాక్యమునందు చెప్పబడినది.

అ॥ ఇట్లు బ్రహ్మానందమును సౌషుప్తికానుభవముచే సాధించిరి. జగత్కారణోపాధి యగు వాసనానందమును (11-1) వివరించుటకు 'కంచిత్కాలం' అని ప్రారంభించుచున్నారు.

**కంచిత్కాలం ప్రబుద్ధస్య బ్రహ్మానందస్య వాసనా।**
**అనుగచ్ఛేద్యతస్తూష్ణీమాస్తే నిర్విషయః సుఖీ ॥ 74**

టీ॥ బ్రహ్మానన్దస్య వాసనా = సుషుప్తియందనుభూతమైన బహ్మానందముయొక్క సంస్కారము, ప్రబుద్ధస్య= నిద్ర నుంచి లేచినవానికి, కంచిత్ కాలం అనుగచ్ఛేత్= స్వల్పకాలము వెంటనుండును. యతః= ఏల యనగా, నిర్విషయః= నిద్రలేచిన తరువాత విషయసంబంధము లేక, సుఖీ= సుఖము ననుభవించుచు తూష్ణీంఆస్తే= ఊరకయుండును.

అ॥ ఈ తూష్ణీంభావమునకు భంగము కలుగుటకు కారణమును 'కర్మభిః' అని తెలుపుచున్నారు.

**కర్మభిః ప్రేరితః పశ్చాన్నానాదుఃఖాని భావయన్।**
**శనైర్విస్మరతి బ్రహ్మానందమేషోఽఖిలో జనః॥ 75**

టీ॥ కర్మభిః ప్రేరితః= పూర్వకర్మలచేత ప్రేరేపింపబడినవాడై, పశ్చాత్= తరువాత, నానాదుఃఖాని భావయన్= అనేకములగు దుఃఖములను మనస్సున సంభావించుచు; ఏషః అఖిలః జనః= ఈ సమస్తజనము, బ్రహ్మానందం= సుషుప్తియం దనుభవింపబడిన బ్రహ్మానందమును, శనైః= క్రమముగా, విస్మరతి= మఱచును.

అ॥ సర్వప్రాణులకును బ్రహ్మానందమునందు, పక్షపాతమనుట నిర్వివాదమని 'ప్రాక్' అని చెప్పుచున్నారు.

**ప్రాగూర్ధ్వమపి నిద్రాయాః పక్షపాతో దినే దినే,**
**బ్రహ్మానందే నృణాం తేన ప్రాజ్ఞోఽస్మిన్ వివదేత కః॥ 76**

టీ॥ నిద్రాయాః ప్రాక్ ఊర్ధ్వం అపి= నిద్రపోవుటకు పూర్వము, లేచినతరువాతను గూడ, దినేదినే= ప్రతిదినము, నృణాం= మనుష్యులకు, బ్రహ్మానందే= బ్రహ్మానందము నందు, పక్షపాతః= పక్షపాతము, అందువలననే మృదుశయ్యాదుల నాయత్తము చేసికొందురు. తేన= అందువలన, అస్మిన్= ఈ విషయమునందు, ప్రాజ్ఞః కః= వివేకియైనవా డెవడు, వివదేత= వివాదము చేయును.



అ॥ శ్రవణాదులచేతగూడ లభ్యము గాని బ్రహ్మానందము తూష్ణీంభావమునందు లభ్యమగుచుండగా, గురుశాస్త్రముల వలన నేమి ప్రయోజనమను శంకకు 'నను' అని సమాధానము చెప్పుచున్నారు.

**నను తూష్ణీం స్థితౌ బ్రహ్మానన్దశ్చేద్భాతి లౌకికాః।**
**అలసాశ్చరితార్థాః స్యుః శాస్త్రేణ గురుణాత్ర కిమ్॥ 77**

టీ॥ నను= ఓసిద్ధాన్తీ! తూష్ణీం స్థితౌ= మనస్సునిర్వ్యాపారముగా నుండిన స్థితియందు, బ్రహ్మానందః భాతిచేత్= బ్రహ్మానందము భానమైనచో, అలసాః లౌకికాః= జగద్వ్యాపారముచే శ్రాంతులగు లౌకికులు, చరితార్థాః స్యుః= కృతకృత్యులగుదురు, అత్ర= బ్రహ్మానంద మొందుటకు, శాస్త్రేణ గురుణా కిం= శాస్త్రముచేత గాని గురువుచేత గాని యేమి ప్రయోజనము

అ॥ ఇట్లనుభూయమానమగు సుఖము బహ్మానందమని తెలిసికొనుటకు గురుశాస్త్రము లవశ్యములగుచున్నవని 'బాఢం' అని చెప్పుచున్నారు.

**బాఢం బ్రహ్మేతి విద్యశ్చేత్కృతార్థాస్తావతైవ తే।**
**గురుశాస్త్రే వినాత్యంతం గంభీరం బ్రహ్మ వేత్తి కః॥ 78**

టీ॥ బాఢం= బాగు! తే= అలౌకికులు బ్రహ్మ ఇతివిద్యుః చేత్= సుషుప్తితదనంతరానందము బ్రహ్మస్వరూపమని తెలిసికొందు రేని, తావతా ఏవ= అంతమాత్రముచేతనే, కృతార్థాః= కృతార్థులగుచున్నారు. కాని, గురుశాస్త్రేవినా= గురుశాస్త్రములులేక, అత్యంతం గంభీరం బ్రహ్మ= అవాఙ్మనసగోచరము, సర్వోపనిషదఖండార్థమునగు బ్రహ్మమును, కః వేత్తి= ఎవరు తెలిసికోగలరు?

అ॥ సుషుప్త్యనంతరానందము బ్రహ్మానందమని మీవలన తెలిసికొనుచున్నాను గదా! అను ప్రశ్నకు 'జానామి' యని సమాధానము.

**జానామ్యహం త్వదుక్త్యాద్య కుతో మే న కృతార్థతా।**
**శృణ్వత్ర త్వాదృశో వృత్తం ప్రాజ్ఞంమన్యస్య కస్యచిత్॥ 79**

టీ॥ త్వత్ ఉక్త్యా= తత్త్వమును తెలిసిన నీ మాటచేత, అహంజానామి= నేను బ్రహ్మానందమును తెలిసికొంటిని, కుతః మే, కృతార్థతాన= నాకు కృతార్థత ఏల కలుగదు అని ప్రశ్న. ఇందుకు సమాధానము. ప్రాజ్ఞం మన్యస= ప్రాజ్ఞుడు కాకపోయినను ప్రాజ్ఞుడనని తనను భావించుకొనుచున్న, త్వాదృశః కస్యచిత్= నీబోటి యొకనియొక్క వృత్తం= కథను, అత్ర= ఈ సందర్భమున, శృణు= వినుము.

అ॥ 'చతుర్వేదవిదే' యని యా కథను చెప్పుచున్నారు.

**చతుర్వేదవిదే దేయమితి శృణ్వన్నవోచత।**
**వేదాశ్చత్వార ఇత్యేవం వేద్మి మే దీయతాం ధనమ్॥ 80**

అ॥ చతుఃవేదవిదే, దేయం ఇతి= నాలుగువేదములు తెలిసినవానికి ధనమీయతగునని, శృణ్వన్= విని, అవోచత= ఒకానొకడిట్లుచెప్పెను. వేదాః చత్వారః ఇతి ఏవ= వేదములు నాలుగని మాత్రము, వేద్మి= నాకు తెలుసును. కనుక, మే ధనం దీయతాం= నాకు ధనమివ్వబడుగాక అని చెప్పెను.

అ॥ వేదములు నాలుగని వినినంత మాత్రముచేతనే నతడు చతుర్వేదవిదుడయ్యెనేని సుషుప్త్యనంత రానందము బ్రహ్మానందమని వినినంత మాత్రముచేతనే దాని సంపూర్ణజ్ఞానమునీకు కలిగినదగునని 'సంఖ్యా' అని చూపుచున్నారు.

**సంఖ్యామేవైష జానాతి న తు వేదానశేషతః।**
**యది తర్హి త్వమప్యేవం నాశేషం బ్రహ్మ వేత్సి హి॥ 81**

టీ॥ ఏషః= ఇతడు, సంఖ్యాం ఏవ జానాతి= వేదముల యొక్క సంఖ్యను మాత్రము తెలిసికొనెను. నతు అశేషతః వేదాన్= కాని సంపూర్ణముగ వేదములను తెలిసికొనలేదు, యది తర్హి= అని అనెద వేని, అట్లయిన, త్వం అపి= నీవును, బ్రహ్మ= బ్రహ్మమును, అశేషం న వేత్సి= పూర్తిగా తెలిసికొనలేదు.

అ॥ బ్రహ్మము నిరంశము. కనుక కొంతభాగము తెలిసికొనుట మరికొంతభాగము తెలిసికొనకుండుట యెటుల సాధ్యమను శంకను 'అఖండ' యని ఉపపాదించుచున్నారు.



**అఖండైకరసానన్దే మాయాతత్కార్యవర్జితే,**
**అశేషత్వసశేషత్వవార్తావసర ఏవ కః ॥ 82**

టీ॥ మాయాతత్ కార్యవర్జితే= మాయ, దాని యొక్క కార్యమగు ఆవరణవిక్షేపములు లేనట్టియు (6-26), అఖండ, ఏక, రస, ఆనందే= నిరంశమై ఏకరసఘనమై పరగుచున్న బ్రహ్మమునందు, అశేషత్వ సశేషత్వవార్తాఅవసరః= నిశ్శేషము సశేషమను ప్రశంస కవసరము, కః= ఎక్కడిది?

అ॥ నా శేషం బ్రహ్మవేత్సి యను పైవాక్యము నందలి అశేషశబ్దార్థము తెలియక పై ప్రశ్న వేయబడినది. దాని వివరణకొరకు బ్రహ్మ జానామి యను మాటయొక్క అర్థమును 'శబ్దానేవ' అని విచారించుచున్నారు.

**శబ్దానేవ పఠస్యహో తేషామర్థం చ పశ్యసి,**
**శబ్దపాఠేఽర్థబోధస్తే సంపాద్యత్వేన శిష్యతే॥ 83**

టీ॥ శబ్దాన్ ఏవ పఠసి= బ్రహ్మ మఖండైక రసానందము, మాయా తత్కార్యవర్జిత మని కేవల శబ్దములను మాత్రము పలుకుచున్నావా? అహోస్విత్= లేక, తేషాం అర్థం చ పశ్యసి= వాని యర్థమునుగూడ చూచుచున్నావా? శబ్దపాఠే= శబ్దములను మాత్ర ముచ్చరించుచుండగా, తే= నీకు అర్థబోధః= వాని యర్థజ్ఞానము, సంపాద్య త్వేన శిష్యతే= సంపాదింపదగినదిగా మిగులుచున్నది.

ఆ॥ వ్యాకరణ శాస్త్రజ్ఞానముచే నర్థజ్ఞానము సమకూరుటచే నపశేష మేమియు లేదను ప్రశ్నకు 'అర్థే' యని సమాధానము చెప్పుచున్నారు.

**అర్థే వ్యాకరణాద్బుద్ధే సాక్షాత్కారోఽవశిష్యతే,**
**స్యాత్కృతార్థత్వధీర్యావత్తావద్గురుముపాస్వ భోః ॥ 84**

టీ॥ భోః= ఓయీ! అర్థే వ్యాకరణాత్ బుద్ధే= అర్థము వ్యాకరణ శాస్త్రముచే తెలియబడినదగుచుండగా, సాక్షాత్కారః అవశిష్యతే= సాక్షాత్కారము మిగులుచున్నది. యావత్= ఎంతవఱకు, కృతార్థత్వధీః= నేను కృతార్థుడనైతినను జ్ఞానము, స్యాత్= కలుగునో, తావత్= అంతవరకు, గురుం ఉపాస్వ= గురువు నాశ్రయించుము.

తా॥ వి॥ వ్యాకరణము, ఛందస్సు, నిరుక్తము, జ్యోతిషము, శిక్ష, కల్పము - ఈ యారును వేదమున కంగములు. వీని సహాయముచే వేదమున కర్థము చెప్పబడుచున్నది. వీని సహాయముచే కలుగు సర్వోపనిషద ఖండార్థమగు బ్రహ్మము యొక్క జ్ఞానము పరోక్షజ్ఞానము గాని యపరోక్ష జ్ఞానముకాదు. అపరోక్షజ్ఞాన మర్థజ్ఞానముచేత కలుగదు. మనన నిదిధ్యాసనములే దానికి సాధనములు. 6-16, 7-67 శ్లోకములు చూడవలెను. ఇట్టి యపరోక్షజ్ఞానసిద్ధికి, అజ్ఞాతజ్ఞాపకములగు శాస్త్రములు శ్రోత్రియుడును బ్రహ్మనిష్ఠుడు నగు గురునవవశ్యము సేవింపవలెను.

అ॥ ప్రసక్తానుప్రసక్తముగ ప్రాప్తమగు బ్రహ్మానందసాధనమును వివరించి, 74 శ్లోకములో నుదాహరించిన వాసనానందవివరణమును 'ఆస్తాం' అని యారంభించుచున్నారు.

**ఆస్తామేతద్యత్ర యత్ర సుఖం స్యాద్విషయైర్వినా।**
**తత్ర సర్వత్ర విద్ధ్యేతాం బ్రహ్మానందస్య వాసనామ్॥ 85**

టీ॥ ఏతత్ ఆస్తాం= ప్రసక్తాను ప్రసక్తముగ సంభవించిన యీ విషయ మటుండనిమ్ము. విషయైః వినా= విషయసంబంధము లేక, యత్ర యత్ర= ఎచ్చటెచ్చట, సుఖం= సుఖానుభవమో, తత్ర సర్వత్ర= అట్టి అన్ని స్థలముల యందును, బ్రహ్మానందస్య వాసనాం = బ్రహ్మానన్దవాసనను, విద్ధ్యేతాం= తెలిసికొందురుగాక.

తా॥ వి॥ మాయాహంకారాద్యుపాధిరహితము, త్రిపుటీశూన్యము, నిర్విషయము, స్వయంప్రకాశమునగు ఆనందము బ్రహ్మానందము, జ్ఞాతృజ్ఞేయాదిత్రిపుటీవిశిష్టములైనను దానిచే నసంస్పృష్టులై యోగులచే ననుభవింపబడు నానందము నిజానందము. నిర్విషయము, అహంకారావృతము, 'అహంసుఖీ' యను త్రిపుటీవిశిష్టము నిద్రలేచినవెంటనే యుండు ఉదాసీనావస్థయం దనుభవింపబడు ఆనందము వాసనానందము. నిద్రయం దనుభవింపబడు బ్రహ్మానందము యొక్క వాసనాస్వరూపమే గనుక దీని కా పేరు కలిగినది. సర్వద్వైత విదూరము బ్రహ్మానందము, ద్వైతమున్నను దానిచే నసంస్పృష్టము నిజానందము. ద్వైతసంస్పృష్టము వాసనా నందము. నిజానందవాసనానందములు బ్రహ్మానందాతిరిక్తములు కావు.



కూటస్థబ్రహ్మలవలె సుగమముగ నర్థగ్రహణకొఱ కొకే యానందము ఆత్మానందము అద్వైతానందమని వాడబడుచున్నవి.

అ॥ 11-12-73 శ్లోకములలో బ్రహ్మానందవివరణము విస్తరింప బడినది. 74-85 శ్లోకములలో వాసనానందము ప్రదర్శింపబడినది. విషయానందమును వివరించవలసియున్నది. శ్లోకార్థానువాద పూర్వకముగా 'విషయేషు' అని విషయానందమును నిరూపించుచున్నారు.

**విషయేష్వపి లబ్ధేషు తదిచ్ఛోపరమే సతి।**
**అన్తర్ముఖమనోవృత్తావానందః ప్రతిబింబతి ॥ 86**

టీ॥ విషయేషు లబ్ధేషు అపి= స్రగాదివిషయములు లభించిన పగుచుండగా గూడ, తత్, ఇచ్ఛా, ఉపరమే సతి= వాని యందిచ్ఛ తొలగిపోగా, అన్తర్ముఖమనోవృత్తౌ= అన్తర్ముఖమగు మనోవృత్తియందు, ఆనందః ప్రతిబింబతి= ఆనందము ప్రతిఫలించును.

తా॥ వి॥ విషయములం దిచ్ఛ జనించినపుడు మనోవృత్తి జ్ఞానేంద్రియములద్వారా బహిర్ముఖమగుచున్నది. అభీప్సితార్థములు లభించి వానిననుభవించిన తరువాత వాని మీద ఇచ్ఛ మరలిపోవును. ఇట్టి సుఖము విషయాధీనమగుటచే నది శ్రమ హేతువు గూడ నగుచున్నది. అపుడు నిర్విషయసుఖమును గోరి బుద్ధివృత్తి యంతర్ముఖమగును. అంతర్ముఖమగు నీ బుద్ధివృత్తియందు బహ్మానందము ప్రతిఫలించి యానందానుభవము నిచ్చుచున్నది. ఇట్టి ప్రతిఫలితానందము విషయానందము.

అ॥ 'బ్రహ్మానందః' అని ఫలితార్థమును చెప్పుచున్నారు.

**బ్రహ్మానందో వాసనా చ ప్రతిబిమ్బ ఇతి త్రయమ్।**
**అన్తరేణ జగత్యస్మిన్ ఆనన్దో నాస్తి కశ్చన॥ 87**

టీ॥ బహ్మానందః వాసనా, ప్రతిబింబః ఇతి= బ్రహ్మానందము, వాసనానందము, బ్రహ్మానందప్రతిబింబితస్వరూపమగు విషయానందము, అని, త్రయం= ఆనందము మూడువిధములు, అన్తరేణ= వీనికంటె,

భిన్నముగ, కః చన ఆనన్దః= మరియొక ఆనన్దమేదియు, అస్మిన్ జగతి= ఈ జగత్తునందు, న అస్తి= లేదు.

అ॥ ఈ యానందములు బ్రహ్మానందజన్యము లగుటచే నీ ప్రకరణమున నుదాహరింపబడినవని 'తథాచ' అని చెప్పుచున్నారు.

**తథా చ విషయానందో వాసనానన్ద ఇత్యమూ।**
**ఆనన్దౌ జనయన్నాస్తే బ్రహ్మానందః స్వయంప్రభః॥ 88**

టీ॥ తథా చ= ఇట్లానందము త్రివిధమగుచుండగా, విషయానన్దః వాసనానన్దః= విషయానన్దము వాసనానన్దము, ఇతి అమూ ఆనన్దౌ= ఈ రెండానన్దములను జనయన్= పుట్టించుచూ, స్వయంప్రభః బ్రహ్మానందః= స్వయంప్రకాశమగు బ్రహ్మానందము, ఆస్తే= నిత్యనిర్వికారముగ నున్నది.

అ॥ విషయానన్ద వాసనానన్ద కారణమగు బ్రహ్మానంద మప్ర యత్నముగ సుషుప్తియం దనుభవింపబడుచున్నట్లు పూర్వగ్రంథమున సవిస్తరముగ చూపబడినది. జాగ్రదవస్థయం దాబ్రహ్మానందము నొందు మార్గమును జూపుటకు 'శ్రుతి' యని యుత్తరగ్రంథము నారంభించు చున్నారు.

**శ్రుతియు క్త్యనుభూతిభ్యః స్వప్రకాశచిదాత్మకే,**
**బ్రహ్మానందే సుప్తికాలే సిద్ధే సత్యన్యథా శృణు ॥ 89**

టీ॥ శ్రుతి, యుక్తి, అనుభూతిభ్యః= సుషుప్తికాలే విలీనే మొదలగు శ్రుతులచేతను, 'సుఖమస్వాప్సం' అను యుక్తిచేతను, అందుచే నూహింప బడిన అనుభవముచేతను, సుప్తికాలే= సుషుప్తియందు, స్వప్రకాశ చిదాత్మకే= స్వయంప్రకాశము చైతన్యస్వరూపమునగు, బ్రహ్మానందే సిద్ధేసతి= బ్రహ్మానందము సిద్ధమగుచుండగా, అన్యథా= జాగ్రదవస్థయందు, శృణు= బ్రహ్మానందము లభించు నుపాయము వినుము.

అ॥ ముందు జీవునికి స్వప్నజాగ్రదవస్థలెట్లు కలుగుచున్నవో, 'యః' అని వివరించుచున్నారు.

**య ఆనందమయః సుప్తౌ స విజ్ఞానమయాత్మతామ్।**
**గత్వా స్వప్నం ప్రబోధం వా ప్రాప్నోతి స్థానభేదతః॥ 90**



టీ॥ సుప్తౌ= సుషుప్తియందు, యః ఆనందమయః= కరగిన ఘృతమువలె పలుచబారిన యేవిజ్ఞానమయు డానందమయశబ్దముచే చెప్పబడుచున్నాడో (11-63), సః= అతడు సుషుప్తియం దనుభవించిన బ్రహ్మసుఖమును శేషకర్మవశమున వదలి చేతోముఖుడై (11-72-73), విజ్ఞానమయాత్మతాం గత్వా= ఘనీభూతుడై తిరిగి విజ్ఞానమయస్వరూపుడై, స్థానభేదతః= స్థానభేదము వలన, స్వప్నం ప్రబోధంవా= స్వప్నజాగ్రదవస్థలను, ప్రాప్నోతి= పొందుచున్నాడు. ఇచట 72 శ్లోకములో వ్రాయబడిన సంక్షేపార్థము చూడతగును. జగద్వ్యాపారముచే శ్రాంతమైన బుద్ధివృత్తి సుఖేచ్ఛచే సుషుప్తిని ప్రవేశించు విధానము 72 శ్లోకమున వివరింపబడినది. సుషుప్తినుంచి తిరిగి జాగ్రదవస్థకు నివర్తించు విధాన మిచట చెప్పబడుచున్నది.

అ॥ పై నుదాహరింపబడిన స్థానభేదమును 'నేత్రే' యని వివరింపు చున్నారు.

**నేత్రే జాగరణం కంఠే స్వప్నం సుప్తిర్హృదంబుజే,**
**ఆపాదమస్తకం దేహం వ్యాప్య జాగర్తి చేతనః ॥ 91**

టీ॥ నేత్ర= నేత్రశబ్దముచే నుపలక్షితమగు శరీరమునందంతయు, జాగరణం= జాగ్రదవస్థ, కంఠే= కంఠమునందు, స్వప్నం= స్వప్నావస్థ, సుప్తిః హృత్ అంబుజే= హృదయకమలమునందు, సుషుప్త్యవస్థ, ఆపాదమస్తకం= పాదము మొదలు శిరస్సువరకు, దేహం= దేహమును, ప్రాప్య= వ్యాపించి, చేతనః= జీవుడు, జాగర్తి= జాగ్రదవస్థయందుండును.

అ॥ పైశ్లోకముయొక్క ఉత్తరార్ధమును 'దేహ' యని సోదాహరణ ముగ వివరింపుచున్నారు.

**దేహతాదాత్మ్యమాపన్న స్తప్తాయఃపిండవత్తతః,**
**అహం మనుష్య ఇత్యేవం నిశ్చిత్యైవావతిష్ఠతే॥ 92**

టీ॥ తప్త, అయః పిండవత్= అగ్ని ఎఱ్ఱగా కాలిన నినుపగుండంతటను వ్యాపించి దాని స్వరూపమును బొందునో అటులనే, దేహతాదాత్మ్యం ఆపన్నః= దేహమే తానను భావమును బొందినవాడై, తతః= అటుపిమ్మట, అహం

మనుష్యః= నేను మనుష్యుడను, ఇతి ఏవం= అని ఇట్లు, నిశ్చిత్యఏవ అవతిష్ఠతే= నిశ్చయముతో ప్రవర్తించును.

అ॥ ఇట్లు దేహతాదాత్మ్యమునుబొందిన జీవునికి సంప్రాప్తమగు నవస్థాత్రయమును 'ఉదాసీనః' అని వర్ణించుచున్నారు.

**ఉదాసీనః సుఖీ దుఃఖీత్యవస్థాత్రయమేత్యసౌ,**
**సుఖదుఃఖే కర్మకార్యే త్వౌదాసీన్యం స్వభావతః॥ 93**

టీ॥ ఉదాసీనః= ఉదాసీనుడు, సుఖీ= సుఖముననుభవించువాడు, దుఃఖీ= దుఃఖముగలవాడు, ఇతి అవస్థాత్రయం= అను మూడవస్థలను, అసౌ ఏతి= ఈ జీవుడు పొందుచున్నాడు. వానిలో, సుఖదుఃఖే= సుఖ దుఃఖములు, కర్మకార్యే= పూర్వకర్మఫలములు, ఔదాసీన్యం తు= ఉదాసీన భావమైతేనో, స్వభావతః= సహజముగానున్నది.

తా॥ వి॥ నిద్రలేచిన వెంటనే కర్మానుభవము తిరిగి ప్రారంభము కాకపూర్వము వాసనానందము ననుభవించుస్థితి ఉదాసీనావస్థ కుదాహరణ మగుచున్నది.

అ॥ కారణభేదమువలన, సుఖదుఃఖములకు కలిగిన ద్వైవిధ్య మును 'బాహ్యభోగా౯' అని చూపుచున్నారు.

**బాహ్యభోగాన్మనోరాజ్యాత్సుఖదుఃఖే ద్విధా మతే।**
**సుఖదుఃఖాన్తరాలేషు భవేత్తూష్ణీమవస్థితిః॥ 94**

టీ॥ బాహ్యభోగాత్= స్రగాదిబాహ్యభోగవిషయములచేతను, మనో రాజ్యాత్= మానసిక భావనచేతను, సుఖదుఃఖే ద్విధా మతే= సుఖ దుః ఖములు రెండువిధములుగపరిగణింపబడుచున్నవి. సుఖదుఃఖాన్తరాలేషు= సుఖదుఃఖానుభవములు మధ్యకాలములయందు, తూష్ణీం అవస్థితిః= ఉదాసీనావస్థ, భవేత్= సంభవించును.

అ॥ జాగ్రదావస్థయందు సంభవించు ఉదాసీనావస్థయందు స్వస్వరూప మభివ్యక్తమగునని 'న కాపి' అని అనుచున్నారు.

**న కాపి చిన్తా మేఽస్త్యద్య సుఖమాస ఇతి బ్రువ౯**
**ఔదాసీన్యే నిజానందభానం వక్త్యఖిలో జనః॥ 95**



టీ॥ మే=నాకు, కా అపి చిన్తాన= ఏమియు దుఃఖము లేదు. అద్య= ఇప్పుడు, సుఖం ఆసే= సుఖముగానున్నాను. ఇతి బ్రువన్= అని చెప్పుచూ, ఔదాసీన్యే= ఉదాసీనస్థితియందు, నిజ ఆనందభానం= తన ఆనందాను భవమును అఖిలః జనః= సమస్తజనము, వక్తి= చెప్పుచున్నారు.

అ॥ ఇట్లనుభూయమానమగు ఆనందము వాసనానందము గాని ముఖ్యమగు నిజానందము కాదని 'అహం' అని పలుకుచున్నారు.

**అహమస్మీత్యహంకారసామాన్యాచ్ఛాదితత్వతః।**
**నిజానందో న ముఖ్యోఽయం కింత్వసౌ తస్య వాసనా॥ 96**

టీ॥ అహం అస్మి= నేను సుఖముగా నున్నాను, ఇతి అహంకార, సామాన్య, ఆచ్ఛాదితత్త్వతః= ప్రత్యేకవ్యక్తిసంబంధము లేక సర్వ సామాన్య మగు నహంకారవిశిష్టమగుటచే, అయం= ఉదాసీనమునందు ప్రతివానికి నభివ్యక్తమగుచున్న యీ యానందము, ముఖ్యః నిజానందః న= ముఖ్యమగు నిజానందము కాదు. కింతు= ఇక నేమనిన, అసౌ= ఇది, తస్య వాసనా= బ్రహ్మానందముయొక్క వాసన మాత్ర మగుచున్నది.

అ॥ ఈ యర్థమును 'నీరపూరిత' యని దృష్టాంతము చేత స్పష్టము చేయుచున్నారు.

**నీరపూరితభాండస్య బాహ్యే శైత్యం న తజ్జలమ్।**
**కింతు నీరగుణస్తేన నీరసత్తాఽనుమీయతే॥ 97**

టీ॥ నీరపూరితభాండస్య= నీటితో నిండిన కుండయొక్క, బాహ్యే= పై భాగమునందు, శైత్యం= స్పర్శచే తెలియుచున్న చల్లదనము, తత్‌జలం న = లోపలి నీరు కాదు. కింతు= ఇక నేమంటె, నీరగుణః= నీటియొక్క గుణము. తేన= ఆ గుణముచేత, నీరసత్తా= కుండయందు నీరున్నట్లు, అనుమీయతే= ఊహించబడుచున్నది.

తా॥ వి॥ శైత్యము జలముయొక్క గుణమని తార్కికులు చెప్పుదురు.

అ॥ ఈ విధముగనే వాసనానందముచే నిజానంద మను భవింపబడు చున్నట్లు 'యావత్' అని తెలుపుచున్నారు.

**యావద్యావదహంకారో విస్మృతోఽభ్యాసయోగతః।**
**తావత్తావత్సూక్ష్మదృష్టేర్ని జానందోఽనుమీయతే॥ 98**

టీ॥ నిరోధసమాధ్యభ్యాసముచేత, అహంకారః= విజ్ఞాన మయ స్వరూపమగు నహంకారము, యావత్ యావత్= ఎంతెంతవఱకు, అభ్యాసయోగాత్= అభ్యాససహకారము వలన, విస్మృతః= మఱువబడు చున్నదో, తావత్ తావత్= అంతత వఱకు, నిజానందః= బ్రహ్మానందము, సూక్ష్మదృష్టేః= సూక్ష్మదృష్టివలన, అనుమీయతే= ఊహింప బడుచున్నది.

అ॥ నిజానందమును సంపూర్ణముగ ననుభవించు స్థితిని 'సర్వాత్మనా' యని వర్ణించుచున్నారు.

**సర్వాత్మనా విస్మృతస్సన్ సూక్ష్మతాం పరమాం వ్రజేత్।**
**అలీనత్వాన్న నిద్రైషా తతో దేహోఽపి నో పతేత్॥ 99**

టీ॥ అహంకారము, సర్వాత్మనా = సంపూర్ణముగ, విస్మృతః సన్ = మరచి పోబడినదై, పరమాం సూక్ష్మతాం= అత్యంతము సూక్ష్మ భావమును, వ్రజేత్= పొందును. ఏషా= ఈ స్థితి, అలీనత్వాత్= అహంకారము సంపూర్ణముగా లీనము కాకుండుటవలన, నిద్రాన= నిద్రావస్థకాదు. తతః= అందువలన, దేహః అపి= దేహముగూడ, నో పతేత్= నిద్రయందు వలె క్రింద పడుటలేదు.

తా॥ వి॥ సమాధియం దశేషమానసికవృత్తులు విరమించుట వలన నహంకారము సమగ్రముగ విస్మృతమై యత్యంత సూక్ష్మావస్థయందుండును. గనుక నది వ్యవహారసమర్థము గాదు. సమాధియం దన్తఃకరణము లీనము కాదు. సుషుప్తి యందు సర్వవృత్తివిరామమే కాక యన్తఃకరణలీనము గూడ కలుగుచున్నది. కాబట్టి సమాధి నిదుర కాదు. సమాధియందు శరీరము గీ 6-13లో చెప్పినట్లు కాయశిరోగ్రీవములు మూడును సమానముగా నుండు నట్లు ధరింపబడును. నిద్రయందు క్రిందపడియుండును. సుషుప్తియందను భవింపబడునది బ్రహ్మానందము. సమాధియం దనుభవింపబడునది నిజానందము. ఇదియే సమాధిసుషుప్తులకు భేదము.



అ॥ భగవద్గీత 6. 25-27, 6. 20-23, 6. 15 శ్లోకముల యర్థవిచారణచేత బ్రహ్మానందస్వరూపమును సప్రమాణముగా నిరూపించ తలచి, ముందు దాని స్వరూపనిర్వచనము 'న ద్వైతం' అని చేయుచున్నారు.

**న ద్వైతం భాసతే నాపి నిద్రా తత్రాస్తి యత్సుఖమ్।**
**స బ్రహ్మానంద ఇత్యాహ భగవానర్జునం ప్రతి॥ 100**

టీ॥ ఏ కాలమునందు, ద్వైతం న భాసతే= ద్వైతము భాసింపదో, న అపి నిద్రా= నిద్రయు గూడ లేదో, తత్ర= ఆసమయమునందు, యత్ సుఖం= ఏ సుఖము కలదో, సః= అది, బ్రహ్మానన్దః ఇతి= బ్రహ్మానందమని, భగవాన్= శ్రీకృష్ణభగవానుడు, అర్జునం ప్రతి= అర్జునుని గూర్చి ఆహ=చెప్పెను.

అ॥ ఈ యర్థము నుపాదించుట పై గీతావాక్యములను 'శనైః' అని క్రమముగా ప్రదర్శించుచున్నారు.

**శనైః శనై రుపరమేద్బుద్ధ్యా ధృతిగృహీతయా**
**ఆత్మసంస్థం మనః కృత్వా న కించిదపి చింతయేత్॥ 101**

టీ॥ ధృతి, గృహీతయా బుద్ధ్యా= ధైర్యముతో నిగ్రహింపబడినబుద్ధితో, శనైః శనైః ఉపరమేత్= క్రమక్రమముగా విరమించవలెను. మనఃమనస్సును, ఆత్మసంస్థం కృత్వా= స్వస్వరూపమునందు నిలిపి, కించిత్ అపి న చింతయేత్= మరిదేనిని ఇసుమంతయు నాలోచించకూడదు. ఇదియే యోగముయొక్క పరమావధి.

అ॥ దీనిని సంపాదించు నుపాయమును గీ 6-26 శ్లోకమునుంచి 'యతః' అని ప్రదర్శించుచున్నారు.

**యతో యతో నిశ్చరతి మనశ్చంచలమస్థిరమ్।**
**తతస్తతో నియమ్యైతదాత్మన్యేవ వశం నయేత్॥ 102**

టీ॥ మనస్సు నాత్మసంస్థముగా చేయదలచిన యోగి, చంచలం= స్వభావముచేత చంచలమై, అస్థిరం= అందుచే నస్థిరమగుటచే- నొక విషయమునుంచి మరియొక విషయమునకు పరుగులెత్తు, మనః= మనస్సు, యతః యతః= శబ్దాది విషయములలో దేని దేనినుంచి, నిశ్చరతి=

బాహ్యమునకు సంచరించునో, తతః తతః= ఆ యావిషయములనుంచి, నియమ్య= నిరోధించి, ఆత్మని ఏవ= ఆత్మయందే, వశంనయేత్= వశమును పొందించవలెను.

అ॥ మనస్సు నాత్మవశము జేయుటవలనకలుగుప్రయోజనమును 'ప్రశాన్త' (గీ. 6-27) యని వర్ణించుచున్నారు.

**ప్రశాన్తమనసం హ్యేనం యోగినం సుఖముత్తమమ్।**
**ఉపైతి శాన్తరజసం బ్రహ్మభూతమకల్మషమ్॥** 103

టీ॥ అకల్మషం= అధర్మాదిదోషరహిత మగుటవలన, నిర్మల మైనట్టియు, శాంతరజసం= క్షీణించిన మోహాదులు కలిగినవాడు గనుకనే, ప్రశాంతమనసం= సమిధలు లేనియగ్నివలే విలయమును పొందిన మనస్సు గలవాడగుటచేత సంపూర్ణముగ విక్షేపరహితుడు గనుక, బ్రహ్మభూతం= బ్రహ్మభావమును బొందినట్టియు, ఏనం యోగినం= ఈ యోగిని, ఉత్తమం సుఖం= సాతిశయముగాని నిత్యమైన సుఖము, ఉపైతి= పొందును.

అ॥ ఈ యర్థము నుపపాదించు గీ. 6-20-23 శ్లోకములను 'యత్ర' యని ఉదాహరించుచున్నారు.

**యత్రోపరమతే చిత్తం నిరుద్ధం యోగసేవయా।**
**యత్ర చైవాత్మనాత్మానం పశ్యన్నాత్మని తుష్యతి॥** 104

**సుఖమాత్యన్తికం యత్తద్బుద్ధి గ్రాహ్యమతీన్ద్రియమ్।**
**వేత్తి యత్ర న చై వాయం స్థితశ్చలతి తత్త్వతః॥** 105

**యం లబ్ధ్వా చాపరం లాభం మన్యతే నాధికం తతః।**
**యస్మిన్ స్థితో న దుఃఖేన గురుణాపి విచాల్యతే॥** 106

**తం విద్యాద్దుఃఖసంయోగవియోగం యోగసంజ్ఞితమ్।**
**స నిశ్చయేన యోక్తవ్యో యోగోఽనిర్విణ్ణచేతసా॥** 107

టీ॥ యత్ర= ఏ సమయమునందు, యోగసేవయా= యోగాభ్యాసముచేత, నిరుద్ధం= విషయములనుంచి అరికట్టబడిన, చిత్తం= మనస్సు, ఉపరమతే= నివాతదీపమువలె నచంచలమగుచున్నదో, యత్ర= ఏ సమయమున, ఆత్మనా= ఇట్లుపరమావస్థయందుండిన యన్తఃకరణము చేత, ఆత్మానం పశ్యన్= పరమాత్మ నుపలబ్ధముచేసికొని, ఆత్మని తుష్యతి= తనయందే తృప్తు డగునో....



యత్ర= ఏ సమయమునందు, అయం= ఆత్మస్థితుడగు నీ యోగి, ఆత్యంతికం= అనంతమైనట్టియు, బుద్ధిగ్రాహ్యం= బుద్ధిచే గ్రహింప బడదగినట్టియు, అతీన్ద్రియం= ఇన్ద్రియాతీతమైనట్టియు, యత్= ఏ సుఖముగలదో, తత్ సుఖం= ఆ సుఖమును, వేత్తి= అనుభవించుచున్నాడో, మరియు, స్థితః= ఆత్మస్థితిని బొంది, తత్త్వతః= ఆ స్వస్వరూపమునుంచి, న చలతి= చలింపడో....

మఱియు, యం= ఏ స్వరూపమును, లబ్ధ్వా= పొంది, తతః అపరం లాభం అధికం న మన్యతే= దానికంటె మరియొక దాని నెక్కుడు లాభముగ తలంచడో, యస్మిన్ స్థితః= దేని యందుండి, గురుణా అపి దుఃఖేన= గొప్పదగు దుఃఖముచేత గూడ, న విచాల్యతే= చలింపబడడో.... 106

తం దుఃఖ సంయోగ, వియోగం= సర్వదుఃఖసంబంధ పరిత్యాగమును, యోగసంజ్ఞితం= యోగమను పేరు గల దానినిగా, విద్యాత్= తెలిసికొనేది. సః= ఆ యోగము, నిశ్చయేన= దృఢమైనట్టియు, అనిర్విణ్ణ చేతసా= శ్రమచెందనిదగు చిత్తముచేత, యోక్తవ్యః= అనుష్ఠింపతగినది.107

అ॥ 'యుంజన్ ' అని నిరుక్తార్థము నుపసంహరించుచున్నారు.

**యుంజన్నేవం సదాత్మానం యోగీ విగతకల్మషః।**
**సుఖేన బ్రహ్మసంస్పర్శమత్యన్తం సుఖశ్నుతే ॥.** 108

టీ॥ విగతకల్మషః= వీడిపోయిన బుద్ధికాలుష్యముగల యోగీ= ధ్యాననిష్ఠుడు, ఏవం= ఉదాహరింపబడిన ప్రకారము, సదా= ఎల్లపుడును, ఆత్మానం= తనను, యుంజన్= స్వస్వరూపాను సంధానముచేయుచు, బ్రహ్మసంస్పర్శం= బ్రహ్మసంబంధియగు, అత్యంతం సుఖం= సర్వోత్కృష్ట మైన నానందమును, సుఖేన అశ్నుతే= అనాయాసముగ బొందుచున్నాడు.

యోగాభ్యాసమును మెల్లమెల్లగా చేయవలెననుటకు, ఉత్సేక, యని గౌడపాదకారికార్థమును (3-41) పఠించుచున్నారు.

**ఉత్సేక ఉదధేర్యద్వత్ కుశాగ్రేణైకబిందునా।**
**మనసో నిగ్రహస్తద్వద్భవేదపరిఖేదతః॥** 109

టీ॥ కుశాగ్రేణ= దర్భకొనచేత, ఏక బిందునా= ఒక్కొక్క బిందువును తీయుటచేత, ఉదధేః, ఉత్సేకః= సముద్రమును వట్టిచేయుట, యద్వత్= ఎట్లో, తద్వత్= అట్లే, మనసః= మనోనిరోధము, అపరిఖేదతః= అనాయాసముగ నభ్యసించుటచేత, భవేత్= కల్గును.

తా॥ వి॥ మానసిక నిగ్రహ మతిదుస్సాధ్యము గనుక దాని గూర్చి బహుశ్రమ చేయవలసియున్నది. లేనియెడల పిచ్చుకకు తన ముక్కుతో సముద్రమును వట్టిచేయుట యెంతసాధ్యమో నిదియు నంతేసాధ్యమగును.

అ॥ ఈ యర్థమునే మైత్రేయణీయశాఖయం దుదాహరింపబడినట్లు, బృహద్రథ అని చెప్పుచున్నారు.

**బృహద్రథస్య రాజర్షేః శాకాయన్యో మునిః సుఖమ్,**
**ప్రాహ మైత్రాఖ్యశాఖాయాం సమాధ్యుక్తిపురస్సరమ్॥** 110

టీ॥ మైత్ర, ఆఖ్యశాఖాయాం= మైత్రాయణి యను యజుశ్శాఖా భాగమునందు, శాకాయన్యః మునిః= శాకాయన్యుడను ముని, బృహద్రథస్య రాజఋషేః= బృహద్రథుడను రాజర్షికి, సుఖం= బ్రహ్మసుఖమును, సమాధిఉక్తి, పురుస్సరం= సమాధినిగూర్చి భోధించుట మూలకముగా, ప్రాహ=ఉపదేశించెను.

అ॥ శాకాయన్యుడు చెప్పినప్రకారమును 'యథా'యని యుదాహరించుచున్నారు.

**యథా నిరిన్ధనో వహ్నిః స్వయోనావుపశామ్యతి।**
**తథా వృత్తిక్షయాచ్చిత్తం, స్వయోనావుపశామ్యతి॥** 111

టీ॥ నిరిన్ధనః వహ్నిః= సమిధలు లేని యగ్ని, స్వయోనౌ= తనకు కారణమగు తేజస్సునందు, యథా ఉపశామ్యతి= ఏ ప్రకారముగ శాంతిని బొందునో, తథా= ఆ ప్రకారమే, చిత్తం అపి= అన్తఃకరణము గూడ, వృత్తిక్షయాత్= నిరోధసమాధియందు సమస్తవృత్తులు నశించుట వలన,



స్వయోనౌ= తనకు కారణమగు సత్త్వమునందు, ఉపశామ్యతి= శమించును. అనగా సత్త్వగుణసంపన్నమగుచున్నదని భావము.

అ॥ ఇట్టి యుపశమనఫలమును 'స్వయోనౌ' అని వర్ణించుచున్నారు.

**స్వయోనావుపశాన్తస్య మనసః సత్యకామినః,**
**ఇన్ద్రియార్థవిమూఢస్యానృతాః కర్మవశానుగాః ॥** 112

టీ॥ సత్యకామినః =సత్యజ్ఞానానంతమగు బ్రహ్మయం దుత్కంఠుడును, స్వయోనౌ = తన కారణమునందు, ఉపశాన్తస్య= లయించినది గనుకనే, ఇంద్రియ, అర్థ, విమూఢస్య= ఇంద్రియములకు విషయములగు శబ్దాదులకు విముఖమగు, మనసః= మనస్సుకు, కర్మవశానుగాః= కర్మ ననుసరించి సంప్రాప్తమైన సుఖదుఃఖాదులుఅనృతాః= మిథ్యా భూతములు, లేక అనృతాః= మిథ్యాభూతములైన సుఖ దుఃఖాదులు, కర్మవశానుగాః కర్మప్రాప్తములుగాని భోగజనకములు కావు. 7-142-145 శ్లోకములను చూడవలెను.

అ॥ భోగజనకత్వమే స్వభావముగా గల విషయములు సహజమగు తమపని నెట్లు మానునను శంకను 'చిత్తమేవ' యని సమాధానము చెప్పుచున్నారు.

**చిత్తమేవ హి సంసార స్తత్ప్రయత్నేన శోధయేత్।**
**యచ్చిత్తస్తన్మయో మర్త్యో గుహ్యమేతత్సనాతనమ్॥** 113

టీ॥ చిత్తం ఏవ సంసారః= చిత్తమే సంసారము. అందుచేత, ప్రయత్నేన= ప్రయత్నముతో, తత్ శోధయేత్= చిత్తమును శోధించి ఏకాగ్ర్యతను కల్పించవలెను. యచ్చిత్తః మర్త్యః= మనుజునియొక్క చిత్తము దేనియందు లగ్నమగునో, అతడు, తన్మయః= ఆ రూపము గలవాడగును. ఏతత్= ఇది, సనాతనం గుహ్యం= సనాతనమగు పరమ రహస్యము.

'యచ్చిత్తస్తేనైష ప్రాణ మాయాతి' (ప్రశ్న 3-10) యథాకామో యథాచారో తథా భవతి (బృ 4-6-5) అను శ్రుతికావ్యము లిచట ప్రస్తుతములు. జీవస్య బంధకం మానసం (4-35) 'మన ఏవమనుష్యాణాం (గీ.6)' అను వాక్యములు గూడ స్మరింపదగును.

అ॥ చిత్తనైర్మల్యముచేత నసంఖ్యేయజన్మసముపార్జితమగు కర్మ గూడ నశించి అక్షయసుఖావాప్తి కలుగునని 'చిత్తస్య' అని చెప్పుచున్నారు.

**చిత్తస్య హి ప్రసాదేన హంతి కర్మ శుభాశుభమ్।**
**ప్రసన్నాత్మాఽఽత్మని స్థిత్వా సుఖమక్షయ్యమశ్నుతే॥ 114**

టీ॥ చిత్తస్య ప్రసాదేన= చిత్తనైర్మల్యముచేత, శుభా శుభం కర్మ= సుకృతదుష్కృతకర్మఫలమును, హన్తి హి= పురుషుడు నశింపజేయును. ప్రసన్నాత్మా= నిర్మల మనస్కుడు, ఆత్మని= స్వస్వరూపమునందు, స్థిత్వా= ఉండి, అక్షయ్యం సుఖం= నాశనరహితమగు సుఖమును, అశ్నుతే= పొందును.

అ॥ ఈ అర్థమునే 'సమాసక్తం' అని దృఢపరచుచున్నారు.

**సమాసక్తం యథా చిత్తం జంతోర్విషయగోచరే।**
**యద్యేవం బ్రహ్మణి స్యాత్తత్కో న ముచ్యేత బంధనాత్॥ 115**

టీ॥ జంతోః చిత్తం= మానవులయొక్క మనస్సు, విషయగోచరే= ఇంద్రియప్రచారమునందు, యథా సమాసక్తం= ఏటుల నాసక్తమైనదో, ఏవం= అదేప్రకారము, బ్రహ్మణి= బ్రహ్మయందు, తత్ స్యాత్ యది= ఆ మనస్సు దృఢముగా నుండినచో, కుతః= ఎందుచేత, బంధనాత్= సంసారబంధము నుండి, న ముచ్యేత= వదలిపెట్టబడడు. ఇచట 7-203 శ్లోకమును పోల్చుకొనవలెను.

అ॥ సంసారదుఃఖమునకు 'మనస్సే' కారణమని, మనో నిరోధమువలన నాత్మసంస్థకలుగుననియు పూర్వగ్రంథమున విస్తరింప బడెను. ఇట్లు పరస్పరము విరుద్ధములగు బంధమోక్షములకు మనస్సే కారణ మగుటను 'మనో హి' అని వివరించుచున్నారు.

**మనో హి ద్వివిధం ప్రోక్తం శుద్ధం చాశుద్ధమేవ చ,**
**అశుద్ధం కామసంపర్కాచ్ఛుద్ధం కామవివర్జితమ్॥ 116**

టీ॥ మనః= మనస్సు, శుద్ధం అశుద్ధం ఏవ చ= శుద్ధమని అశుద్ధమని, ద్వివిధం ప్రోక్తం= రెండువిధములుగా చెప్పబడినది. కామసంపర్కాత్= కామములయొక్క సంబంధమువలన, అశుద్ధం= మలినమైనది, కామ వివర్జితం= కామములులేనిది, శుద్ధం= నిర్మలమైనది అగుచున్నది.



అ॥ అశుద్ధమగు మనస్సు బంధమునకును, శుద్ధమగు మనస్సు మోక్షమునకును కారణమగునని 'మన ఏవ' యని చెప్పుచున్నారు.

**మన ఏవ మనుష్యాణాం కారణం బంధమోక్షయోః।**
**బంధాయ విషయాసక్తం ముక్త్యై నిర్విషయం స్మృతమ్॥ 117**

టీ॥ పూర్వార్థము శ్లోకమున వ్యాఖ్యానింపబడినది. మనస్సు, విషయ, ఆసక్తం= విషయములను కోరినదై, బంధాయ= బంధము కొఱకు, నిర్విషయం= విషయసంబంధము లేనిదై, ముక్త్యై= ముక్తికొఱకనియు, స్మృతం= స్మరింపబడుచున్నది.

అ॥ 'ప్రసన్నాత్మా ఽఽ త్మని, స్థిత్వా, సుఖమక్షయ్యమశ్నుతే' అను 114 శ్లోకముయొక్క ఉత్తరార్థమును 'సమాధి' యని శ్రుతిసిద్ధము చేయుచున్నారు.

**సమాధినిర్ధూతమలస్య చేతసో**
**నివేశితస్యాత్మని యత్సుఖం భవేత్।**
**న శక్యతే వర్ణయితుం గిరా తదా**
**స్వయం తదన్తఃకరణేన గృహ్యతే॥ 118**

టీ॥ సమాధి నిర్ధూత, మలస్య= చిత్తవృత్తినిరోధము చేత పారదోల బడిన విషయాసక్తి కలిగినట్టియు, ఆత్మని= ప్రత్యగ్రూపము నందు, నివేశితస్య= అహం బ్రహ్మాస్మి అను జ్ఞానము గల్గినట్టియు, చేతసః= మనస్సునకు, యత్ సుఖం= ఎటువంటి సుఖము, భవేత్= కలుగునో, తత్= దానిని, గిరా వర్ణయితుం న శక్యతే= అలౌకికవిషయము గనుక మాటలచే వర్ణించుట కలవి కాదు. తదా= ఆ సుఖానుభవ సమయమునందు, తత్ = స్వరూపభూతమగు నా సుఖము, స్వయం అన్తఃకరణేన ఏవ గృహ్యా తే= అన్తఃకరణము కాదు గనుక దానిచే గ్రహింపబడును.

అ॥ సమాధి చిరకాలము నిలువలేదు. అటువంటి యస్థిరమగు సమాధివలన బ్రహ్మానంద మెట్లు నిశ్చయ మగునను శంకకు 'యద్యపి' అని సమాధానము చెప్పుచున్నారు.

**యద్యప్యసౌ చిరం కాలం సమాధిర్దుర్లభో నృణామ్।**
**తథాఽపి క్షణికో బ్రహ్మానందం నిశ్చాయయత్యసౌ॥ 119**

టీ॥ యది అపి= అయినను, అసౌ సమాధిః= ఇటువంటి, సమాధి, నృణాం= మనుష్యులకు, చిరం కాలం= దీర్ఘకాలము నిలుచుట, దుర్లభం= కష్టము. తథాపి= అయినను, అసౌ, క్షణికః= స్వల్ప కాలము నిలుచునదైనను ఈ సమాధి, బ్రహ్మానందం నిశ్చాయయతి= బ్రహ్మానందమును నిశ్చయించును.

అ॥ శ్రద్ధాళువైనవానికి సమాధియందు బ్రహ్మానందమును నిశ్చయించ సాధ్యమగుట 'శ్రద్ధాలుః' అని చూపుచున్నారు.

**శ్రద్ధాలుర్వ్యసనీ యోఽత్ర నిశ్చినోత్యేవ సర్వదా।**
**నిశ్చితే తు సకృత్తస్మిన్ విశ్వసిత్యన్యదాప్యయమ్॥ 120**

టీ॥ అత్ర= ఈ బ్రహ్మానందమునందు, యః శ్రద్ధాళుః= ఎవడు శ్రద్ధగలవాడో, ఎవడు వ్యసనీ= బ్రహ్మానందమే వ్యసనముగా గలవాడో అతడు, సర్వదా= ఎల్లపుడును బ్రహ్మానందమును, నిశ్చినోతి ఏవ= నిశ్చయించగలడు. సకృత్ నిశ్చితే సతి= ఆ బ్రహ్మానంద మొకమారు నిశ్చయింపబడుచున్న దగుచుండగా, అయం= ఈ అభ్యాసకుడు, అన్యధా అపి= మఱియొకపుడు గూడ, తస్మిన్ విశ్వసితి= దానియందు విశ్వాస ముంచుచున్నాడు.

బ్రహ్మానందమునందు ద్వైతము భానము కాదు. నిజానందము ననుభవించు సమాధియందది భానమగుచున్నను, దానిచే నసంస్పృష్టుడు గనుక శ్రద్ధచే నద్వైతమును గూడ బుద్ధినుండి తొలగింపవచ్చును. అప్పుడు స్వస్వరూపమే ప్రకాశించుచుండును.



అ॥ బ్రహ్మానందమునందు విశ్వాసము కలిగిన తరువాత, వాసనానంద సమయమున కూడ దానినిమాని, ముఖ్యమగు బ్రహ్మానంద మునే భావించునని 'తాదృక్' అని చెప్పుచున్నారు.

**తాదృక్పుమానుదాసీనకాలేఽప్యానందవాసనామ్।**
**ఉపేక్ష్య ముఖ్యమానందం భావయత్యేవ తత్పరః॥ 121**

టీ॥ తాదృక్ పుమాన్= బ్రహ్మానన్దమునందు విశ్వాస వ్యసనములు గల పురుషుడు, ఉదాసీనకాలే అపి= సుఖదుఃఖములకు మధ్యనున్న అంతరాలస్థితియందు గూడ (11-94), ఆనందవాసనాం సహజముగ ననుభవించుచున్న వాసనానందమును, ఉపేక్ష్య= నిర్లక్ష్యము చేసి అచటనున్న త్రిపుటిని త్రోసివేసి, తత్పరః= ముఖ్యానందమునందు తీవ్రమగు నిచ్ఛ గలవాడై, ముఖ్యం ఆనందం ఏవ భావయతి= బ్రహ్మానందమునే భావించును.

సమాధియం దొక్కమారు బ్రహ్మానందమును చవిచూచిన దాని నుదాసీన సమయమునందుగూడ నభ్యసింప ప్రయత్నించును.

అ॥ ఇచట 'పరవ్యసనినీ' యని దృష్టాంతము నిచ్చుచున్నారు.

**పరవ్యసనినీ నారీ వ్యగ్రాఽపి గృహకర్మణి,**
**తదేవాస్వాదయత్యన్తః పరసఙ్గరసాయనమ్॥ 122**

టీ॥ శ్లోకము 9-94 శ్లోకమున వివరింపబడినది॥

అ॥ దృష్టాంతమును దార్ష్టాంతకమున 'ఏవం' అని సమన్వయము చేయుచున్నారు.

**ఏవం తత్త్వే పరే శుద్ధే ధీరో విశ్రాన్తిమాగతః,**
**తదేవాస్వాదయత్యన్తర్బహిర్వ్యవహరన్నపి॥ 123**

టీ॥ ఏవం= ఈ విధముగా, ధీరః= ధీరుడు, శుద్ధే పరే తత్త్వే= అద్వితీయమగు పరతత్త్వమునందు, విశ్రాన్తిం ఆగతః= విశ్రాంతిని పొందినవాడై, అన్తః బహిః వ్యవహరన్ అపి= బాహ్యాభ్యంతరవ్యవహారములు

సంచరించుచున్నను, తత్ ఏవ= ఆ బ్రహ్మానందరసమునే, ఆస్వాదయతి= రుచిచూచుచుండును.

అ॥ 'ధీరత్వం' అని ధీరలక్షణమును చెప్పుచున్నారు.

**ధీరత్వమక్షప్రాబల్యేఽప్యానన్దాస్వాదవాఞ్ఛయా।**
**తిరస్కృత్యాఖిలాక్షాణి తచ్చిన్తాయాం ప్రవర్తనమ్॥ 124**

టీ॥ అక్షప్రాబల్యే అపి= బుద్ధినాకర్షించు నింద్రియములు బలవంతములుగానున్నను, ఆనన్దాస్వాదవాఞ్ఛయా= బ్రహ్మానందానుభవము నందలి కోర్కిచేత, అఖిల, అక్షాణి= సమస్త ఇంద్రియములను, తిరస్కృత్య= నిరసించి, తత్ చింతాయాం= బ్రహ్మానందచింతనమునందు, ప్రవర్తనం= ప్రవర్తించుట, ధీరత్వం= ధీరుని లక్షణ మగును.

అ॥ విశ్రాంతి శబ్దార్థమును 'భారవాహీ' యని విశదపరచుచున్నారు.

**భారవాహీ శిరోభారం ముక్త్వాఽఽస్తే విశ్రమం గతః।**
**సంసారవ్యాపృతిత్యాగే తాదృగ్బుద్ధిరస్తు విశ్రమః॥ 125**

టీ॥ భారవాహీ= తలమీద బరువును మోసికొని పోవువాడు, శిరోభారం= నెత్తిబరువును, ముక్త్వా= వదలి, విశ్రమం గతః ఆస్తే= విశ్రాంతిని బొందియున్నాడు. సంసారత్యాగే= సంసారమును వదలివేయుటలో, తాదృక్ బుద్ధిః= అటువంటి విశ్రమబుద్ధి, విశ్రమః అస్తు= విశ్రాన్తియగును.

అ॥ విశ్రాంతిఫలమును 'విశ్రాన్తిం' అని చూపుచున్నారు.

**విశ్రాన్తిం పరమాం ప్రాప్తస్త్వౌదాసీన్యే యథా తథా।**
**సుఖదుఃఖదశాయాం చ తదానన్దైకతత్పరః॥ 126**

టీ॥ పరమాం= ఉత్కృష్టమగు, విశ్రాన్తిం= విశ్రాన్తిని, ప్రాప్తః తు= పొందినవాడైతే, యథా ఔదాసీన్యే= ఔదాసీన్యమునం దేవిధముగ ముఖ్యానందానుభావమును చేయుచున్నాడో, తథా= అటులనే, సుఖ దుఃఖదశాయాం చ= సుఖదుఃఖానుభవకాలమగు జాగ్రదవస్థయందు గూడ, తదా నన్దైకతత్పరః= ఆ బ్రహ్మానందానుభావనపరుడే యగును.



అ॥ అనుదినము విషయసుఖ మత్యంతము ప్రాణిజాతముచేత కోరబడుచుండగా దాని యందెట్లు వైముఖ్య మేర్పడు ననుశంకకు సమాధానము.

**అగ్నిప్రవేశహేతౌ ధీః శృంగారే యాదృశీ తథా।**
**ధీరస్యోదేతి విషయేఽనుసంధానవిరోధిని॥ 127**

టీ॥ అగ్నిప్రవేశహేతౌ = సహగమనమునకు సంసిద్ధురాలగు స్త్రీ యొక్క అగ్నిప్రవేశమునకు కారణమగు, శృంగారే= అలంకారమునందు, యాదృశీ ధీః= వైరస్యమును పొందినబుద్ధి యేరీతిగా నుండునో, తథా= అటులనే, అనుసంధానవిరోధిని= బ్రహ్మానందానుసంధానవిరుద్ధమగు, విషయే= విషయమునందు, అస్య= ఈ ఆభాసకునికి, ధీః ఉదేతి= అటువంటి బుద్ధిపుట్టును.

అ॥ విషయసుఖములందు బుద్ధి పోకపోవచ్చుగాక, భోజనాదుల యం దెట్లు కోరిక పుట్టకుండునను శంకకు 'అవిరోధి' యని సమాధానము నిచ్చుచున్నారు.

**అవిరోధిసుఖే బుద్ధిః స్వానన్దే చ గమాగమౌ,**
**కుర్వన్నాస్తే క్రమాదేషా కాకాక్షవదితస్తతః॥ 128**

అవిరోధిసుఖే= స్వస్వరూపానుసంధానమునకు విరుద్ధముకాని సుఖమునందును, స్వానన్దే చ= స్వరూపానన్దమునందును. ఏషా బుద్ధిః= స్వసుఖాభిలాషి యగు బుద్ధి, కాకాక్షవత్= కాకిచూపువలె, ఇతః తతః= ఇటునటు గమ, ఆగమౌ= రాకపోకలు, కుర్వన్తీ= చేయుచూ, ఆస్తే= ఉండును.

తా॥ వి॥ జీవించియున్న వానికి స్వస్వరూపానుసంధానము గాని, అన్యునికి కాదు. జీవించుటకు భోజన మవసరము. అట్టి భోజనేచ్ఛ సాత్త్విక సుఖానుభవహేతు వగుటచే నది స్వస్వరూపానుసంధానేచ్ఛకు విరోధి కాదు. రాజసతామససుఖేచ్ఛలు బ్రహ్మానందేచ్ఛకు విరోధులు. అందువలన బుద్ధి యీ యవిరోధికోరికల రెంటిమీద, కాకిచూపువలె నిటునటు ఒకదాని తరువాత నొకదానిమీదికి ప్రసరించుచుండును.

అ॥ 'ఏకైవ' యని దృష్టాంతమును వివరించుచున్నారు.

**ఏకైవ దృష్టిః కాకస్య వామదక్షిణనేత్రయోః।**
**యాత్యాయాత్యేవమానన్దద్వయే, తత్త్వవిదో మతిః॥ 129**

టీ॥ కాకస్య= కాకియొక్క, వామదక్షిణనేత్రయోః= కుడి ఎడమ నేత్రములయందు, ఏకా ఏవ దృష్టిః= ఒకటియే చూపు, ఏవం= అటులనే, ఆనన్దద్వయే= స్వస్వరూపానన్దము నందు, దానికి విరోధిగాని, భోజనాది విషయసుఖేచ్ఛయందును, తత్త్వవిదః మతిః= తత్త్వవేత్తయొక్క బుద్ధి, యాతి ఆయాతి= వెళ్లును, వచ్చును.

అ॥ దార్ష్టాంతికమునందు 'భుంజానః' అని దృష్టాంతమును వివరించుచున్నారు.

**భుంజానో విషయానందం బ్రహ్మానందం చ తత్త్వవిత్।**
**ద్విభాషాభిజ్ఞవద్విద్యాదుభౌ లౌకికవైదికౌ॥ 130**

టీ॥ తత్త్వవిత్= తత్త్వమును గుర్తెఱింగిన వాడు, విషయానందం బ్రహ్మానందం చ = బ్రహ్మానం దావిరోధియగు భోజనాదివిషయానందమును, స్వస్వరూపభావనచే గలుగు బ్రహ్మానందమును, భుంజానః= అను భవించుచూ, ద్విభాషాభిజ్ఞవత్= రెండుభాషలు తెలిసిన వానివలె, లౌకిక వైదికౌ ఉభౌ= లౌకికవైదికసుఖముల రెంటిని, విద్యాత్= తెలిసికొనును. సంస్కృతభాషాజ్ఞానముచేత, వైదికమగు పరమార్థము, ఇతరభాషాజ్ఞానము చేత లౌకికవ్యవహారము సమయోచితముగ సంభవించునని ధ్వని తోచు చున్నది.

అ॥ ఉద్వేగకారణమగు దుఃఖ మనివార్యమగుచుండగా స్వస్వరూపానుసంధాన మెట్లు సాధ్యమగునను శంకకు 'దుఃఖప్రాప్తౌ' అని సమాధానము.

**దుఃఖప్రాప్తౌ న చోద్వేగో యథాపూర్వం యతో ద్విదృక్।**
**గంగామగ్నార్ధకాయస్య పుంసః శీతోష్ణధీర్యథా॥ 131**



టీ॥ తత్త్వవిత్తునకు, యథాపూర్వం= జ్ఞానోదయమునకు పూర్వము వలె, దుఃఖప్రాప్తౌ= ఉపభోగముచేతనే నశింపతగ్గ దుఃఖము సంభవించి నపుడు, ఉద్వేగః న= సంతాపము కలుగదు. యతః= ఏలయనగా, యథా= ఏవిధముగా, గంగా మగ్న, అర్ధ, కాయస్య పుంసః= నదీజలమున సగము మునిగిన శరీరము కలవానికి, శీత, ఉష్ణ, ధీః= జలములోనున్న శరీర భాగమునకు శైత్యభావము, లేని భాగమునకు ఉష్ణభావము, ఈ విధముగా రెండు అనుభవములు కలుగుచున్నట్లు, తత్త్వవిత్తు ద్విదృక్= లౌకిక వైదికోభయమగు చూపు కలవాడగుచున్నాడు.

అ॥ 126-131 శ్లోకములలో జాగ్రద్దశయందు బ్రహ్మానందావాప్తి మార్గము చూపబడినది. ఇకస్వప్నమునం దది సాధ్యమగు మార్గమును, 'ఇత్థం' అని చూపుచున్నారు.

**ఇత్థం జాగరణే తత్త్వవిదో బ్రహ్మసుఖం సదా।**
**భాతి తద్వాసనాజన్యే స్వప్నే తద్భాసతే తథా॥ 132**

టీ॥ ఇత్థం= ఈ ప్రకారముగా, జాగరణే= జాగ్రదవస్థయందు, తత్త్వవిదః= తత్త్వవేత్తకు, సదా= ఎల్లపుడును, బ్రహ్మసుఖం భాతి= బ్రహ్మా నందము భానమగుచున్నది. తద్వాసనా, జన్యే= బ్రహ్మానందానుభవ సంస్కారము దృఢముగా గల జాగ్రద్వాసనలవలన సంభవించు, స్వప్నే= స్వప్నమునందుగూడ, తథా= జాగ్రత్తునందువలెనే, తత్ భాసతే= బ్రహ్మా నందము భాసించును.

అ॥ స్వప్న మవిద్యావాసనాజన్యమగుటచే నచట దుఃఖానుభూతి గూడ కలుగుచున్నదని 'అవిద్యా' యని చూపుచున్నారు.

**అవిద్యావాసనాప్యస్తీత్యతద్వాసనోత్థితే।**
**స్వప్నే మూర్ఖవదేవైష సుఖం దుఃఖం చ వీక్షతే॥ 133**

టీ॥ జాగ్రత్తునందు అవిద్యావాసనా అపి అస్తి ఇతి= అవిద్యా వాసనానుభవముగూడ కలదను కారణముచేత, అతః= అందువలన, తద్వాసనోత్థితే స్వప్నే= ఆ అజ్ఞానవాసనాజన్యమగు స్వప్నమునందు, ఏషః=

ఈ అభ్యాసకుడు, మూర్ఖవత్= మూర్ఖునివలె, సుఖం దుఃఖం చ= సుఖ దుఃఖముల రెంటిని, వీక్షతే= అనుభవించును.

తా॥ వి॥ జాగ్రదవస్థయందలి దృఢవాసనలే స్వప్నమునం దనుభవింపబడుచున్నవి. గనుక జాగ్రదవస్థయందు బ్రహ్మానందానుభవ సంస్కార మెంత దృఢముగానుండిన నంత యెక్కువగ స్వప్నమునందు గూడ ఆ వాసనలు స్ఫురించును. జాగ్రదవస్థయందెంత అజ్ఞానానుభవము తగ్గునో అంత తక్కువగనే నవి స్వప్నములో కలుగును.

అ॥ 'బ్రహ్మానన్దాభిదే' యని ప్రకరణము నుపసంహరించున్నారు.

**బ్రహ్మానన్దాభిధే గ్రంథే బ్రహ్మానన్దప్రకాశకమ్,**
**యోగిప్రత్యక్షమధ్యాయే ప్రథమేఽస్మిన్నుదీరితమ్॥** 134

టీ॥ బ్రహ్మానంద, అభిధే గ్రంథే= బ్రహ్మానందమను పేరుగల ఈ గ్రంథమునందు, అస్మిన్ ప్రథమే అధ్యాయే= ఈ ప్రథమాధ్యాయమునందు, బ్రహ్మానన్దప్రకాశం= జాగ్రత్స్వప్నౌ దాసీనకాలములయందు, బ్రహ్మానందాను భవమార్గమును తెలుపు, యోగి ప్రత్యక్షం= యోగిజనాను భవము, ఉదీరితం= వర్ణింపబడినది.

శ్రీభారతీసంప్రదాయసార్వభౌమ జగద్గురు శ్రీకళ్యాణానంద
భారతీమాన్యాచార్యాత్యంత ప్రియాంతేవాసియు అత్రి
గోత్ర సముద్భూతుడును ఉభయకులపవిత్రుడును
నగు లింగన సోమయాజిచే విరచిత
మగు వేదాంతపంచదశి కళ్యాణామృత
మను ఆంధ్రవ్యాఖ్యాసమేతమగు
బ్రహ్మానందమునందు యోగానందము
సంపూర్ణము

శ్రీ గురుభ్యో నమః

# శ్రీమదాంధ్రవేదాన్తపంచదశి

## కళ్యాణామృతవ్యాఖ్యాసమేతము

### * 12 బ్రహ్మానందము - ఆత్మానందప్రకరణము *

అ॥ యోగిజనోపకారకమగు నిజానందమేకాదశ ప్రకరణమున వివరింపబడినది. తదితరులకు గతిని చూపుటకై తద్విషయక ప్రశ్న పూర్వకముగా పదురెండవప్రకరణము 'నను' అని యారంభింప బడు చున్నది.

**నన్వేవం వాసనానన్దాద్బ్రహ్మానన్దాదపీరితమ్।**
**వేత్తు యోగీ నిజానన్దం మూఢస్యాత్రాస్తి కా గతిః॥** 1

టీ॥ నను= ఓయీ, ఏవం= ఈవిధముగా, వాసనానందాత్ బ్రహ్మానందాత్ ఇతరం నిజానందం = వాసనానందబ్రహ్మానందములకంటె వేఱగు నిజానందమును, యోగీ వేత్తు= యోగి సమాధియందు తెలిసికొనునుగాక! అత్ర= ఈ బ్రహ్మ నందము గూర్చి, మూఢస్య= యోగవిహీనునికి, కాగతిః= మోక్షమార్గమేది కలదు?

అ॥ అతిమూఢుడైనవానికి, బ్రహ్మవిద్యాధికారము లేదని 'ధర్మ' అని చెప్పుచున్నారు.

**ధర్మాధర్మవశాదేష జాయతాం మ్రియతా మపి।**
**పునః పునర్దేహలక్షైః కిం నో దాక్షిణ్యతో వద॥** 2

టీ॥ ఏషః= ఇతడు, ధర్మ అధర్మ వశాత్= ధర్మ అధర్మ ఆచరణ వలన, దేహలక్షైః= లక్షలకొలది శరీరములచేత, జాయతాం మ్రియతాం= పుట్టుగాక, చచ్చుగాక! నః = మనకు, దాక్షిణ్యతః= అతనిమీద దాక్షిణ్యము చేత, కిం వద= ఏమిలాభమో చెప్పుము.

అ॥ ఒకపక్షమున నతనికి గూడ గతి కల్పింప వచ్చునని 'అస్తి' అని అతని యోగ్యతనుబట్టి మార్గమును చూపుచున్నారు.

**అస్తి వోఽనుజిఘృక్షుత్వాద్దాక్షిణ్యేన ప్రయోజనమ్।**
**తర్హి బ్రూహి స మూఢః కిం జిజ్ఞాసుర్వాపరాఙ్ముఖః ॥ 3**

టీ॥ వః= మీరు, అనుజిఘృక్షుత్వాత్= మూఢుల ననుగ్రహించు కోరిక గలవారు గనుక, దాక్షిణ్యేన ప్రయోజనం అస్తి= దాక్షిణ్యముచే ప్రయోజనము కలదు అని శిష్యునిచే ప్రార్థింపబడి గురువడుగుచున్నాడు. తర్హి= అటులైనచో, సః మూఢః= ఆమూఢుడు, కిం జిజ్ఞాసుః= బ్రహ్మజ్ఞానేచ్ఛ కలవాడా! వా= లేక, పరాఙ్ముఖః= అందుకు విముఖుడా! బ్రూహి= చెప్పుము!

అ॥ ఈ ప్రశ్న వేయుటకు 'ఉపాస్తి' అని కారణము చెప్పుచున్నారు.

**ఉపాస్తిం కర్మ వా బ్రూయాద్విముఖాయ యథోచితమ్।**
**మందప్రజ్ఞం తు జిజ్ఞాసుమాత్మానన్దేన బోధయేత్॥ 4**

టీ॥ విముఖాయ= బ్రహ్మజిజ్ఞాసావిముఖునికొఱకు, ఉపాస్తిం కర్మవా= ఉపాసన కాని కర్మ గాని, యథోచితం= తగినరీతిని, బ్రూయాత్= బోధింపవలెను. మందప్రజ్ఞం తు= మందబుద్ధి అయినను, జిజ్ఞాసుం= బ్రహ్మజిజ్ఞాసుని, ఆత్మానన్దేన= ఆత్మానందముచేత, బోధయేత్= బోధింప వలెను.

తా॥వి॥ చికిత్స యోగానుకూలము బ్రహ్మలోకాది సుఖిలిప్సునకు నిర్గుణోపాసనమవసరము 7-105, 9-51 శ్లోకములచూడవలెను. స్వర్గ కామునికి కర్మాచరణమావశ్యకము. బ్రహ్మజిజ్ఞాసునకు మందప్రజ్ఞుడైనను ఆత్మానందముపకరించును.

అ॥ మందప్రజ్ఞుల కుపకారకమగు ఆత్మనందప్రకరణమును 'బోధయామాస' అని ప్రారంభించుచున్నారు.

**బోధయామాస మైత్రేయీం యాజ్ఞవల్క్యో నిజప్రియామ్ ।**
**న వా అరే పత్యురర్థే పతిః ప్రియ ఇతీరయన్ ॥ 5**

టీ॥ అరే= ప్రియమైనమైత్రేయీ! పత్యుః అర్థే= పతిప్రయోజనము కొరకు, పతిః ప్రియః న వా= స్త్రీకి పతిప్రియుడగుట లేదు. ఇతి ఈరయన్ = ఇట్లు చెప్పుచూ, యాజ్ఞవల్క్యః= యాజ్ఞవల్క్యుడు, నిజప్రియాం మైత్రేయీం= తన భార్యయగు మైత్రేయిని, బోధయామాస= బోధించెను.



తా॥ వి॥ ప్రతిమనుజుడును స్వలాభమును కోరి భార్యాది చేతనములను గృహాద్యచేతనములను కోరుచున్నాడు కాని, వాని వాని లాభమును కోరి కాదని యాజ్ఞవల్క్యుడు తన భార్యయగు మైత్రేయికి బోధించెను. ఇచట బృహదారణ్యము 4-5-6 మంత్రములను చూడవలెను.

అ॥ స్వలాభము కొఱకు సర్వము ప్రియ మగుచున్నది. గనుక తాను పరప్రేమాస్పదమని బోధించుటకుగాను 'ఆత్మనస్తుకామాయ' అను (బృ 4-5-6) శృత్యర్థమును సంక్షేపముగా 'పతిః' అని చెప్పుచున్నారు.

**పతిర్జాయాపుత్రవిత్తే పశుబ్రాహ్మణబాహుజాః।**
**లోకా దేవా వేదభూతే సర్వం చాత్మార్థతః ప్రియమ్॥ 6**

టీ॥ పతిః= భర్త, జాయా= భార్య, పుత్రవిత్తే= పుత్రులు, ధనము, పశుబ్రాహ్మణబాహుజాః= పశువులు, బ్రాహ్మణులు, క్షత్రియులు, లోకాః= లోకములు, దేవాః= దేవతలు, వేదభూతే= వేదములు, భూతములు, సర్వం చ= సమస్తము, ఆత్మా, అర్థతః= తన ప్రయోజనమునకై ప్రియం= ప్రియమగుచున్నది.

అ॥ భార్య, భర్త, పుత్ర, దృష్టాంతములను, పత్యా అని నాలుగు శ్లోకములచే వివరించుచున్నారు.

**పత్యావిచ్ఛా యదా పత్న్యాస్తదా ప్రీతిం కరోతి సా।**
**క్షుదనుష్ఠానరోగాద్యైస్తదా నేచ్ఛతి తత్పతిః॥ 7**

**న పత్యురర్థే సా ప్రీతిః స్వార్థ ఏవ కరోతి తామ్।**
**పతిశ్చాత్మన ఏవార్థే న జాయార్థే కదాచన॥ 8**

**అన్యోన్యప్రేరణేఽప్యేవం స్వేచ్ఛయైవ ప్రవర్తనమ్॥ 9**

**శ్మశ్రుకంటకవేధేన బాలే రుదతి తత్పితా।**
**చుంబత్యేవ న సా ప్రీతిర్బాలార్థే స్వార్థ ఏవ సా॥ 10**

టీ॥ యదా= ఎప్పుడు, పత్న్యాః= భార్యకు, పత్యౌ= భర్తయందు, ఇచ్ఛా= కోరికయో, తదా= అప్పుడు, సా= ఆమెయే, ప్రీతిం కరోతి=

భర్తయందు ప్రేమను చూపును. యదా= ఎప్పుడు తత్పతిః= ఆమెభర్త, క్షధ్, అనుష్ఠాన, రోగాద్యైః= ఆకలి, రోగము, అనుష్ఠానము మొదలగు వానియం దుండినచో, తదా= అప్పుడు, న ఇచ్ఛతి= అతనిని కోరదు.

సా ప్రీతిః= ఆ ప్రేమ, పత్యుః అర్థే= భర్త ప్రయోజనముకొరకు, న= కాదు. తాం= ఆ ప్రీతిని, స్వార్థేఏవ= స్వప్రయోజనముకొరకే, కరోతి= చేయుచున్నది. పతిః చ= భర్తయు, ఆత్మన ఏవ అర్థే= తన ప్రయోజనము కొరకే, ప్రీతిం కరోతి= ప్రేమించును. కదాచన జాయార్థే న= ఎప్పుడును భార్యకొరకును కాదు.

అన్యోన్యప్రేరణే అపి ఏవం= పరస్పరము భార్యా భర్తలు ప్రేమించినపుడుగూడ ఇటులనే, స్వ ఇచ్ఛయా ఏవ ప్రవర్తనం= స్వీయమగు నిచ్ఛానుసారమే ప్రవృత్తి కలుగుచున్నది.

శ్మశ్రుకంటక వేధేన= ముండ్లవలె గ్రుచ్చుకొనుచున్న మీసముల బాధచే, బాలే= పిల్లవాడు, రుదతి= ఏడ్చుచున్నను,తత్ పితా= వానితండ్రి, చుంబతి ఏవ= ముద్దాడుచునే యున్నాడు. సా ప్రీతిః= ఆ ప్రేమ, బాల, అర్థే న= పిల్లవాని కొఱకు కాదు స్వ అర్థే ఏవ హి= తన కొఱకే కదా!

తా॥వి॥ వైరాగ్యమునకు ప్రతిబంధకమగు ఏషణత్రయములో బలవత్తమమగు దారైషణను ముందుగా యాజ్ఞవల్క్యుడు తన భార్య కుపదేశించెను.

అ॥ అటుతరువాత జీవము లేని రత్నాదివస్తూదాహరణముచేత నీ విషయమును స్పష్టము చేయుచున్నారు.

**నిరిచ్ఛమపి రత్నాదివిత్తం యత్నేన పాలయన్।**
**ప్రీతిం కరోతి స స్వార్థే విత్తార్థత్వం న శంకితమ్॥** 11

**అనిచ్ఛతి బలీవర్దే వివాహయిషతే బలాత్।**
**ప్రీతిః సా వణిగర్థైవ బలీవర్దార్థతా కుతః॥** 12

**బ్రాహ్మణ్యం మేఽస్తి పూజ్యోఽహమితి తుష్యతి పూజయా।**
**అచేతనాయా జాతేర్నో సంతుష్టిః పుంస ఏవ సా॥** 13



**క్షత్రియోఽహం తేన రాజ్యం కరోమీత్యత్ర రాజతా।**
**న జాతేర్వైశ్యజాత్యాదౌ యోజనాయేదమీరితమ్॥** 14

**స్వర్గలోకబ్రహ్మలోకౌ స్తాం మమేత్యభివాంఛనమ్।**
**లోకయోర్నోపకారాయ స్వభోగాయైవ కేవలమ్॥** 15

**ఈశవిష్ణ్వాదయో దేవా పూజ్యన్తే పాపనష్టయే।**
**న తన్నిష్పాపదేవార్థం తత్తు స్వార్థం ప్రయుజ్యతే॥** 16

**ఋగాదయో హ్యధీయంతే దుర్బ్రాహ్మణ్యానవాప్తయే।**
**న తత్ప్రసక్తం వేదేషు మనుష్యేషు ప్రసజ్యతే॥** 17

**భూమ్యాదిపంచభూతాని స్థానతృట్పాకశోషణైః।**
**హేతుభిశ్చావకాశేన వాంఛన్త్యేషాం న హేతవః॥** 18

**స్వామిభృత్యాదికం సర్వం స్వోపకారాయ వాంఛతి।**
**తత్తత్కృతోపకారస్తు తస్య తస్య న విద్యతే॥** 19

టీ॥ రత్నాదిధనమును సంరక్షించుకొనుచున్నాము. పశువులచేత బండ్లు లాగించుకొనుచున్నాము. నేను బ్రాహ్మణుడనని పూజచేయించుకొని తృప్తినిచెందుచున్నాము. క్షత్రియుడనని రాజ్యముచేయుచున్నాము, స్వర్గలోక బ్రహ్మలోకమును గోరుచున్నాము. పాపవిహీనులగు దేవతలను పూజించు చున్నాము. దౌర్బ్రాహ్మణ్యనివృత్తి కొరకు వేదాధ్యయనము చేయుచున్నాము. నివసించుటకు భూమిని, దాహశాంతికి జలమును, అన్న పచనమున కగ్నిని, ఎండపెట్టుటకు వాయువును, తిరుగుటకాకాశమును ఆశ్రయించుచున్నాము. ధనము కొఱకు యజమానుని, సేవ కొఱకు నౌకర్లను, కోరుచున్నాము. ఇట్లు చేయుటకు స్వప్రయోజనమే కారణము. కోరబడు రత్నము పశువులు, బ్రాహ్మణాదిజాతులు మొదలగు వాని కేమియు ప్రయోజనములేదు. 11-19

అ॥ ఇట్లనేక నిదర్శనములవలన కలుగు ప్రయోజనమును 'సర్వ' అని చూపుచున్నారు.

**సర్వవ్యవహృతిష్వేవమనుసంధాతుమీదృశమ్।**
**ఉదాహరణబాహుల్యం తేన స్వాం వాసయేన్మతిమ్॥** 20

టీ॥ సర్వవ్యవహృతిషు= సర్వవ్యవహారములయందు, ఏవం అను సంధాతుం= స్వప్రయోజనము కోరి యితర వస్తువులను కోరుచున్నాము. గాని వాని ప్రయోజనము కొఱకు కాదని తెలిసికొనుటకు, ఈదృశం ఉదాహరణబాహుల్యం= ఇటువంటి యనేకములగు నుదాహరణలు పేర్కొనబడినవి. తేన= అందుచేత, స్వాం మతిం= స్వబుద్ధిని వీని యందు, వాసయేత్= నిలుపవలెను. వీని వలన ఆత్మ పరమ ప్రేమాస్పదమని తెలియుచున్నది. 1-8 శ్లోకములను చూడవలెను.

'అథ' యని వివిధ ప్రేమలకు వికల్పించి యాత్మ ప్రేమ స్వరూపమును విచారించుచున్నారు.

**అథ కేయం భవేత్ప్రీతిః శ్రూయతే యా నిజాత్మని,**
**రాగో వధ్వాదివిషయే, శ్రద్ధా యాగాదికర్మణి,**
**భక్తిః స్యాద్గురుదేవాదావిచ్ఛా త్వప్రాప్తవస్తుని॥** 21

నిజఆత్మని= తనయందు, యా శ్రూయతే= ఏది వినబడుచున్నదో, అటువంటి, ఇయం ప్రీతిః= ఈ ప్రేమ, కా= ఎటు వంటిది? రాగః= రాగమంటివేని, వధు, ఆది, విషయే= భార్యా పుత్రాదు లందగును. శ్రద్ధా= శ్రద్ధ అయినచో, యాగాది కర్మణి=యాగాదికర్మలయందు తగును. భక్తిః= భక్తి యందుమా, గురు, దేవ, ఆదౌ= గురువు దేవతలు మొదలగు వారి యందు సరిపోవును. ఇచ్ఛాతు= ఇచ్ఛ అన్ననో, అప్రాప్తవస్తుని= లభించని వస్తువును గూర్చి కుదురును.

ఆత్మవిషయమగుప్రీతియొక్క స్వరూపమెట్టిది? భార్యాదుల యందుండు రాగము వంటిది కాదు. యాగాదుల యెడ గల శ్రద్ధవంటిది కాదు. గురుదేవాదులయందలి భక్తి వంటిది కాదు. అది ఇచ్ఛ యన వీలులేదు. మనకు లేని వస్తువు విషయమై ఇచ్ఛ జనించును.

'తర్హి' అని సమాధానము చెప్పుచున్నారు.

**తర్హ్యస్తు సాత్వికీ వృత్తిః సుఖమాత్రానువర్తినీ।**
**ప్రాప్తే నష్టేఽపి సద్భావాదిచ్ఛాతో వ్యతిరిచ్యతే॥** 22



తర్హి= అటులయినచో, సుఖ, మాత్ర, అనువర్తినీ= సుఖమును మాత్ర మనుసరించునట్టి, సాత్వికీ వృత్తిః= సత్వస్వరూపమగు బుద్ధివృత్తి, ప్రీతిః స్యాత్= ప్రీతి స్వరూపమగు గాక. ప్రాప్తేనష్టే అపి= సుఖాదులు ప్రాప్తించినను, ప్రాప్తించకపోయినను, సద్భావాత్= ఉండుటచేత, ఇచ్ఛాతః వ్యతిరిచ్యతే= ఇచ్ఛకంటె భిన్న మగుచున్నది.

ఆత్మప్రీతి సాత్త్వికమగు బుద్ధివృత్తి. సుఖము మాత్రమా వృత్తి విషయము. సుఖమాత్రానువర్తినియు సత్వస్వరూపయు నగు చిత్తవృత్తి ప్రీతి యనిపించుకొనును. సుఖోపలబ్ధి కలిగినను నీ సాత్త్వికవృత్తి మాత్రముండును. ఇష్టవస్తువు లభించిన తరువాతను, నశించిన తరువాత ఇచ్ఛ యుండనేరదు. అందుచే నాత్మప్రీతి ఇచ్ఛకంటె విలక్షణము.

సుఖసాధనమగు వస్తువు ప్రీతివిషయ మగుచున్నది. భోజనాదులు సుఖసాధనము లగుటచే ప్రియములగుచున్నవి. ఆత్మప్రియమైనవస్తువు. గనుక నది సుఖసాధక మగుచున్నదను ఆక్షేపణను సుఖసాధన యని తొలగించుచున్నారు.

**సుఖసాధనతోపాధేరన్నపానాదయః ప్రియాః।**
**ఆత్మానుకూల్యాదన్నాది సమశ్చేదమునాత్ర కః॥** 23

టీ॥ సుఖసాధనతా, ఉపాధేః= సుఖమును సంపాదించుటకు కారణమగుట చేత, అన్న, పాన, ఆదయః= అన్నము పానము మొదలగునవి, ప్రియాః= ప్రియము లగుచున్నవి. అటులనే, ఆత్మా= ఆత్మగూడ, అనుకూల్యత్వాత్= ప్రియమైనది గనుక సుఖసంపాదత మగుచున్నది. అందువలన అన్న, ఆది, సమః, చేత్= అన్నాదులతో సమాన మన్న,

అ॥ 'అమునా' యని సమాధానము చెప్పుచున్నారు

**....................................................అమునాత్ర కః,**
**అనుకూలయితవ్యః స్యాన్నైకస్మిన్ కర్మకర్తృతా॥** 24

టీ॥ అమునా= సుఖసాధనమగు నాత్మ చేత, అనుకూలయితవ్యః= అనుకూలింప తగినవాడు, కః స్యాత్?= ఎవ డయ్యేనేని? తనకు తానే

అనుకూలయితవ్యుడనినచో, ఏకస్మిన్= ఒకనియందే, కర్మకర్తృతా= కర్మత్వ, కర్తృత్వములు రెండును, న= సంభవించవు.

అన్నాదులు జీవునికి సుఖమును కలుగ చేయుచున్నవి. అటులనే ఆత్మ సుఖమును సాధించిపెట్ట తగ్గ మఱియొక రెవరును లేరు. గనుక ఆత్మ సుఖసాధనము కాదు. తన వలన గలిగిన సుఖము తానే అనుభవించు చున్నాడన వీలు లేదు. తానే సుఖసాధనము, తానే సుఖానుభవితయు నగుట సాధ్యముకాదు.

అ॥ అన్న పానాదులకును, ఆత్మకును 'సుఖే' అని వై లక్షణ్యమును చూపుచున్నారు.

**సుఖే వైషయికే ప్రీతిమాత్రమాత్మా త్వతిప్రియః।**
**సుఖే వ్యభిచరత్యేషా నాత్మని వ్యభిచారిణీ॥** 25

టీ॥ వైషయికే సుఖే= విషయసుఖమునందు, ప్రీతి, మాత్రం= సామాన్యమగు ప్రేమమాత్రము కలదు. ఆత్మాతు= ఆత్మ అయితే, అతిప్రియః= అత్యంతము ప్రియమైనది. ఏషా ప్రీతిః= ఈ ప్రీతి, సుఖే వ్యభిచరతి= సుఖమునందు వ్యభిచరించును. ఆత్మని= ఆత్మవిషయమై, న వ్యభిచారిణీ= వ్యభిచరింపదు....

తా॥వి॥ అన్న పానాదులయందలి ప్రేమ సామాన్యము. వీనియను భవముచే సుఖముకలిగినప్పుడు, వీని యందలి ప్రేమ పోవుచున్నది. ఆత్మ యందలి ప్రేమ సర్వోత్కృష్టము. ఆ ప్రేమకాత్మ యొక్కటియే విషయము, విషయాన్తరము లేదు.

అ॥ ఈ యర్థమును 'ఏకం' అని విపులము చేయుచున్నారు.

**ఏకం త్యక్త్వాఽన్యదాదత్తే సుఖం వైషయికం సదా।**
**నాఽఽత్మా త్యాజ్యో న చాఽఽదేయ స్తస్మిన్ వ్యభిచరేత్ కథమ్॥** 26

టీ॥ వైషయికం సుఖం= విషయసుఖము, ఏకం త్యక్త్వా= ఒక విషయమును వదలి, అన్యత్, ఆదత్తే= మఱియొక దానిని గ్రహించును, ఆత్మా న త్యాజ్యః= ఆత్మ త్యజింప వీలులేనిది, స ఆదేయః= గ్రహింప వీలులేనిది, తస్మిన్ కథం వ్యభిచరేత్= దాని విషయమై వ్యభిచరించుటెట్లు?



తా॥ వి॥ విషయము లనేకములు కాబట్టి వాని వలన కలుగు సుఖములు గూడ ననేకములు. దాని నొకదాని తరువాత మరియొక దానిని గ్రహించుచున్నాము. ఆత్మ యొకటియే గనుక దానిని వదలుటకు గాని పరిగ్రహించుటకు గాని శక్యము కాదు.

అ॥ ఆత్మ ఉపేక్షణీయము కూడ కాదని 'హాన' అని చూపుచున్నారు.

**హానాదానవిహీనేఽస్మిన్నుపేక్షా చేత్తృణాదివత్।**
**ఉపేక్షితుః స్వరూపత్వాన్నోపేక్ష్యత్వం నిజాత్మనః॥** 27

టీ॥ హాన, ఆదాన, విహీనే, అస్మిన్= పరిత్యజన పరిగ్రహణములు లేని యీ యాత్మయందు, తృణాదివత్= గడ్డిపోచవలె, ఉపేక్షా చేత్= ఉపేక్ష ఉండగూడదా యనిన, ఉపేక్షితుః స్వరూపత్వాత్= ఉపేక్షచేయువాని స్వరూపమే యగుటచేత, నిజ, ఆత్మనః ఉపేక్ష్యత్వం న= తన స్వరూపమును తానుపేక్షించుట సంభవించదు.

అ॥ నేను మరణింతును గాక అను మొదలగు ఆత్మ హానబోధకము లగు ప్రయోగములుండగా ఆత్మహానమేల శక్యము కాదను శంకకు 'రోగ' అని జవాబు చెప్పుచున్నారు.

**రోగక్రోధాభిభూతానాం ముమూర్షా వీక్ష్యతే క్వచిత్।**
**తతో ద్వేషాద్భవేత్త్యాజ్య ఆత్మేతి యది తన్న హి॥** 28

టీ॥ రోగ, క్రోధ, అభిభూతానాం= రోగము, క్రోధము మొదలగు ఆవేశము గలవారికి, క్వచిత్= ఒకానొకపుడు, ముమూర్షా= మరణేచ్ఛ, వీక్ష్యతే= చూడబడుచున్నది. తతః= అందువలన, ద్వేషాత్= ద్వేషమువలన, ఆత్మా త్యాజ్యః భవేత్ యది= ఆత్మ పరిత్యాజ్య మగుచున్నదనినచో, తత్ న హి= అది సరికాదు.

అ॥ ఇందుకు 'త్యక్తుం' అని కారణము చెప్పుచున్నారు.

**త్యక్తుం యోగ్యస్య దేహస్య నాత్మతా త్యక్తురేవ సా।**
**న త్యక్తర్యస్తి స ద్వేషస్త్యాజ్యే ద్వేషే తు కా క్షతిః॥** 29

టీ॥ త్యక్తుం యోగ్యస్య దేహస్య= పరిత్యజించుటకు తగిన శరీరమునకు, ఆత్మతా న= ఆత్మభావము లేదు. సా= ఆ ఆత్మభావము, త్యక్తుః ఏవ= పరిత్యజించు వానిదే, సః ద్వేషః= ఆ ద్వేషము, త్యక్తరి న అస్తి= వదలిపెట్టు వానియందు లేదు. త్యాజ్యే ద్వేషే= పరిత్యజింపదగిన దాని యందు ద్వేషభావ మున్నయెడల, కా క్షతిః= ఆత్మ కేమి హాని?

తా॥ వి॥ రోగాదు లాత్మవికావు. అవి శరీరము నాశ్రయించి నవిగనుక శరీరమునందు ద్వేషభావము కలుగ వచ్చును. అందుచే నాత్మ కేమియు హాని లేదు. ఆసన్నమృత్యువగు పరీక్షిత్తు శుకునివలన నధ్యాత్మోపదేశము బొందెను.

అ॥ ఆత్మయందలి నిరతిశయప్రీతిని ఆత్మార్థత్వేన అని యుక్తి చేత సాధించుచున్నారు.

**ఆత్మార్థత్వేన సర్వస్య ప్రీతేశ్చాత్మా హ్యతిప్రియః।**
**సిద్ధో యథా పుత్రమిత్రాత్ పుత్రః ప్రియతరస్తథా॥ 30**

టీ॥ ఆత్మార్థత్వేన= ఆత్మనిమిత్తమై, సర్వస్య ప్రీతేః= అన్నియు ప్రియము లగుటవలన, ఆత్మా అతి ప్రియః హి= ఆత్మ అత్యంతము ప్రియమని, సిద్ధః= స్థిరమగుచున్నది. యథా= అది ఎట్లనిన, పుత్రమిత్రాత్= పుత్రుని యొక్క స్నేహితుని కంటె, పుత్రః= పుత్రుడు, ప్రియతరః= ఎక్కువ ప్రియమైనవాడు. తథా= అటులనే, అని పై కన్వయము.

అ॥ ఈ యర్థమును స్వానుభవముచేత 'మా న భూవం' అని దృఢము చేయుచున్నారు.

**మా న భూవమహం కిం తు భూయాసం సర్వధేత్యసౌ,**
**ఆశీః సర్వస్య దృష్టేతి ప్రత్యక్షా ప్రీతిరాత్మని॥ 31**

టీ॥ ఈ శ్లోకము పూర్వార్ధమునకు 1-8 శ్లోకములు చూడుడు. ఈవిధముగ, సర్వస్య= సమస్త జనమునకును, అసౌ ఆశః= ఈ ఆశయము, దృష్టా ఇతి= చూడబడిన దగుటచే, ఆత్మని ప్రీతిః ప్రత్యక్షా= ఆత్మయం దత్యంతప్రేమ అనుభవసిద్ధము.



అ॥ శ్రుతియుక్త్యనుభవములచేత నింతవర కాత్మయొక్క పర ప్రేమాస్పదత్వము సాధింపబడినది. ఇందుకు భిన్నముగా తలంచు మతాంతరములను ఖండించవలసియున్నది. ముందామతములను 'ఇత్యాదిభిః' అని ప్రవేశపెట్టుచున్నారు.

**ఇత్యాదిభిస్త్రిభిః ప్రీతౌ సిద్ధాయామేవమాత్మని।**
**పుత్రభార్యాదిశేషత్వమాత్మనః కైశ్చిదీరితమ్॥ 32**

టీ॥ ఇత్యాదిభిః త్రిభిః= ఈ విధముగా 7-20 శ్లోకములయందు శ్రుతులచేతను, 23-29 శ్లోకములయందు యుక్తిచేతను, 30, 31 శ్లోకముల యందనుభవముచేతను, ఏవం= ఈ విధముగా, ఆత్మని= ఆత్మయందు, ప్రీతౌ సిద్ధాయాం= ప్రేమసిద్ధమగుచుండగా, కైః చిత్= శాస్త్రము తెలియని కొందరి చేత, ఆత్మనః= ఆత్మకు, పుత్రభార్యాది శేషత్వం= పుత్రభార్యాదుల ప్రయోజనము కొఱకు మిగిలియుండుట, ఈరితం= చెప్పబడినది.

అ॥ ఈ యభిప్రాయమునకు 'ఏతత్' అని కారణమును చూపుచున్నారు.

**ఏతద్వివక్షయా పుత్రే ముఖ్యాత్మత్వం శ్రుతీరితమ్।**
**ఆత్మా వై పుత్రనామేతి తత్తోపనిషది స్ఫుటమ్॥ 33**

టీ॥ ఏతద్వివక్షయా= పుత్రాదుల శేషత్వమును చెప్పకోరికచేతనే, 'ఆత్మా వై పుత్ర నామ'= ఆత్మ యనగా పుత్రుడనుపేరు కలది యని, పుత్రే ముఖ్యాత్మత్వం= పుత్రుడే ముఖ్యమగు ఆత్మయని, శ్రుతి+ఈరితం= కౌషీతకీ 1-11 శ్రుతిచేత చెప్పబడినది. తత్= ఆ విషయము, ఉపనిషది చ=ఐత రేయశ్రుతియందు గూడ, స్ఫుటం= స్పష్టమగుచున్నది.

అ॥ ఉదాహరింపబడిన శ్రుతివాక్యార్థము 'సోఽస్య' యని పఠించుచున్నారు.

**సోఽస్యాయమాత్మా పుణ్యేభ్యః కర్మభ్యః ప్రతిధీయతే,**
**అథాస్యేతర ఆత్మాఽయం కృతకృత్యః ప్రమీయతే॥ 34**

టీ॥ అస్య= ఈ పురుషునియొక్క, సః అయం ఆత్మా= ఈ పుత్రరూపి యగు ఆత్మ, పుణ్యేభ్యః కర్మభ్యః = తాను చేయు పుణ్యకర్మలకొఱకు

ప్రతిధీయతే= ప్రతినిధిగా నుంచబడుచున్నాడు. అథ= తరువాత, అస్య= ఈ తండ్రియొక్క ఇతరః అయం ఆత్మా= మరియొక స్వీయమగు ఆత్మ కృతకృత్యుడై, ప్రమీయతే= మరణించును.

తా॥ వి॥ 'పురుషో హ వాయమాదితో గర్భోభవతి' (ఐత 2-1) అను శ్రుతిచే నీ యర్థము బోధింపబడుచున్నది. ప్రతి తండ్రికిని స్వీయమ గాత్మ యొకటి, తనస్వరూపమే యగు తన కుమారుడు మరియొకటి అవసానకాలమునందు తా నాచరించు కర్మలన్నిటికిని 'కుమారుని త్వం బ్రహ్మ' (బృ. 1-5-17) అను మంత్రముతో తన ప్రతినిధిగా నేర్పరచి కృత కృత్యుడగుచున్నాడు. అందువలన పుత్రుడు ముఖ్యాత్మ, తన ఆత్మ గౌణాత్మయు నగుచున్నారు. ఇది పూర్వపక్షము.

అ॥ పూర్వపక్షమును దృఢపఱచుటకై 'నాఽపుత్రస్య లోకోస్తి' యను వాక్యార్థమును 'సత్యపి' యని పఠింపుచున్నారు.

**సత్యప్యాత్మని లోకోఽస్తి నాపుత్రస్యాత ఏవ హి ।**
**అనుశిష్టం పుత్రమేవ లోక్యమాహుర్మనీషిణః॥ 35**

టీ॥ అతః ఏవ= పుత్రుడు ముఖ్యాత్మ గనుకనే, ఆత్మని సతి అపి= తండ్రియగు తా నుండినను, అపుత్రస్య= పుత్రుడు లేని వానికి, లోకః న అస్తి హి= సద్గతి లేదని ప్రసిద్ధము. అనుశిష్టం= సుశిక్షుడైన, పుత్రం ఏవ= పుత్రునే, లోక్యం= లోకమునకు హితమైన వానినిగా, మనీషిణః= పండితులు, ఆహుః= చెప్పిరి.

అ॥ పుత్రుడు పరలోకసాధనమే కాక, నీ లోకసాధనము గూడ నగుచున్నాడని 'మనుష్య' అని చెప్పుచున్నారు.

**మనుష్యలోకో జయ్యః స్యాత్పుత్రేణైవేతరేణ నో।**
**ముమూర్షుర్మన్త్రయేత్పుత్రం త్వం బ్రహ్మేత్యాదిమంత్రకైః॥ 36**

టీ॥ మనుష్యలోకః= మనుష్యలోకము, పుత్రేణ ఏవ= పుత్రుని చేతనే, జయ్యః= జయింపతగినది. ఇతరేణనో= కర్మాదిసాధనముచేత కాదు. త్వం బ్రహ్మ ఇత్యాది మంత్రకైః= నీవే బ్రహ్మవు అని చెప్పు మంత్రములచేత, ముమూర్షుః= మరణించుటకు నిశ్చయించుకున్న తండ్రి, పుత్రం మంత్రయేత్=కుమారుని మంత్రించును.



అ॥ 'ఇత్యాది' యని ఫలితార్థమును చెప్పుచున్నారు.

**ఇత్యాదిశ్రుతయః ప్రాహుః పుత్రభార్యాదిశేషతామ్।**
**లౌకికా అపి పుత్రస్య ప్రాధాన్యమనుమన్వతే॥ 37**

టీ॥ ఇత్యాదిశ్రుతయః= ఈ మొదలగు శ్రుతులు, పుత్రభార్యాది శేషతాం= పుత్రభార్యాదుల యొక్క శేషత్వమును, ప్రాహుః= చెప్పునవి. లౌకికాః అపి= లౌక్యులు గూడ, పుత్రస్య= పుత్రుని యొక్క, ప్రాధాన్యం= ముఖ్యత్వమును, అనుమన్వతే= అంగీకరించుచున్నారు.

అ॥ 'స్వస్మిన్' అని లౌకికానుభవమును చూపుచున్నారు.

**స్వస్మిన్ మృతేఽపి పుత్రాదిర్జీవేద్విత్తాదినా యథా।**
**తథైవ యత్నం కురుతే ముఖ్యాః పుత్రాదయస్తతః ॥ 38**

టీ॥ స్వస్మిన్ మృతే అపి= తాను చనిపోయినను, పుత్రాదిః పుత్రకళత్రాదులు, విత్తాదినా= తనయొక్క ఆస్తితో, యథా జీవేత్= ఎట్లు సుఖముగా జీవింతురో, తథా ఏవ= ఆప్రకారమే, యత్నం కురుతే= ప్రయత్నము చేయుచున్నారు. అదే ప్రకారముగ పూర్వాశ్రపు పుత్రకళత్రాదులకై యతిపుంగవులు పాటుపడుచుందురు. తతః= అందువలన, పుత్రాదయః= పుత్రకళత్రాదులు, ముఖ్యాః= ముఖ్యాత్మలు.

అ॥ ఇందుకు సమాధానమును 'బాఢం' అని చెప్పుచున్నారు.

**బాఢమేతావతా నాత్మా శేషో భవతి కస్యచిత్, 38 1/2**

టీ॥ బాఢం= బాగున్నది. కాని, ఏతావతా= అంతమాత్రముచేతనే, కస్యచిత్= ఎవనికిని, ఆత్మా= తన ఆత్మ, పుత్రాద్యపేక్షయా శేషః న భవతి= పుత్రాద్యపేక్షయా శేషము కానేరదు, ఆముఖ్యము గాదు.38

అ॥ ఈ యర్థవివరణ మారంభించుచున్నారు.

**గౌణమిథ్యాముఖ్యభేదై రాత్మాఽయం భవతి త్రిధా॥ 39**

టీ॥ అయం ఆత్మా= ఈ ఆత్మ, గౌణ, మిథ్యా, ముఖ్య భేదైః= గౌణము, మిథ్య, ముఖ్యము అను భేదముల చేత, త్రిధా భవతి= మూడువిధము లగుచున్నది.

అ॥ 'దేవదత్తః' అని గౌణాత్మను వివరించుచున్నారు.

**దేవదత్తస్తు సింహోఽయమిత్యైక్యం గౌణమేతయోః।**
**భేదస్య భాసమానత్వాత్పుత్రాదేరాత్మతా తథా॥ 40**

టీ॥ పరాక్రమాతిశయముచేత, అయం దేవదత్తః సింహః= ఈ దేవదత్తుడు సింహము, ఇతి ఏతయోః= అని దేవదత్తసింహములయొక్క, ఐక్యం= ఐక్యము, గౌణం= గుణసామ్యమును బట్టి చెప్పినది కాని నిజముగా కాదు. ఎందువల్లననగా, భేదస్య, భాసమానత్వాత్= దేవదత్తుసింహములకు భేదము స్పష్టముగా కనపడుచుండుటచేతను, తథా= ఆప్రకారమే, పుత్రాదేః ఆత్మాతా= పుత్రకళత్రాదులు ఆత్మత్వము గూడ గౌణమే యగును.

అ॥ 'భేదః' అని మిథ్యాత్వమును వివరించుచున్నారు.

**భేదోఽస్తి పంచకోశేషు సాక్షిణో న తు భాత్యసౌ।**
**మిథ్యాత్మతాఽతః కోశానాం స్థాణోశ్చోరాత్మతా యథా॥ 41**

టీ॥ పంచకోశేషు= పంచకోశములయందు, సాక్షిణః= సాక్షికంటె, బేధః అస్తి= భేదముగలదు, అసౌ= ఈ భేదము, న తు భాతి= ప్రకాశించుట లేదు. యథా= ఏ ప్రకారము, స్థాణోః= చీకటిలో నిలువపెట్టబడిన కొయ్య మొద్దుకు, చోరాత్మతా= అసత్యమగు చోరుని స్వరూపమో అట్లే, అతః= అందువలన, కోశానాం= పంచకోశములకు, మిథ్యాత్మతా= మిథ్యా స్వరూపము.

అ॥ 'న భాతి' యని సాక్షియొక్క ముఖ్యాత్మత్వమును వివరించు చున్నారు.

**న భాతి భేదో నాప్యస్తి సాక్షిణోఽప్రతియోగినః।**
**సర్వాన్తరత్వాత్తస్యైవ ముఖ్యమాత్మత్వమిష్యతే॥ 42**

టీ॥ అప్రతియోగినః= తనతో సమానమగు మరియొక సత్యవస్తువు లేని, సాక్షిణః= ఆత్మకు, భేదః= భేదము, న భాతి= కనపడుటలేదు. న అపి అస్తి= భేదము లేనూ లేదు. సర్వాన్తరత్వాత్= అన్నిటిలో నాంతరముగ నున్న వస్తువగుటవలన, తస్య ఏవ= ఆసాక్షికే, ముఖ్యం ఆత్మత్వం= ముఖ్యమగు ఆత్మత్వము, ఇష్యతే= అంగీకరించబడుతున్నది.



అ॥ ఆత్మయొక్క యిట్టి త్రివిధభేదము వ్యవహారము నందు ప్రకరణోచితముగ వాడబడుచున్నదని. 'సత్యేవం' అని తెలుపుచున్నారు.

**సత్యేవం వ్యవహారేషు యేషు యస్యాత్మతోచితా।**
**తేషు తస్యైవ శేషిత్వం సర్వస్యాన్యస్య శేషతా॥ 43**

టీ॥ ఏవం సతి= ఆత్మశబ్దార్థ మిట్లుండగా, యేషు వ్యవహారేషు= ఏ వ్యవహారముల యందు, యస్య= దేనికి, ఆత్మతా= ముఖ్యాత్మత్వము, ఉచితా= యుక్తమో, తేషు= ఆ వ్యవహారములయందు, తస్య ఏవ, దానికే శేషిత్వం= ముఖ్యత్వము, అన్యస్య సర్వస్య= మిగిలిన అన్నిటికిని, శేషతా= అముఖ్యత్వము సంభవించుచున్నది.

అ॥ గౌణాత్మ ముఖ్యాత్మగా వ్యవహరింపబడిన స్థలమును 'ముమూర్షోః' అని యుదాహరించుచున్నారు.

**ముమూర్షోర్గృహరక్షాదౌ గౌణాత్మైవోపయుజ్య తే।**
**న ముఖ్యాత్మా న మిథ్యాత్మా పుత్రః శేషీభవత్యతః॥ 44**

టీ॥ ముమూర్షోః= మరణ మాసన్నమైన వానికి, గృహరక్షాదౌ= గృహరక్షణము మొదలగు వానియందు, గౌణ, ఆత్మా ఏవ= గౌణాత్మయగు పుత్రుడే, ఉపయుజ్యతే= పనికివచ్చుచున్నాడు. ముఖ్యాత్మా= ముఖ్యాత్మ యగు సాక్షి చైతన్యము, న= ఉపకరించదు. అటులనే, మిథ్యాత్మా న= మిథ్యములగు పంచకోశములు నుపకరించవు. అతః= అందు వలన పుత్రః = గౌణాత్మ యగు పుత్రుడే పై సందర్భమున, శేషీ భవతి= ముఖ్య మగుచున్నాడు. తన తరువాత తన కర్మలను ప్రాతినిధ్యముచేత నిర్వహించుటకు గాను ముఖ్యత్వము నంభవించుగాక.

అ॥ 'అధ్యేతా' యని దృష్టాంతము నిచ్చుచున్నారు.

**అధ్యేతా వహ్నిరిత్యత్ర సన్నప్యగ్నిర్న గృహ్యతే।**
**అయోగ్యత్వేన యోగ్యత్వాద్వటు రేవాత్ర గృహ్యతే॥ 45**

టీ॥ వహ్నిః= అగ్ని, అధ్యేతా= అధ్యయనము చేయుచున్నాడు. ఇతి అత్ర= అను ప్రయోగమునందు, అగ్నిః సన్ అపి= అచట అగ్ని యున్నను,

అయోగ్యత్వేన= ప్రకరణ యోగ్యము కానందున, న గృహ్యతే= గ్రహింపబడదు. అత్ర= ఇటువంటి స్థలములయందు, వటుః ఏవ= బ్రహ్మతేజస్సుచే నుద్దీపించుచున్న బ్రహ్మచారియే, యోగ్యత్వాత్= ప్రకరణసందర్భమునకు సరిపోవుటచేత, గృహ్యతే= గ్రహింపబడుచున్నాడు. 45

అ॥ మిథ్యాత్మకు ముఖ్యాత్మత్వమును చెప్పు స్థలమును 'కృశోఽహం' అని చూపుచున్నారు.

**కృశోఽహం పుష్టిమాప్స్యామీత్యాదౌ దేహాత్మతోచితా,**
**న పుత్రం వినియుఙ్క్తేఽత్ర పుష్టి హేత్వన్నభక్షణే॥ 46**

టీ॥ అహం కృశ్యః= నేను చిక్కియున్నాను. పుష్టిం ఆప్స్యామి= పుష్టిని పొందుదును, ఇత్యాదౌ= ఇట్టి ప్రయోగములయందు, దేహాత్మతా ఉచితా= దేహమే ముఖ్యాత్మయగుట యుక్తము. అత్ర= ఈసందర్భములో పుష్టి హేతువగు అన్న భక్షణయందు, పుత్రం న వినియుఙ్క్తే= కుమారుడన్నము తినిన తనకు బలమురాదు గనుక పుత్రుని వినియోగించడు.

అ॥ కర్త్రాత్మకు ముఖ్యాత్మత్వము సిద్ధమగు స్థలమును 'తపసా' యని చూపుచున్నారు.

**తపసా స్వర్గమేష్యామీత్యాదౌ కర్త్రాత్మతోచితా।**
**అనపేక్ష్య వపుర్భోగం చరేత్కృచ్ఛ్రాదికం తతః॥ 47**

టీ॥ తపసా= తపస్సు చేత, స్వర్గం ఏష్యామి= స్వర్గమునకు పోవుదును. ఇత్యాదౌ= ఇటువంటి స్థలమునందు, కర్త్రాత్మతా= కర్తృత్వము వహించెడు విజ్ఞానమయుడు, ఉచితా= ముఖ్యాత్మ అగుటకు తగును. తతః = అందుచేతనే, వపుః భోగం= శరీరసుఖమును, అనపేక్ష్య=కోరక, కృచ్ఛ్రాదికం= ప్రాజాపత్యాదివ్రతములు, చరేత్= ఆచరించును.

అ॥ సాక్షి ముఖ్యాత్మయగు స్థలమును 'మోక్ష్యే' అని చూపుచున్నారు.

**మోక్ష్యేఽహమిత్యత్ర యుక్తం చిదాత్మత్వం తదా పుమాన్।**
**తద్వేత్తి గురుశాస్త్రాభ్యాం న తు కించిచ్చికీర్షతి॥ 48**



టీ॥ అహం= నేను, మోక్ష్యే= సంసారమునుంచి ముక్తుడనయ్యెదను, ఇత్యత్ర= ఇట్టి స్థలములో. చిత్ ఆత్మత్వంయుక్తం= చేతనాత్మకు ముఖ్యాత్మత్వము తగును. తదా= అపుడు పుమాన్= పురుషుడు, గురుశాస్త్రాభ్యాం= గురుశాస్త్రముల చేత, తత్= ఆ పరబ్రహ్మమును, వేత్తి= పరోక్షముగ తెలిసికొనును. కించిత్= కొంచెమైనను, న తు చికీర్షతి= చేయకోరడు.

అ॥ ఇట్లు గౌణాద్యాత్మలకు ప్రకరణోచితముగ నర్థసందర్భమును కల్పింపతగునని 'విప్ర' యని చెప్పుచున్నారు.

**విప్రక్షత్రాదయో యద్వద్బృహస్పతిసవాదిషు।**
**వ్యవస్థితాస్తథా గౌణమిథ్యాముఖ్యా యథోచితమ్॥ 49**

టీ॥ విప్రక్షత్రాదయః= బ్రాహ్మణక్షత్రియవైశ్యులు, బృహస్పతి సవాదిషు= బృహస్పతిసవనము మొదలగు వాని యందు, యద్వత్= ఏ ప్రకారము, వ్యవస్థితాః= వ్యవస్థ చేయబడిరో, తథా= అటులనే, గౌణమిథ్యా ముఖ్యాః= గౌణమిథ్యాముఖ్యాత్మలు, యథోచితం= ప్రకరణాను సారముగా, వ్యవస్థ చేయబడినారు.

అ॥ ఇట్లాత్మ యొక్క త్రివిధభేదవిచారణాఫలమును సంక్షేపముగ జ్ఞాపకముచేయుచు 30 శ్లోకార్థమును 'తత్ర' అని నిగమనము చేయుచున్నారు.

**తత్ర తత్రోచితే ప్రీతిరాత్మన్యేవాతిశాయినీ।**
**అనాత్మని తు తచ్ఛేషే ప్రీతిరన్యత్ర నోభయమ్॥ 50**

టీ॥ తత్రతత్ర= అచ్చటచ్చట, ఉచితే ఆత్మని= ప్రకరణోచితమగు ఆత్మయందు, ప్రీతిః= ప్రీతిగల్గను, కాని, అతిశాయినీ ప్రీతిః= సర్వోత్కృష్టమగు ప్రేమ, ఆత్మని ఏవ= సాక్షియందు మాత్రమే, తచ్ఛేషే అనాత్మని తు= మిగిలిన గౌణమిథ్యాత్మలయందు, ప్రీతిః= సామాన్యమగు ప్రేమ మాత్రము. అన్యత్ర= ఈ మూడు కానిస్థలములయందు, ఉభయం న= రెండు విధములైన ప్రేమలు లేవు.

ఈ మూడు కాని అన్యవస్తు వేదియో 'ఉపేక్ష్యం' అని చెప్పుచున్నారు.

**ఉపేక్ష్యం ద్వేష్యమిత్యన్యద్ద్వేధా మార్గతృణాదికమ్।**
**ఉపేక్ష్యం వ్యాఘ్రసర్పాది ద్వేష్యమేవ చతుర్విధమ్॥ 51**

టీ॥ అన్యత్= సామాన్యాతిశయప్రేమలకు విషయము గాని ఇతరము, ఉపేక్ష్యం= ఉపేక్ష్య మనియు, ద్వేష్యం= ద్వేష్య మనియు, ద్వేధా= రెండు విధములు. మార్గతృణాదికం= మార్గమునందలి గడ్డిపోచ మొదలగునవి. ఉపేక్ష్యం= ఉపేక్ష్య మగును. వ్యాఘ్రసర్పాది= వ్యాఘ్ర సర్పాదులు, ద్వేష్యం= ద్వేషవిషయము, ఏవం= ఈ విధముగా, చతుర్విధం= నాలుగువిధములు.

అ॥ ఈ చతుర్విధ్యమును 'ఆత్మా' అని ప్రదర్శించుచున్నారు.

**ఆత్మా శేష ఉపేక్ష్యం చ ద్వేష్యం చేతి చతుర్ష్వపి।**
**న వ్యక్తినియమః కింతు తత్తత్కార్యాత్తథా తథా॥ 52**

టీ॥ ఆత్మా= ముఖ్యాత్మ, శేషః= గౌణాదీతరాత్మలు, ఉపేక్ష్యం= ఉపేక్ష్యము, ద్వేష్యం చ ఇతి= ద్వేష్యమని, చతుర్షు అపి= నాల్గింటిలోను, వ్యక్తినియమః= వ్యక్తిని గూర్చిన నియతమగు విభాగము, న = లేదు, కింతు= ఇక నేమన, తత్తత్కార్యాత్= ఆయా పనివలన, తథా తథా= ఆ యా విధమగును. అనగా ఒకేవ్యక్తి చేయుపనులను బట్టి నాల్గింటిలో నేదైనను కావచ్చును.

అ॥ 'స్యాద్వ్యాఘ్రః' అని ఈవిషయమును విశదము చేయు చున్నారు.

**స్యాద్వ్యాఘ్రః సంముఖో ద్వేష్యో హ్యుపేక్ష్యస్తు పరాఙ్ముఖః।**
**లాలనాదనుకూల శ్చేద్వినోదాయేతి శేషతామ్॥ 53**

టీ॥ వ్యాఘ్రః= వ్యాఘ్రము, సంముఖః= ఎదురైనచో, ద్వేష్యః= ద్వేషింపదగినది, పరాఙ్ముఖః= అవతల ముఖము పెట్టియున్నచో, ఉపేక్ష్యః తు= ఉపేక్ష్యమగును. లాలనాత్= మచ్చిక చేయుటవలన, అనుకూలః చేత్= అనుకూలమైనచో, వినోదాయ= వినోదము కొఱకు, శేషతాం ఏతి= సాధనమగును.



అ॥ వ్యక్తినియమము లేనిచో వ్యవహారవ్యవస్థయే సాధ్యము కాదను శంకకు 'వ్యక్తీనాం' అని సమాధానము చెప్పుచున్నారు.

**వ్యక్తీనాం నియమో మాభూల్లక్షణాత్తు వ్యవస్థితిః।**
**ఆనుకూల్యం ప్రాతికూల్యం ద్వయాభావశ్చ లక్షణమ్॥ 54**

వ్యక్తీనాం= వ్యక్తులకు, నియమః= నియమము, మాభూత్= లేకపోవుగాక, లక్షణాత్ తు= లక్షణ వలననైతే వ్యవస్థితిః= వ్యవస్థ కలుగును. ఆనుకూల్యం= అనుకూలత, ప్రాతికూల్యం= ప్రతికూలత, ద్వయాభావః చ= ఈ రెండును లేకపోవుట, లక్షణం= లక్షణ మగును.

తా॥ వి॥ ఒకేవ్యక్తి చేయుపనులను బట్టి ద్వేష్యము కావచ్చును. లేదా మరియొకటి కావచ్చును. అనుకూలభావము శేషసాధనయొక్క లక్షణము. ప్రతికూలభావము ద్వేషలక్షణము. ఈ రెండును లేకుండుట యుపేక్ష లక్షణము.

అ॥ ఉక్తార్థమును ఆత్మా యని సంగ్రాహముగ చెప్పుచున్నారు.

**ఆత్మా ప్రేయాన్ ప్రియః శేషో ద్వేషోపేక్షే తదన్యయోః।**
**ఇతి వ్యవస్థితో లోకో యాజ్ఞవల్క్యమతం చ తత్॥ 55**

టీ॥ ఆత్మా= ప్రత్యగాత్మ, ప్రేయాన్ = అతిశయ ప్రేమాస్పదము, శేషః= ప్రేమసాధనము, ప్రియః= సామాన్యప్రేమాస్పదము. ద్వేష ఉపేక్షే= ద్వేషము, ఉపేక్ష, తదన్యయోః= తదితరులయందు కలుగుచున్నవి. ఇతి= ఈ విధముగా, లోకఃవ్యవస్థితః= లోకమువ్యవస్థచేయబడినది. యాజ్ఞ వల్క్యమతంచతత్= యాజ్ఞవల్క్యమతము గూడ అదియే.

అ॥ ఇచట "తదేతత్ప్రేయః పుత్రాత్ప్రేయో, విత్తాత్ప్రేయోఽ న్యస్మాత్ సర్వస్మాదన్తరతరంయదయ మాత్మా" (బృ 1-4-8) అను వాక్యార్థమును 'అన్యత్రాపి' అని పఠించుచున్నారు.

**అన్యత్రాపి శ్రుతిః ప్రాహ పుత్రాద్విత్తాత్తథాన్యతః।**
**సర్వస్మాదాన్తరం తత్త్వం తదేతత్ప్రేయ ఇష్యతామ్॥ 56**

టీ॥ పుత్రాత్= పుత్రునికంటెను, విత్తాత్= విత్తము కంటెను, అన్యతః సర్వస్మాత్= అన్యమగుసమస్తము కంటెను, అన్తరంతత్త్వం= బుద్ధిగుహాహిత మగు ఆత్మతత్త్వమేది గలదో, తదేతత్= ఆ యిది, ప్రేయః= ప్రియతమమని, ఇష్యతాం= అంగీకరింపబడుగాక, అన్యత్ర అపి శ్రుతిః ప్రాహ= మరోకచోట గూడ శ్రుతి చెప్పును.

అ॥ అన్నిటికంటెను ప్రియతమమైన నీ యాత్మ ఎద్దియో శ్రౌత్యాయని చెప్పుచున్నారు.

**శ్రౌత్యా విచారదృష్ట్యాయం సాక్ష్యేవాత్మా న చేతరః।**
**కోశాన్ పంచ వివిచ్యాన్తర్వస్తుదృష్టిర్విచారణా॥ 57**

టీ॥ శ్రౌత్యా విచార దృష్ట్యా= "అహం బ్రహ్మాస్మి" (బృ 1-4-10) అను మొదలగు శ్రుతులచేత సూచింపబడిన విచారణామార్గముచేత, సాక్షీ ఏవ= సాక్షియే, అయం ఆత్మా= నిరతిశయప్రేమాస్పదమగు నీ యాత్మ; ఇతరః న= అన్యముకాదు. విచారణ మన నేమియో చెప్పుచున్నారు. కోశాన్ పంచ= పంచకోశములను, వివిచ్య= ప్రత్యేకించి, అన్తః వస్తుదృష్టిః= స్వయంప్రకాశము, సర్వసాక్షిభూతము, నిర్గుణము, అనిర్వాచ్యమునై హృత్పుండరీకమున నుపలభ్యమానమగు పరమార్థవస్తువుమీద దృష్టి, విచారణా= విచారణ మగును.

అ॥ అట్టి అంతర్దృష్టిస్వరూపమును 'జాగర' యని వర్ణించుచున్నారు.

**జాగరస్వప్నసుప్తీనామాగమాపాయభాసనమ్।**
**యతో భవత్యసావాత్మా స్వప్రకాశచిదాత్మకః॥ 58**

టీ॥ జాగరస్వప్నసుప్తీనాం= జాగరము, స్వప్నము, సుషుప్తి యను మూడవస్థలయొక్క, ఆగమ, ఆపాయ, భాసనం= వ్యావర్తనము చేయుటచే, మూడింటి యందును తానుండి, వాని రాకపోకల ప్రకాశనము, యతః= దేనివలన, భవతి= కలుగుచున్నదో, అటువంటి, అసౌ ఆత్మా= ఈ ఆత్మ, స్వప్రకాశచిదాత్మకః= స్వయంప్రకాశచైతన్యస్వరూపుడు.

అ॥ సాక్షి శేషి, తదితరులకు తరతమభావముచేత శేషత్వము కలుగుచున్నదని 'శేషాః' అని చెప్పుచున్నారు.



**శేషాః ప్రాణాదివిత్తాన్తా ఆసన్నాస్తారతమ్యతః।**
**ప్రీతి స్తథా తారతమ్యాత్తేషు సర్వేషు వీక్ష్యతే॥ 59**

టీ॥ సాక్షికాకమిగిలిన, ప్రాణాదివిత్తాన్తాః= ప్రాణము మొదలు విత్తము వరకు గల అన్నియు, శేషాః= ఆత్మకు సుఖసాధనములగు చున్నవి. తారతమ్యతః= తరతమభావముచేత, ఆసన్నాః= ఆత్మకు సన్నిహితములగు చున్నవి. తేషు సర్వేషు= వాని అన్నిటియందును, తథా= ఆప్రకారమే, ప్రీతిః = ప్రేమ, తారతమ్యాత్= తారతమ్యముతో వీక్ష్యతే= చూడబడు చున్నది.

అ॥ పై తారతమ్యభావమును 'విత్తాత్' అని వివరించుచున్నారు.

**విత్తాత్పుత్రః ప్రియః పుత్రాత్పిండః పిండా త్తథేన్ద్రియమ్।**
**ఇన్ద్రియాచ్చ ప్రియః ప్రాణః ప్రాణాదాత్మా ప్రియః పరః॥ 60**

టీ॥ విత్తాత్ పుత్రః=ధనముకంటె పుత్రుడు ప్రియతరుడు. పుత్రాత్ పిండః= పుత్రుని కంటె తన శరీరము, తథా= అట్లే పిండాత్ ఇన్ద్రియం= శరీరముకంటె ఇంద్రియములు, ఇంద్రియాత్ చ ప్రాణః= ఇంద్రియముల కంటె ప్రాణములు, ప్రాణాత్ ఆత్మా= ప్రాణములకంటె ఆత్మ, ఇట్లోకదాని కంటె మఱియొకటి యాత్మకు సన్నిహితతరములై ప్రియతరము లగు చున్నవి.అన్నిటికంటెను, ఆత్మా ప్రియః పరః= ఆత్మ ప్రియతమము.

అ॥ ఈ విషయమై శ్రుతిచే నుదాహరింపబడిన నొక వివాదమును 'ఏవ' అని పలుకరించుచున్నారు.

**ఏవం స్థితే వివాదోఽత్ర ప్రతిబుద్ధవిమూఢయోః।**
**శ్రుత్యోదాహారి తత్రాత్మా ప్రేయానిత్యేవ నిర్ణయః॥ 61**

టీ॥ ఏవం స్థితే= ఆత్మ పరమప్రేమాస్పదమని యనుభవసిద్ధమగు చుండగా, అత్ర= ఈ విషయమునందు, ప్రతి బుద్ధవిమూఢయోః= జ్ఞాన్య జ్ఞానులకు గల, వివాదః= వివాదము, శ్రుత్యా ఉదాహారి= బృహదారణ్యము 1-4-8 వాక్యముచేత నుదాహరింపబడెను. తత్ర= ఆవివాదమునందు, ఆత్మ ప్రేయాన్ ఇతి ఏవ= ఆత్మ పరప్రేమాస్పదమని, నిర్ణయః= నిశ్చయము.

అ॥ ఆ వివాదమును 'సాక్షీ' యని చెప్పుచున్నారు.

**సాక్ష్యేవ దృశ్యాదన్యస్మాత్ప్రే యానిత్యాహ తత్త్వవిత్।**
**ప్రేయాన్ పుత్రాదిరేవేమం భోక్తుం సాక్షీతి మూఢధీః॥ 62**

టీ॥ సాక్షీ ఏవ= సాక్షియే, దృశ్యాత్= పరిదృశ్యమానమగు, అన్యస్మాత్= సాక్షీతరమగు ద్వైతముకంటె, ప్రేయాన్ ఇతి= ప్రియతరమని, తత్త్వవిత్= తత్త్వజ్ఞాని, ఆహ= పలికెను. పుత్రాదిః ఏవ= పుత్రవిత్తజాయాదులే, ప్రేయాన్= ప్రియతములు, ఇమం= ఈ ద్వైతమును, భోక్తుం= అనుభవించుటకు, సాక్షీ ఇతి= సాక్షియని మూఢధీః= అజ్ఞాని చెప్పుచున్నాడు.

తా॥ వి॥ ఆత్మ ప్రియతమమనియు శేషి యనియు జ్ఞాని యొక్క వాదము. పుత్రభార్యాదులు ఆత్మకంటె ప్రియతరము లనియు వానికొఱకాత్మ ప్రియ మగుచున్నదనియు అజ్ఞునివాదము.

అ॥ ఇట్లు వాదము చేయు నజ్ఞుడు జిజ్ఞాసువైనను కావచ్చును. జిగీషువైనను కావచ్చును. ఉభయుల కనుకూలమైన సమాధానము చెప్పవలయునని 'ఆత్మనః' అని చెప్పుచున్నారు.

**ఆత్మనోఽన్యం ప్రియం బ్రూతే శిష్యశ్చ ప్రతివాద్యపి।**
**తస్యోత్తరం వచో బోధశాపౌ కుర్యాత్తయోః క్రమాత్॥ 63**

టీ॥ శిష్యః చ= జిజ్ఞాసువగు శిష్యుడును, ప్రతివాదీ అపి= జిగీషువగు ప్రతివాదియు, ఆత్మనః అన్యం= ఆత్మకంటె మఱియొకటి, ప్రియం= ప్రియమని, బ్రూతే= చెప్పుచున్నారు. తస్య= ఆవాదమునకు, ఉత్తరం వచః= ప్రతివచనము, తయోః బోధశాపౌ= జిజ్ఞాసువునకు బోధరూపముగను జిగీషువునకు శాపరూపముగను, క్రమాత్= వరుసగా, కుర్యాత్= చెప్పవలెను.

అ॥ ఇట్లుభయులకు ప్రతివచనమగు నొక్క శ్రుతివాక్యము నుదాహరించుచున్నారు.

**ప్రియం త్వాం రోత్స్యతీత్యేవముత్తరం వక్తి తత్త్వవిత్।**
**స్వోక్తప్రియస్య దుష్టత్వం శిష్యో వేత్తి వివేకతః॥ 64**

టీ॥ శిష్యప్రతిపక్షు లుభయులకును, 'ప్రియం త్వాంరోత్స్యతి' (బృ 1-4-8)= ఏది ప్రియమని నీవు తలంచుచున్నావో అది నిన్ను



దుఃఖపెట్టగలదు. ఇతి ఏవం= అని మాత్రమే, తత్త్వవిత్= జ్ఞాని, ఉత్తరం వక్తి= ఒకే ప్రతివచనమును చెప్పును. శిష్యః= శిష్యుడు జిజ్ఞాసువు గనుక స్వోక్త, ప్రియస్య= తనచే చెప్పబడిన ప్రియమగు పుత్రవిత్తాదికము యొక్క, దుష్టత్వం= చెడు స్వభావమును, వివేకతః వేత్తి= విచారణచే తెలిసికొనును.

శిష్యుడు విచారణచేయు విధానమును, 'అలభ్యమానః' అని ఉదాహరించుచున్నారు.

**అలభ్యమానస్తనయః పితరౌ క్లేశయేచ్చిరమ్।**
**లబ్ధోఽపి గర్భపాతేన ప్రసవేన చ బాధతే॥ 65**

**జాతస్య గ్రహరోగాదిః కుమారస్య చ మూర్ఖతా।**
**ఉపనీతేఽప్యవిద్యత్వమనుద్వాహశ్చ పండితే॥ 66**

**పునశ్చ పరదారాది దారిద్ర్యం చ కుటుమ్బినః।**
**పిత్రోర్దుఃఖస్య నాస్త్యన్తో ధనీ చేన్మ్రియతే తదా॥ 67**

టీ॥ తనయః అలభ్యమానః= చిరకాలమువఱకును పుట్టని సంతానము, పితరం చిరం క్లేశయేత్= తలిదండ్రులను చిరకాలము కష్ట పెట్టును. లబ్ధః అపి= గర్భోత్పత్తి అయిన తరువాత కూడ, గర్భపాతేన ప్రసవేన చ బాధతే= గర్భస్రావముచేత ప్రసవశ్రమచేతను కష్టపెట్టుచున్నాడు.

జాతస్య= పుట్టినవానికి, గ్రహరోగాదిః= బాలారిష్టాది గ్రహములు అజీర్ణాదిరోగములు, కుమారస్య చ= ఇవి గడచిన, బాల్యమందున్న వానికి, మూర్ఖతా= మూర్ఖత్వము, ఉపనీతే= అపి= ఉపనీతుడైనను, అవిద్వత్త్వం= విద్యారాహిత్యము, పండితః= పండితుడైన, అనుద్వాహః= వివాహము కాకపోవుట.

పునఃచ= మీదుమిక్కిలి, పరదారాది= పరస్త్రీగమనాదికము, కుటుంబినః= వివాహమై సంతానముగలిగిన వానికి, దారిద్ర్యం చ= దారిద్ర్యము, ధనీ చేత్= ధనవంతుడైనచో, తదా= అప్పుడు, మ్రియతే = అల్పాయుస్కుడై మరణించును. ఇట్లు పిత్రోః అపి= తలిదండ్రుల, దుఃఖస్య అన్తః న అస్తి= దుఃఖమున కంతులేదు. ఇట్లు పుత్రుడు పుట్టియు పుట్టకయు దుఃఖహేతువగుచున్నాడు.

అ॥ ఈ విధమగు విచారణముచేత పుత్రు డనాత్మగా భావించి అతనియందు చూపుచుండిన ప్రీతిని ఆత్మయందే జిజ్ఞాసువు చూపునని 'ఏవం' అని చెప్పచున్నారు.

**ఏవం వివిచ్య పుత్రాదౌ ప్రీతిం త్యక్త్వా నిజాత్మని।**
**నిశ్చిత్య పరమాం ప్రీతిం వీక్షతే తమహర్నిశమ్॥ 68**

టీ॥ ఏవం వివిచ్య= ఇట్లు ముఖాత్మగౌణాత్మ వివేచనను విచారణ పూర్వకముగ చేసి, పుత్రాదౌ= పుత్రవిత్తజాయాదులయందు, ప్రీతిం త్యక్త్వా= ప్రేమను వదలి, నిజాత్మని= స్వస్వరూపమగు ఆత్మయందు, పరమాం ప్రీతిం= ఉత్కృష్టప్రేమాస్పదత్వమును, నిశ్చిత్య= నిశ్చయించి, అహర్నిశం= రాత్రింబవళ్లు, తం= ఆ ఆత్మ నే, వీక్షతే= అనుసంధానము చేసికొనును.68

అ॥ 'ప్రియం త్వాంరోత్స్యతి' అను ప్రతివచనము ప్రతికక్షి విషయములో నెట్లు సరిపోవునో 'ఆగ్రహాత్' అని చూపుచున్నారు.

**ఆగ్రహాద్బ్రహ్మవిద్వేషాదపి పక్షమముంచతః।**
**వాదినో నరకః ప్రోక్తః దోషశ్చ బహుయోనిషు॥ 69**

టీ॥ ఆగ్రహాత్= స్వపక్షమునందలి యభినివేశనము వలన గాని, బ్రహ్మవిద్వేషాత్ అపి= తనకు ప్రతికూలుడగు బ్రహ్మజ్ఞాని మీద ద్వేషము వలనకాని, పక్షం అముంచతః= తన వాదమును వదలని, వాదినః= ప్రతి వాదికి, నరకః= దుఃఖపరంపరయు, బహు, యోనిషు= అనేకజన్మము లందు, దోషఃచ= పుట్టుట యనెడు దోషమును, ప్రోక్తః= శాస్త్రమునందు చెప్పబడినది.

అ॥ ఒకే వాక్యముచే జిజ్ఞాసుజిగీషులకు విభిన్న ఫలము లభించుటకై 'ఈశ్వరో హి తథైవ స్యాత్' (బృ 1-4-8) అను వాక్యార్థపఠనముచే నుపపత్తిని 'బ్రహ్మవిత్' అనిచూపుచున్నారు.

**బ్రహ్మవిద్బ్రహ్మరూపత్వాదీశ్వరస్తేన వర్ణితమ్।**
**యద్యత్తత్తథైవ స్యాత్తచ్ఛిష్యప్రతివాదినోః॥ 70**

టీ॥ బ్రహ్మవిత్= బ్రహ్మజ్ఞాని, బ్రహ్మరూపత్వాత్= బ్రహ్మరూపు డగుటచేత, ఈశ్వరః= శాపానుగ్రహసమర్థుడగుచున్నాడు. అందువలనతేన=



ఆ బ్రహ్మవిదుని చేత, యత్ యత్ వర్ణితం= ఏది ఏది ఎటుల వర్ణింపబడినదో, తత్ తత్= ఆయా యది, శిష్యప్రతివాదినోః= శిష్యునికి ప్రతికక్షికిని, తథా ఏవ స్యాత్= అటులనే యగును.

అ॥ పైశ్రుతివాక్యముయొక్క సమనంతరభాగమగు 'ఆత్మానమేవ ప్రియముపాసీత, స య ఆత్మానమేవ ప్రియముపాస్తే స హాస్య ప్రియం ప్రమాయుకం భవతి' (బృ 1-4-8) అను వాక్యముయొక్క అర్థమును 'యస్తు' అని పఠించుట పూర్వకముగ నీ యర్థమును నన్వయముఖమున స్థిరపఱచు చున్నారు.

**యస్తు సాక్షిణమాత్మానం సేవతే ప్రియముత్తమమ్।**
**తస్య ప్రేయానసావాత్మా న నశ్యతి కదాచన॥ 71**

టీ॥ యః తు= ఎవడై తే, సాక్షిణం= సర్వవ్యవహార సాక్షి గనుకనే ఉత్తమం= సర్వోత్కృష్టమైనట్టియు, అందుచేత, ప్రియం= నిరతిశయ ప్రేమాస్పదమైనట్టియు, ఆత్మానం సేవతే= ఆత్మకంటె ప్రియతరమగునది మరియొకటి లేదని నిశ్చయించి చింతించుచుండునో, తస్య= అతనికి, ప్రేయాన్, అసౌ ఆత్మా= ప్రియతమమగు ఆత్మ, కదాచన న నశ్యతి= ఎప్పుడును నశింపదు. అతని యందలి శేషిత్వ జ్ఞానము నశింపదని భావము.

అ॥ ఇట్లు శ్రుతియుక్త్యనుభవములచే సాధించిన ఆత్మయొక్క పరమప్రేమాస్పదత్వమును బట్టి పరమానందత్వమును 'పరప్రేమ' యని సిద్ధము చేయుచున్నారు.

**పరప్రేమాస్పదత్వేన పరమానందరూపతా।**
**సుఖవృద్ధిః ప్రీతివృద్ధౌ సార్వభౌమాదిషు శ్రుతా॥ 72**

టీ॥ పరప్రేమాస్పదత్వేన= పరప్రేమాస్పదమగుటచే, పరమానన్ద రూపతా= పరమానన్దరూపత్వ మాత్మకు సంభవించును. ఏలయన, ప్రీతివృద్ధౌ సుఖవృద్ధిః= ప్రేమ యెక్కువైన కొలది యానన్ద మెక్కువగుట, సార్వభౌమా దిషు= చక్రవర్తులు మొదలగు వానియందు, శ్రుతా= వినబడుచున్నది.

తా॥ వి॥ ప్రేమ హెచ్చిన కొలది యానందము హెచ్చుచున్నది. మనుష్య డనుభవింపతగిన సర్వోత్కృష్టతమమగు యానందము సార్వభౌమా

నందము. దీనికంటె నూరురెట్లధికము గంధర్వానందము. ఇట్లు పితృలోకానందము, దేవానందము, ఇంద్రానందము, బృహస్పత్యానందము, ప్రజాపత్యానందము, బ్రహ్మానందము. ఒకదానికంటె మరియొకటి క్రమముగా నూరురెట్లధికమగుచున్నది. బ్రహ్మానందము సర్వోత్కృష్టతమము. ఆత్మ పరమ ప్రేమాస్పదము, గనుక పరమానందాస్పద మగుచున్నది. ఇచట తైత్తిరీయము 2-7 అనువాకము, 1 ప్రకరణము 8-9 శ్లోకములు చూడవలెను.

అ॥ ప్రత్యగాత్మ పరమానందరూపము కానేరదు. అట్లయినచో చైతన్యమువలెనే సర్వబుద్ధివృత్తులయం దానంద మనువర్తించవలెను గదా యను ఆక్షేపణను 'చైతన్యవత్' అని ఉపపాదించుచున్నారు.

**చైతన్యవత్సుఖం చాస్య స్వభావశ్చేచ్చిదాత్మనః।**
**ధీవృత్తిష్వనువర్తేత సర్వాస్వపి చితిర్యథా॥ 73**

టీ॥ అస్య చిదాత్మనః= చిత్స్వరూపుడగు నీప్రత్యగాత్మకు, సుఖం= ఆనందము, చైతన్యవత్= చైతన్యము వలెనే, స్వభావః చేత్= స్వభావమే అయినచో, సర్వాసు అపి ధీవృత్తిషు= అన్ని బుద్ధివృత్తుల యందును, యథా చితిః= చైతన్య మేవిధముగానో ఆ విధముగానే, అనువర్తేత= అనువర్తింపవలెనుగదా!

అ॥ పూర్వపక్షమును 'మైతం' అని వారించుచున్నారు.

**మైతముష్ణప్రకాశాత్మా దీపస్తస్య ప్రభాగృహే।**
**వ్యాప్నోతి నోష్ణతా తద్వచ్చితే రేవానువర్తనమ్॥ 74**

టీ॥ ఏవం మా అస్తు= చైతన్యము భాసించినచోట నెల్ల నానందము భాసించును అను నియమము లేదు. దీపః= దీపము, ఉష్ణ, ప్రకాశ, ఆత్మా= ఉష్ణము ప్రకాశము రెండు స్వభావములు కలది. అయినను, తస్య ప్రభా= దానికాంతి, గృహేవ్యాప్నోతి= గృహమునందు వ్యాపించును. ఉష్ణతా న= వేడి వ్యాపించుటలేదు. తద్వత్= అటులనే, బుద్ధివృత్తులయందు, చితేః ఏవ అనువర్తనం= చైతన్య మొక్కటియే అనువర్తించును.



అ॥ 'గంధ' యని యిచట మరియొక దృష్టాంతమునిచ్చుచున్నారు.

**గంధరూపరసస్పర్శేష్వపి సత్సు యథా పృథక్।**
**ఏకాక్షేణైవ ఏకార్థో గృహ్యతే నేతర స్తథా॥ 75**

టీ॥ ప్రతివస్తువునందును, గంధరూపరసస్పర్శేషు సత్సు అపి= గంధము, రూపము, రసము, స్పర్శలను గుణములున్నను (1-2-7శ్లోకము) యథా= ఏవిధముగా, పృథక్= వేరుగా, ఏకాక్షేణ= ఒక ఇంద్రియముచేత, ఏక ఏవ అర్థః= ఒక గుణము మాత్రమే, గృహ్యతే= గ్రహింపబడుచున్నది. ఇతరః న= తదితరములు గ్రహింపబడుటలేదు, తథా= అటులనే, ధీవృత్తి యందు చైతన్యము భాసించును, గాని యానందము భాసింపనేరదు.

అ॥ అభిన్నములగు చిదానందములను గూర్చి చెప్పిన ఈ దృష్టాంతము విషమదృష్టాంతమను ఆక్షేపణను 'చిదానన్ద' యని నిరాకరించున్నారు.

**చిదానన్దౌ నైవ భిన్నౌ గన్ధాద్యాస్తు విలక్షణాః।**
**ఇతి చేత్తదభేదోఽపి సాక్షిణ్యన్యత్ర వా వద॥ 76**

టీ॥ చిత్ ఆనన్దౌ= చిదానందములు, భిన్నౌ న ఏవ= భిన్నములు కానేకావు, గన్ధాద్యాః తు విలక్షణాః= గన్ధాదులు విలక్షణములు. ఇతి చేత్= అని అంటిరేని, తత్ అభేదః అపి= ఆ అభేదముగూడ, సాక్షిణి= సాక్షియందా, అపి= లేక, అన్యత్ర వా= మరియొకచోటనా, వద= చెప్పుము.

తా॥ వి॥ ఈ భేదము సాక్షి వలన కలిగినదియా? లేక నీ గుణములను గ్రహించు బుద్ధివృత్తులను బట్టి కలిగినదియా? అని ప్రశ్నభావము.

అ॥ 'ఆద్యే' అని సమాధానము చెప్పుచున్నారు.

**ఆద్యే గన్ధదయోఽప్యేవమభిన్నాః పుష్పవర్తినః।**
**అక్షభేదేన తద్భేదే వృత్తిభేదాత్తయోర్భిదా॥ 77**

టీ॥ పై రెండుపక్షములలో, ఆద్యే= సాక్షియందభేదమను పక్షములో, పుష్పవర్తినః= పుష్పమునందుండెడి, గంధాదయః అపి= గంధాదులు గూడ, ఏవం ఏవ= ఇటులనే, అభిన్నాః= అభిన్నములే అగుచున్నవి. అక్షభేదేన=

గంధాదులను గ్రహించు ఇంద్రియభేదముచేత, తద్భేదే= గంధాదులకు భేదము కలుగుచుండగా, వృత్తిభేదాత్= బుద్ధివృత్తులు భిన్నములగుట వలన, తయోః= చిదానందముల యొక్క, భిదా= భేదము గలుగుచున్నది.

తా॥ వి॥ పుష్పమునందుగల రూపరసగంధాదులే పుష్పము. తదన్యముకాదు. గుణిగుణములకు భేదములేదు. కాని యీ రూపరస గంధాదుల నొక్కక్క దాని నొక్కొక్క ఇన్ద్రియము గ్రహించును. అన్నిగుణము లన్నియింద్రియములకు విషయములు కావు. అటులనే కొన్ని బుద్ధివృత్తులుమాత్ర మానందమును గ్రహింపగలవు.

అ॥ బుద్ధియెక్క సాత్త్వికరాజసవృత్తిభేదము వలన చిదానన్దములకు భేదము కల్పితమని 'సత్వ' యని చూపుచున్నారు.

**సత్త్వవృత్తౌ చిత్సుఖైక్యం తద్వృత్తేర్నిర్మలత్వతః।**
**రజోవృత్తేస్తు మాలిన్యాత్ సుఖాంశోఽత్ర తిరస్కృతః॥** 78

టీ॥ బుద్ధియొక్క సత్త్వవృత్తౌ= సాత్త్వికవృత్తియందు, చిత్సుఖైక్యం= చైతన్యఆనందములయొక్క ఐక్య మనుభూతమగును. ఏలయనగా, తద్వృత్తేః నిర్మలత్వతః= ఆ సత్త్వ వృత్తి నిర్మల మగుటచేత, రజోవృత్తేః మాలిన్యాత్ తు= రజోవృత్తి మలిన మగుట చేత, అత్ర= ఈ వృత్తియందు, సుఖాంశః= ఆనందాంశ, తిరస్కృతః= కప్పివేయబడినది. ఆనందము సాత్త్వికము, (12-22శ్లోకము) గనుక సాత్త్వికవృత్తి గోచర మగును. గాని అన్యవృత్తి గోచరము కాదు.

అ॥ ఇచట 'తింత్రిణీ' యని ఉదాహరణము నిచ్చుచున్నారు.

**తింత్రిణీఫలమత్యమ్లం లవణేన యుతం యదా।**
**తదామ్లస్య తిరస్కారాదీషదమ్లం యథా తథా॥** 79

టీ॥ అతిఆమ్లం= విస్తారము పులుపగు,తింత్రిణీఫలం= చింతకాయ, యదా= ఏప్పుడై తే, లవణేన యుతం= లవణముతో మిశ్రితమగుచున్నదో. తదా= అప్పుడు, ఆమ్లస్య= పులుపుయొక్క తిరస్కారాత్= కప్పివేయబడుట



వలన, యథా= ఈషత్ ఆమ్లం= కొంచెము పులుపు, ఎట్లో, తథా= అట్లే రాజసవృత్తిచేత యానందము కప్పబడుచున్నది.

అ॥ ఇట్లు ప్రియతమము, ప్రియము, ఉపేక్ష్యము, ద్వేష్యము (12-51-55)అని విచారణముచేత ఆత్మయొక్క పరమానందరూపము నిశ్చయము కావచ్చును. ఇంతమాత్రముచేత నపరోక్షజ్ఞానము కలుగనేరదు. అది యోగమువలననే కలుగగలదను పూర్వపక్షమును 'నను' అని ప్రవేశ పెట్టుచున్నారు.

**నను ప్రియతమత్వేన పరమానందతాత్మని।**
**వివేక్తుం శక్యతామేవం వినా యోగేన కిం భవేత్॥** 80

టీ॥ నను= ఓసిద్ధాన్తీ! ఏవం= నీవు చెప్పిన రీతిని, ప్రియతమత్వేన= పరప్రేమాస్పదమగుటచే, ఆత్మని= ఆత్మయందు, పరమానన్దతా= పరమానన్దత్వము గూడ, వివేక్తుం= వివేచన చేయుటకు, శక్యతాం= సాధ్యమగుగాక! యోగేన వినా= యోగము లేకుండ, కేవలవివేకముచేత, కిం భవేత్= ఏమి లాభముకలుగును?

అ॥ యోగమువలె పంచకోశవివేకము గూడ నపరోక్షజ్ఞానహేతు వగునని 'యత్' అని చెప్పుచున్నారు.

**యద్యోగేన తదేవేతి వదామో జ్ఞానసిద్ధయే।**
**యోగః ప్రోక్తో వివేకేన జ్ఞానం కిం నోపజాయతే॥** 81

టీ॥ యోగేన= ధ్యానయోగముచేత, యత్= ఏ ఫలము 11-132 శ్లోకములో చెప్పబడినదో, తత్ ఏవ ఇతి= ఆఫలమే, కోశపంచకవివేకముచేత గూడ గల్గునని, వదామః= చెప్పుచున్నాము. జ్ఞానసిద్ధయే= అపరోక్షజ్ఞానసిద్ధి కొఱకు, యోగః ప్రోక్తః= యోగము చెప్పబడినచో, వివేకేన= కోశపంచక వివేకముచేత, జ్ఞానం కిం న ఉపజాయతే= జ్ఞాన మేల కలుగదు?

ఉపాసనము చేత, మూలావిద్యావినాశము, తద్వారా బ్రహ్మ లోకమున జ్ఞానావాప్తి, అచట బ్రహ్మతోగూడ ముక్తి గలుగును. 9-136-142-146 శ్లోకములుచూడవలెను. శ్రవణముచే ననాత్మయగు కోశ

పంచకమును ఆత్మనుంచి వివేకముచేసి తత్త్వమస్యాదిమహావాక్యములచే నపరోక్షసాక్షాత్కారము పొందదగును. 1-42-53-62-63-64 శ్లోకములు చూడవలెను.

అ॥ ఇచట 'యత్సాంఖ్యైః' అని గీతావాక్యార్థము నుదాహరించుచున్నారు.

**యత్సాంఖ్యైః ప్రాప్యతే స్థానం తద్యోగైరపి గమ్యతే।**
**ఇతి స్మృతం ఫలైకత్వం యోగినాం చ వివేకినామ్॥ 82**

టీ॥ ఈ పూర్వార్థము 9-134 శ్లోకమున వివరింపబడినది. ఇతి= అని, యోగినాం వివేకినాం చ= యోగులకును జ్ఞానులకును, ఫల, ఏకత్వం= ఒకటియే ఫలము,స్మృతం= స్మరింపబడుచున్నది.

అ॥ సాంఖ్యయోగములకు ఫలైకత్వమున్నను, అధికారిభేదము చేత మార్గభేదము సంభవించుచున్నదని 'అసాధ్యః' అని చెప్పుచున్నారు.

**అసాధ్యః కస్యచిద్యోగః కస్యచిత్ జ్ఞాననిశ్చయః।**
**ఇత్థం విచార్య మార్గౌ ద్వౌ జగాద పరమేశ్వరః॥ 83**

టీ॥ కస్యచిత్= ఒకనికి, యోగః= యోగము,అసాధ్యః= సాధ్యము కాదు. కస్యచిత్= మరి యొకనికి, జ్ఞాననిశ్చయః= తత్త్వనిశ్చయము అసాధ్యము, ఇత్థం విచార్య= ఈ ప్రకారము విచారించి పరమేశ్వరః= శ్రీకృష్ణభగవానుడు, ద్వౌ మార్గౌ= మోక్షమునకు, సాంఖ్యయోగములను రెండు మార్గములను, జగాద= ఉపదేశించెను.

అ॥ యోగము విశేషాయాససాధ్యము. వివేకమనాయాసలభ్యము. యోగమునందలి ఆయాసబాహుళ్యమున కనురూపమగు విశేష మొకింత ఉండియుండవలెను. ఆ విశేషమెద్ది? అపరోక్షజ్ఞానజనకత్వమా, రాగ ద్వేషాదినివర్తకత్వమా లేక ద్వైతానుపలబ్ధికారణత్వమా? ఇట్లు వికల్పించి 'యోగే' అని సమాధానము చెప్పుచున్నారు.

**యోగే కోఽతిశయస్తేఽత్ర జ్ఞానముక్తం సమం ద్వయోః।**
**రాగద్వేషాద్యభావశ్చ తుల్యో యోగివివేకినోః॥ 84**



టీ॥ తే= నీకు, జ్ఞానము కంటె, అత్ర యోగే= ఈ యోగమునందు, కః అతిశయః= ఏమి అతిశయము కలదు? అనగా అతిశయ మేమియు లేదు. అతిశయమెట్లు లేదో వివరించుచున్నాడు. ద్వయోః= జ్ఞానయోగముల రెంటికిని, జ్ఞానం= తత్త్వజ్ఞానఫలము, సమం ఉక్తం= సమానముగానే చెప్పబడినది. యోగివివేకినోః= యోగికి జ్ఞానికి గూడ, రాగ, ద్వేష ఆది, ఆభావః చ = రాగద్వేషాదులు లేక పోవుటయు, తుల్యః= సమానమే.

అ॥ చిత్తనిరోధముచేత యోగికి రాగద్వేషాదులు నశించున్నవి. జ్ఞాని కవి యెట్లు పోగలవను ప్రశ్నకు 'న ప్రీతిః' అని సమాధానము చెప్పుచున్నారు.

**న ప్రీతిర్విషయేష్వస్తి ప్రేయానాత్మేతి జానతః।**
**కుతో రాగః కుతో ద్వేషః ప్రాతికూల్యమపశ్యతః॥ 85**

టీ॥ ఆత్మా ప్రేయాన్= ఆత్మ నిరతిశయ ప్రేమాస్పదము, ఇతి జానతః= అని తెలిసికొనిన జ్ఞానికి, విషయేషు= సామాన్యప్రేమ విషయములగు శబ్దస్పర్శాదులందు, ప్రీతిః న= ప్రీతి యుండదు. రాజ్యము చేయు చక్రవర్తికి మంత్రిత్వము మీద కోరికయుండదు. విషయములు మిథ్యయగుటచే వానియందు, ప్రాతికూల్యం= ప్రతికూలతయు గాని ఆనుకూల్యముగాని, అపశ్యతః= కనిపెట్టని వానికి, రాగః కుతః= ఆను కూల్యములేదు. గనుక, వానియందు రాగము లేదు. ద్వేషః కుతః= ప్రాతికూల్యము లేదు గనుక ద్వేషము లేదు.

అ॥ జ్ఞానికూడ తన కపకారముచేసిన వారిని ద్వేషించుచుండగా నతనికి రాగద్వేషాదులు లేవని చెప్పుటకెట్లు సాధ్యమను శంకకు 'దేహాదేః' అని సమాధానము చెప్పుచున్నారు.

**దేహాదేః ప్రతికూలేషు ద్వేషస్తుల్యో ద్వయోరపి।**
**ద్వేషం కుర్వన్నయోగీ చేదవివేక్యపి తాదృశః॥ 86**

టీ॥ దేహాదేః ప్రతికూలేషు= దేహాదులకు ప్రతికూలమగు సర్పవ్యాఘ్రాదులయందు, ద్వేషః= ద్వేషభావము, ద్వయోః అపి= జ్ఞాని, యోగు లిద్దఱికిని, తుల్యః= సమానమే. ద్వేషం కుర్వన్= ఇతరులను ద్వేషించుచు, అయోగీచేత్= ఆతడు యోగికానేరడని అందురేని, వివేకీ అపి=

జ్ఞానిగూడ, తాదృశః= ఇతరులను ద్వేషించిన యెడల జ్ఞాని కానేరడు. అనగా నిజమగు యోగికి గాని జ్ఞానికి గాని, రాగద్వేషాదు లుండవని భావము.

అ॥ యోగికి ద్వైతభానము లేదను 84వ శ్లోకమునందలి మూడవ వికల్పమును 'ద్వైతస్య' అని విమర్శించుచున్నారు.

**ద్వైతస్య ప్రతిభానం తు వ్యవహారే ద్వయోః సమమ్।**
**సమాధౌ నేతి చే త్తద్వన్నాద్వైతత్త్వవివేకినః॥ 87**

టీ॥ మీరుచెప్పు ద్వైతభానము వ్యవహారదశయందా? లేక జ్ఞాన దశయందా? వ్యవహారే ద్వైతస్య ప్రతిభానం తు= వ్యవహారమునందు ద్వైతము భాసించుట, ద్వయోః= ఇద్దఱికిని, సమమ్= సమానమే, వ్యవహారమునం దుభయులకు ద్వైతము భాన మగుగాక; యోగికి, సమాధౌ న ఇతి చేత్= సమాధియందు భానమగుట లేదంటి రేని, అద్వైతత్త్వ వివేకినః = అద్వైతమే తత్త్వము, ద్వైతము కాదని శ్రుతి యుక్త్యనుభవములచేత వివేకముచేయు జ్ఞానికి, తద్వత్= అటులనే ద్వైతము భాసింపదు.

అ॥ అద్వైతతత్త్వవివేకశీలునికి ద్వైతభావన యుండదను విషయమే రాబోవు అధ్యాయమున వివరింపబడుచున్నదని చెప్పుచున్నారు.

**వివక్ష్యతే తదస్మాభిరద్వైతానన్దనామకే।**
**అధ్యాయే హి తృతీయేఽతః సర్వమప్యతిమంగలమ్॥ 88**

టీ॥ తత్= అద్వైతతత్త్వవివేకికి ద్వైతభావన లేకుండుట, అద్వైతా నన్దనామ కే తృతీయే అధ్యాయే= అద్వైతానన్దమను పేరుగల మూడవ అధ్యాయమున, అస్మాభిః= మాచేత, వివక్ష్యతే= చెప్పబడుచున్నది. అతః సర్వం= కనుక నంతయు, అతిమంగలం= అత్యంతము శుభకరము.

అ॥ ద్వైతదర్శనము లేని జ్ఞాని యోగియే యగునను ప్రశ్నకు 'సదా' అని అంగీకారమును చూపుచున్నారు.

**సదా పశ్యన్నిజానన్దమపశ్యన్నిఖిలం జగత్।**
**అర్థాద్యోగీతి చేత్తర్హి సంతుష్టో వర్ధతాం భవాన్ ॥ 89**



టీ॥ సదా= ఎల్లప్పుడును, నిజానన్దం= నిరుపాధికమగు నాత్మానంద మును, పశ్యన్ = అనుభవించుచూ నిఖిలం జగత్ అపశ్యన్= ద్వైతస్వరూపమగు సమస్తజగత్తును నిరసించుజ్ఞాని, అర్థాత్= పర్యవసానమునందు, యోగీ ఇతి చేత్= యోగియే అగుచున్నా డనినచో, తర్హి= అట్లయిన, సంతుష్టః= మీవాదము సమీచీనమని సంతోషించినవాడవై, భవాన్= నీవు, వర్ధతాం= వర్ధిల్లుదువుగాక!

అ॥ మందానుజిఘృక్షకై ప్రతిజ్ఞాతమైన ఆత్మానందమను నీప్రకరణ మును బ్రహ్మానందాభిధే యని యుపసంహరించుచున్నారు.

**బ్రహ్మానందాభిధే గ్రన్థే మందానుగ్రహసిద్ధయే।**
**ద్వితీయాధ్యాయ ఏతస్మిన్నాత్మానందో వివేచితః॥ 90**

టీ॥ మందానుగ్రహసిద్ధయే= మందప్రజ్ఞులగువారి ప్రయోజనము కొఱ కారంభింపబడిన, బ్రహ్మానన్దాభిధే గ్రన్థే= బ్రహ్మానందమను పేరగల గ్రంథమునందు, ఏతస్మిన్ ద్వితీయాధ్యాయే= ఈ రెండవ యధ్యాయము నందు, ఆత్మానన్దః= ఆత్మానన్దము, వివేచితః= వివేచన చేయబడినది.

శ్రీభారతీసంప్రదాయసార్వభౌమ, జగద్గురు శ్రీకళ్యాణానంద
భారతీమహాచార్యాత్యన్త ప్రియాన్తేవాసియు, అత్రి
గోత్ర సముద్భూతుడును, ఉభయకులపవిత్రుడును
నగు లింగన సోమయాజిచే విరచిత
మగు వేదాంతపంచదశి కళ్యాణామృత
మను ఆంధ్రవ్యాఖ్యాసమేతమగు
బ్రహ్మానందమునందు ఆత్మానన్దము
సంపూర్ణము.

శ్రీ గురుభ్యో నమః

# శ్రీమదాంధ్ర వేదాన్తపంచదశి

## కళ్యాణామృత వ్యాఖ్యాసమేతము

### * 13 బ్రహ్మానందము - అద్వైతానందము *

అ॥ బ్రహ్మానన్ద మద్వితీయాఖండఘనస్వరూపమైనను దానిని పొందు మార్గభేదమును బట్టి మూడు విధములుగ నిచట వివరింపబడినది. యోగ లభ్యమగు మార్గము యోగానన్దప్రకరణమున ప్రదర్శింపబడినది. దేహాభిమాన నివిష్టులగు మందప్రజ్ఞుల కాత్మయొక్క పరమప్రేమాస్పదత్వ పరమానందా స్పదత్వము లాత్మానందప్రకరణమున బోధింపబడినవి. విచారచతురులగు సూక్ష్మబుద్ధుల కద్వైతానంద మీ ప్రకరణమున యోగానన్దః యని ప్రారంభించు చున్నారు.

**యోగానన్దః పురోక్తో యః స ఆత్మానన్ద ఇష్యతామ్,**
**కథం బ్రహ్మత్వమేతస్య సద్వయస్యేతి చేచ్ఛృణు॥ 1**

టీ॥ పురా= పదునొకండవ ప్రకరణమునందు, యః యోగానన్దః ప్రోక్తః= ఏ యోగానందము చెప్పబడినదో, సః= అదియే, ఆత్మానన్దః ఇష్యతామ్= ఆత్మానన్దమని తలంపబడు గాక! సద్వయస్య ఏతస్య= 12-39 శ్లోకములో నుదాహరింపబడిన ప్రకారము గౌణమిథ్యాముఖ్యభేదముచే వివిధాకారమగు నీ యాత్మానందమునకు, బ్రహ్మత్వం కథం ఇతి చేత్= అద్వితీయమగు బ్రహ్మానందస్వరూప మెట్లు సంభవించును. అని ప్రశ్నించితి వేని, శృణు= వినుము.

అ॥ ఆకాశాది అని సమాధానము చెప్పుచున్నారు.

**ఆకాశాదిస్వదేహాన్తం తైత్తరీయశ్రుతీరితమ్।**
**జగన్నాస్త్యన్యదానందాద్వైతబ్రహ్మతా తతః॥ 2**

టీ॥ తైత్తిరీయ, శ్రుతి, ఈరితా= తైత్తిరీయశ్రుతి 2-1 యందు వర్ణింప బడిన, ఆకాశ, ఆది, స్వదేహ, అన్తం= ఆకాశము, వాయువు, అగ్ని, జలము,



పృథ్వి, ఓషధులు, అన్నము, పురుషుడు లోనుగాగల, జగత్= జగత్తంతయు. అన్యత్= పరబ్రహ్మముకంటె భిన్నముగ, న ఆస్తి= లేదు, తతః= జగదన్తః పతితములగు ఆకాశాది దేహాంతము బ్రహ్మముకంటె మరియొకవస్తువు లేదుగనుక, ఆనన్దాద్వైతబ్రహ్మ తా= ఆత్మానన్దమున కద్వైత బ్రహ్మభావము కలుగును.

తా॥ వి॥ ఇచట తైత్తిరీయశ్రుతి 2-1 అనువాకము చూడవలెను. అద్వైతపరబ్రహ్మమును, చెప్పబూని తొలుదొల్తనే "బ్రహ్మ సత్యం జగన్మిథ్యా" యన బ్రహ్మనిత్యము, జగత్తు అనిత్యమను అద్వైతసిద్ధాంతముఖ్య సూత్ర మిచట బోధింపబడుచున్నది.

అ॥ తైత్తిరీయశ్రుతియందు ఏతస్మాదాత్మనః ఆకాశః సంభూతః (తై 2-1) యని జగత్కారణ మాత్మయని చెప్పబడినదికాని యానందమని చెప్పబడలేదుగదా యను శంకకు 'ఆనన్దాదేవ' యని సమాధానమును చెప్పుచున్నారు.

**అనన్దాదేవ తజ్జాతం తిష్ఠత్యానన్ద ఏవ తత్।**
**ఆనన్ద ఏవ లీనం చేత్యుక్తానన్దాత్కథం పృథక్॥ 3**

టీ॥ తత్= ఆ జగత్తు, అనన్దాత్ ఏవ జాతం= ఆనందమువలననే పుట్టినది. ఆనన్దే ఏవ తిష్ఠతి= ఆనందమునందే స్థితిని పొందినది. ఆనన్దే ఏవ లీనం చ= ఆనందమునందే లయమగుచున్నది. ఇతి= కనుక, ఉక్తానందాత్= చెప్పబడిన యానందముకంటె జగత్తు, కథం పృథక్= భిన్న మెట్లగును?

తా॥ వి॥ ఆనన్దాద్ధ్యేవ ఖల్విమాని భూతాని జాయ న్తే ఆనన్దేనజాతాని జీవంతి ఆనన్దం ప్రయన్త్యభిసంవిశంతి (తై 3-6) అను వాక్యమిచట ప్రస్తుతము.

అ॥ కార్యమగు జగత్తు తనకారణమగు బ్రహ్మముకంటె వేరు కాదని చెప్పుటచేత కారణకార్యముల కభేదము నియత మని చెప్పిన ట్లగుచున్నది. ఘటకులాలాదిస్థలములయం దీ నియమమునకు భంగము కలుగుచున్నది కదా యను యాక్షేపణకు కులాలాత్ అని సమాధానము చెప్పుచున్నారు.

**కులాలాద్ఘట ఉత్పన్నో భిన్నశ్చేతి న శంక్యతామ్।**
**మృద్వదేష ఉపాదానం నిమిత్తం న కులాలవత్॥** 4

టీ॥ ఘటః= ఘటము, కులాలాత్= కుమ్మరి వలన, ఉత్పన్నః= పుట్టినది. భిన్నః చ ఇతి= కాని, కారణమగు కులాలుని కంటె భిన్నముగాగూడ నున్నదని, న శంక్యతాం= శంకింపవలదు. ఘటమును గూర్చి, మృద్వత్= మట్టివలే, ఏషః= ఈ యానందము, ఉపాదానం= జగత్తున కుపాదాన కారణము, కులాలవత్= కుమ్మరివలె, నిమిత్తం న = నిమిత్త కారణము కాదు.

తా॥ వి॥ ఘటము పుట్టుటకు మట్టి కుమ్మరియు కావలెను. నగలు చేయుటకు బంగారము సువర్ణకారుడు కావలెను. మట్టి సువర్ణములే ఘటాభరణరూపములుగా మారినవి. మృత్సువర్ణములు లేక ఘటాభరణము లుద్భవింప నేరవు. ఘటాభరణములకు మృత్సువర్ణము లుపాదానకారణము లందురు. కులాలసువర్ణకారులు ముఖ్యకారణములు కారు. నిమిత్త మాత్రు లగుచున్నారు. వీరులేకున్నను కార్యోత్పాదనశక్తి యున్నంత వఱకు యేదేయొక నిమిత్తముచేత కార్య ముత్పన్నమగును. యంత్రములచే నాభరణములు వస్త్రములు మొదలగునవి చేయబడుచున్నవి. కనుక కులాల సువర్ణ కారాదులు నిమిత్తకారణము లగుచున్నారు. బంగారము, మృత్తు నిత్యము. వికారమగు ఆభరణము, ఘటము అనిత్యము. అందు వలన కార్య కారణములకు తాదాత్మ్యము చెప్పునపుడు కారణశబ్దమున కుపాదాన కారణము గ్రహించవలెను.

అ॥ ఉపాదానకారణనిర్వచనముచేత ఆనందమే జగత్తున కుపాదాన కారణము కావలెను. కాని మరియొకటి కాదని 'స్థితి' యని చూపుచున్నారు.

**స్థితిర్లయశ్చ కుంభస్య కులాలే స్తో న హి క్వచిత్।**
**దృష్టౌ తౌ మృది తద్వత్స్యాదుపాదానం తయోః శ్రుతేః॥** 5

టీ॥ కుంభస్య= ఘటమునకు, స్థితిః లయః చ= స్థితిలయములు, కృచిత్=ఒకపుడైనను, కులాలే= కుమ్మరియందు, న స్తః హి= ఉండవు గదా! తౌ= ఆ రెండును, మృది= మృత్తునందు, దృష్టౌ= చూడబడుచున్నవి. తద్వత్= ఆ రీతిగనే, తయోః=జగత్తుయొక్క స్థితిలయములకు, శ్రుతేః= 'ఆనందాద్ధ్యేవ' (తై3-6) అను శ్రుతివలన, ఉపాదానం స్యాత్= ఆనందము పాదాన మగుచున్నది.



తా॥ వి॥ బంగారము కంటె భిన్నముగా నాభరణమునకు, మృత్తుకంటె భిన్నముగా ఘటమునకు ఉనికి లేదు. బంగారముయొక్క వికారభేదముచే నాభరణభేదము, మృద్వికారభేదముచే ఘటశరావాదిభేదము గలుగుచున్నది. ఏ కార్యము యొక్క ఉత్పత్తిస్థితిలయముల కేది అనివార్యమై విడదీయుటకు వీలుగాని కారణ మగుచున్నదో అది దాని ఉపాదాన కారణ మగును. ఆనందము జగత్తుయొక్క ఉత్పత్తిస్థితిలయముల కాధారము మగుటచే దాని కుపాదానకారణ మగుచున్నది.

అ॥ ఉపాదానత్వములోని అవాంతరభేదములను జెప్పుచున్నాఁడు:-

**ఉపాదానం త్రిధా భిన్నం వివర్తి పరిణామి చ,**
**ఆరంభకం చ తత్రాంత్యౌ న నిరంశే ఉవకాశినౌ.** 6

టీ॥ ఉపాదానం= ఉపాదానకారణము, వివర్తి=వివర్త్యుపాదాన మనియు; పరిణామి చ=పరిణామ్యుపాదాన మనియు, ఆరంభకం చ= ఆరంభకోపాదాన మనియు, త్రిధా= మూఁడు విధములుగా నున్నది. తత్ర= ఈ మూఁడింటిలో, అంత్యౌ= కడపటి రెండును, నిరంశే= నిరవయవవస్తువు నందు, అవకాశినౌ= అవకాశము గలవి, న= కావు.

తా॥ స్పష్టము.

అ॥ జగదుత్పత్తిని గూర్చి ఆరంభము, పరిణామము, వివర్తమని మూడు వాదములు క్రమముగా, తర్కసాంఖ్యద్వైతసిద్ధాంతముల యందగ పడుచున్నవి. జగత్తంతయు పంచీకృతపంచమహాభూతముల వలన కలుగు చున్నది. (1-27 శ్లోకము) బుద్ధిచేతను గూడ నూహింపశక్యముగాని యత్యంతము సూక్ష్మతమములగు పరమాణువులు రెండు నాలుగు ఎనిమిది- ఈ విధముగ కలియుటచేత జగత్సృష్టి యారంభమైనదనియు నిట్లు కలిసిన పరమాణుసంఘములు విడిపోయి పరమాణుస్థితికి వచ్చినపుడు లయము సంభవించుచున్నదనియు ఆరంభవాదుల మతము. వీరల మతమునందు పరమాణువు నిత్యము. కార్యకారణములు భిన్నములు. పరమాణువుల కలయిక వలన జగత్సృష్టియారంభమైనదనుట యారంభవాదము.

క్షీరము, సువర్ణము, మృత్తు మొదలగునవి పూర్వావస్థను మారి దధి ఆభరణము ఘటము మొదలగు నవస్థాంతరములుగ పరిణామమును చెందుచున్నవి. ఒకే వస్తువు అవస్థాంతరము నొంది నూతనవ్యవహారమున కాస్పదమగుచున్నది. క్షీరమే నూతనరూపమునొంది దధి యని నూతన

వ్యవహారక్షమ మగుచున్నది. ఈ విధముగా ప్రతిపదార్థ మేదో యొక పరిణామముచే కలిగినదని పరిణామవాదులగు సాంఖ్యులు చెప్పుచున్నారు. పరిణామము పొందు క్షీరసువర్ణాదు లుపాదానకారణము. పరిణమింపజేయు ఆమ్లఫల సువర్ణకారకులాలాదులు నిమిత్తకారణములు. ఏదో యొక నిమిత్తమునుబట్టి వస్తువులు మరియొక రూపమున పరిణమించుననుట పరిణామవాదము.

రజ్జుమరుమరీచికాదులు స్వయముగా నేమియు మార్పుజెందక నే చూచువారికి మాత్రము సర్పజలాది విశేషాకారముతో వర్తిల్లుచున్నట్లు కన్పట్టుట వివర్తమందురు. ఇదియే యద్వైతుల వివర్తవాదము. రజ్జువు సర్పముగా చీకటిలో కన్పట్టుచున్న కాలమునందుగూడ స్వస్వరూపముతోనే యున్నది. రజ్జువు లేనిది సర్పభ్రాంతి కలుగదు గనుక సర్పభ్రాంతికి రజ్జు వధిష్ఠానమగుచున్నది. స్వయముగా నిర్వికారమగు రజ్జువునందు అజ్ఞాన ముచే లేని సర్పమును కల్పించుచున్నాము. దీపకాంతిలో సర్పము పోయి నిజస్వరూప మగపడుచున్నది. అటులనే నిర్వికారమగు పరబ్రహ్మ మను అధిష్ఠానమునందు మనము జగత్తును కల్పించుచున్నాము.ఇదియే అద్వైతముయొక్క ముఖ్యతత్త్వము. బ్రహ్మ జగత్కారణమను మాటకిదియే యర్థము. స్వయముగా నేమార్పునుజెందక విశేషాకారముతో భాసించు ననుట వివర్తవాదము. ఆరంభపరిణామములు వస్త్వధీనములు. వివర్తము ద్రష్టధీనము. ఆరబ్ధములు పరిణతములు నగు పదార్థము లంశా విశిష్టములు. నిరంశమగు నాకాశముగూడ విశేషాకారములతో నున్నటుల మనముచూచుచుండుచేత భేదత్రయశూన్యమగు పరబ్రహ్మ మునకు గూడ మాయచేత జగత్తను వివర్తము సంభవమగు చున్నది. క్షీరమున కవస్థాం తరప్రాప్తమగు దధిరూపము పోయి. పూర్వరూపము రాదు. ఇది కేవల పరిణామము. కటకాద్యాభరణము లవస్థాంతరము పోయిన వెంటనే సువర్ణ మగుచున్నవి. సువర్ణము, పరిణామమునకును వివర్తమునకు గూడ నుదాహరణ మగును. ఇట్లు వివిధదర్శన ప్రవర్తకులచే నుపపాదింప బడిన జగత్సృష్టి కారణభేదములు 7-10-49-52 శ్లోకములలో విపులము చేయుబడుచున్నవి ముందు నైయాయికుల ఆరంభవాదమును 'ఆరంభ' యని ప్రదర్శించుచున్నారు.

**ఆరంభవాదినోఽన్యస్మాదన్యస్యోత్పత్తి మూచిరే।**
**తంతోః పటస్య నిష్పత్తేర్భిన్నౌ తంతుపటౌ ఖలు॥** 7



టీ॥ అన్యస్మాత్= భిన్నమగు కారణమువలన, అన్యస్య= భిన్నమగు కార్యము యొక్క, ఉత్పత్తిం= పుట్టుకను, ఆరమ్భవాదినః= ఆరమ్భవాదులగు తార్కికులు, ఊచిరే= చెప్పిరి. ఉదాహరణమునకు, తంతోః= దారమను కారణమువలన, పటస్య నిష్పత్తేః= మరియొకటియగు వస్త్రమను కార్యము పుట్టుటవలన, తంతుపటౌ= దారము వస్త్రము, భిన్నౌ ఖలు= భిన్నములు గదా!

అ॥ తరువాత సాంఖ్యుల పరిణామవాదమును 'అవస్థ' యని చూపుచున్నారు.

**అవస్థాన్తరతాపత్తిరేకస్య పరిణామితా।**
**స్యాత్ క్షీరం దధి మృత్కుమ్భః సువర్ణం కుండలం యథా॥** 8

టీ॥ ఏకస్య= ఒకేవస్తువుకు, అవస్థా, అన్తరతా, ఆపత్తిః= మరియొక యవస్థ సంభవించుట, పరిణామితా= పరిణామమగును. యథా= అది ఎట్లనిన, క్షీరం, దధి స్యాత్ = పాలు పెరుగుగా మారుచున్నది. మృత్ కుంభః= మృత్తు ఘటముగాను, సువర్ణః కుండలం= సువర్ణము కుండలాద్యా భరణము గాను మారుచున్నది.

తా॥ వి॥ సత్త్వరజస్తమోగుణములయొక్క సామ్యావస్థ లయ మనియు సాంఖ్యసిద్ధాంతము.

అ॥ ఇక వివర్తమును 'అవస్థ' అని వివరించుచున్నారు.

**అవస్థాన్తరభానం తు వివర్తో రజ్జుసర్పవత్।**
**నిరంశేఽప్యస్త్యసౌ వ్యోమ్ని తలమాలిన్యకల్పనాత్॥** 9

టీ॥ రజ్జుసర్పవత్= త్రాడు పామువలె, అవస్థ, అంతర భానం తు= స్వయముగా మార్పుచెందకయే మరియొకరూపములతో చూచువారి కగపడుట మాత్రము, వివర్తః= వివర్తమనబడును. నిరంశే అపి వ్యోమ్ని= అంశావిహీనమగు నాకాశమునందు గూఢ తలమాలిన్యకల్పనాత్= బోర్లించిన మూకుడు మొదలగు స్వరూపములు నీలము మొదలగు వర్ణములు కల్పింపబడుటచేత, ఆకాశమునందు గూడ, అసౌ అస్తి= ఈ వివర్తము గలదు.

అ॥ ఆనన్దాదేవ యని 3 వ శ్లోకమున చెప్పిన ఆనందముయొక్క జగత్కారణత్వ మెటుల శక్యమో 'తతః' అని చూపించుచున్నారు.

**తతో నిరంశ ఆనన్దే వివర్తో జగదిష్యతామ్।**
**మాయాశక్తిః కల్పికా స్యాదైన్ద్రజాలికశక్తివత్॥ 10**

టీ॥ తతః= అందువలన, నిరంశే ఆనందే= అంశావిహీనమగు నానందమునందు, జగత్= జగత్తు, వివర్తః= వివర్తకార్య స్వరూపమని, ఇష్యతాం= అంగీకరింపబడుగాక, ఐన్ద్రజాలికశక్తివత్= ఇంద్రజాలకుని శక్తివలె, మాయాశక్తిః= మాయాశక్తి, కల్పికా స్యాత్= జగత్తును కల్పించున్నది అగును, ఇచట 6-97, 2-59 శ్లోకములను చూడవలెను.

అ॥ ఇట్లానందముకంటె భిన్నమగు మాయనొక దాని నంగీకరించిన ఆనందమున కద్వితీయత్వభంగము కలుగుచున్నది. ఇది అద్వైతమత సమ్మతముగాదు. ఇట్టి యాక్షేపణను నివారించుటకై 'శక్తిః' అని మాయాశక్తి స్వరూపమును నిరూపించుచున్నారు.

**శక్తిః శక్తాత్పృథఙ్నాస్తి తద్వద్దృష్టేర్న చాభిదా।**
**ప్రతిబంధస్య దృష్టత్వాచ్ఛక్త్యభావే తు కస్య సః॥ 11**

టీ॥ శక్తిః= దాహకాదిశక్తి, శక్తాత్= శక్తిమత్తగువహ్ని మొదలగు వానికంటె, పృథక్ న అస్తి= భిన్నముగా లేదు. తద్వత్=శక్తిమత్తుకంటె శక్తి భిన్నము కానటుల, దృష్టేః= కనబడుచుండుటవలన, శక్తిశక్తిమత్తులకు భేదము లేదని చెప్పవచ్చును గదా! అటుల వీలులేదు. ఏలన శక్తి విజృంభణమునకు, ప్రతిబంధస్య= పసరు మొదలగు ప్రతిబంధకములు, దృష్టత్వాత్= అగ్నిమండు చున్నను. పసరుచేతికి వేడి తగులకుండుటవలన, అభిదా= శక్తి శక్తిమత్తులకభేదము, న చ= లేదు. ఒకవేళ, శక్తి, అభావే తు= శక్తి యే లేదను పక్షమునందు, సః= ఆ ప్రతిబంధము, కస్య= దేనికి?

తా॥ వి॥ అగ్నికంటె భిన్నముగా దాహకశక్తి ఉపలబ్ధమగుట లేదు కనుక అగ్నికంటె దాని శక్తి భిన్నము కాదని చెప్పవలసివచ్చుచున్నది యన పసరురాచిన చేతిని అగ్ని కాల్చుటలేదు గనుక అగ్నికంటె వేరుగ దాహకశక్తి కలదని చెప్పవలసి వచ్చుచున్నది. ఇచట 2-47-53 శ్లోకములు చూడవలెను.



అ॥ శక్తి ఇన్ద్రియాగోచరము గనుక దానియొక్క యునికిలేములు గూడ నింద్రియాగోచరములే అగుచున్నవి. అందువలన ప్రతిబంధమును తెలిసికొన వీలులేదను ఆక్షేపణకు 'శక్తేః' అని సమాధానమును చెప్పుచున్నారు.

**శక్తేః కార్యానుమేయత్వాదకార్యే ప్రతిబంధనమ్।**
**జ్వలతోఽగ్నేరదాహే స్యాన్మంత్రాదిప్రతిబన్ధతా॥ 12**

టీ॥ శక్తేః కార్యానుమేయత్వాత్= దాహకశక్తి కంటి కగుపడక పోయినను, అది చేయు పనియగు బొబ్బయెక్కుట మొదలగువానిచే నూహింపదగినదగుటవలన, అకార్యే సతి= దాని కార్య మగపడని దగుచుండగా, ప్రతిబంధనం= ప్రతిబంధ మున్నట్లూహింపబడును. ఇందు కుదాహరణము. జ్వలతః అగ్నేః అదాహే= మండుచున్న యగ్ని దహించనపుడు, మంత్రాదిప్రతిబంధతా= మంత్రములు, ఓషధులు మొదలగు ప్రతిబంధములు, స్యాత్= ఉండియుండవలెను.

అ॥ ఇట్లు మాయాశక్తియొక్క అస్తిత్వమును యుక్తి సిద్ధము చేసి, తే ధ్యానయోగానుగతా (శ్వేత 1-3) పరాఽస్య శక్తిర్వివిధైవ శ్రూయతే స్వాభావికీ జ్ఞానబల క్రియా (శ్వేత 6-36) అను శ్రుత్యర్థమును 'దేవాత్మశక్తిం' అని పఠించుచు శ్రుతిసిద్ధముగూడ చేయుచున్నారు.

**దేవాత్మశక్తిం స్వగుణైర్నిగూఢాం మునయోఽవిదన్।**
**పరాఽస్య శక్తిర్వివిధా క్రియాజ్ఞానబలాత్మికా ॥ 13**

ఇతి వేదవచః ప్రాహ॥

టీ॥ మునయః= మననశీలులగు మహర్షులు, దేవ, ఆత్మశక్తిం= స్వయంప్రకాశము ప్రత్యగభిన్నము నగు పరమాత్మయొక్క మాయశక్తిని, స్వగుణైః నిగూఢాం= తన గుణములచే నావరింపబడినదానిగా, అవిదన్ = తెలిసికొనిరి. అస్య= ఈ పరబ్రహ్మము యొక్క, పరాశక్తిః= ఉత్కృష్టమైన శక్తి, క్రియాజ్ఞానబలాత్మికా= క్రియ జ్ఞానము ఇచ్ఛ మొదలగు రూపములచేత, వివిధా, శ్రూయతే= పలుతెరంగుల వినబడుచున్నది, ఇతి= అని, వేదవచః ప్రాహ= పై శ్వేతాశ్వతర వేదవాక్కులు చెప్పినవి.

తా॥ వి॥ తాను కట్టుకొన్న గూటిలోని సాలీడు వలె మాయాశక్తి స్వకార్యభూతములగు స్థూలసూక్ష్మ శరీరములలో నావృతమైయున్నది. ఈ మాయాశక్తి ఇచ్ఛ, జ్ఞానము, క్రియ మొదలగు ననేకరూపములు పొందు చున్నది. ఈ మాయాశక్తి అంతర్ముఖులగు మునిపుంగవులకు వేద్యమగు చున్నది. ఇచట 5-7-13, 2-47-53 శ్లోకముల జ్ఞాపకము చేసికొనవలయును.

అ॥ ఈ యర్థమునే శ్రీరామునికి వసిష్ఠు డుపదేశించిన ప్రకారమును 'వసిష్ఠశ్చ అని చూపుచున్నారు.

వసిష్ఠశ్చ తథాబ్రవీత్,

**సర్వశక్తి పరంబ్రహ్మ నిత్యమాపూర్ణమద్వయమ్।**
**యయోల్లసతి శక్త్యాఽసౌ ప్రకాశమధిగచ్ఛతి॥** **14 1/2**

టీ॥ తథా= వేదవచోఽనురూపముగానే, వసిష్ఠః చ= వసిష్ఠుడును శ్రీరామునికి, అబ్రవీత్= ఉపదేశించెను. సోపాధికమగుటచేత, సర్వశక్తి= సర్వసమర్థము, ఆపూర్ణం= సర్వవ్యాపకము అందువలన, అద్వయం= రెండవది లేనిది అగు ఆ, పరం బ్రహ్మ= పరబ్రహ్మము, యయా శక్త్యా= ఏ మాయాశక్తిచే, ఉల్లసతి= విశేషాకారమున భాసించుచున్నదో, తథా= అదే ప్రకారము, అసౌ శక్తిః= ఈ మాయాశక్తి, ప్రకాశం అధిగచ్ఛతి= ప్రకాశమును పొందుచున్నది. అనగా పరబ్రహ్మము జగద్రూపమున నభివ్యక్తమైనపుడు దానితో పాటు మాయాశక్తి గూడ నభివ్యక్త మగుచున్నది.

అ॥ 'చిచ్ఛక్తిః' అని యీ యర్థమునే విశదము చేయుచున్నారు.

**చిచ్ఛక్తిర్బ్రహ్మణో రామ! శరీరేషూపలభ్యతే॥** **15**

**స్పందశక్తిశ్చ వాతేషు దార్ఢ్యశక్తిస్తథోపలే।**
**ద్రవశక్తిస్తథాంభస్సు దాహశక్తిస్తథానలే॥** **16**

**శూన్యశక్తిస్తథాకాశే నాశశక్తిర్వినాశిని,**
**యథాఽణ్డేఽన్తర్మహాసర్పో జగదస్తి తథాఽత్మని॥** **17**

టీ॥ హేరామ= ఓశ్రీరామా! బ్రహ్మణః చిచ్ఛక్తిః= బ్రహ్మముయొక్క చైతన్యశక్తి, శరీరేషు= శరీరములయందు, ఉపలభ్యతే= తెలియబడుచున్నది.



వాతేషు= గాలులయందు, స్పందశక్తిః చ= చలనశక్తియు, తథా= అట్లే ఉపలే= శిలయందు, దార్ఢ్యశక్తిః= కాఠిన్యశక్తియు, తథా= అట్లే, అంభస్సు= జలములయందు, ద్రవశక్తిః= ద్రవశక్తియు' తథా= అట్లే, 'అనలే= అగ్ని యందు, దాహశక్తిః= దహన శక్తియు, తథా= అట్లే, ఆకాశే= ఆకాశమునందు, శూన్యశక్తిః= అవకాశశక్తి, వినాశిని= నశింపజేయుదాని యందు, నాశశక్తిః= నాశశక్తియు, యథా= ఏవిధముగా.అండే అన్తః= గ్రుడ్డులోపల మహాసర్పః = గొప్పసర్పమున్నదో, తథా= అటులనే, ఆత్మని= ఆత్మయందు, జగత్ అస్తి= జగత్తు కలదు. 141/2 - 17

అ॥ ఫలపత్ర యని యొక దృష్టాంతము నిచ్చుచున్నారు.

**ఫలపత్రలతాపుష్పశాఖావిటపమూలవాన్।**
**నను బీజే యథా వృక్షస్తథేదం బ్రహ్మణి స్థితమ్॥** **18**

టీ॥ నను= ఓశ్రీరామా! ఫల.... మూలవాన్ = పండ్లు, ఆకు, తీగె, పుష్పము, కొమ్మలు, మొదలు, వ్రేళ్ళు గల, వృక్షః= వృక్షము, బీజే= విత్తనమునందు, యథా= ఎట్లున్నదో, తథా= అటులనే, ఇదం= ఈ జగత్తు, బ్రహ్మణి స్థితం= బ్రహ్మయందున్నది.

అ॥ ఈ శక్తి దేశకాలానుసారముగ నభివ్యక్తమగునని 'క్వచిత్' అని చెప్పుచున్నారు.

**క్వచిత్కాశ్చిత్కదాచిచ్చ తస్మాదుద్యన్తి శక్తయః।**
**దేశకాలవిచిత్రత్వాత్ క్ష్మాతలాదివ శాలయః॥** **19**

టీ॥ దేశకాలవిచిత్రత్వాత్= దేశకాలములు విచిత్రములగుటవలన, క్ష్మాతలాత్= భూమినుంచి, శాలయః ఇవ= సస్యములు వలెనే, క్వచిత్= ఒకానొక దేశమున, కదాచిత్= ఒకానొక కాలమున, కాఃచిత్ శక్తయః= కొన్ని కొన్ని శక్తులు మాత్రము, తస్మాత్= ఆ బ్రహ్మమువలన, ఉద్యంతి= పుట్టు చున్నవి.

అ॥ మాయాశబలితమగు నీశ్వరునిచే సృష్టింపబడిన జగత్తు మనోవృత్త్యాత్మకమగు జీవసంకల్పముచేత భోగసాధనముగా చేయబడినదని

చెప్పదలచి (4-19-32) మనస్సు యొక్క స్వరూపమును 'స ఆత్మా' అని వర్ణించుచున్నారు.

**స ఆత్మా సర్వగో రామ! నిత్యోదితమహావపుః।**
**యన్మనాఙ్మననీం శక్తిం ధత్తే తన్మన ఉచ్యతే॥ 20**

టీ॥ రామ= ఓ రామ! సర్వగః= సర్వవ్యాపకుడు, నిత్య, ఉదిత, మహా వపుః= నిత్యము, స్వయంప్రకాశస్వరూపము, అపరిచ్ఛిన్నమునగు, స ఆత్మా,= ఆ ఆత్మ, మనాక్= కొంచెము, మననీం శక్తిం= స్వపరమన నాత్మక మగు మాయాశక్తిని, యత్, ధత్తే= ఎపుడు ధరించునో, తత్= అపుడు, మనః ఉచ్యతే= మనస్సని చెప్పబడును.

అ॥ జగత్కల్పనాప్రకారమును 'ఆదౌ' అని వర్ణించుచున్నారు.

**ఆదౌ మనస్తదను బంధవిమోక్ష దృష్టీ**
**పశ్చాత్ప్రపంచరచనా భువనాభిధానా।**
**ఇత్యాదికా స్థితిరియం హి గతా ప్రతిష్ఠా**
**మాఖ్యాయికా సుభగబాలజనోదితేవ॥ 21**

టీ॥ ఆదౌ= మొదట, మనః= మనస్సు, తదను= దానిననుసరించి, బన్ధవిమోక్షదృష్టీ= సంసారమునుంచి బంధము మోక్షము అను భావములు, పశ్చాత్= తరువాత, భువన, అభిధానా= భువనమను పేరుగల, ప్రపంచ రచనా= జగత్సృష్టి అగుచున్నది. ఇతి ఆదికా= ఇది మొదలుగాగల, ఇయం స్థితిః= ఈ జగత్ స్థితి, హే సుభగ= ఓ శుభంకరుడా, బాలజన ఉదితాఇవ= ముద్దుపిల్లలకు, చెప్పెడు, ఆఖ్యాయికా, ఇవ= కథవలెనే, ప్రతిష్ఠాం గతా= స్థైర్యమును పొందినది.

అ॥ కథను బాలస్య అని చెప్పుచున్నారు.

**బాలస్య వినోదాయ ధాత్రీ వక్తి వినోదాం కథామ్।**
**క్వచిత్సన్తి మహాబాహో రాజపుత్రాస్త్రయః శుభాః॥ 22**

**ద్వౌ న జాతౌ తథైకస్తు గర్భ ఏవ న చ స్థితః।**
**వసన్తి తే ధర్మయుక్తా అత్యన్తాసతి పత్తనే॥ 23**



**స్వకీయాచ్ఛూన్యనగరాన్నిర్గత్య విమలాశయాః।**
**గచ్ఛన్తో గగనే వృక్షా౯ దదృశుః ఫలశాలినః॥ 24**

**భవిష్యన్నగరే తత్ర రాజపుత్రాస్త్రయో౽పి తే।**
**సుఖమద్య స్థితాః పుత్ర మృగయావ్యవహారిణః॥ 25**

**ధాత్ర్యేతి కథితా రామ! బాలకాఖ్యాయికా శుభా।**
**నిశ్చయం స యయౌ బాలో నిర్విచారణయా ధియా 26**

టీ॥ బాలస్య వినోదాయ= చిన్నబిడ్డయొక్క వినోదము కొరకు, ధాత్రీ= బిడ్డలకు పాలిచ్చి పెంచు స్త్రీ, శుభాం కథాం= శుభమగు కథను, వక్తి= చెప్పును. ఆ కథ ఏమనగా! హే మహాబాహో= గొప్ప బాహులు గలవాడా! క్వచిత్= ఒకపుడు, శుభాః= శుభులగు, త్రయః రాజపుత్రాః సన్తి= ముగ్గురు రాజపుత్రు లుండిరి.

వారిలో, ద్వౌ= ఇద్దరు. న జాతౌ= పుట్టని వారు. తథా= అట్లే, ఏకః తు గర్భే ఏవ న స్థితః= మూడవవాడు గర్భమునందుకూడ పడలేదు. తే= వారు. ధర్మయుక్తాః= ధర్మయుక్తులై, అత్యన్త అసతి పత్తనే= అసలే లేనట్టి పట్టణములో, వసన్తి= నివసించుచుండిరి. 23

స్వకీయాత్ శూన్యనగరాత్= లేనట్టి నిజపట్టణము నుండి, విమల, ఆశయాః = స్వచ్ఛమగు భావములు గలవారై నిర్గత్య= బయలుదేరి గచ్ఛన్తః= వెళ్లుచు, గగనే= ఆకాశమునందు, ఫలశాలినః= ఫలములతో శోభించునట్టి, వృక్షా౯ = వృక్షములను, దదృశుః=చూచిరి. 24

తే రాజపుత్రాః త్రయః అపి= ఆ ముగ్గురు రాజపుత్రులును, భవిష్యత్ నగరే= ముందు కట్టనున్నట్టి నగరములో, మృగయా. వ్యవహారిణః= వేటయందు ప్రసక్తులై, అద్య సుఖం స్థితాః= ఇప్పుడు సుఖముగానున్నారు.25

రామ= ఓ రామ, ఇతి= ఈ ప్రకారముగా, ధాత్ర్యా= దాయిచేత, శుభా భాలక, ఆఖ్యాయికా= పిల్లలకు శుభమగు కథ, కథితా= చెప్పబడినది. సః బాలః= ఈ కథను వినిన బాలుడు, నిర్విచారణయా ధియా= విచారము లేని మనస్సుతో, నిశ్చయం యయౌ= కథ నిజమని తలచెను.

తా॥ వి॥ మాటల పొందికను బట్టి పై అఖ్యాయికకు కథారూపము పొసగుచున్నను, అర్థవిచారణముచేయగా సత్యము కానట్లు తేలుచున్నది. అదే విధముగ పైకి సత్యముగా కనపడినను విచారణము మీద జగత్తు సత్యము కాదు. కథ వినిన బాలుని వలె అజ్ఞానులు జగత్తు సత్యమని తలచెదరు.

అ॥ పై ఆఖ్యాయికార్థమును ప్రకృతమున, 'ఇయం' అని సమన్వయము చేయుచున్నారు.

**ఇయం సంసారరచనా విచారోజ్ఝితచేతసామ్।**
**బాలకాఖ్యాయికేవేత్థమవస్థితిముపాగతా॥ 27**

టీ॥ ఇయం సంసారరచనా= ఈ జగత్కల్పన, విచార ఉజ్ఝిత, చేతసాం= విచారహీనమగు మనస్సు గలవారికి, బాలక, అఖ్యాయికా, ఇవ= పిల్లవాని కథవలెనే, ఇత్థం అవస్థితిం= ఈ విధమగు నిలకడను, ఉపాగతా= పొందినది.

అ॥ ఇట్లు మాయాశక్తియొక్క అనిర్విచనీయత్వము (11-12) వైవిధ్యము (13-17) దేశకాలోచితమగు నభివ్యక్తి (18-20) మాయచేత జగత్సర్జనప్రకారము దానివాస్తవము (20-27) వివరింపబడినది. ఇక దాని స్వరూపవర్ణనమును 'ఇతి' అని ప్రారంభించుచున్నారు.

**ఇత్యాదిభిరుపాఖ్యానైర్మాయాశక్తేశ్చ విస్తరమ్।**
**వసిష్ఠః కథయామాస సైవ శక్తిర్నిరూప్యతే॥ 28**

టీ॥ ఇతి, ఆదిభిః, ఉపాఖ్యానైః= ఇది మొదలుగాగల కథలచే, మాయాశక్తేః విస్తరం= మాయాశక్తి యొక్క బాహుళ్యమును, వసిష్ఠః కథయామాస= వసిష్ఠుడు బోధించెను, సా ఏవ శక్తిః= ఆమాయాశక్తియే, నిరూప్యతే= ఇచట నిరూపింపబడును.

అ॥ మాయాశక్తి తన కాశ్రయము తన కార్యము కంటె భిన్నమని 'కార్య' యని చూపుచున్నారు.

**కార్యాశ్రయతశ్చైషా భవేచ్ఛక్తిర్విలక్షణా।**
**స్ఫోటాంగారౌ దృశ్యమానౌ శక్తిస్తత్రానుమీయతే॥ 29**



టీ॥ ఏషా శక్తిః= ఈ మాయాశక్తి, కార్య, ఆశ్రయతః= తన కార్యమగు జగత్తుకంటెను. తన ఆశ్రయమగు బ్రహ్మము కంటెను, విలక్షణా= భిన్నమైనది. ఇచట, దృష్టాన్తము స్ఫోట, అంగారౌ= అగ్నిశక్తి కార్యమగు బొబ్బయు, దాని కాశ్రయమగు అగ్నియు, దృశ్యమానౌ= స్పష్టముగ కనబడుచున్నవి. తత్ర= నిప్పునందు, శక్తిః= దాహకశక్తి, అనుమీయతే= ప్రత్యక్షముగ కనబడక పోయినను, దానికార్యమగు బొబ్బచేత నూహింప బడుచున్నది.

అ॥ అదే ప్రకారము మృచ్ఛక్తిగూడ తనయొక్క కార్యాశ్రయముల కంటె వేఱని 'పృథు' అని చూపుచున్నారు.

**పృథుబుధ్నోదరాకారో ఘటః కార్యోఽత్ర మృత్తికా।**
**శబ్దాదిభిః పఞ్చగుణైర్యుక్తా శక్తిస్త్వతద్విధా॥ 30**

టీ॥ పృథు, బుధ్న ఉదర, ఆకారః= లావు, గుండ్రమునగు ఆకారముగల, ఘటః= ఘటము, కార్యః= మృచ్ఛక్తి యొక్క కార్యము, ఈ మృచ్ఛక్తి ఆశ్రయమగు, మృత్తికా= మృత్తు, పంచీకృతమగు పృథివియొక్క వికార మగుటచేత, శబ్దాదిభిః పంచగుణైః= శబ్దస్పర్శాదిపంచగుణములతో, యుక్తా= కూడినది. శక్తిః తు అతద్విధా= శక్తి ఘటసదృశముకాదు, మృత్స దృశముకాదు. అందుచేత తన కార్యాశ్రయముల రెంటికంటెను భిన్నము. ఈ సందర్భమున రెండవప్రకరణము 47-94 శ్లోకములను చూడవలెను.

అ॥ 'న పృథ్వాదిః' అని వైలక్షణ్యమును ప్రదర్శించుచున్నారు.

**న పృథ్వాదిర్న శబ్దాదిః శక్తావస్తు యథా తథా।**
**అత ఏవ హ్యచిన్త్యైషా న నిర్వచనమర్హతి ॥ 31**

టీ॥ ఘటము నుత్పత్తిచేసిన, శక్తౌ= మృచ్ఛక్తి యందు, పృథు, ఆదిః న = కార్యమగు ఘటము యొక్క లావు గుండ్రము మొదలగు ధర్మములు లేవు. శక్తి కాశ్రయమగు మృత్తుయొక్క ధర్మమగు, శబ్ద, అదిః= శబ్దము మొదలగు పంచధర్మములు, న= లేవు, అట్లయినచో నీ శక్తిస్వరూప మెట్టిది? ఆ స్వరూపము. యథా తథా అస్తు= అది యెట్లగపడుచున్నదో అట్లె ఉండు

గాక! అతః ఏవ= అందువలననే. ఏషా= ఈ శక్తి, అచిన్త్యా= బుద్ధికి అందునదికాదు. కాబట్టి, నిర్వచనం న అర్హతి= దానియొక్క స్వరూప నిరూపణము కుదరదు. ఇచట 2-47-53 శ్లోకములు చూడవలెను.

అ॥ శక్తికిని శక్తి కార్యమునకును భేద మవశ్యము సిద్ధమగుచున్నది. ప్రత్యేకముగా శక్తి ఏల కనబడుట లేదను ప్రశ్నకు కార్యోత్పత్తేః అని సమాధానము చెప్పుచున్నారు.

**కార్యోత్పత్తేః పురా శక్తిర్నిగూఢా మృద్యవస్థితా।**
**కులాలాదిసహాయేన వికారాకారతాం వ్రజేత్॥ 32**

టీ॥ కార్య,ఉత్పత్తేః పురా = కార్యమగు ఘటము. పుట్టుటకు పూర్వము, శక్తిః= ఘటమును పుట్టించ గలశక్తి, మృది= మృత్తునందు, నిగూఢా అవస్థితా= నిగూఢమైయున్నది. కార్యోత్పాదనము తరువాత, కులాలాది, సహాయేన= నిమిత్తకారణమగు కులాలాదుల సహాయముచేత, వికార, ఆకారతాం = కార్యమగు ఘటాదిరూపమును, వ్రజేత్= పొందును.

తా॥ వి॥ కార్యము పుట్టుటకు పూర్వము శక్తి తనకాశ్రయమగు మృత్తునందు నిగూఢమై యున్నది. కార్యోత్పాదనము తరువాత ఘటాదికార్య రూపమునుచెందియున్నది. ఇట్లు శక్తికి ప్రత్యేకవ్యక్తిత్వము లేకుండుటచేత కార్యాశ్రయములకంటె భిన్నముగా నది కనబడనేరదు.

అ॥ శక్తికార్యము శక్తికంటె విలక్షణమనినచో కార్యకారణములకు భేదమవశ్యము సిద్ధమగుచున్నది గదా! ఆ భేదమేల స్ఫురింపదు? అను ప్రశ్నకు 'పృథుత్వ' అని సమాధానము చెప్పుచున్నారు.

**పృథుత్వాదివికారాన్తం స్పర్శాదిం చాపి మృత్తికామ్।**
**ఏకీకృత్య ఘటం ప్రాహుర్విచారవికలా జనాః॥ 33**

టీ॥ విచారవికలాః జనాః= యథార్థమును విచారణ చేయుటకు సమర్థులు కాని యజ్ఞానులు, పృధుత్వ ఆది వికార అన్తం= లావు గుండ్రము మొదలగు రూపము గల కార్యమును, స్పర్శాదిం=స్పర్శాదిగుణరూపమైన, మృత్తికాం చ= కారణమైన మృత్తికను గూడ, ఏకీకృత్య= ఒకటిగా జేర్చి, ఘటం ప్రాహుః= ఘటమని చెప్పుచున్నారు.



తా॥ వి॥ మృత్తు కారణము, ఘటము కార్యము, స్పర్శాదులు కారణగుణము లగుటచే నవి కార్యమునందు గూడ సంక్రమించియే యున్నవి. పృథుబుధ్నోదరాదులు ఘటముయొక్క స్వీయగుణములు. ఈ భేధమును గ్రహించ లేక కార్యకారణగుణములన్నిటిని కలిపి ఘటమని అజ్ఞానులు వాడుచున్నారు కనుక కార్యకారణభేద మగపడుట లేదు.

అ॥ ఇందు కజ్ఞానమే కారణమని నిశ్చయించుటకు గల హేతువును కులాల అని చూపుచున్నారు.

**కులాలవ్యాపృతేః పూర్వం యో మృదశంస్స నో ఘటః।**
**పశ్చాత్తు పృథుబుధ్నాదిమత్త్వే యుక్తా హి కుంభతా॥ 34**

టీ॥ కులాల,వ్యాపృ తేః పూర్వం= కులాలుడు ఘటము చేయ ప్రారంభింపక పూర్వము, యః మృత్, అంశః= ఘటముయొక్క మృద్భాగ మేది కలదో, సః= అది, ఘటః న= ఘటము కాదు. పశ్చాత్, తు= తరువాతనో, పృథుబుధ్నాదిమత్త్వే= లావు వట్రువ కలిగినపుడు, కుంభతా= ఘటమునందు దాని యుపాదానకారణమగు మృత్తు, దాని స్వీయాకార విశేషమగు పృథుబుధ్నాదికము అని రెండంశలు కలవు, కులాలుడు మృత్తున కొక రూపము నిచ్చి తయారుచేసినపుడే దానికి ఘటమను వ్యవహారము కలుగుచున్నది. అంతకు పూర్వ మట్టి వ్యవహారము లేదు. ఇట్టి వ్యవస్థను గమనించ లేకపోవుటచేత రెంటిని కలిపి ఘటమను వ్యవహారము సంభవించుచున్నది.

అ॥ ఇట్లనుటచేత ఘటమునకు పారమార్థికత్వము ఘటిల్లుచున్నది. పారమార్థికమగు ఘటము పారమార్థికము అనిర్వచనీయము 'నగుశక్తి కార్యముగూడ నెటుల కాగలదు?' అనుశంకకు సఘటః అని సమాధానము చెప్పుచున్నారు.

**స ఘటో న మృదో భిన్నో వియోగే సత్యనీక్షణాత్।**
**నాప్యభిన్నః పురా పిండదశాయామనవేక్షణాత్॥ 35**

టీ॥ సః ఘటః= ఆ ఘటము, మృదః=మత్తుకంటె, భిన్నః న=భిన్నము కాదు. ఏలయన! వియోగే సతి= మృత్తు లేనపుడు, అనీక్షణాత్=

ఘటము లేకుండుటచేత; మరియు ఘటము మృత్తుకంటె, అభిన్నః అపి న= భిన్నము కానిది కాదు. ఇందుకు కారణము, పురా= మొదట, పిండదశాయాం= మృత్తు కేవలము ముద్దగానున్నపుడు, అనవేక్షణాత్= ఘట మగపడకపోవుటచే.

తా॥ వి॥ ఘటము మృత్తుకంటె భిన్నమని గాని అభిన్నమని గాని చెప్ప వీలులేదు. మట్టిలేకపోయిన ఘటము లేదు. గనుక ఆ రెంటికిని భేదము లేదనవలెను. మట్టి ముద్దగానున్న కాలములో ఘట మగపడుట లేదు. కనుక రెంటికిని భేదము చెప్పవలెను, కనుక అనిర్విచనీయశక్తి కార్యమగు ఘటము గూడ యనిర్విచనీయమే కాని పారమార్థికము కాదు.

అ॥ 'అతః' అని ఫలితార్థమును చెప్పుచున్నారు.

**అతోఽనిర్విచనీయోఽయం శక్తివత్తేన శక్తిజః।**
**అవ్యక్తత్వే శక్తిరుక్తా వ్యక్తిత్వే ఘటనామభృత్॥ 36**

టీ॥ అతః= అందువలన, అయం= ఈఘటము,అనిర్విచనీయః= నిరూపించుట కసాధ్యము, తేన= ఈ సామ్యము చేత, శక్తిజః= మృత్తునందలి శక్తి వలన పుట్టిన ఘటము, శక్తివత్= శక్తిని పోలినదియే యగును. శక్తితత్కార్యములు రెండు ననిర్వాచ్యము లైనచో, వాని భేదము నిర్ణయించు టెట్లనిన, అవ్యక్త త్వే= కార్యరూపమున నభివ్యక్తము కానపుడు, శక్తిః ఉక్తా= శక్తి యని చెప్పబడుచున్నది. వ్యక్తిత్వే= కార్యరూపమున నభివ్యక్తిమైనపుడు, ఘటనామభృత్= ఘటమను పేరును ధరించును.

అ॥ ఇచట లౌకికదృష్టాంతమును ఐన్ద్రజాలిక యని చూపుచున్నారు.

**ఐన్ద్రజాలికనిష్ఠాఽపి మాయా న వ్యజ్యతే పురా।**
**పశ్చాద్గన్ధర్వసేనాదిరూపేణ వ్యక్తిమాప్నుయాత్॥ 37**

టీ॥ ఐన్ద్రజాలికనిష్ఠా = ఐన్ద్రజాలవిద్యయందున్న, మాయా అపి= మాయ గూడ, పురా= ముందుగా, నవ్యజ్యతే= అభివ్యక్తము గాదు, పశ్చాత్= తరువాత, గన్ధర్వసేనాదిరూపేణ= గంధర్వసేన మొదలగు ఆకారముతో, వ్యక్తిం అప్నుయాత్= అభివ్యక్తమగుచున్నది.



అ॥ ఇట్లు శక్తి తత్కార్యములయొక్క అవాస్తవమును శక్తి కాశ్రయమగు మృత్తు యొక్క వాస్తవమును 'వాచారమ్భణం వికారో నామధేయం, మృత్తికేత్యేవ సత్యం' (ఛాం 6-2-5) అను శ్రుత్యర్థముచే 'ఏవం' అని దృఢపరచుచున్నారు.

**ఏవం మాయామయత్వేన వికారస్యానృతాత్మతామ్।**
**వికారాధారమృద్వస్తుసత్యత్వం చాబ్రవీచ్ఛ్రుతిః॥ 38**

టీ॥ ఏవం= ఈవిధముగా, మాయామయత్వేన= మాయా వికార మగుటచే, వికారస్య అనృతాత్మతాం= కార్యముయొక్క అవాస్తవ స్వరూపమును, వికార, ఆధార, మృత్, వస్తు, సత్యత్వం చ= కార్యమునకు కారణమగు మృత్తుయొక్క వాస్తవత్వమును, శ్రుతిః అబ్రవీత్= శ్రుతిచెప్పెను.

అ॥ 'వాఙ్నిష్పాద్యం' అని ఆ శ్రుత్యర్థము నుదాహరించుచున్నారు.

**వాఙ్నిష్పాద్యం నామమాత్రం వికారో నాస్య సత్యతా,**
**స్పర్శాదిగుణయుక్తా తు సత్యా కేవలమృత్తికా॥ 39**

టీ॥ వాక్ నిష్పాద్యం= కేవలవాక్కుచేత సంపాదింపబడతగినది, నామమాత్రం= పేరు మాత్ర మునికి గలది, వికారః= వికారస్వరూపము. అస్య సత్యతా న= ఇటువంటి దానికి సత్యత్వము లేదు. స్పర్శాదిగుణ యుక్తా= స్పర్శాది గుణవిశిష్టమగు, కేవలమృత్తికా= మృత్తుమాత్రము, సత్యా= సత్యము.

తా॥ వి॥ మృత్తు కారణము, ఘటము కార్యము. మృత్తువాస్తవము, ఘట మవాస్తవము. కారణమగు మృత్తుయొక్క గుణములను కార్యమగు ఘటముయొక్క గుణముల నైక్యముచేసి ఘటమని వ్యవహరింపబడు చున్నది. ఇట్టి ఘటమను నామము కేవలనామమాత్రమే కాని దాని స్వరూపమును మార్చలేదు. మల్లెపుష్పము మరియొక పేరుచే పిలువ బడినను స్వీయమగు స్వచ్ఛత సుగంధము మొదలగు గుణములకు లోపముండదు. రూపము వికారాత్మకము. ఘటము బ్రద్దలుకాగానే ఆ స్వరూపము పోవును. మృత్తొకటియే ఘటము, శరావము మొదలగు వివిధ రూపములను పొంది వివిధనామములచే వర్ణింపబడుచున్నది. వీని యన్నిటి

లోను సత్యమగు పదార్థము మృత్తు. పై వికారములగు నామరూపము లవాస్తవములు. ఇదియే పై నుదాహరింపబడిన వాచారంభణ శ్రుతి తాత్పర్యము.

అ॥ శక్తి తత్కార్యాశ్రయములయొక్క యసత్యత్వ సత్యత్వములకు వ్యక్తావ్యక్తే యని కారణమును చూపుచున్నారు.

**వ్యక్తావ్యక్తే తదాధార ఇతి త్రిష్వాద్యయోర్ద్వయోః,**
**పర్యాయః కాలభేదేన తృతీయస్త్వనుగచ్ఛతి॥** 40

టీ॥ శక్తి యొక్క, వ్యక్తఅవ్యక్తే= వ్యక్తావస్థయు, అవ్యక్తావస్థయు, తత్ ఆధారః=దానియొక్క ఆశ్రయము, ఇతిత్రిషు= అను మూడింటిలో, ఆద్యయోః ద్వయోః= మొదటి రెండగు వ్యక్తావ్యక్తావస్థలకు, కాలభేధేన= విభిన్న కాలముచేత, పర్యాయః= ఒకటి తరువాత నొకటి సంభవించును. తృతీయః= మూడవది యగు ఆశ్రయము, అనుగచ్ఛతి= ఒక దాని తరువాత నొకటిగా సంభవించు వ్యక్తావ్యక్తావస్థల రెంటిని అనువర్తించుచున్నది. వ్యక్తావ్యక్తావస్థ లొకదాని నొకటి వ్యావర్తించుటచేత నవి అవాస్తవములు. మృత్తు ఈ రెంటి ననువర్తించుటచే సత్యము. ఇచట 1-39శ్లోకము చూడవలెను.

అ॥ వాచారంభణశ్రుతిలోని వాచారంభణపదమునకు 'నిస్తత్త్వం' అని యర్థము చెప్పుచున్నారు.

**నిస్తత్త్వం భాసమానం చ వ్యక్తముత్పత్తినాశభాక్।**
**తదుత్పత్తౌ తస్య నామ వాచా నిష్పాద్యతే నృభిః॥** 41

టీ॥ వ్యక్తం= అభివ్యక్తమగుచున్న ఘటాదికార్యజాతము, నిస్తత్త్వా= వాస్తవము కానిది. అయినను, భాసమానం= పైకి ప్రతీయమానమగుచున్నది. ఉత్పత్తినాశభాక్= పుట్టుక వినాశములను బొందినది. తదుత్పత్తౌ= అది పుట్టినపుడు, నృభిః= జనులచేత, తస్య= దానికి, నామ=ఏదో యొక పేరు, వాచా= వాక్కుచేత, నిష్పాద్యతే= సంపాదింపబడుచున్నది.

అ॥ ఉత్పత్తివినాశముల తరువాత గూడ నా వస్తు వా నామముచేతనే వ్యవహరింప బడుచున్నది, కనుక నా వస్తువు శబ్దాత్మకమే అగుచున్నట్లు 'వ్యక్తే' అని చెప్పుచున్నారు.



**వ్యక్తే నష్టేఽపి నామైతన్నృవక్త్రేష్వనువర్తతే,**
**తేన నామ్నా నిరూప్యత్వాద్వ్యక్తం తద్రూపముచ్యతే॥** 42

టీ॥ ఘటాదికము, వ్యక్తే నష్టే అపి= ఉత్పత్తివినాశముల తరువాత గూడ, ఏతత్ నామ= ఈ పేరే, నృవక్త్రేషు= మనుష్యుల నోట, అనువర్తతే= వాడబడుచున్నది. తేన నామ్నా నిరూప్యత్వాత్= ఆపేరు చేతచే తెలియ బడుటచేత, తద్రూపం= ఆ నామమే దాని స్వరూపమని, ఉచ్యతే= చెప్పబడును.

తా॥ వి॥ ఘటమునకు ఘటమని నామము పృథుబుధ్నోదరాది రూపములు కలవు. ఘటనాశాంతర మీ రూపము పోయినను ఘటమను నామము మాత్రము నిలిచి ఆ నామముచేతనే ఘటము వ్యవహరింప బడును. ఇట్లు నామరూపములలో నామము రూపమును వ్యావర్తింపజేసి తా ననువర్తించుచున్నది. గనుక ఘటమను నామమే ఘట స్వరూప మగు చున్నది.

అ॥ అనుమానప్రమాణముచేత ఘటాదికార్యము యొక్క అసత్యత్వ మును 'నిస్తత్త్వాత్' అని నిరూపించుచున్నారు.

**నిస్తత్త్వాద్వినాశిత్వాద్వాచారమ్భణనామతః।**
**వ్యక్తస్య న తు తద్రూపం సత్యం కించిన్మృదాదివత్॥** 43

టీ॥ నిస్తత్త్వాత్= అవాస్తవస్వరూప మగుటచేతను, వినాశిత్వాత్= నశ్వర మగుటచేతను. వాచారంభణనామతః= వాక్కుచేత సంపాదింపబడిన పేరు గలదగుటచేతను, వ్యక్తస్య= అభివ్యక్తమైన ఘటాదికార్యముయొక్క, తద్రూపం= పైకి కనపడుచున్న పృథుబుధ్నోదరాది రూపము, కించిత్ అపి= ఎంతమాత్రముగూడ, మృత్ఇవ= మృత్తువలెన, తు సత్యం= సత్యము మాత్రము కాదు.

తా॥ వి॥ పృథుబుధ్నోదరాదిరూపమగు ఘటకార్యము అవాస్తవము, నిస్తత్త్వమగుటచేత. ఏది యసత్యము కాదో అది నిస్తత్త్వముకాదు, ఇందు కుదాహరణము మృత్తు. ఈ ప్రకారమే యితర కారణములకుగూడ అనుమానరచన చేయదగును.

అ॥ మృదాద్యుపాదానకారణముయొక్క సత్యత్వమును 'వ్యక్తకాలే' యని నిరూపించుచున్నారు.

**వ్యక్తకాలే తతః పూర్వమూర్ధ్వమప్యేకరూపభాక్।**
**సతత్త్వమవినాశం చ సత్యం మృద్వస్తు కథ్యతే॥ 44**

టీ॥ వ్యక్త కాలే= ఘటాదిరూపముచే నభివ్యక్తమైన సమయము నందు, తతః పూర్వం= అంతకు పూర్వము, ఊర్ధ్వం అపి= ఘటనాశనము తరువాతగూడ, ఏకరూపభాక్= ఒకే రూపమును బొందినది, సతత్త్వం= వాస్తవస్వభావము గలది, అవినాశం చ= వినాశము లేనిది, యత్ మృత్ వస్తు= ఏ మృత్తను పదార్థము కలదో, తత్= అది, సత్యం కథ్యతే= సత్యమని చెప్పబడుచున్నది.

తా॥ వి॥ మృత్పదార్థ మాత్మపదార్థమువలె ఏకాకారము, అవినాశి, సతత్త్వము నగుటచేత సత్య మగుచున్నది. ఏకాకారత్వము, ఆవినాశత్వము అను నవి సత్యత్వలక్షణ మని యిచట చెప్పబడుచున్నవి. ఇచట చెప్పబడిన మృత్సత్యత్వము, దాని వికారములగు ఘటాదులరీత్యా నిర్వికారము సత్యమని మాత్రము గ్రహించవలెను. ఆత్మవలె నాత్యంతికమని గ్రహించ కూడదు.

అ॥ సర్పరజతాదిభ్రమస్థలములయందు పైకి కనపడుచున్న సర్పరజతములు భ్రమమాత్రములను జ్ఞానము కలిగిన వెంటనే రజ్జుశుక్త్యాద్యధిష్ఠానము యొక్క యథార్థజ్ఞానము కలుగుచున్నది. అదేప్రకారము ఘట మసత్యమను జ్ఞానము కలిగిన తరువాత ఘటజ్ఞానము పోయి మృత్తుజ్ఞానము కలుగవలెను. కాని ఆప్రకారము కలుగుటలేదు. కనుక ఘటమసత్యమని చెప్పుటకు సాధ్యము కాదను పూర్వపక్షమును 'వ్యక్తం' అని ప్రతిపాదించుచున్నారు.

**వ్యక్తం ఘటో వికారశ్చేత్యేతైర్నామభిరీరితః।**
**అర్థశ్చేదనృతః కస్మాన్న మృద్బోధే నివర్తతే॥ 45**



టీ॥ వ్యక్తం= అభివ్యక్తమైనది, ఘటః= ఘటము, వికారః= వికార స్వరూపము, ఇతి ఏతైః నామభిః= అను నీ పదములచేత, ఈరితః అర్థః= చెప్పబడిన పదార్థము, అనృతః చేత్= అవాస్తవమైన యెడల, మృద్బోధే సతి= కార్యమగు ఘటము వికారస్వరూపము, నామమాత్రము కారణమగు మృత్తు సత్యమను జ్ఞానము కలుగుచుండగా, కస్మాత్= ఏ కారణముచేత ఆ ఘటపదార్థము, న నివర్తతే= నివర్తించదు?

అ॥ 'నివృత్త ఏవ' అని సమాధానమును చెప్పుచున్నారు.

**నివృత్త ఏవ యస్మాత్తే తత్సత్యత్వమతిర్గతా।**
**ఈదృఙ్నివృత్తిరేవాత్ర బోధజా న త్వభాసనమ్॥ 46**

టీ॥ నివృత్తః ఏవ= కార్యమగు ఘట మసత్యము, కారణమగు మృత్తు సత్యమను జ్ఞానము కలుగగానే కార్యమగు ఘటపదార్థముయొక్క జ్ఞానము నశించినదియే యగుచున్నది. యస్మాత్= ఏలన, తత్, సత్యత్వమతిః గతా= ఘటము సత్యమను జ్ఞానము నశించినది. కనుక, అత్ర= ఇట్టి సోపాధికభ్రమస్థలములందు, ఈ దృక్ నివృత్తిః ఏవ= ఇటువంటి జ్ఞాననాశమే, బోధజా= ఘటమసత్యమనుజ్ఞానము వలన కలిగినది. న తు అభాసనం= వస్తువు సంపూర్ణముగా కనపడకుండుట కాదు.

తా॥ వి॥ ఘటమను స్వరూపముచేత పిలువబడుచున్న నొకవస్తు విశేషము నాధారము చేసికొని ఘటజ్ఞానము కలుగుచున్నది. ఆ స్వరూప మసత్యమని తెలిసికొనినపు డాస్వరూపముచే నుత్పన్నమైన జ్ఞానము గూడ అసత్యమని తెలిసి కొందుము. ఇట్టి యసత్యజ్ఞానము కలుగుటకు స్వరూపనాశన మవశ్యముకాదు, ఆరంభపరిణామ కారణములయొక్క కార్యములు కారణముకంటె భిన్నమగు మరియొక స్వరూపమును బొందుచున్నవి. ఇట్టి కారణభిన్నములగు కార్యములే భ్రమవిషయము లగుచున్నవి. వివర్తకారణకార్యములగు సర్పరజతాదిస్థలములందు కార్యము ప్రత్యేకవ్యక్తి రూపమును దాల్చుట లేదు. ఇచట గూడ భ్రమవిషయము కార్యమగు సర్పరజతాదులే. మొదటి రెండు స్థలములందు భ్రమకు ఘటాద్యుపాధులుండుటచేత నచట భ్రమ సోపాధికమగుచున్నది.

మూడవ చోట కారణమే విశేషాకారముతో భాసమగుటజేత నచట భ్రమ నిరుపాధిక మగుచున్నది. కాని యీ మూడుస్థలములందును భ్రమ కధిష్ఠానము మాత్రము సత్యము. ఈ ప్రకారము ఘటాదిసోపాధిక భ్రమ కధిష్ఠానమగు మృదాదులు, సర్పరజతాదినిరుపాధిక భ్రమ కధిష్ఠానమగు రజ్జుశుక్త్యాదులు సత్యములు. ఘట మసత్యమను జ్ఞానము కలుగుటకు ఘటస్వరూపనాశ మవసరము లేదు. ఇంద్రజాలికుని విద్య ప్రత్యక్షముగ కనబడుచున్నను అసత్యమనియే భావించుచున్నాము. అదే ప్రకారము మాయాకార్యమగు జగత్తు భ్రమమాత్రము అసత్యము. ఈ భ్రమ కధిష్ఠానమగు పరబ్రహ్మము సత్యము. ఇంద్రజాలికమువలె జగత్తుకూడ అసత్యమను జ్ఞానము కలుగుటకు దాని స్వరూపనాశన మవసరము లేదు.

అ॥ సోపాధిక భ్రమస్థలమునం దారోపితసత్యత్వజ్ఞాన నివృత్తిచేతనే అభీప్సితార్థసిద్ధి కలుగునని 'పుమా౯' అని చూపుచున్నారు.

**పుమానధోముఖీ నీరే భాతోఽప్యస్తి న వస్తుతః।**
**తటస్థమర్త్యవత్తస్మిన్నైవాస్థా కస్యచిత్ క్వచిత్॥ 47**

టీ॥ పుమా౯= పురుషుడు, నీరే= నీటియందు, అధోముఖీ= తలక్రిందులుగా నున్నటుల, భాతః ఆపి= పైకి కనబడుచున్నను, వస్తుతః న అస్తి= యథార్థముగ తలక్రిందుగాగల మనిషి నీటిలో లేడు. తస్మిన్= అట్టి తలక్రిందుమనిషి యున్నాడనుట యందు, కస్యచిత్= ఎవనికిని, క్వచిత్= ఒకపుడును, తటస్థమర్త్యవత్= ఒడ్డున నున్న మనిషివలె, ఆస్థా= అస్తిత్వబుద్ధి న= లేదు.

అ॥ ఘటాదికార్యము మిథ్య యను జ్ఞానము కలిగినంతమాత్రము చేత నేమి ప్రయోజము కలుగునను ప్రశ్నకు 'ఈదృగ్బోధే' అని సమాధానము చెప్పుచున్నారు.

**ఈదృగ్బోధే పుమర్థత్వం మతమద్వైతవాదినామ్।**
**మృద్రూపస్య పరిత్యాగాద్వివర్తత్వం ఘటే స్థితమ్॥ 48**

టీ॥ ఈదృక్ బోధే= ఇట్టి జ్ఞానమునందే, పుమర్థత్వం= పురుషార్థము, అద్వైతవాదినాం= అద్వైతమతవాదులకు, మతం= అంగీకారము, మృత్ రూపస్య అపరిత్యాగాత్= కార్యమగు, ఘటమునందు, కారణమగు మృత్తు యొక్క రూపము పరిత్యాగము కాకుండుటచేత, ఘటే= ఘటము నందు, వివర్తత్వం= వివర్తకారణము, స్థితం= ఉన్నది. ఇచట 6వ శ్లోకవ్యాఖ్యానము చూడవలెను.



అ॥ మృత్తే ఘటముగా మారుటచేత మృత్పరిణామమే ఘటమని ఏల చెప్పకూడదను ప్రశ్నకు 'పరిణామః' అని సమాధానము చెప్పుచున్నారు.

**పరిణామే పూర్వరూపం త్యజేత్తత్క్షీరరూపవత్।**
**మృత్సువర్ణే నివర్తేతే ఘటకుండలయోర్నహి॥ 49**

టీ॥ పరిణామే= పరిణామకారణమునందు, పూర్వరూపం= కార్యోత్పాదనకు పూర్వమునందున్న రూపము ఏదియో, తత్=దానిని, క్షీరరూపవత్= క్షీరరూపము వలె, త్యజేత్ = పరిత్యజించును. ఘట కుండ లయోః= మృత్సువర్ణకార్యములగు ఘటకుండలములందు, మృత్ సువర్ణే= మృత్సువర్ణములు, న నివర్తేతే= నివర్తించుటలేదు.

అ॥ కుండలస్వరూపము నశించినపుడు, పూర్వసువర్ణ స్వరూపము మిగిలియుండుటచేత సువర్ణము వివర్తమని చెప్పిన చెప్పవచ్చును. ఘటము నశించినపుడు పూర్వపు మృత్స్వరూపము సంభవించుట లేదు గనుక మృత్తువిషయమై వివర్తము చెప్పవీలులేదను, పూర్వపక్షమును 'ఘటే' యని ఉపపాదించుచున్నారు.

**ఘటే భగ్నే న మృద్భావః కపాలానామవేక్షణాత్।**
**మైవం చూర్ణేఽస్తి మృద్రూపం స్వర్ణరూపం త్వతిస్ఫుటమ్॥ 50**

టీ॥ ఘటే భగ్నే సతి= ఘటము బ్రద్దలైనపుడు కపాలానాం అవేక్షణాత్= పెంకు లగుపడుచుండుటచేత, మృద్భావః న =కార్యమగు ఘటము కారణమగు మృద్భావమును వదలకపోలేదు గనుక ఘటమునకు మృత్తు వివర్తకారణము కాదని భావము. ఇందుకు సమాధానము చెప్పుచున్నారు. ఏవం మ= మీరు చెప్పునట్లు కాదు. ఏలన, చూర్ణే= ఘటముయొక్క ముక్కలయందు, మృత్‌రూపం అస్తి= మృత్తుయొక్క స్వరూపము కలదు.

కాని స్పష్టముగా కనబడుటలేదు, స్వర్ణరూపం తు అతిస్ఫుటమ్= కుండల ములు నాశనమైనపుడు స్వర్ణరూపము స్పష్టముగ కనపడుచున్నది.

అ॥ మృత్తుసువర్ణమునకు వలెనే క్షీరమునకు గూడ వివర్తత్వ మేల చెప్పకూడదను శంకకు 'క్షీ రాదౌ' అని సమాధానము చెప్పుచున్నారు.

**క్షీరాదౌ పరిణామోఽస్తు పునస్తద్భావవర్జనాత్।**
**ఏతావతా మృదాదీనాం దృష్టాన్తత్వం న హీయతే॥ 51**

క్షీర, ఆదౌ= క్షీరము మొదలగు వానియందు, పునః= వికార నాశనానంతరము, తద్భావవర్జనాత్= క్షీరభావము వదలి పోయి తిరిగి రాకుండుటచేత. పరిణామః అస్తు= పరిణామము మాత్ర మచట నుండు గాక. ఏతావతా= అంతమాత్రముచేత, మృత్ ఆదీనాం= మృత్తు వర్ణముల, దృష్టాన్తత్వం న హీయతే= వివర్తదృష్టాన్తము లగుటకు తీసిపోవు.

అ॥ మృత్తువర్ణముల కారంభ మేల చెప్పకూడదో 'ఆరంభవాదినః' అని చూపుచున్నారు.

**ఆరంభవాదినః కార్యే మృదో ద్వైగుణ్యమాపతేత్।**
**రూపస్పర్శాదయః ప్రోక్తాః కార్యకారణయోః పృథక్॥ 52**

టీ॥ ఆరంభవాదినః= ఆరంభవాదికి, కార్యే= ఘటాది కార్యము నందు, మృదః= మృత్తునకు, ద్వైగుణ్యం= రెండు విధములగు గుణములు కలిగియుండుట, ఆపతేత్= సంభవించును. కార్యకారణయోః= కార్య కారణముల యందు, రూపస్పర్శాదయః= రూపస్పర్శాదులు, పృథక్ ప్రోక్తాః= వేరు వేరుగా చెప్పబడినది.

తా॥ వి॥ పరమాణువులచే పదార్థము లారంభింపబడుచున్నవి. అదే ప్రకారము దారమువలన వస్త్ర మారంభింపబడుచున్నది, అపుడు దారములు మొదలగునవి కారణాకారముగను కార్యాకారముగను గూడనున్నవి. ఈ నూలుపోగులు వస్త్రాకారమును చెందినపుడు స్వీయగుణములను విడనాడలేదు. కార్యమగు వస్త్రముయొక్క గుణములను గూడ బొందు చున్నవి. కార్యమగు వస్త్రముయొక్క గుణములు కారణమగు నూలుపోగుల



యొక్క గుణములు భిన్నములు. ఇది ఆరంభవాద స్వరూపము. కార్య కారణముల గుణములు భిన్నములు. కారణగుణములే కార్యమునందు ద్విగుణము లగుచున్నవి. ఈ రెండును విరుద్ధవాదములు గనుక మృత్తు వర్ణముల కారంభకత్వము చెప్పవీలులేదు.

అ॥ వివర్తమునకు శ్రుతిప్రసిద్ధమగు దృష్టాంతముల 'మృత్' అని యుదాహరించుచున్నారు.

**మృత్సువర్ణమయశ్చేతి దృష్టాన్తత్రయమారుణిః।**
**ప్రాహాతో వాసయేత్కార్యానృతత్వం సర్వవస్తుషు॥ 53**

టీ॥ ఆరుణిః= ఆరుణకుమారుడగు నుద్దాలకుడు తన కుమారునికి సర్వకార్యానృతత్వము నుపదేశించుచు, మృత్, సువర్ణం, అయః,చ ఇతి= మృత్తు సువర్ణము ఇనుము అను, దృష్టాంతత్రయం ప్రాహ= మూడు దృష్టాంతములను చెప్పెను. అతః= అందువలన, సర్వవస్తుషు= సమస్త వస్తువులయందు, కార్య అనృతత్వం= కార్యముయొక్క అవాస్తవత్వమును, వాసయేత్= అనుసంధానముచేయవలెను.

తా॥ వి॥ యథా సోమ్యైకేన మృత్పిండేన (ఛాం 6-1-4) అను వాక్యము మొదలు కృష్ణాయసమిత్యేవ సత్యం (ఛాం 6-1-6) అను వాక్యాంతము వరకు గల శ్రుతి ఇచట విషయము.

అ॥ కార్యము మిథ్య యని ఏల యనుసంధానము చేయవలెను? అను ప్రశ్నకు 'కారణ' అని సమాధానము చెప్పుచున్నారు.

**కారణజ్ఞానతః కార్యవిజ్ఞానం చాఽపి సోఽవదత్॥ 53 1/2**

టీ॥ కారణజ్ఞానతః= కారణజ్ఞానము వలన, కార్య విజ్ఞానం= కార్యవిజ్ఞానమును గూడ, సః, అవదత్= ఉద్దాలకు డుపదేశించెను.

అ॥ మృత్తువర్ణాదికారణజ్ఞానముచే ఘటకటకాది కార్యజ్ఞాన మెట్లు కలుగు నను ప్రశ్నను 'సత్య' అని చెప్పుచున్నారు.

**సత్యజ్ఞానేఽనృతజ్ఞానం కథమత్రోపపద్యతే॥ 54**

టీ॥ సత్యజ్ఞానే= సత్యమగు కారణము యొక్క జ్ఞానము కలుగుచుండగా, అనృతజ్ఞానం= అసత్యమగు కార్యజ్ఞానము, కథం= ఎట్లు, ఉపపద్యతే= కలుగును?

అ॥ ఇందుకు 'సమృత్కస్య' అని సమాధానము చెప్పుచున్నారు.

**సమృత్కస్య వికారస్య కార్యతా లోకదృష్టితః।**
**వాస్తవోఽత్ర మృదంశోఽస్య బోధః కారణబోధతః॥ 55**

టీ॥ సమృత్కస్య వికారస్య= మృత్తుతో గూడిన ఘటమను వికారమునకు, లోకదృష్టితః= సామాన్యమగు లోకమువాడుకలో, కార్యతా= కార్యభావము కలదు. అత్ర= ఈ ఘటమునందు, మృత్, అంశః= మృద్భాగము, వాస్తవః= నిజమైనది, అస్య బోధః= ఈ వాస్తవాంశయొక్క జ్ఞానము, కారణబోధతః= కారణజ్ఞానమువలన కలుగుచున్నది.

తా॥ వి॥ ఘటమునందు మృదంశ మృత్తునం దారోపింపబడిన పృథుబుధ్నోదరాదిస్వరూప విశేషాంశ అని రెండు భాగములు గలవు. మృదంశ ఘటమునకు కారణము సత్యము. దీనియం దారోపింపబడిన యాకారమ సత్యము. రెండును కలిసి ఘటమని సామాన్యముగ వాడబడుచున్నది. అధిష్ఠానమగు మృత్తుయొక్క జ్ఞానముచే కార్యమగు ఘటమునందలి వాస్తవాంశజ్ఞానము కలుగును.

అ॥ కార్యగతమగు సత్యాంశము వలె యసత్యాంశ గూడ తెలిసికొ తగినదే కదా యను శంకకు 'అనృతాంశః' అని సమాధానము చెప్పుచున్నారు.

**అనృతాంశో న బోద్ధవ్యస్తద్బోధానుపయోగతః।**
**తత్త్వజ్ఞానం పుమర్థం స్యాన్నానృతాంశావబోధనమ్॥ 56**

టీ॥ తత్, బోధ అనుపయోగతః= ఘటము యొక్క అనృతాంశ జ్ఞానమువలన ప్రయోజన మేమియు లేకుండుటచే, అనృత, అంశః, న బోద్ధవ్యః= అనృతాంశము తెలిసికొన తగినది కాదు. తత్త్వజ్ఞానం= వాస్తవవస్తుజ్ఞానము, పుమర్థం స్యాత్= పురుషార్థమగును. అనృత, అంశ, అవబోధనం, న= అనృతాంశావబోధనము పురుషార్థము కాదు.



అ॥ కారణమగు మృత్తుయొక్క జ్ఞానమువలన ఘటముయొక్క వాస్తవాంశయగు మృత్తుయొక్క జ్ఞానము కలుగుచున్నదనుటచే విశేషమేమి కలదను ప్రశ్నను 'తర్హి' యని తెలియజేయుచున్నారు.

**తర్హి కారణవిజ్ఞానాత్కార్యజ్ఞానమితీరితే,**
**మృద్బోధాన్మృత్తికా బుద్ధేత్యుక్తం స్యాత్కోఽత్ర విస్మయః॥ 57**

టీ॥ తర్హి= అట్లయినచో, కారణవిజ్ఞానాత్= కారణజ్ఞానము వలన, కార్య జ్ఞానం ఇతి ఈరితే= కార్యజ్ఞానము కలుగునని చెప్పబడుచుండగా, మృత్ బోధాత్= మృత్తుయొక్క జ్ఞానము వలన, మృత్తికా బుద్ధా ఇతి ఉక్తం స్యాత్= మృత్తిక తెలియబడినదని చెప్పినట్లయినది. అత్ర= ఈస్థితిలో, కః విస్మయః= ఏమి ఆశ్చర్యము కలదు?
అ॥ ఇందుకు 'సత్యం' అని సమాధానము చెప్పుచున్నారు.

**సత్యం కార్యేషు వస్త్వంశః కారణాత్మేతి జానతః।**
**విస్మయో మాఽస్త్విహాజ్ఞస్య విస్మయః కేన వార్యతే॥ 58**

టీ॥ సత్యం= నీవు చెప్పినది నిజమే! కార్యేషు= కార్యములయందు, వస్తు అంశః= పారమార్థికాంశ ఏది కలదో అది, కారణ ఆత్మా ఇతి= కారణస్వరూపమని, జానతః= తెలిసినవానికి, విస్మయః= ఆశ్చర్యము, మా అస్తు= లేకపోవు గాక! ఇహ= ఈ విషయమున, అజ్ఞానస్య= కార్యకారణాంశ విభాగము తెలియని వానికి, విస్మయః= విస్మయము, కేన వార్యతే= ఎవనిచే నివారింపబడగలదు?

అ॥ ఇట్లు కార్యమునందలి సత్యానృతాంశవిభాగజ్ఞానము లేక విస్మయమును పొందిన యజ్ఞులను ఆరమ్భియని పేర్కొనుచున్నారు.

**ఆరమ్భీ పరిణామీ చ లౌకికశ్చైకకారణే।**
**జ్ఞాతే సర్వమతిం శ్రుత్వా ప్రాప్నువంత్యేవ విస్మయమ్॥ 59**

టీ॥ ఆరమ్భీ= ఆరమ్భవాదియగు తార్కికుడు, పరిణామీ= పరిణామవాదియగు సాంఖ్యుడు, లౌకికః= శాస్త్రానభిజ్ఞుడగు పామరుడును, ఏకకారణే జ్ఞాతే= ఒక కారణము తెలిసికొనబడిన దగుచుండగా, 'సర్వమతిం=

సర్వవిజ్ఞానము కలుగునని శ్రుత్వా= విని, విస్మయం ప్రాప్నువంతి ఏవ= విస్మయమును పొందుచునే యున్నారు. ఇచట ఛాందోగ్యము 6-1-3 ఖండము చూడదగును.

అ॥ ఇట్లేకవిజ్ఞానముచేత సర్వవిజ్ఞానసిద్ధి యగుననిబోధించుట యందు శ్రుతితాత్పర్యమును 'అద్వైతే' అని వివరించుచున్నారు.

**అద్వైతేఽభిముఖీకర్తుమేవాత్రైకస్య బోధతః।**
**సర్వబోధః శ్రుతౌ నైవ నానాత్వస్య వివక్షయా॥ 60**

టీ॥ ఏకస్య= సర్వజగత్కారణభూతమగు పరమాత్మ యొక్క, బోధతః= జ్ఞానమువలన, అద్వైతే= అద్వితీయపరబ్రహ్మమునందు, అభిముఖీకర్తుం= సుముఖులనుగా చేయుటకై, అత్ర శ్రుతౌ= ఈ వాచారమ్భణ శ్రుతి (ఛాం 6-1-4) యందు, సర్వబోధః= సర్వకార్యజ్ఞాన ముపదేశింపబడినది. కాని, నానాత్వవివక్షయా ఏవం న= నానారూపమగు ద్వైతమును బోధించు కోరిక చేత నిట్లు చెప్పలేదు.

అ॥ ఇట్లు మృత్సువర్ణాయఃఖండాది వివిధోదాహరణములచేత బోధింపబడిన వాచారమ్భణశ్రుతి యొక్క అర్థమును 'ఏక' యని దార్ష్టాంతికమునందు సమన్వయించుచున్నారు.

**ఏకమృత్పిండవిజ్ఞానాత్ సర్వమృణ్మయధీర్యథా।**
**తథైకబ్రహ్మబోధే న జగద్బుద్ధిర్విభావ్యతామ్॥ 61**

టీ॥ ఏకమృత్ పిండవిజ్ఞానాత్= ఒక మృత్పిండము యొక్కజ్ఞానము వలన, సర్వమృణ్మయధీః= మృద్వికారమగు ఘటాదిసర్వమృద్వస్తుజ్ఞానము, యథా= ఎటులగలుగునో, తథా= అటులనే, ఏకబ్రహ్మబోధేన= అద్వితీయ పరబ్రహ్మజ్ఞానము వలన, జగత్, బుద్ధిః= జగత్తుయొక్క జ్ఞానము కలుగునని, విభావ్యతాం= తలంపబడుగాక.

అ॥ జగత్కార్య మసత్యము గనుక అనపేక్షణీయమను బోధకవశ్యమగు కార్యకారణస్వరూపవివేచనను సచ్చిత్ అని చేయుచున్నారు.



**సచ్చిత్సుఖాత్మకం బ్రహ్మ నామరూపాత్మకం జగత్।**
**తాపనీయే శ్రుతం బ్రహ్మ సచ్చిదానందలక్షణమ్॥ 62**

టీ॥ బ్రహ్మ= పరబ్రహ్మము, సత్, చిత్, సుఖ, ఆత్మకం= సచ్చిదానందస్వరూపము; జగత్, నామ, రూప, ఆత్మకం= జగత్తు నామరూపములు స్వరూపము గాగలది. బ్రహ్మ= బ్రహ్మము, సచ్చిదానంద లక్షణం= సచ్చిదానందములే లక్షణముగా గలదని, తాపనీయే= బహ్మైవేదం సర్వం సచ్చిదానన్దమాత్రం (ఉ.తా.7) అను తాపనీయశ్రుతి వాక్యమునందు, శ్రుతం= వినబడుచున్నది.

**సద్రూపమారుణిః ప్రాహ ప్రజ్ఞానం బ్రహ్మ బహ్వృచః।**
**సనత్కుమార ఆనన్దమేవమన్యత్ర గమ్యతామ్॥ 63**

టీ॥ బ్రహ్మ, సత్‌రూపం= సదేవసోమ్యేదమగ్ర ఆసీత్ (ఛాం 6-2-1) అను వాక్యమునందు సద్రూపమని, ఆరుణిః ప్రాహ= ఆరుణి చెప్పెను. బహ్వృచః= ఋక్శాఖీయులు, ప్రజ్ఞానం బ్రహ్మ= బ్రహ్మ ప్రజ్ఞానమని ఐతరేయ 3-4 వాక్యమున చెప్పిరి. సనత్కుమారః= సనత్కుమారుడు, ఆనందం= భూమ త్వేన విజిజ్ఞాసితవ్యః (ఛాం 7-13-1) అనువాక్యము మొదలు యో భూమా తదమృతం అను వాక్యము చివరవరకు బ్రహ్మ ఆనందమే యని చెప్పెను. ఏవం = ఇదే ప్రకారము, అన్యత్ర= ఆనన్దం బ్రహ్మణో విద్వాన్ (తై 2-4) మొదలగు శ్రుత్యంతరముల యందుగూడ గమ్యతాం= తెలియబడదగును.

అ॥ కారణసత్యత్వ వివరణమువలన కార్యమగు జగత్తు యొక్క యసత్యత్వమును బోధించుటకై, ముందుగ దాని నామరూపాత్మకత్వమును 'విచిత్య' యని శ్రుతిపురస్సరముగ ప్రదర్శించుచున్నారు.

**విచిత్య సర్వరూపాణి కృత్వా నామాని తిష్ఠతి।**
**అహం వ్యాకరవాణీమే నామరూపే ఇతి శ్రుతేః॥ 64**

టీ॥ సృష్టికర్త, సర్వరూపాణి విచిత్య= సమస్తాకారములను పూర్వమున్నటులనే సృజించుటకు ఆలోచించి, నామాని= వాని పేర్లను,

కృత్వా= రచించి, తిష్ఠతి= ఉన్నాడు. సర్వాణి విచిత్యధీరః నామాని కృత్వా ఉ భివదన్ యదాస్తే యను పురుషసూక్తవచన మిచట నభిప్రేతమగు చున్నది. అహం= నేను, ఇమే, నామ, రూపాణి వ్యాకరవాణి= ఈ నామరూపముల నభివ్యక్తము చేయున్నాను, ఇతి శ్రుతేః= అనేన జీవేనాత్మనానుప్రవిశ్య నామరూపే వ్యాకరవాణి (ఛాం 6-3-2) అను శ్రుతివలన తెలియుచున్నది. 23-24 శ్లోకములను చూడవలెను.

అ॥ సృష్టియొక్క నామరూపాత్మకత్వమును బోధించు 'తర్హ్యవ్యాకృత మాసీత్తన్నామరూపాభ్యామేవ వ్యాక్రియతాఉసౌ నామాఉ య, మిదం రూపం (బృ 1-4-7) అనుశ్రుత్యర్థమును 'అవ్యాకృతం' అని పఠించు చున్నారు.

**అవ్యాకృతం పురా సృష్టేరూర్ధ్వం వ్యాక్రియతే ద్విధా।**
**అచిన్త్యశక్తి ర్మాయైషా బ్రహ్మణ్యవ్యాకృతాభిధా॥ 65**

టీ॥ సృష్టేః పురా= సృష్టికి పూర్వము, ఇదం= ఈ జగత్తు, అవ్యాకృతం= అభివ్యక్తము కాకుండెను. ఊర్ధ్వం= సృష్టిసమయమునందు, ద్విధా= నామము రూపమని రెండు విధములుగా, వ్యాక్రియతే= వ్యక్తము చేయబడెను, బ్రహ్మణి= బ్రహ్మయందు, ఏషా అచిన్త్యశక్తిః= బుద్ధికి గోచరము గాని యీశక్తి, మాయా= మాయ, ఆవ్యాకృతఅభిదా= ఆవ్యాకృతమను శబ్దముచే పిలువబడుచున్నది. 2-38 శ్లోకమును చూడవలెను.

అ॥ నామరూపాభ్యామేవ వ్యాక్రియత అను వాక్యమునకు 'అవిక్రియ' యని అర్థము చెప్పుచున్నారు.

**అవిక్రియబ్రహ్మనిష్ఠా వికారం యాత్యనేకథా,**
**మాయాం తు ప్రకృతిం విద్యాన్మాయినం తు మహేశ్వరమ్॥ 66**

టీ॥ అవిక్రియ, బ్రహ్మనిష్ఠా= వికారరహితమగు బ్రహ్మయందు దృఢముగా నున్న మాయ, అనేకథా= అనేక విధములుగా, వికారం యాతి= వికారములను బొందుచున్నది. బ్రహ్మయందు మాయ యున్నదనుటకు ప్రమాణము మాయాంతు అని యుత్తరార్థశ్రుతి, ఈవాక్యము 4-2, 6-123 శ్లోకములలో వివరింపబడినది.ఇచట 2-47-59 శ్లోకములు చూడతగును.



అ॥ జగత్తు కార్యము, అసత్యము, అది కారణము సత్యమునగు అద్వితీయానందమున మాయాశక్తిచేత కల్పింపబడినది. కార్యమునందు సత్యాంశ, అసత్యాంశ రెండును గలవు. కారణమగు సత్యాంశజ్ఞానము వలన కార్యమునందలి యసత్యాంశజ్ఞాన ముపదేశించి అద్వైతమునందాభి ముఖ్యమును కల్పించుటయందే వాచారంభణాదిశ్రుతులు ప్రవర్తించినవి. సచ్చిదానందస్వరూపము పరబ్రహ్మము, నామరూపాత్మకము జగత్తు అని యింతవఱకు బోధింపబడినది. ప్రసక్తాను ప్రసక్తముగ నుపాదానాదికారణ త్రైవిధ్యము మాయాశక్తి తత్కార్యస్వరూపనిరూపణము గూడ చేయబడినది, వాచారంభణశ్రుతిచే నుపదేశింపబడిన ఏకవిజ్ఞానముచే సర్వవిజ్ఞానము సిద్ధించునను నద్వైతసూత్రము నాకాశాదిభూతపంచకమునందును తత్కార్యమగు శరీరములందును సమన్వయముచేసి నచటి వికారాత్మకమగు నసత్యాంశమును త్రోసిపుచ్చగా మిగిలియున్నది సత్యాంశము జగత్కారణ మునగు నద్వితీయానందము మాత్రమే యని బోధించ దలచి 'ఆద్యో వికారః' అని ఆకాశస్వరూపవిచారణ మారంభించుచున్నారు.

**ఆద్యో వికార ఆకాశః సోఉస్తి భాత్యపి చ ప్రియః**
**అవకాశ స్తత్స్వరూపం తన్మిథ్యా న తు తత్త్రయమ్॥ 67**

టీ॥ ఆద్యః వికారః= బ్రహ్మమునందు మాయచేత కల్పింపబడిన మొదటి వికారము, ఆకాశః= ఆకాశము, కార్యమగుటచేత దానియందున్న సత్యాంశ అనృతాంశలను విభాగించి చెప్పుచున్నారు. సః= ఆ ఆకాశము, బ్రహ్మము యొక్క సత్తు చిత్తు ఆనందమను మూడంశలలో, అస్తి= ఉన్నదను సత్వాంశ, భాతి= ప్రకాశించుచున్నదను చిదంశ ప్రియః ఆపి చ= ప్రియము గూడ నగుచున్నదను ఆనందాంశము. త్రయః= ఈమూడును, కారణాంశ ములు. తత్ స్వరూపం= వికారాత్మకమగు దానియొక్క స్వరూపము, అవకాశః= అవకాశదాతృత్వము. కాని, తత్= దాని స్వరూపము, మిథ్యా= అనిర్వచనీయము. తత్ త్రయం తు= అస్తి భాతి ప్రియం అను మూడు మాత్రము, న= మిథ్యకావు. ఇచట 2, 61-69 శ్లోకములను చూడవలెను.

అ॥ అవకాశము మిథ్యయనుటకు న వ్యక్తేః అని యుక్తిని చెప్పు చున్నారు.

**న వ్యక్తేః పూర్వమస్త్యేవ న పశ్చాచ్చాపి నాశతః।**
**ఆదావన్తేచ యన్నాస్తి వర్తమానేఽపి తత్తథా॥** 68

టీ॥ సః= జగద న్తఃపాతి యగు ఆ ఆకాశము, వ్యక్తేః పూర్వం= నామరూపములచేత నభివ్యక్తము గాక పూర్వము, న అస్తి ఏవ= లేనే లేదు. ఏ వస్తువయు, తాను పుట్టక పూర్వము తానుండుట సాధ్యము కాదు. నాశతః పశ్చాత్ చ= ప్రళయమునకు తరువాతను గూడ, న= లేదు. పుట్టిన తరువాతను, నాశనమునకు పూర్వము ఉన్నది గదా; సమాధానము, యత్= ఏ వస్తువు, ఆదౌ అంతే చ= మొదట చివరను, న అస్తి= లేదో, తత్= అది, వర్తమానే అపి= ప్రస్తుతము గూడ, తథా= అదే ప్రకారము లేనట్లే.

తా॥ వి ॥ జగత్తు సృష్టికి పూర్వ మదృష్టము, తరువాత దృష్టము. తరువాత నష్టము, అదృష్ట నష్ట మధ్యగతమగు దృష్టముగూడ నదృష్టమే యగును. 2, 41-42 శ్లోకములలో ప్రస్తావింపబడిన యాకాశనిత్యత్వము న్యాయనయానుసారము.

అ॥ ఇచట అవ్యక్తాదీని అని (2-28) గీతా వాక్యము నుదాహరించుచున్నారు.

**అవ్యక్తాదీని భూతాని వ్యక్తమధ్యాని భారత ।**
**అవ్యక్తనిధనాన్యేవేత్యాహ కృష్ణోఽర్జునం ప్రతి॥** 69

టీ॥ భారత= ఓయర్జునా! భూతాని= ఆకాశాది భూతములు, అవ్యక్త ఆదీని= తెలియబడని ప్రారంభము గలవి. వ్యక్తమధ్యాని= ప్రారంభమునకు నాశనమునకు మధ్యదశయందు తెలియబడినవి. అవ్యక్త, నిధనాని ఏవ= తెలియబడని నాశనము గలవిన్ని అని, కృష్ణః అర్జునం ప్రతి ఆహ= శ్రీకృష్ణ డర్జుననిగూర్చి చెప్పెను.

అ॥ ఆకాశమునందు సచ్చిదానందము లున్నవనుటకు 'మృద్వత్' అని యనుభవ ప్రమాణమును చూపుచున్నారు,

**మృద్వత్తే సచ్చిదానందా అనుగచ్ఛంతి సర్వదా।**
**నిరాకాశే సదాదీనామనుభూతిర్నిజాత్మని॥** 70



టీ॥ మృత్ వత్= కారణమగు మృత్తు కార్యములగు ఘటశరావాదులను వలె, తే సచ్చిదానందాః= ఆ సచ్చిదానందములు మూడును, సర్వదా= ఎల్లపుడును, అనుగచ్ఛంతి= జగత్కార్యమునం దనుస్యూతముగనుండియే యున్నవి. నిరాకాశే= ఆకాశాది జగత్కార్యము మిథ్య యని జ్ఞానము గల్గుచుండగా, నిజ, ఆత్మని= తనయందే, సత్, ఆదీనాం= సత్, చిత్ ఆనందముల యొక్క అనుభూతిః= అనుభవము లేక సాక్షాత్కారము కలుగుచున్నది.

అ॥ ఈ యర్థమును అవకాశే యని విపులము చేయుచున్నారు.

**అవకాశే విస్మృతేఽథ తత్ర కిం భాతి తే వద।**
**శూన్యమేవేతి చేదస్తు నామ తాదృగ్విభాతి హి॥** 71

టీ॥ అవకాశే విస్మృతే= ఆకాశములోని అనృతాంశమగు అవకాశ గుణము మిథ్యయని విస్మరింపబడినదగుచుండగా, అథ= అటుపిమ్మట. తత్ర= అక్కడ, తే కిం భాతి= నీ కేమి స్ఫురించుచున్నదో, వద= చెప్పుము. శూన్యం ఇతి ఏవ చేత్= శూన్యము మాత్రమే అనినచో, అస్తు నామ= శూన్యమే భానమగు గాక! తాదృక్ విభాతి హి= అటువంటిది ప్రకాశించుచున్నది గదా!

తా॥ వి॥ ఆకాశమునందలి అనృతాంశమగు నవకాశగుణమును త్రోసిపుచ్చిన యెడల శూన్యము మాత్రము మిగిలి యున్నదని జన సామాన్యము చెప్పును, శూన్యము ఉన్నది అని చెప్పుటచే అస్తిత్వము భానము రెండును వ్యక్తమగుచున్నవి. అస్తిత్వము సత్తాలక్షణము. శూన్యము అనగా ఏమియు లేకుండుట యని యర్థము కనుక అట్టిపదము సత్తుకు విశేషణము కానేరదు. శూన్యము ఉన్నది యను వాక్యము నందు విశేషముగా నుండతగని శూన్యము అనుశబ్దము పోయినపుడు నిర్వి శేషమగు 'అస్తి' యని మాత్రము మిగులుచున్నది. ఉన్నది యని బుద్ధికి గోచరమగుటచేత భానము గూడ నచట నున్నది. కాబట్టి యాకాశమునందు సచ్చిదానందముల లోని సదంశ భానాంశ రెండునున్నటుల తేలుచున్నది. ఇచట 2ప్రకరణము, 67, 74, 75 శ్లోకములు చూడవలెను.

అ॥ ఆకాశమునందానందాంశమున్నటుల తాదృక్ అని చూపుచున్నారు.

**తాదృక్త్వాదేవ తత్సత్యత్వమౌదాసీన్యేన తత్సుఖమ్।**
**ఆనుకూల్యప్రాతికూల్యహీనం యత్తన్నిజం సుఖమ్॥ 72**

టీ॥ తత్ సత్యత్త్వం= ఆ అస్తిత్వము, తాదృక్త్వాత్ ఏవ= అవకాశాభావముచేత శూన్యమున్నది యని చెప్పుటచేత మాత్రము నిశ్చయింపబడుచున్నవి. సన్మాత్రముండుగాక; అది సుఖస్వరూపమెట్లగును. అను ప్రశ్నకు సమాధానము. తత్= ఆ అస్తిత్వము, ఔదాసీన్యేన= ఉదాసీన భావము చేత, సుఖం= సుఖరూపమగుచున్నది. ఏలయన, యత్= ఏ వస్తువు, ఆనుకూల్యప్రాతికూల్యహీనం= అనుకూలము ప్రతికూలము కాకుండునో, తత్= అది, నిజం సుఖం= నిజమగు సుఖము.

అ॥ ఈ యర్థమునే 'ఆనుకూల్యే' యని వివరించుచున్నారు.

**ఆనుకూల్యే హర్షధీః స్యాత్ప్రాతికూల్యే తు దుఃఖధీ।**
**ద్వయాభావే నిజానన్దో నిజదుఃఖం న తు క్వచిత్॥ 73**

టీ॥ ఆనుకూల్యే= విషయము లనుకూలమై నపుడు, హర్షధీః= సంతోషము, ప్రాతికూల్యే తు= అవి ప్రతికూలమైనపుడు, దుఃఖధీః= దుఃఖము, ద్వయ అభావే= ఈ రెండును లేనపుడు, నిజ, ఆనన్దః= నిజానన్దమును గలుగుచున్నది. నిజదుఃఖం తు= నిజదుఃఖమైతే, క్వచిత్= అపి న= ఒకప్పుడును లేదు.

తా॥ వి॥ ఇచట 11-94-95 శ్లోకములు చూడవలెను. ఇచట నిజానన్దమను శబ్దముచే పరబ్రహ్మము యొక్క ఆనన్దస్వరూపము సామాన్యముగా చెప్పబడినది గాని బ్రహ్మానందమునందలి యవాంతరభేదమగు నిజానందము చెప్పబడదు.

అ॥ నిజానందము నిత్యము ఆనందరూపము నగుటచేత నెల్లప్పుడును హర్షమే యగును. హర్ష మెపుడు ఆనుకూల్యమే యగును గనుక ఆనుకూల్యప్రాతికూల్యవిహీనమైనది నిజానన్దమను లక్షణమసంభవమను పూర్వపక్షమును 'నిజానన్దే' యని పరిహరించుచున్నారు.



**నిజానన్దే స్థిరే హర్షశోకయోర్వ్యత్యయః క్షణాత్।**
**మనసః క్షణికత్వేన తయోర్మానసతేష్యతామ్॥ 74**

నిజానన్దే స్థిరే= నిజానందము నిత్యమైనను, మనసః క్షణికత్వేన= దానిని గ్రహించు మనస్సు క్షణిక మగుటచేత, హర్షశోకయోః= సంతోష వ్యసనములకు, క్షణాత్= క్షణికత్వముచేత, వ్యత్యయః= మార్పు కలుగుచున్నది, తయోః= ఆ సుఖదుఃఖములకు, మానసతా= మానసిక సంబంధము ఇష్యతామ్= అంగీకరింపబడుగాక.

తా॥ వి॥ హర్షము మానసికధర్మముగాని నిజానందధర్మము కాదు. మనస్సు క్షణికముగనుక హర్షము గూడ క్షణికము. అటులనే దుఃఖము గూడ క్షణికమగుచున్నది. విషయాధీనమగు తాత్కాలికసుఖము హర్షము. విషయనిరపేక్షము నిజానందము.

అ॥ ఇట్లాకాశమునందు కారణగతసత్తాభానములు రెండు ననుగమించుచున్నటుల సిద్ధముచేసి యచట ఆనం దానుగమనమును గూడ 'ఆకాశే' యని సిద్ధము చేయుచున్నారు.

**ఆకాశేఽప్యేవమానన్దః సత్తాభానే తు సమ్మతే॥ 74 1/2**

టీ॥ ఏవం= పూరోక్తదృష్టాంతముచేత, ఆకాశే= ఆకాశమునందు, ఆనందః అపి= ఆనందముగూడ అనుగతమగుచున్నవి. సత్తాభాతే సమ్మతే= సత్తాభానములు రెండును అనుగతములైనట్లు సమ్మతమే గదా!

అ॥ ఆకాశమునందువలెనే వాయ్వాదులయందు గూడ సచ్చిదానందము లనుగతములగుచున్నటుల గ్రహింపవలయునని 'వాయ్వాది' అని చెప్పుచున్నారు.

**వాయ్వాది దేహపర్యన్తం వస్తుష్వేవం విభావ్యతామ్॥ 75**

టీ॥ వాయు, ఆది దేహపర్యన్తం= వాయువు మొదలు అగ్ని, జలము, పృథివి, ఓషధులు, అన్నము, శరీరము వఱకు నుండు, వస్తుషు= వస్తువులయందు, ఏవం= ఈ ప్రకారమే, విభావ్యతామ్= కారణాంశములగు సచ్చిదానందము లనుగతము లైనటుల భావింపబడుగాక.

అ॥ వాయ్వాదిభూతచతుష్టయము యొక్క స్వీయగుణములను 'గతిస్పర్శౌ' అని యుదాహరించుచున్నారు.

**గతిస్పర్శౌ వాయురూపం వహ్నేర్దాహప్రకాశనే।**
**జలస్య ద్రవతా భూమేః కాఠిన్యం చేతి నిర్ణయః॥ 76**

**ఆసాధారణ ఆకాశ ఓషధ్యన్నవపుష్యపి,**
**ఏవం విభావ్యం మనసా తత్తద్రూపం యథోచితమ్॥ 77**

టీ॥ గతిస్పర్శౌ= చలనము, స్పర్శలు, వాయురూపం= వాయువు యొక్క రూపము, వహ్నేః= అగ్నికి, దాహప్రకాశనే= దహనము, ప్రకాశము; జలస్య= నీటికి, ద్రవతా= ద్రవత్వము, భూమేః= భూమికి, కాఠిన్యం చ= కాఠిన్యమును, ఇతి నిర్ణయః= అని శాస్త్ర నిర్ణయము.

తా॥ వి॥ వాయ్వాదుల స్వీయగుణములతోపాటు, పూర్వభూత గుణము లుత్తరోత్తర భూతములయందు సంక్రమించినటుల కాఠిన్యం చ యని శబ్దముచే తెలియచేయబడుచున్నది. ఇచట 2-2, 79, 89, 92, 94 శ్లోకములను చూడవలెను.

టీ॥ అసాధారణే ఆకాశే= అసాధరణ ధర్మములు గల ఆకాశము నందును, జీషధీ, అన్న, వపుషిఅపి= జీషధులు, అన్నము, శరీరములయందు తత్, తత్ రూపం= వాని వాని యసాధారణ ధర్మములగు రూపములు, ఏవం= ఇదే ప్రకారము, యథా ఉచితం= ఉచిత ప్రకారముగా, విభావ్యం= తెలిసికొనదగును.

అ॥ అనేకధా యని ఫలితార్థమును తెలియజేయుచున్నారు.

**అనేకధా విభిన్నేషు నామరూపేషు చైకధా।**
**తిష్ఠన్తి సచ్చిదానన్దా విసంవాదో న కస్యచిత్॥ 78**

టీ॥ అనేకధా= అనేకవిధములుగ, విభిన్నేషు నామరూపేషు= విభిన్నములైవ నామరూపములయంధుసత్ చిత్ అనన్దాః= సచ్చిదానందములు మూడును, ఏకధా తిష్ఠన్తి= నియతముగా నున్నవి. ఈ విషయమై, కస్యచిత్= ఎవనికిని, విసంవాదః= అభిప్రాయభేదము, న= లేదు.



తా॥ వి॥ విభిన్నములగుటచేత కొన్నిస్థలములలో మాత్రముండి యితరస్థలములలో నుండని నామరూపములొకదాని నొకటి వ్యావర్తము చేయుటచే నవి యసత్యములు. విభిన్నములగు సర్వపదార్థములయందు ననుగతములగుటచేత సచ్చిదానందములు సత్యములు. ఆన్వయ వ్యతిరేక ములు 1-37లో చూడవలెను.

అ॥ నామరూపము లసత్యములైనను బుద్ధిగోచరము లగుచున్నవి, గనుక 'నిస్తత్త్వే' యని వాని స్వరూపవిచారణ మారంభించుచున్నారు.

**నిస్తత్త్వే నామరూపే ద్వే జన్మనాశయుతే చ తే,**
**బుద్ధ్వా బ్రహ్మణి వీక్షస్వ సముద్రే బుద్బుదాదివత్॥ 79**

టీ॥ నామరూపే ద్వే= నామరూపములు రెండును, నిస్తత్త్వే= కల్పితములు. తే= అవి జన్మనాశయుతే= పుట్టుక, చావుతో కూడి యున్నవి గనుక లేనివే యగుచున్నవి, 68వ శ్లోకము చూడుడు. సముద్రే= సముద్రము నందు, బుద్బుదాదివత్= బుడగలు, తరంగము, నురుగువలె, బ్రహ్మణి= పరబ్రహ్మమునందు, బుద్ధ్వా= బుద్ధిచేత కల్పింపబడినవానిగా, వీక్షస్వ= తెలిసికొనుము.

అ॥ ఇట్లు తెలిసికొనుట వలని ప్రయోజనమును సచ్చిదానంద యని చెప్పుచున్నారు.

**సచ్చిదానన్దరూపేఽస్మిన్ పూర్ణే బ్రహ్మణి వీక్షితే।**
**స్వయమేవావజానాతి నామరూపే శనైః శనైః॥ 80**

టీ॥ అస్మిన్= ఈ, పూర్ణే= సర్వసంపూర్ణమగుటచే నద్వితీయమైన, సత్ చిత్ ఆనందరూపే= సచ్చిదానందరూపమగు, బ్రహ్మణి= బ్రహ్మము, వీక్షితే సతి= తెలిసికొనబడుచుండగా, నామరూపే= కల్పితములగు నామ రూపములను, శనైః శనైః= మెల్ల మెల్లగా, స్వయం ఏవ అవజానాతి= తనంతటతానే ఉపేక్షచేయును.

అ॥ ఇట్టి యవజ్ఞాఫలమును 'యావద్యావత్' అని వర్ణించుచున్నారు.

**యావద్యావదవజ్ఞా స్యాత్తావత్తావత్తదీక్షణమ్।**
**యావద్యావద్వీక్ష్యతే తత్తావత్తావదుభే త్యజేత్॥ 81**

టీ॥ యావత్ యావత్= ఎంతెంతవరకు, అవజ్ఞా స్యాత్= నామ రూపముల యుపేక్ష కలుగునో, తావత్ తావత్= అంతంతవఱకు, తత్, ఈక్షణం= ఆ పరబ్రహ్మను తెలిసికొనుట యగును. యావత్ యావత్= ఎంతెంతవఱకు, తత్ వీక్ష్యతే= ఆ బ్రహ్మము తెలిసికొనబడుచున్నదో, తావత్ తావత్= అంతంతవఱకు, ఉభే= నామారూపములు రెంటిని, త్యజేత్= వదలివేయును.

అ॥ 'తదభ్యాసేన' యని యిట్టి యభ్యాసఫలమును వర్ణించు చున్నారు.

**తదభ్యాసేన విద్యాయాం సుస్థితాయామయం పుమాన్।**
**జీవన్నేవ భవేన్ముక్తో వపురస్తు యథా తథా॥ 82**

టీ॥ తత్ అభ్యాసేన= నామరూపము లసత్యము లని యనవరతము చింతనము చేయుటచేత, విద్యాయాం సుస్థితాయాం= అద్వైతబ్రహ్మ జ్ఞానము స్థిరమగుచుండగా, అయం పుమాన్= ఈ అభ్యాసకుడు, జీవ౯ ఏవ= జీవించియుండగానే, ముక్తః భవేత్= ముక్తుడగును, వపుః= శరీరము, యథాతథా= ఎట్లున్నదో అటులనే, అస్తు= ఉండుగాక.

తా॥ వి॥ ప్రారబ్ధమైన శరీరము భోగాంతమువఱకు నుండుగాక, బ్రహ్మసాక్షాత్కారము చేసికొన్నవాడు శరీరపతనముతో సంబంధము లేకుండగనే జీవన్ముక్తుడగును. 2-102, 7-143, 144, 145 శ్లోకములు చూడవలెను.

అ॥ బ్రహ్మాభ్యాసఫలమును చెప్పి తచ్చింతనం అని దాని స్వరూపమును చెప్పుచున్నారు.

**తచ్చింతనం తత్కథనమన్యోన్యం తత్ప్రబోధనమ్।**
**ఏతదేకపరత్వం చ బ్రహ్మాభ్యాసం విదుర్బుధాః॥ 83**

టీ॥ 7-106 శ్లోకము చూడవలెను.



అ॥ చిరకాలికమగు బ్రహ్మజ్ఞానాభ్యాసమువలన, అనాది యగు ద్వైతవాసన నశించునని 'వాసనా' అని చూపుచున్నారు.

**వాసనాఽనేకకాలీనా దీర్ఘకాలం నిరంతరమ్।**
**సాదరం చాఽభ్యస్యమానే సర్వథైవ నివర్తతే॥ 84**

టీ॥ సాదరం= ఆదరభావముతో, నిరంతరం= ఎల్లపుడు, దీర్ఘకాలం= చిరకాలము, అభ్యస్యమానే= బ్రహ్మాభ్యాసము చేయబడుచుండగా, అనేకకాలీనా అపి= చిరకాలికమైనను, వాసనా= ద్వైతవాసన, సర్వథా= అన్ని విధములను, నివర్తతే ఏవ= తప్పక నివర్తించును.

తా॥ వి॥ ద్వైతమన ప్రపంచము. దీనికి కారణ మజ్ఞానము. ఇది సృష్టికి పూర్వముగూడ నున్నది. ప్రపంచమనాది, గనుక ద్వైతవాసన అనేక కాలీనమని చెప్పబడినది.

అ॥ అద్వితీయమగు పరబ్రహ్మ నానావిధమగు జగత్తు యొక్క కారణమగుటెట్లు సంభవ మను శంకకు 'మృచ్ఛక్తి' యని సమాధాన పరచుచున్నారు.

**మృచ్ఛక్తివద్బ్రహ్మశక్తి రనేకాననృతా౯ సృజేత్।**
**యద్వా జీవగతా నిద్రా స్వప్నశ్చాత్ర నిదర్శనమ్॥ 85**

టీ॥ మృత్‌శక్తివత్= మృత్తునందున్న శక్తి యొకటియే ఘటశరావాద్యనేకవికారములను కల్పించినట్లు, బ్రహ్మ శక్తిః= బ్రహ్మ నాశ్రయించియున్న మాయాశక్తి, అనేకా౯ అనృతా౯ = అనేకములగు నసత్యములను, సృజేత్= కల్పించును. యద్వా= అటుల కాకపోయిన, జీవగతా నిద్రా స్వప్నః చ= జీవుని పొందిన, నిద్రయు స్వప్నము, అత్ర నిదర్శనం= ఇచట దృష్టాంతము.

అ॥ 'నిద్రాశక్తిః' అని నిద్రాదృష్టాంతమును వివరించుచున్నారు.

**నిద్రాశక్తిర్యథా జీవే దుర్ఘటస్వప్నకారిణీ।**
**బ్రహ్మణ్యేషా స్థితా మాయా సృష్టిస్థిత్యన్తకారిణీ॥ 86**

టీ॥ యథా= ఏప్రకారము, నిద్రాశక్తిః= నిద్రాశక్తి, జీవే= జీవుని యందు, దుర్ఘటస్వప్నకారిణీ= స్వశిరశ్ఛేదనము, అతిదూరగమనము మొదలగు నసంభావ్యములైన స్వప్నములను కలుగ చేయుచున్నాదో, తథా= అట్లే, ఏషామాయా= ఈమాయ, బ్రహ్మణి స్థితా= బ్రహ్మయం దుండి, సృష్టి, స్థితి, అంతకారిణీ= జగత్తుయొక్క యుత్పత్తి స్థితి లయములను కల్పించు చున్నది.ఇచట 2-55-59 శ్లోకములు చూడవలెను.

అ॥ 'స్వప్నే' యని పై యర్థమును వివరించుచున్నారు.

**స్వప్నే వియద్గతిం పశ్యేత్స్వ మూర్ధచ్ఛేదనం తథా।**
**ముహూర్తే వత్సరౌఘం చ మృతపుత్రాదికం పునః॥ 87**

టీ॥ మంచమున నిద్రించుచున్న పురుషుడు, స్వప్నే= స్వప్నము నందు, వియత్ గతిం పశ్యేత్= తా నాకాశమునందు, సంచరించుచున్నట్లు కనుగొనును. తథా= అటులనే, స్వమూర్ధచ్ఛేదనం= తన శిరస్సును తానే ఛేదించుకొనుట, ముహూర్తే= ముహూర్తకాలములో, వత్సర ఓఘం= అనేక సంవత్సర సమూహమును, పునః= తిరిగి, మృతపుత్ర ఆదికం=మరణించిన పుత్రాది ప్రియజనము జీవించినట్లుగాను, పశ్యేత్= చూచును.

అ॥ స్వప్నదర్శనమునకు యుక్తాయుక్త వ్యవస్థ చేయసాధ్యముకాదని 'ఇదం' అని చెప్పుచున్నారు.

**ఇదం యుక్తమిదం నేతి వ్యవస్థా తత్ర దుర్లభా।**
**యథా యథేక్ష్యతే యద్యత్తత్తద్యుక్తం తథా తథా॥ 88**

టీ॥ తత్ర= ఆస్వప్నదర్శనమునందు, ఇదం యుక్తం ఇదం న ఇతి వ్యవస్థా= ఇది యుక్తము ఇది అయుక్తమని వ్యవస్థ, దుర్లభా= సాధ్యము కాదు. యత్ యత్= ఏదేది, యథా యథా= ఏ యే రీతిని, ఈక్ష్యతే= చూడబడుచున్నదో, తత్ తత్= అది అది, తథా తథా= అట్లట్లే, యుక్తం= తగినది. ఇచట 2-49 శ్లోకమును పోల్చిచూడవలెను.

తా॥ వి॥ స్వాప్నికవిచిత్రము స్వాప్నికవిచిత్రమువంటిదే కాని దాని పోల్చదగిన మరియొక యుపమానము లేదు.



అ॥ 'ఈదృశః' అని కైముతిక న్యాయముచే మాయాశక్తి యొక్క దుర్ఘటఘటనాసామర్థ్యమును సమర్థించుచున్నారు.

**ఈదృశో మహిమా దృష్టో నిద్రాశక్తేర్యథా తథా।**
**మాయాశక్తేరచిన్త్యోఽయం మహిమేతి కిమద్భుతమ్॥ 89**

టీ॥ నిద్రాశక్తేః= సామాన్యమగు నిద్రాశక్తికే, ఈదృశః మహిమా= ఇట్టి దుర్ఘట ఘటనాసామర్థ్యము, యథా దృష్టా= ఏ విధముగా కనపడు చున్నదో, తథా= అదేవిధముగా, మాయాశక్తేః= మాయాశక్తియొక్క, అచిన్త్యః అయం మహిమా ఇతి= బుద్ధికందరాని యిట్టి మహిమ కలదనిన, కిం అద్భుతం= ఏమి యాశ్చర్యము!

అ॥ అద్భుతదుర్ఘటకారిణి యగు మాయాశక్తి బ్రహ్మయం దనేక వికారములను కల్పించుచున్నదని 'శయానే' అని చెప్పుచున్నారు.

**శయానే పురుషే నిద్రా స్వప్నం బహువిధం సృజేత్।**
**బ్రహ్మణ్యేవం నిర్వికారే వికారాన్ కల్పయత్యసౌ॥ 90**

టీ॥ శయానే పురుషే= పరుండియున్న పురుషునియందు, నిద్రా= నిద్రాశక్తి, బహువిధం స్వప్నం= అనేకవిధములగు స్వప్నములను, సృజేత్= సృష్టించును, ఏవం= ఇటులనే, నిర్వికారే బ్రహ్మణి= వికారహితమగు పరబ్రహ్మమునందు, అసౌ= ఈ మాయాశక్తి, వికారాన్ కల్పయతి= వికారములను కల్పించును.

అ॥ మాయాకల్పితసృష్టిని 'ఖానిల' అని వర్ణించుచున్నారు.

**ఖానిలాగ్నిజలోర్వ్యండలోకప్రాణిశిలాదికాః।**
**వికారాః ప్రాణిధీష్వన్తశ్చిచ్ఛాయాప్రతిబిమ్బితాః॥ 91**

టీ॥ ఖ, అనిల, అగ్ని, జల, ఉర్వీ, అండ, లోక, ప్రాణి, శిలా, ఆదికాః= అకాశము, వాయువు, అగ్ని, జలము, పృథ్వి, బ్రహ్మాండము, సత్యాది లోకములు, జీవరాసులు, శిలలు ఉద్భిజ్జము, అండజము, స్వేదజము, మొదలగు, వికారాః= వికారములు మాయాకల్పితములు ప్రాణిధీషు= చేతనములయందలి బుద్ధులయందు, అన్తః= లోన, చిత్= చైతన్యము యొక్క, ఛాయా ప్రతిబింబితాః= ప్రతిఫలించుచున్నవి.

తా॥ వి॥ మానుషబుద్ధి సాక్షిచిదాభాసు లుభయులచే భాసింపబడు చున్నది. (8-14శ్లోకముచూడుడు) గనుక మనుష్యులయందు చేతనత్వము స్పష్టముగ కనపడుచున్నది. పశ్వాదీతరప్రాణులయందన్తఃకరణము మనుజులయందువలె నంత స్పష్టముగ కనపడదు. వృక్షాదులయం దది మరింత యస్పష్ట మగుచున్నది. శిలాదులయం దంతకంటె నది యస్పష్టము. వృక్షశిలాదులయందు చైతన్య మస్పష్టమగుటచే నవి యచేతనములని సామాన్యముగ వాడబడుచున్నవి. చైతన్య వ్యాప్తిలేని వస్తువు ప్రపంచమునం దెచటను లేదు. వృక్షములకు అన్తఃకరణము కలదనియు, మనకువలెనే వానికిని సుఖదుఃఖానుభవము కలదని బోస్‌మహాశయుడు ప్రదర్శించెను. సుఖదుఃఖానుభవము చిదాభాసలక్షణము. శాకాదులను తరిగినపుడు వానికి కలుగుచున్న హింసకైన ప్రాయశ్చిత్తము కొరకు వైశ్వదేవ మేర్పడినది. శిలాదులు పెరుగుచున్నవని యా శాస్త్రజ్ఞులు చెప్పుచున్నారు. గనుక అచేతనమను పదార్థములేదు. అన్తఃకరణము స్పష్టముగా భాసించ కుండుటచే వృక్షాదులు జడము లనవలసియుండును. 6-187 శ్లోకము చూడుడు.

అ॥ లోకములోని చేతనాచేతనవిభాగము చైతన్యము యొక్క భావాభావములను బట్టిగదా చేయబడినదను శంకకు 'చేతనా' యని సమాధానము చెప్పుచున్నారు.

**చేతనాచేతనేష్వేషు సచ్చిదానన్దలక్షణమ్।**
**సమానం బ్రహ్మ భిద్యేతే నామరూపే పృథక్ పృథక్॥ 92**

టీ॥ చేతనఅచేతనేషు= చేతనములని అచేతనములని వ్యవహరింప బడుచున్న యీ యనేకపదార్థములయందు, సత్ చిత్, ఆనందలక్షణం బ్రహ్మ సమానం= సచ్చిదానందములు లక్షణముగాగల బ్రహ్మ సమానమే. నామరూపే= నామరూపములు మటుకు, పృథక్ పృథక్ భిద్యేతే= విడివిడిగా భిన్న మగుగాక!

అ॥ నామరూపాత్మకమగు జగత్తు యొక్క కల్పనకాధారమగు బ్రహ్మమును గ్రహించు మార్గమును 'బ్రహ్మణి' అని చూపుచున్నారు.



**బ్రహ్మణ్యేతే నామరూపే పటే చిత్రమివ స్థితే।**
**ఉపేక్ష్య నామరూపే ద్వే సచ్చిదానన్దధీర్భవేత్॥ 93**

టీ॥ పటే చిత్రం ఇవ= వస్త్రమునందు చిత్తరువువలె (6-67), ఏతే నామరూపే= ఈ నామరూపములు, బ్రహ్మణి= బ్రహ్మమునందు, స్థితే= ఆరోపింపబడియున్నవి. ద్వే నామరూపే= నామరూపముల రెంటిని, ఉపేక్ష్య = ఉపేక్షించినపుడు, సత్, చిత్, ఆనంద ధీః భవేత్= సచ్చిదానన్దబుద్ధి కలుగును.

ఇ॥ ఇచట 'జలస్థే' యని దృష్టాంతము నిచ్చుచున్నారు.

**జలస్థేఽధోముఖే స్వస్య దేహే దృష్టేఽప్యుపేక్ష్య తమ్,**
**తీరస్థ ఏవ దేహే స్వే తాత్పర్యం స్యాద్యథా యథా॥ 94**

టీ॥ స్వస్య దేహే= గట్టుననున్న తనయొక్క దేహము, జలస్థే అధోముఖే దృష్టే అపి= జలమునం దధోముఖముగా ప్రతిఫలించి కనపడుచున్నను, తం= ఆ ప్రతిబింబితశరీరమును, ఉపేక్ష్య= ఉపేక్ష్యచేసి, తీరస్థే ఏవ స్వే దేహే= గట్టున సహజమైన స్థితిలోనున్న శరీరమునందే, యథా తాత్పర్యం స్యాత్= బుద్ధి యేవిధముగా కలుగునో, తథా= అట్లె.

అ॥ సహస్రశో' అని మరియొక దృష్టాంతము నిచ్చుచున్నారు.

**సహస్రశో మనోరాజ్యే వర్తమానే సదైవ తత్।**
**సర్వైరుపేక్ష్యతే యద్వదుపేక్షా నామరూపయోః॥ 95**

టీ॥ సదా= ఎల్లపుడు, మనోరాజ్యే= మనోరాజ్యము, సహస్రశః= అనేకవిధముల, వర్తమానే= ఉన్నను, తత్= అది, సర్వైః= అందరిచేతను, యద్వత్ ఉపేక్ష్యతే= ఏవిధముగ నుపేక్షింపబడుచున్నదో, అటుల నే నామరూపయోః= నామరూపములయొక్క ఉపేక్షా= ఉపేక్ష చేయదగును.

అ॥ ఈ యర్థమునే 'క్షణే క్షణే' యని విశదము చేయుచున్నారు.

**క్షణేక్షణే మనోరాజ్యం భవత్యేవాన్యథాఽన్యథా।**
**గతం గతం పునర్నాస్తి వ్యవహారో బహిస్తథా॥ 96**

టీ॥ మనోరాజ్యం= కేవల కల్పితములగు మనోరథములు, క్షణే క్షణే= ప్రతిక్షణము, అన్యధా అన్యధా భవతి ఏవ= అనేకవిధము లగుచుండును. గతం గతం ఏవ= గతించినది గతించినది, పునః న అస్తి= తిరిగి కలుగదు. బహిః వ్యవహారః అపి= మనస్సుకు బాహ్యమగు ప్రపంచమునందలి వ్యవహారముగూడ, తథా= మనోరాజ్యమువలెనే అనేక విధము లగుచు గతమగునది గతమే యగును గాని తిరిగి రానేరదు.

అ॥ 'గతం గతం' అను దాని యర్థమును 'నబాల్యం' అని వివరించుచున్నారు.

**న బాల్యం యౌవనే లబ్ధం యౌవనం స్థావిరే తథా।**
**మృతః పితా పునర్నాస్తి నాఽయాత్యేవ గతం దినమ్॥ 97**

టీ॥ బాల్యం= గడచిపోయిన బాల్యము, యౌవనే న లబ్ధం= యౌవనమునందు రానేరదు. తథా= అటులనే, యౌవనం= గడచిపోయిన యౌవనము, స్థావిరే= వార్ధక్యమున తిరిగి రాదు. మృతః పితా= చనిపోయిన తండ్రి, పునః న అస్తి= తిరిగి రాడు. గతం దినం= గడచిపోయిన రోజు, న ఆయాతి ఏవ= రానే రాదు.

అ॥ వ్యవహార మనోరాజ్యముల కేమియు భేదము లేదని 'మనోరాజ్యాత్' అని చెప్పుచున్నారు.

**మనోరాజ్యాద్విశేషః కః క్షణధ్వంసిని లౌకికే॥ 97 1/2**

టీ॥ క్షణధ్వంసిని లౌకికే= క్షణకాలములోనశించెడు వ్యవహారము నందు, మనోరాజ్యాత్= మనోరాజ్యముకంటె, విశేషః కః= ఏమి విశేషము కలదు.

అ॥ కనుక లౌకిక మసత్యమని వదలివేయతగునని అతః అని బోధించుచున్నారు.

**అతోఽస్మిన్ భాసమానేఽపి తత్సత్యత్వధియం త్యజేత్॥ 98**



టీ॥ అతః= వ్యవహార మసత్యము గనుక, అస్మిన్ భాసమానే అపి= ద్వైతము భానమగుచున్నను, తత్, సత్యత్వధియం= అది నిజమను బుద్ధిని, త్యజేత్= వదలివేయవలెను.

అ॥ ఇట్లు ద్వైతావజ్ఞచే గలుగు ఫలమును ఉపేక్షి తే యని వర్ణించుచున్నారు.

**ఉపేక్షితే లౌకికే ధీర్నిర్విఘ్నా బ్రహ్మచిన్తనే।**
**నటవత్ కృతిమాస్థాయ నిర్వహత్యేవ లౌకికమ్॥ 99**

టీ॥ ఈ విధముగా, లౌకికే ఉపేక్షితే= ద్వైత ముపేక్షింప బడుచుండగా, ధీః= చిత్తము, బ్రహ్మచింతనే= బ్రహ్మవిచారమునందు, నిర్విఘ్నా= ఆతంకము లేనిదగును. నటవత్= నటకునివలె, లౌకికం కృతిం= వ్యావహారిక కార్యక్రమమును, ఆస్థాయ= పొంది, నిర్వహతి ఏవ= దానిచే లిప్తుడు కాక నిర్వహించును.

అ॥ ఇట్టి కృత్రిమవ్యవహారముచే జ్ఞాని లిప్తుడుకాడని 'ప్రవహత్యపి' అని చూపుచున్నారు.

**ప్రవహత్యపి నీరేఽధః స్థితా ప్రౌఢశిలా యథా।**
**నామరూపాన్యథాత్వేఽపి కూటస్థం బ్రహ్మ నాన్యథా॥ 100**

టీ॥ నీరే ప్రవహతి అపి= పైగా నీరు ప్రవహించుచున్నను, అధః ప్రౌఢశిలా= అడుగున స్థిరముగా నున్న రాతిబండ, యథా స్థిరా= ఏటుల స్థిరముగా నుండునో, అటులనే నామ, రూప, అన్యథాత్వే అపి= నామరూపములు వికారములు అసత్యము లైనను, కూటస్థం బ్రహ్మ= నిర్వికారమగు బ్రహ్మము, అన్యథా న= మరియొకవిధము కానేరదు.

అ॥ మిథ్యాభూతమగు జగత్తు బ్రహ్మయందు ప్రతీయమాన మగుచున్న విధమును నిశ్ఛిద్రే యని వర్ణించుచున్నారు.

**నిశ్ఛిద్రే దర్పణే భాతి వస్తుగర్భం బృహద్వియత్।**
**సచ్చిద్ఘనే తథా నానాజగద్గర్భమిదం వియత్॥ 101**

టీ॥ నిశ్ఛిద్రే= అడుగున దట్టముగా పాదరసము పూత పూయబడిన, దర్పణే= అద్దమునందు, వస్తుగర్భం= అనేక వస్తువులు గర్భమందున్నట్టి, బృహత్ వియత్= మహాకాశము, భాతి= ప్రతిఫలించి ప్రకాశించుచున్నది, తథా= అదేవిధముగ, సత్ చిత్ ఘనే= సచ్చిద్ఘనస్వరూపమగు బ్రహ్మము నందు, నానాజగద్గర్భం = అనేకజగములు గర్భమునందుగల, ఇదం వియత్= ఈ చిదాకాశము ప్రకాశించును.

అ॥ నామరూపములను గ్రహించుటకూడ సచ్చిదానంద వీక్షణ మవశ్యమని 'అదృష్ట్వా' అని చూపుచున్నారు.

**అదృష్ట్వా దర్పణం నైవ తదన్తరస్థేక్షణం తథా,**
**అమత్వా సచ్చిదానన్దం నామరూపమతిః కుతః॥** 102

టీ॥ దర్పణం అదృష్ట్వా= అద్దమును చూడకుండ, అన్తరస్థ, ఈక్షణం= దానియందున్న ప్రతిబింబమును చూచుట న ఏవం= సంభవించదు. తథా= అటులనే సచ్చిదానన్దం అమత్వా= సచ్చిదానన్దస్వరూపమును గుర్తెఱుంగక, నామరూపమతిః= నామరూపజ్ఞానము కుతః= ఎట్లుకలుగును.

అ॥ జగత్తునందు నామరూపములు ప్రతీయమానము లగు చుండగా నిర్విషయమగు పరబ్రహ్మ జ్ఞానమెటుల కలుగునను ప్రశ్నకు 'ప్రథమం' అని సమాధానము చెప్పుచున్నారు.

**ప్రథమం సచ్చిదానందే భాసమానేఽథ తావతా।**
**బుద్ధిం నియమ్య నైవోర్ధ్వం ధారయేన్నామరూపయోః॥** 103

టీ॥ ప్రథమం= మొదట, సచ్చిదానందే భాసమానే సతి= సచ్చిదానంద స్వరూపమగు పరబ్రహ్మము ప్రకాశించుచుండగా, అథ= తరువాత, తావతా= సచ్చిదానందస్వరూపమునందు మాత్రమే, బుద్ధిం నియమ్య= బుద్ధిని నిరోధించి, ఊర్ధ్వం= అటుపిమ్మట, నామరూపయోః= కల్పితములగు నామ రూపములయందు బుద్ధిని, న ధారయేత్ ఏవ= ధారణచేయగూడదు.

అ॥ ప్రకరణఫలమును ఏవం చ అని చెప్పుచున్నారు.



**ఏవం చ నిర్జగద్బ్రహ్మ సచ్చిదానన్దలక్షణమ్,**
**అద్వైతానన్ద ఏతస్మిన్ విశ్రామ్యన్తు జనాశ్చిరమ్॥** 104

టీ॥ ఏవం= ఈ ప్రకారము, సచ్చిదానన్దలక్షణం= సచ్చిదానన్దస్వరూప మగు పరబ్రహ్మము, నిర్జగత్= నిరసింపబడిన ద్వైతము గలది. ఏతస్మిన్ అద్వైత, ఆనందే= ఈ అద్వైతానందమునందు, జనాః= ముముక్షువులు చిరం= చిరకాలము, విశ్రామ్యన్తు= విశ్రమింతురు గాక.

అ॥ 'బ్రహ్మానన్దాభిధే' అని ప్రకరణము నుపసంహరించుచున్నారు.

**బ్రహ్మానన్దాభిధే గ్రన్థే తృతీయోఽధ్యాయ ఈరితః।**
**అద్వైతానన్ద ఏవ స్యాజ్జగన్మిథ్యాత్వచిన్తయా॥** 105

టీ॥ బ్రహ్మ, ఆనంద, అభిధే= బ్రహ్మానందమను పేరు గల ఈ గ్రంథమునందు, తృతీయః అధ్యాయః= మూడవ అధ్యాయము, ఈరితః= చెప్పబడినది. జగత్, మిథ్యాత్వ, చిన్తయా= జగత్తు మిథ్యయని భావించుట చేత సమస్త ద్వైతము ధ్వస్త మగుచుండగా, అద్వైత, ఆనందః ఏవ= ప్రపంచము లేకపోవుటచేత నిర్విషయము పరిపూర్ణము నగు ఆనందమే, స్యాత్= చిత్తమునందు భాసించును.

శ్రీభారతీసంప్రదాయసార్వభౌమ, జగద్గురు శ్రీకళ్యాణానంద
భారతీమహాచార్యాత్యన్త ప్రియాన్తేవాసియు, అత్రి
గోత్ర సముద్భూతుడును, ఉభయకులపవిత్రుడును
నగు లింగన సోమయాజిచే విరచిత
మగు వేదాంతపంచదశి కళ్యాణామృత
మను ఆంధ్రవ్యాఖ్యాసమేతమగు
బ్రహ్మానందమునందు అద్వైతానందము
సంపూర్ణము.

*-*-*

శ్రీ గురుభ్యో నమః

# శ్రీమదాంధ్ర వేదాన్తపంచదశి

## కళ్యాణామృత వ్యాఖ్యాసమేతము

### * 14 బ్రహ్మానందము - విద్యానంద ప్రకరణము *

అ॥ యోగానన్ద ప్రకరణారంభమున నుదాహరింపబడిన విద్యానన్ద స్వరూప మిచట 'యోగేన' అని విస్తరించుచున్నారు.

**యోగేనాత్మవివేకేన ద్వైతమిథ్యాత్వచిన్తయా ।**
**బ్రహ్మానన్దం పశ్యతోఽథ విద్యానన్దో నిరూప్యతే॥ 1**

టీ॥ యోగేన= సమాధిచేత, ఆత్మవివేకేన= ఆత్మవివేచనచేత, ద్వైత మిథ్యాత్వచిన్తయా= ద్వైతము మిథ్యయను చింతనముచేతను, బ్రహ్మానందం పశ్యతః = బ్రహ్మానందము ననుభవించువానికి, అథ= అటు తరువాత, విద్యానందం= విద్యానందము, నిరూప్యతే= నిర్వచింపబడును.

తా॥ వి॥ దుఃఖసంయోగవియోగము యోగమని 11-107 శ్లోకమున నిర్వచింపబడినది. ఇచట 107-11 2శ్లోకములు చూడవలెను. పై మూడు విశేషణములచేత, యోగానందము ఆత్మానందము అద్వైతానందములు సంక్షేపముగ నుదాహరింపబడుచున్నవి.

అ॥ విషయానందవత్ అని విద్యానందస్వరూపమును విశదము చేయుచున్నారు.

**విషయానన్దవద్విద్యానన్దో ధీవృత్తి రూపకః।**
**దుఃఖాభావాదిరూపేణ ప్రోక్త ఏష చతుర్విధః॥ 2**

టీ॥ విషయ, ఆనన్దవత్= విషయానన్దము వలెనే, విద్యా, ఆనన్దః= విద్యానన్దము, ధీవృత్తి రూపకః= మనోవృత్తివిశేషము, ఏషః= ఇది, దుఃఖ, అభావ, ఆదిరూపేణ= దుఃఖాభావము మొదలగు రూపము చేత, చతుర్విధః ప్రోక్తః= నాలుగు విధములుగ చెప్పబడినది.

అ॥ 'దుఃఖాభావశ్చ' అని నాలుగు విధముల నుదాహరించు చున్నారు.



**దుఃఖాభావశ్చ కామావాప్తిః కృతకృత్యోఽహమిత్యసౌ।**
**ప్రాప్తప్రాప్యోఽహమిత్యేవం చాతుర్విధ్యముదాహృతమ్॥ 3**

టీ॥ దుఃఖ, అభావః= దుఃఖము లేక పోవుట, కామ, అవాప్తిః= కోరికను పొందుట, కృతకృత్యః= కృతకృత్యుడు, ప్రాప్తప్రాప్యః= పొందదగినది పొందినవాడు, ఇతి ఏవం= ఈరీతిగా, అసౌ= ఈవిద్యానందము, చాతుర్విధ్యం ఉదాహృతం = నాలుగు విధములుగా నుదాహరింపబడినది 7-32 శ్లోకములు చూడవలెను.

అ॥ తృప్తిదీపము 34 శ్లోకములో నుదాహరింపబడిన సప్తావస్థలలో నొకటియగు దుఃఖాభావము 46 శ్లోకములో సామాన్యముగ నుదాహరింప బడినది. దాని నిచట 4-17 శ్లోకములలో విస్తరింపదలచి మున్ముందు 'ఐహికం' అని దుఃఖముయొక్క ద్వైవిధ్యమును చూపుచున్నారు.

**ఐహికం చాముష్మికం చేత్యేవం దుఃఖం ద్విధేరితమ్।**
**నివృత్తిమైహికస్యాఽఽహ బృహదారణ్యకం వచః॥ 4**

టీ॥ దుఃఖం= దుఃఖము, ఐహికం అముష్మికం చ= ఇహలోక సంబంధమైనదని, పరలోకసంబంధమైనదని, ద్విధాఈరితం= రెండు విధము లుగా చెప్పబడినది. ఐహికస్యనివృత్తిం= ఐహికదుఃఖనివృత్తిని గూర్చి, బృహదారణ్యకం వచః= బృహదారణ్యకశ్రుతి, ఆహ= చెప్పెను.

అ॥ 'ఆత్మానంచేత్' అను నాశ్రుతిని ఉదాహరించుచున్నారు.

**ఆత్మానం చేద్విజానీయాదయమస్మీతి పూరుషః।**
**కిమిచ్ఛన్ కస్య కామాయ శరీరమను సంజ్వరేత్॥ 5**

టీ॥ ఈ శ్రుతి 7-1 శ్లోకమున వివరింపబడినది,

అ॥ ఆత్మయొక్క భోక్తృత్వ సంబంధమును వివరించుటకై 'జీవాత్మ' యని వాని భేదము నుదాహరించుచున్నారు.

**జీవాత్మా పరమాత్మా చేత్యాత్మా ద్వివిధ ఈరితః।**
**చిత్తాదాత్మ్యాత్త్రిభిర్దేహైర్జీవః సన్ భోక్తృతాం వ్రజేత్॥ 6**

టీ॥ ఆత్మా= ఆత్మ, జీవ ఆత్మా, పరమ, ఆత్మా= జీవాత్మ పరమాత్మ యని, ద్వివిధః ఈరితః= రెండు విధములుగ చెప్పబడుచున్నాడు. త్రిభిః దేహైః = స్థూలసూక్ష్మకారణశరీరముల మూడింటితోను, చిత్ తాదాత్మ్యాత్= ప్రత్యగాత్మ ఐక్యమగుచున్నాడను భ్రమవలన, ప్రత్యగాత్మ, జీవః సన్= జీవత్వమును పొందినవాడై, భోక్తృతాం వ్రజేత్= భోక్తృత్వమును పొందుచున్నాడు. ఇచట 7-4 శ్లోకము చూడుడు.

అ॥ పరమాత్మా యని పరమాత్మస్వరూపమును చెప్పుచున్నారు.

**పరమాత్మా సచ్చిదానన్దస్తాదాత్మ్యం నామరూపయోః।**
**గత్వా భోగ్యత్వమాపన్నస్తద్వివేకే తు నోభయమ్॥** 7

టీ॥ పరమాత్మా= పరమాత్మ, సచ్చిదానన్దః= సచ్చిదానన్ద స్వరూపుడు, నామరూపయోః తాదాత్మ్యం= నామరూపములతో నైక్యమును గత్వా= పొంది, భోగ్యత్వం ఆపన్నః= భోక్తృత్వమును పొందినాడు. తద్వి వేకేతు= పరమాత్మను, జగత్తునుంచి శరీరత్రయమునుంచి వివేచన చేయగా, ఉభయం న= భోక్తృత్వము, భోగ్యజాతము, ఈ రెండును లేవు.

అ॥ 'భోగ్యం' అని దీనియర్థమును వివరించుచున్నారు.

**భోగ్యమిచ్ఛన్ భోక్తురర్థే శరీరమనుసంజ్వరేత్।**
**జ్వరాస్త్రిషు శరీరేషు స్థితా న త్వాత్మనో జ్వరాః॥** 8

టీ॥ భోక్తుః అర్థే= భోక్తయొక్క ప్రయోజనము కొఱకు, భోగ్యం ఇచ్ఛన్ = భోగ్యజాతమును కోరుచు, శరీరం అనుసంజ్వరేత్= శరీరమును భోగేచ్ఛానుసారముగ ననుతపింపజేయును. జ్వరాః= జ్వరములు, త్రిషు శరీరేషు= శరీర త్రయమునందు గలవు, జ్వరాః= ఈ జ్వరములు, ఆత్మనః న= ఆత్మకు లేవు. 7-223 శ్లోకము చూడుడు.

అ॥ ప్రకరణానుసారముగ తిరిగి వానిని 'వ్యాధయః' అని ఇచట చెప్పుచున్నారు.

**వ్యాధయో ధాతువైషమ్యే స్థూలదేహే స్థితా జ్వరాః।**
**కామక్రోధాదయః సూక్ష్మే ద్వయోర్బీజం తు కారణమ్** 9



టీ॥ ధాతువైషమ్యే= ధాతువులయొక్క విషమస్థితియందు, స్థూల దేహే= స్థూల శరీరమునందు, వ్యాధయః= వ్యాధులు, జ్వరాః స్థితాః= జ్వరరూపమున నున్నవి. సూక్ష్మే= సూక్ష్మ శరీరమునందు, కామ క్రోధ, ఆదయః= కామక్రోధాదులు జ్వరములు, ద్వయోః ఈ రెంటికిని, బీజం తు= అంకురమైతే, కారణం= కారణశరీరము.

అ॥ 'అద్వైతానన్ద' యని 'ఆత్మానం చేద్విజానీయాత్' (బృ4-4-12) అను శ్రుత్యర్థవివరణచే పై యర్థమును విపులము చేయుచున్నారు.

**అద్వైతానన్దమార్గేణ పరాత్మని వివేచితే,**
**అపశ్యన్ వాస్తవం భోగ్యం కిం నామేచ్ఛేత్పరాత్మవిత్॥** 10

టీ॥ అద్వైత ఆనన్ద, మార్గేణ= అద్వైతానన్దప్రకరణములో వివరించిన ప్రకారము, పరాత్మని వివేచితే= సచ్చిదానందస్వరూపమగు పరమాత్మను, అసత్యమగు నామరూపములనుంచి వివేచన చేసినపుడు, భోగ్యం= భోగ్య జాతము, వాస్తవం= సత్యమని, అపశ్యన్ = తలచనందున, పరాత్మవిత్= బ్రహ్మజ్ఞాని, కిం, ఇచ్ఛేత్ నామ= దేనిని కోరును?

తా॥ వి॥ ద్వైతము సత్యము కాదని తెలిసిన, దానిలో జేరిన భోగ్యజాతముగూడ సత్యము కాదని తెలియును. భోగ్యజాతము లేనపుడు కామ ముండదు. అందువలన కాముకుడు లేడు. కాముకుడు లేకుండుటచే భోక్త లేడు. కామము కామ్యము, కామి లేనపుడు కామి సంబంధమగు శరీర సంతాపము లేదు.

అ॥ ఆత్మానందప్రకరణము 12-57 శ్లోకములలో చెప్పిన ప్రకారము, జీవాత్మలయొక్క యథార్థస్వరూపము నిశ్చయింపబడుచుండగా భోక్తృ భావముచే సంతాపము లేకుండునని ఆత్మానన్ద యని చెప్పుచున్నారు.

**ఆత్మానన్దోక్తరీత్యాఽస్మిన్ జీవాత్మన్యవధారితే।**
**భోక్తా నైవాస్తి కోఽప్యత్ర శరీరే తు జ్వరః కుతః** 11

టీ॥ ఆత్మానన్ద ఉక్తరీత్యా= ఆత్మానన్దమున చెప్పినట్లు, అస్మిన్ జీవ, ఆత్మని= ఈ జీవాత్మ స్వరూపము, అవధారితే= నిశ్చయింపబడుచుండగా,

కః అపి భోక్తాన అస్తి= భోక్త ఎవరును లేరు. అత్ర శరీరే= ఈశరీరమునందు, జ్వరః కుతః= సంతాప మెట్లు కలుగును?

అ॥ అటులనే ఆముష్మిక జ్వరముయొక్క మిథ్యాత్వమును 'పుణ్యపాప' యని చూపుచున్నారు.

**పుణ్యపాపద్వయే చిన్తా దుఃఖమాముష్మికం భవేత్।**
**ప్రథమాధ్యాయ ఏవోక్తం చిన్తా నైనం తపేదితి॥ 12**

టీ॥ పుణ్యపాపద్వయే= పుణ్యపాపముల రెంటియందు, చిన్తా= విచారము, ఆముష్మికం దుఃఖం భవేత్= ఆముష్మిక దుఃఖమగును. చిన్తా= ఇటువంటి చింత, ఏనం= ఆత్మజ్ఞానిని, న తపేత్ ఇతి= తపింపదని, ప్రథమాధ్యాయే ఏవ= బ్రహ్మానందములోని మొదటి ప్రకరణమగు యోగానందము 5 శ్లోకమునందే, ఉక్తం= చెప్పబడినది.

అ॥ జ్ఞానికి ఆగామిచింత గూడ ఉండదని చూపుటకు 'యథా పుష్కరపర్ణే' (ఛాం 4-14-3) అను శ్రుత్యర్థమును పఠింపుచున్నారు.

**యథా పుష్కరపర్ణేఽస్మిన్న పామశ్లేషణం తథా।**
**వేదనాదూర్ధ్వమాగామికర్మణోఽశ్లేషణం బుధే॥ 13**

టీ॥ యథా= ఏ విధముగా, అస్మిన్ పుష్కరపర్ణే= ఈ పద్మపత్రమునందు, అపాం అశ్లేషణం= జలము అంటకుండునో, తథా= అటులనే, వేదనాత్ ఊర్ధ్వం= జ్ఞానము కలిగిన పిమ్మట, ఆగామి కర్మణః= సంచితకర్మ యొక్క, అశ్లేషణం= అసంస్పృష్టత్వము, బుధే= జ్ఞాని యందుండును.

అ॥ ఇచట అస్య సర్వే పాప్మానః ప్రదూయన్తే (ఛాం 5-24-3) అను శ్రుతిప్రమాణము నిచ్చుచున్నారు.

**ఇషీకాతృణతూలస్య వహ్నిదాహః క్షణాద్యథా।**
**తథా సంచితకర్మాఽస్య దగ్ధం చ భవతి వేదనాత్॥ 14**

టీ॥ ఇషీకాతృణతూలస్య= ఇషీకయను గడ్డిపోచమీది పింజకు, క్షణాత్= తక్షణమే, యథా వహ్ని దాహః= నిప్పుఅంటుకొనుటెటులనో, తథా= అటులనే, అస్య= ఈ జ్ఞాని యొక్క, సంచితకర్మా= సంచితకర్మ, వేదనాత్= బ్రహ్మజ్ఞానమువలన, దగ్ధం భవతి= తగులపెట్టబడినది యగును.



అ॥ ఇచట గీతావాక్యము (4-37)నుదాహరించుచున్నారు.

**యథైధాంసి సమిద్ధోఽగ్నిర్భస్మసాత్కురుతేఽర్జున।**
**జ్ఞానాగ్నిః సర్వకర్మాణి భస్మసాత్కురుతే తథా॥ 15**

టీ॥ హే అర్జున! సమిద్ధః అగ్నిః= బాగాజ్వలింపబడిన అగ్ని, ఏధాంసి= పుడకలను, యథాభస్మసాత్ కురుతే= ఏ విధముగా భస్మము చేయునో, తథా= ఆ ప్రకారమే, జ్ఞాన, అగ్నిః= జ్ఞానమను అగ్ని, సర్వకర్మాణి= సమస్తకర్మలను, భస్మసాత్ కురుతే= భస్మము చేయును.

అ॥ అహంకర్తృత్వభావము లేనివానికి కర్మసంబంధము లేదని యస్య యని చూపుచున్నారు.

**యస్య నాహంకృతో భావో బుద్ధిర్యస్య న లిప్యతే।**
**హత్వాఽపి స ఇమాంల్లోకాన్న హన్తి న నిబధ్యతే॥ 16**

టీ॥ యస్య= ఎవనికి, అహంకృతః భావః= నేను కర్తనను యభిమానము, న= లేదో, యస్య= ఎవని యొక్క, బుద్ధిః= బుద్ధి, న లిప్యతే= కర్మఫలముచే లిప్తము కాదో, సః= అతడు, ఇమాన్ లోకాన్ = ఈ లోకములను, హత్వా అపి= జయించినను, న హన్తి= జయించనివాడే.

అ॥ 'న మాతృవధేన న పితృవధేన' (కౌషి 3-1) అను శ్రుత్యర్థమును 'మాతా' యని పఠించుటచేత నీ యర్థమును విశదము చేయుచున్నారు.

**మాతాపిత్రోర్వధః, స్తేయం భ్రూణహత్యాన్యదీదృశమ్।**
**న ముక్తం నాశయేత్పాపం ముఖకాన్తిర్న నశ్యతి॥ 17**

టీ॥ మాతాపిత్రోః= తలిదండ్రులయొక్క, వధః= వధ గాని, స్తేయం= దొంగతనము గాని, భ్రూణహత్యా= గర్భములోని శిశువును చంపుట గాని, ఈదృశం, అన్యత్ పాపం= ఇటువంటి మరి యే యితర పాపము గాని, ముక్తం న నాశయేత్= ముక్తుని నశింపచేయదు, అతని యొక్క ముఖకాన్తిః=

ముఖకాన్తి, న నశ్యతి= నశింపదు. నిరహంకారమును, నిస్సంగమును స్తోత్రము చేయుటయందు మాత్రమే యీ శ్రుతితాత్పర్యము.

అ॥ 3వ శ్లోకములో నుదాహరింపబడిన విద్యానందచాతుర్విధ్యము నందు మొదటిదగు దుఃఖాభావము వివరింపబడినది. రెండవదియగు కామావాప్తిని 'దుఃఖాభావవత్' అని వివరింప నారంభించుచున్నారు.

**దుఃఖాభావవదేవాస్య సర్వకామాప్తిరీరితా**
**సర్వాన్ కామానసావాప్త్వా హ్యమృతోఽభవదిత్యతః॥ 18**

టీ॥ అస్య= ఈ జ్ఞానికి, దుఃఖ, అభావవత్= దుఃఖాభావమువలెనే, సర్వకామ, ఆప్తిః= సమస్త కోరికల ఆవాప్తిగూడ, ఈరితా= చెప్పబడినది, సర్వాన్ కామాన్= సమస్తకామములను, అసౌ= ఇతడు, అవాప్త్వా= పొంది, అతః= అందువలన, అమృతః= ముక్తుడు, అభవత్= కాగలడు.

అ॥ 'జక్షన్ క్రీడన్ రమమాణః' (ఛాం 8-12-3) అను శ్రుత్యర్థపఠనము చేత కామాప్తిని వివరించుచున్నారు.

**జక్షన్ క్రీడన్ రతిం ప్రాప్తః స్త్రీభిర్యానైస్తథేతరైః,**
**శరీరం న స్మరేత్ప్రాణః కర్మణా జీవయేదముమ్॥ 19**

టీ॥ జక్షన్= భుజించుచు, క్రీడన్= క్రీడించుచు, స్త్రీభిః= స్త్రీలతో గాని, యానైః= వాహనములతో గాని, తథా= అటులనే, ఇతరైః= ఇతరసాధనములతో గాని రతింప్రాప్తః= ఆసక్తిని పొందినవాడు, శరీరం న స్మరేత్= శరీరమును స్మరింపడు. ప్రాణః= ప్రాణము అముం= ఇతనిని, కర్మణా= కర్మచేత, జీవయేత్= జీవింపచేయును.

తా॥ వి॥ భోగముచేత ప్రారబ్ధము నశించువరకతడు జీవించియే యుండునని భావము

అ॥ 'సోఽశ్నుతే సర్వాన్ కామాన్ సహ బ్రహ్మణావిపశ్చితా' (తై 2-1) అను శ్రుత్యర్థమును 'సర్వాన్' అని పఠించుచున్నారు.

**సర్వాన్ కామాన్ సహాప్నోతి నాన్యవజ్జన్మకర్మభిః॥ 19 1/2**



టీ॥ జ్ఞాని, సర్వాన్ కామాన్= సమస్తకోరికలను, సహ= ఒకమారుగా, ఆప్నోతి= అనుభవించును. అన్యవత్= అజ్ఞానివలె, కర్మభిః= కర్మల వలన అతనికి, జన్మ న= జన్మము లేదు.

అ॥ జ్ఞానాగ్నియందు జ్ఞాని యొక్క కర్మఫలము హుతమగుటచే నతనికి తిరిగి జన్మ లేకుండుగాక; అనేక జన్మోపభోగ్యమగు భోగజాత మంతయు నతని కొక్కమారుగ నెట్లు భోగ్యమగునను శంకకు 'వర్తన్తే' అని సమాధానము చెప్పుచున్నారు.

**వర్తన్తే శ్రోత్రియే భోగా యుగపత్క్రమవర్జితాః॥ 20**

టీ॥ భోగాః= భోగము లన్నియు, శ్రోత్రియే= శ్రోత్రియుడును, అకామహతుడును నగు వానియందు, క్రమవర్జితాః= వరుసను మాని, యుగపత్= ఒకమారుగా, వర్తన్తే = సంభవించును. సర్వభూతముల స్వరూపము తానే యను దృఢజ్ఞానము గలవాడగుటచేత జ్ఞాని యందరి యనుభవముల నొక్కమారుగా తానే యనుభవించును.

అ॥ ఇచట తైత్తిరీయశ్రుతి 2-7 అనువాకములో నుదహరింపబడిన శ్రోత్రియానన్దోత్కృష్టత నుదాహరించుచున్నారు.

**యువా రూపీ విద్యావాన్ నీరోగీ దృఢచిత్తవాన్।**
**సైన్యోపేతః సర్వపృథ్వీం విత్తపూర్ణాం ప్రపాలయన్॥ 21**

**సర్వైర్మానుష్యకై ర్భోగైస్సంపన్న స్తృప్తభూమిపః।**
**యమానన్దమాప్నోతి బ్రహ్మవిత్తమశ్నుతే॥ 22**

టీ॥ రూపీ చ యువా= రూపముచేత వయస్సు చేతను పడుచు వాడు, విద్యావాన్=విద్యావంతుడు, నీరోగి= రోగము లేనివాడు, దృఢచిత్తవాన్= దృఢమనస్కుడు, సైన్యఉపేతః= సైన్యముతో కూడినవాడు విత్తపూర్ణాం= ధనధాన్యములతో సమృద్ధమగు, సర్వపృథ్వీం= సమస్త భూచక్రమును, ప్రపాలయన్= పుష్కలముగ పరిపాలించుచు.

సర్వైః మానుష్యకైః భోగైః= మానుషలోకసంబంధమగు సర్వ భోగములచేత, సంపన్నః= సమృద్ధుడగుటచే, తృప్తభూమిపః= సంతృప్తిని

చెందిన మహాచక్రవర్తి, యం ఆనందం ఆప్నోతి= ఏట్టి యానందము ననుభవించునో, తం= ఆ యానందమును, బ్రహ్మవిత్ చ= బ్రహ్మజ్ఞానియు, అశ్నుతే= అనుభవించును.

అ॥ చక్రవర్తికి కలుగు తృప్తి జ్ఞానికి గూడ సాధ్యమగునని 'మర్త్యభోగే' యని చెప్పుచున్నారు.

**మర్త్యభోగే ద్వయోర్నాస్తి కామస్తృప్తిరతః సమా**
**భోగాన్నిష్కామతైకస్య పరస్యాపి వివేకతః॥** 23

టీ॥ ద్వయోః= సమ్రాట్ జ్ఞాను లిద్దరికిని, మర్త్యభోగే= మానుష భోగమునందు; కామః న అస్తి= కోరిక లేదు. అతః= అందువలన, నిద్దఱికి తృప్తిః సమా= తృప్తి సమానమే, కారణ మేమనగా, ఏకస్య= సమ్రాట్టునకు, భోగాత్= అనుభవమువలన, నిష్కామతా= సర్వకామనివృత్తియగుచున్నది. పరస్య అపి= జ్ఞానికిని, వివేకతః= సర్వభోగములు మిథ్యయను జ్ఞానముచే నిష్కామత కలుగుచున్నది.

అ॥ 'వివేకతః' యను శబ్దమును 'శ్రోత్రియ' యని వివరించు చున్నారు.

**శ్రోత్రియత్వాద్వేదశాస్త్రైః భోగదోషానవేక్షతే।**
**రాజా బృహద్రథో దోషాంస్తాన్ గాథాభిరుదాహరత్॥** 24

టీ॥ జ్ఞాని, శ్రోత్రియత్వాత్= శ్రోత్రియుడగుటచేత, వేదశాస్త్రైః= వేదశాస్త్రములచేతను, భోగదోషాన్= భోగమునందలి దోషములను, అవేక్షతే= కనిపెట్టును. తాన్ దోషాన్= ఆదోషములను, బృహద్రథః రాజా= బృహద్రథుడను రాజు, గాథాభిః= కథలచే, ఉదాహరత్= చెప్పెను. 11-110 శ్లోకముచూడవలెను.

అ॥ దేహదోషాన్ అని దోషముల నుదాహరించుచున్నారు.

**దేహదోషాంశ్చిత్తదోషాన్ భోగ్యదోషాననేకశః।**
**శునా వాన్తే పాయసే నో కామస్తద్వద్వివేకినః॥** 25



టీ॥ దేహదోషాన్= దేహమునందలి దోషములను, చిత్తదోషాన్= మానసిక దోషములను, భోగ్యదోషాన్= భోగములయందలి దోషములను, అనేకశః= అనేకవిధముల, ఉదాహరత్= చెప్పెను. శునావాన్తే= కుక్కవ మనమగు, పాయసే= పాయసమునందు, నో కామః= ఎవరికిని కోరిక లేదు. తద్వత్= అటులనే, వివేకినః= జ్ఞానికి భోగములందు కోరిక లేదు.

అ॥ సార్వభౌమునికంటె శ్రోత్రియు డధికుడని చూపుటకై సార్వభౌముని దోషములను 'నిష్కామత్వే' అని చూపుచున్నారు.

**నిష్కామత్వే సమేఽప్యత్ర రాజ్ఞః సాధనసఞ్చయే।**
**దుఃఖమాసీద్భావినాశాదతిభీరనువర్తతే॥** 26

టీ॥ జ్ఞాని సార్వభౌములకు, నిష్కామత్వే సమే అపి= కోరికలేకపోవుట సమానమైనను, రాజ్ఞః,= రాజుకు, అనుభవముచేత తృప్తి చెందువాడు గావున, (23 శ్లోకము) సాధనసఞ్చయే= అనుభవముకొరకైన సాధనసామగ్రిని ప్రోగుచేయుటయందు, దుఃఖం ఆసీత్= దుఃఖ ముండును. భావినాశాత్= అతని సార్వభౌమపదవి ముందు నశించ దగినదగుటచేత, అతిభీః=విస్తారము భయము, అనువర్తతే= భోగములను వెంబడించును.

అ॥ శ్రోత్రియున కట్టి భయము లేదనుచున్నారు.

**నోభయం శ్రోత్రియస్యాతస్తదానన్దోఽధికోఽన్యతః।**
**గన్ధర్వానన్ద ఆశాస్తి రాజ్ఞో నాస్తి వివేకినః॥** 27

టీ॥ శ్రోత్రియస్య= శ్రోత్రియునికి, ఉభయం న= సాధన సంచయము. భావినాశము రెంటివలని భయము లేదు. అతః= అందు వలన, తత్, ఆనన్దః= అతని యానందము, అన్యతః= సార్వభౌముని యానందముకంటె,అధికః= అధికమైనది. రాజ్ఞః= రాజునకు గన్ధర్వానన్దే= గన్ధర్వానన్దమునందు, ఆశా అస్తి= ఆశ గూడ కలదు. వివేకినః=జ్ఞానికి, న అస్తి= అట్టి ఆశ లేదు.

తా॥ వి॥ తైత్తిరీయశ్రుతి 2-7 వాక్యములో మానుషానన్దము మొదలు బ్రహ్మానందము వఱకు పదునొకండానందములు పేర్కొనబడినవి. అందులో

నొకదానికంటె నొకటి శతాధికముగ వర్ణింపబడినది- ఆనందములన్నిటిలోను మానుషానందము నికృష్టము. సార్వభౌముని యానందము సర్వోత్కృష్టమగు మానుషానన్దము. అదియు దుఃఖావృతముగనున్నది. గంధర్వానందము మొదలగు వానిమీద కోరిక కలుగవచ్చును. అందుచేత సార్వభౌమానందము నందు తృప్తిలేదు. శ్రోత్రయుని బ్రహ్మానందమున నిట్టి దోషములు లేవు. గనుక శ్రోత్రియుని తృప్తి నిరతిశయము.

అ॥ పుణ్యపరిపాకముచేత మనుష్యునికి గూడ గంధర్వానందము సాధ్యము గనుక దానియం దతనికి కోరిక కలుగ వచ్చునని 'అస్మి౯' అని చూపుచున్నారు.

**అస్మి౯ కల్పే మనుష్యః స౯ పుణ్యపాకవిశేషతః।**
**గన్ధర్వత్వం సమాపన్నో మర్త్యగన్ధర్వ ఉచ్యతే॥** 28

టీ॥ అస్మి౯ కల్పే= ఈ కల్పములందు, మనుష్యఃస౯ మనుష్యుడై, పుణ్యపాకవిశేషతః= పరిపక్వమగు పుణ్యవిశేషమువలన, గన్ధర్వత్వం= సమాపన్నః= గన్ధర్వత్వమునుపొంది, మర్త్యగన్ధర్వః ఉచ్యతే= మానుషజన్మ నెత్తి గంధర్వాధికారమును పొందినవాడని చెప్పబడును.

అ॥ మఱికొందఱు పూర్వపుణ్యబలముచేత కల్పారంభమున గంధర్వయోనియందు జన్మించుచుదురని 'పూర్వకల్పే' యని చెప్పుచున్నారు.

**పూర్వకల్పే కృతాత్పుణ్యాత్కల్పాదావేవ చేద్భవేత్।**
**గన్ధర్వత్వం తాదృశోఽత్ర దేవగన్ధర్వ ఉచ్యతే॥** 29

టీ॥ పూర్వకల్పే= పూర్వకల్పమున, కృతాత్ పుణ్యాత్= చేయబడిన పుణ్యవశమున, కల్ప ఆదౌ ఏవ= కల్పారంభముననే, గన్ధర్వత్వం భవేత్ చేత్= గన్ధర్వత్వము సంభవించెనేని, అత్ర= ఈ ప్రకరణమున, తాదృశః= అట్టివాడు, దేవగంధర్వః ఉచ్యతే= దేవగంధర్వుడని చెప్పబడును.

తా॥ వి॥ మనుష్యజన్మనెత్తి తపోబలముచేత గన్ధర్వత్వము నీ జన్మయందే సంపాదించినవాడు మర్త్యగన్ధర్వుడు. పూర్వజన్మ ఫలవిశేషము చేత గంధర్వయోనియందు జన్మము నెత్తినవాడు దేవగంధర్వుడు. ఇదే ప్రకార మితరచోట్లగూడ కనుగొనవలెను.



అ॥ దీనికంటె పితృదేవానందాధిక్యమును 'అగ్నిష్వాత్త' యని చూపుచున్నారు.

**అగ్నిష్వాత్తాదయో లోకే పితరశ్చిరవాసినః।**
**కల్పాదావేవ దేవత్వం గతా ఆజానదేవతాః॥** 30

టీ॥ అగ్నిష్వాత్తాదయః పితరః= అగ్నిష్వాత్తాదులు మొదలగు పితృదేవతలు, లోకే= పితృలోకమునందు, చిరవాసినః= చిరకాలనివాసులై, కల్పాదౌ ఏవ= కల్పారంభమునందే, దేవత్వం గతాః= దేవత్వమును పొందిన వారు, ఆజానదేవాః= పుట్టుకలోనే పితృదేవత్వము నొందినవారు. వీరు కర్మచేత పితృదేవత్వమును పొంది కర్మదేవత లనుపించుకొను మనుజుల కంటె వేరు.

అ॥ కర్మదేవత్వమును 'అస్మి౯' అని వర్ణించుచున్నారు.

**అస్మి౯ కల్పేఽశ్వమేధాది కర్మ కృత్వా మహత్పదమ్।**
**అవాప్యాజానదేవైర్యాః పూజ్యాస్తాః కర్మదేవతాః॥** 31

టీ॥ అస్మి౯ కల్పే= ఈ కల్పమునందు. అశ్వమేధ, ఆది, కర్మ, కృత్వా= అశ్వమేధాదియాగములను చేసి, మహత్ పదం= ఉత్కృష్టపదవిని, అవాప్య= పొంది, ఆజానదేవైః= జన్మచే దేవతలగు వారిచేతయాః పూజ్యాః= ఎవరు పూజ్యు లగుచున్నారో, తాః= వారు కర్మదేవతాః= కర్మకర్మదేవతలు.

అ॥ ఆజాన దేవతలయందు ముఖ్యులను 'యమాగ్ని' యని స్మరించుచున్నారు.

**యమాగ్నిముఖ్యా దేవాః స్యుర్జ్ఞాతావింద్రబృహస్పతీ।**
**ప్రజాపతిర్విరాట్ ప్రోక్తో బ్రహ్మసూత్రాత్మనామకః॥** 32

టీ॥ యమఅగ్నిముఖ్యాః= యముడు అగ్ని మొదలగు ముఖ్యులు, దేవాః స్యుః= ఆజానదేవత లగుదురు. ఇన్ద్రబృహస్పతీ= ఇంద్రుడు బృహస్పతి, జ్ఞాతౌ= ప్రసిద్ధులు, ప్రజాపతిః= ప్రజాపతి, విరాట్ ప్రోక్తః= విరాట్టని చెప్పబడుచున్నాడు. బ్రహ్మ= బ్రహ్మ, సూత్రాత్మనామకః= సమష్టి శరీరోపాధికుడగు హిరణ్యగర్భు డగుచున్నాడు 1-16 శ్లోకము చూడుడు.

అ॥ సార్వభౌమాదిసూత్రబ్రహ్మాంతములగు ఆనందము లన్నియు శ్రోత్రియుడు నకామహతుడు నగు వానియొక్క బ్రహ్మానందముకంటె న్యూనములని 'సార్వభౌమ' అని చెప్పుచున్నారు.

**సార్వభౌమాదిసూత్రాన్తా ఉత్తరోత్తరకామినః।**
**అవాఙ్మనసగమ్యోఽయమాత్మానన్దస్తతః పరః॥ 33**

సార్వభౌమాదిసూత్రాన్తాః= సార్వభౌముడు మొదలు సూత్రబ్రహ్మ వరకును, ఉత్తర, ఉత్తర, కామినః= పూర్వపూర్వముకంటె నధికమగు నుత్తరోత్తరపదమును కోరుదురు. అయం ఆత్మానందః= అకామహతుడగు శ్రోత్రియుని ఆత్మానందము, అవాఙ్మనసగమ్యః= మనస్సునకు, వాక్కునకు గూడ అందదు. తతః పరః= అందువలన సర్వోత్కృష్టము. సార్వభౌమా నందము మొదలు సూత్రబ్రహ్మానన్దము వరకుగల యానందములన్నియు ధీవృత్తిరూపములు, శ్రోత్రియుని బ్రహ్మానందము తదితరము.

అ॥ శ్రోత్రియు డకామహతుడగుటచేత సార్వభౌమానందాద్యానంద ము లన్నియు నతనియం దవగతములగుచున్నవి.

**తైస్తైః కామ్యేషు సర్వేషు సుఖేషు శ్రోత్రియో యతః।**
**నిఃస్పృహస్తేన సర్వేషామానన్దాస్సన్తి తస్య తే॥ 34**

టీ॥ యతః= ఏకారణముచేత, తైః తైః= సార్వభౌముడు మొదలు సూత్రబ్రహ్మవరకు గల వారిచేత, కామ్యేషు= కోరబడిన, సర్వేషు సుఖేషు= సమస్తసుఖముల యందు, నిఃస్పృహః శ్రోతియః= శ్రోత్రియుడు కోరిక లేనివాడగు చున్నాడో, తేన= ఆకారణముచేత, సర్వేషాం= వారలందరియొక్క, తే ఆనన్దాః= ఆ యా ఆనందములు, తస్య సన్తి= అతనికి గలవు.

అ॥ మూడవ శ్లోకమున నుదాహరింపబడిన సర్వకామావాప్తి వివరణ మును 'సర్వ' యని యుపసంహరించుచున్నారు.

**సర్వకామాప్తిరేషోక్తా యద్వా సాక్షిచిదాత్మనా।**
**స్వదేహవత్సర్వదేహేష్వపి భోగానవేక్షతే॥ 35**



టీ॥ సర్వ, కామ, ఆప్తిః= సర్వకామాప్తి యను రెండవ విధము, ఏషాఉక్తా= 18-34 శ్లోకములయందు వివరింపబడినది. యద్వా= ఆశబ్దమున కర్థ మటులకానిచో, సాక్షిచిదాత్మనా= సర్వవ్యవహారములకు సాక్షిభూతమగు చిత్స్వరూపముచేత, స్వదేహవత్= తన శరీరమువలెనే, సర్వదేహేషు అపి= అన్ని దేహములయందును, భోగాన్ అవేక్షతే= భోగముల ననుభవించుచున్నాడు. సర్వకామావాప్తి యనసార్వభౌమానందాది సూత్రా నందము వరకనుభవమని యొకయర్థము. అట్లుకానిచో ఉపాధిభూతమగు తన దేహము యొక్క పరిహాణము చేత, తనయందే యానందరూపమును గుర్తెఱుగుచున్నాడు. దేహాన్తరముల యందుగూడ నుపాధిపరిహాణముచేత నాత్మనందమును గుర్తెఱుంగుట కామాప్తి యనబడును.

అ॥ ఈ యర్థమునే 'అజ్ఞ స్యాపి' యని వివరించుచున్నారు.

**అజ్ఞస్యాప్యేతదస్త్యేవ న తు తృప్తిరబోధతః।**
**యో వేద సోఽశ్నుతే సర్వాన్ కామానిత్యబ్రవీచ్ఛ్రుతిః॥ 36**

టీ॥ ఏతత్= సమస్త భోగముల ననుభవించుటచే గలుగు కామాప్తి అజ్ఞస్య అపి= అజ్ఞానికి గూడ, అస్తి ఏవ= ఉన్నది కాని, అబోధతః= బ్రహ్మజ్ఞానము లేక పోవుటచేత, తృప్తిః న= తృప్తిమాత్రము లేదు. ఏలయన యో వేద= ఎవరు బ్రహ్మతత్త్వమును తెలిసికొనునో, సః= అతడు, సర్వాన్ కామాన్= సమస్త కామములను, అశ్నుతే ఇతి= అనుభవించునని, శ్రుతిః అబ్రవీత్= శ్రుతిచెప్పెను.

తా॥ వి॥ సర్వాత్మత్వజ్ఞానసిద్ధి లేనిది సర్వకామావాప్తి సిద్ధి కలుగ నేరదు.

అ॥ 'యద్వా' యని ప్రకారాంతముచే సర్వకామావాప్తి నిర్వచనము చేయుచున్నారు.

**యద్వా సర్వాత్మతాం స్వస్య సామ్నా గాయతి సర్వదా।**
**అహమన్నం తథాన్నాదశ్చేతి సామ హ్యధీయతే॥ 37**

టీ॥ యద్వా= అటులకానిచో, సర్వదా= నిరంతరము, స్వస్య సర్వాత్మతాం= తానే సర్వస్వరూపుడను భావమును, సామ్నా= సామముచేత

గాయతి= గానము చేయును. గానప్రకారమేమన, ఆహం అన్నం= నేనే అన్నస్వరూపుడను, తథా= అదే ప్రకారముగ, అన్నాదః చ ఇతి= భోక్తను గూడ అని, సామ అధీయతే= సామ పఠింపబడుచున్నది.

తా॥ వి॥ నాయందు ప్రకాశించుచున్న చైతన్యము సూర్యాదుల యందు ప్రకాశించుచున్న చైతన్యమొకటియే, నేనే సర్వస్వరూపుడనను. జ్ఞానము గల బ్రహ్మవేత్త సర్వసమత్వమును బోధించు శ్రుతి ననవరతము గానము చేయుచూ యానందానుభవమున మైమఱచును. ఇట్టి యనుభవమును లోకములన్నిటికి చాటుచుండును. తైత్తిరీయము 3-10 చూడవలెను.

అ॥ ఇక మిగిలిన రెండు విభాగములగు కృతకృత్యత్వము, ప్రాప్తప్రాప్యత్వమును 'దుఃఖాభావః' అని వివరించుచున్నారు.

**దుఃఖాభావశ్చ కామాప్తిరుభే హ్యేవం నిరూపితే।**
**కృతకృత్యత్వమన్యచ్చ ప్రాప్తప్రాప్యత్వమీక్షతామ్॥** 38

టీ॥ దుఃఖాభావః కామాప్తిః చ=దుఃఖాభావము, కామాప్తియు, ఏవం నిరూపితే= ఈప్రకారము నిరూపింపబడినవి. ఇక కృతకృత్యత, అన్యత్= చివరదగు ప్రాప్తప్రాప్యత్వం= ప్రాప్తప్రాప్యత్వము, ఈక్షతాం= తెలిసికొనబడుగాక.

అ॥ ఈరెండువిషయములు తృప్తిదీపమున విశేషించి నిరూపింపబడినవి. అయినను విషయమంతయు నొకచోట సమాహారము చేయుటకై యాశ్లోకములే యిచట బొందుపరుపబడుచున్నవని 'ఉభయం' అని చెప్పుచున్నారు.

**ఉభయం తృప్తిదీపే హి సమ్యగస్మాభిరీరితమ్।**
**త ఏవాత్రానుసంధేయాః శ్లోకా బుద్ధివిశుద్ధయే॥** 39

టీ॥ ఉభయం= ఈ రెండువిషయములు, తృప్తి దీపే= తృప్తదీపము నందు, అస్మాభిః= మాచేత, సమ్యక్= లెస్సగా, ఈరితం హి= వివరింపబడినవి గదా! తే ఏవ శ్లోకాః= ఆశ్లోకములే, బుద్ధివిశుద్ధయే= బుద్ధినైర్మల్య



మునకుగాను, అత్ర= ఇచట, అనుసంధేయాః= అనుసంధానము చేయ తగినవి.

**ఐహికాముష్మికవ్రాతసిద్ధ్యై ముక్తేశ్చ సిద్ధయే।**
**బహుకృత్యం పురాఽ స్యాభూత్తత్సర్వమధునా కృతమ్॥** 40

**తదేతత్కృతకృత్యత్వం ప్రతియోగిపురఃసరమ్।**
**అనుసందధదేవాయమేవం తుష్యతి నిత్యశః॥** 41

**దుఃఖినోఽజ్ఞాః సంసరంతు కామం పుత్రాద్యపేక్షయా।**
**పరమానందపూర్ణోఽహం సంసరామి కిమిచ్ఛయా॥** 42

**అనుతిష్ఠంతు కర్మాణి పరలోకయియాసవః।**
**సర్వలోకాత్మకః కస్మాదనుతిష్ఠామి కిం కథమ్॥** 43

**వ్యాచక్షతాం తే శాస్త్రాణి వేదానధ్యాపయంతు వా।**
**యేఽత్రాధికారిణో మే తు నాఽధికారోఽక్రియత్వతః॥** 44

**నిద్రాభిక్షే స్నానశౌచే నేచ్ఛామి న కరోమి చ।**
**ద్రష్టారశ్చేత్కల్పయంతి కిం మే స్యాదన్యకల్పనాత్॥** 45

**గుంజాపుంజాది దహ్యేత నాన్యారోపితవహ్నినా।**
**నాన్యారోపితసంసారధర్మానేవమహం భజే॥** 46

**శృణ్వన్త్వజ్ఞాతతత్త్వాస్తే జానన్ కస్మాచ్ఛృణోమ్యహమ్।**
**మన్యంతాం సంశయాపన్నా న మన్యేఽహమసంశయః॥** 47

**విపర్యస్తో నిదిధ్యాసేత్కిం ధ్యానమవిపర్యయే।**
**దేహాత్మత్వవిపర్యాసం న కదాచిద్భజామ్యహమ్॥** 48

**అహం మనుష్య ఇత్యాదివ్యవహారో వినాఽప్యముమ్।**
**విపర్యాసం చిరాభ్యస్తవాసనాతోఽవకల్పతే॥** 49

**ఆరబ్ధకర్మణి క్షీణే వ్యవహారో నివర్తతే।**
**కర్మాక్షయే త్వసౌ నైవ శామ్యేద్ధ్యానసహస్రతః॥** 50

**విరలత్వం వ్యవహృతేరిష్టం చేద్ధ్యానమస్తు తే।**
**అబాధికాం వ్యవహృతిం పశ్యన్ ధ్యాయామ్యహం కుతః॥ 51**

**విక్షేపో నాస్తి యస్మాన్మే న సమాధిస్తతో మమ।**
**విక్షేపో వా సమాధిర్వా మనసః స్యాద్వికారిణః॥ 52**

**నిత్యానుభవరూపస్య కో మేఽత్రానుభవః పృథక్।**
**కృతం కృత్యం ప్రాపణీయం ప్రాప్తమిత్యేవ నిశ్చయః॥ 53**

**వ్యవహారో లౌకికో వా శాస్త్రీయో వాన్యథాపి వా।**
**మమాకర్తురలేపస్య యథారబ్ధం ప్రవర్తతామ్॥ 54**

**అథవా కృతకృత్యోఽపి లోకానుగ్రహకామ్యయా ।**
**శాస్త్రీయేణైవ మార్గేణ వర్తేఽహం మమ కా క్షతిః, 55**

**దేవార్చనస్నానశౌచభిక్షాదౌ వర్తతాం వపుః।**
**తారం జపతు వాక్ తద్వత్పఠత్వామ్నాయమస్తకమ్॥ 56**

**విష్ణుం ధ్యాయతు ధీర్యద్వా బ్రహ్మానందే విలీయతామ్।**
**సాక్ష్యహం కించిదప్యత్ర న కుర్వే నాపి కారయే॥ 57**

ఈ శ్లోకములు తృప్తిదీపము 253-270 శ్లోకములుగ వ్యాఖ్యానింప బడినవి.

**కృతకృత్యతయా తృప్తః ప్రాప్తప్రాప్యతయా పునః।**
**తృప్యన్నేవం స్వమనసా మన్యతేఽసౌ నిరంతరమ్॥ 58**

**ధన్యోఽహం ధన్యోఽహం నిత్యం స్వాత్మానమంజసా వేద్మి।**
**ధన్యోఽహం ధన్యోఽహం బ్రహ్మానందో మే విభాతి స్పష్టమ్॥ 59**

**ధన్యోఽహం ధన్యోఽహం దుఃఖం సాంసారికం న వీక్షేఽద్య।**
**ధన్యోఽహం ధన్యోఽహం స్వస్యాజ్ఞానం పలాయితం క్వాపి॥ 60**

**ధన్యోఽహం ధన్యోఽహం కర్తవ్యం మే న విద్యతే కించిత్।**
**ధన్యోఽహం ధన్యోఽహం ప్రాప్తవ్యం సర్వమద్య సంపన్నమ్॥ 61**



**ధన్యోఽహం ధన్యోఽహం తృప్తేర్మే కోపమా భవేల్లోకే।**
**ధన్యోఽహం ధన్యోఽహం ధన్యో ధన్యః పునః పునర్ధన్యః॥ 62**

**అహో పుణ్యమహో పుణ్యం ఫలితం ఫలితం దృఢమ్।**
**అస్య పుణ్యస్య సంపత్తేరహో వయమహో వయమ్॥ 63**

**అహో శాస్త్రమహో శాస్త్రమహో గురురహో గురుః।**
**అహో జ్ఞానమహోజ్ఞానమహో సుఖమహో సుఖమ్॥ 64**

ఈ శ్లోకములు తృప్తిదీపము 291-297 శ్లోకములుగా వ్యాఖ్యానింప బడినవి.

అ॥ 'బ్రహ్మానంద' యని ఫలకథనముచే నధ్యాయము నుపసంహ రించుచున్నారు.

**బ్రహ్మానందాభిధే గ్రంథే చతుర్థోఽధ్యాయ ఈరితః।**
**విద్యానందస్తదుత్పత్తిపర్యన్తోఽభ్యాస ఇష్యతామ్॥ 65**

టీ॥ బ్రహ్మానన్ద,అభిధే గ్రంథే= బ్రహ్మానందమను పేరుగలగ్రంథము నందు, చతుర్థః అధ్యాయః= నాల్గవ అధ్యాయమగు, విద్యానందః= విద్యా నందము, ఈరితః= చెప్పబడినది. తత్, ఉత్పత్తిపర్యన్తః= ఆ విద్యా నందము కలుగుటయే మేర కలిగినదిగా, అభ్యాసః ఇష్యతాం= అభ్యాస మంగీకరింప బడవలెను. దృఢజ్ఞానము కలుగు నంతవఱకు దాని నభ్యసించు చుండవలెను.

శ్రీ భారతీసంప్రదాయసార్వభౌమ, జగద్గురు శ్రీ కళ్యాణానంద
భారతీమాన్యాచార్యత్యన్త ప్రియాంతేవాసియు, అత్రి
గోత్ర సముద్భూతుడును, ఉభయకులపవిత్రుడును
నగు లింగన సోమయాజిచే విరచిత
మగు వేదాంతపంచదశి కళ్యాణామృత
మను ఆంధ్రవ్యాఖ్యాసమేతమగు
బ్రహ్మానందమునందు విద్యానందము
సంపూర్ణము.

శ్రీ గురుభ్యో నమః

# శ్రీమదాంధ్ర వేదాన్తపంచదశి

## కళ్యాణామృత వ్యాఖ్యాసమేతము

### * 15 బ్రహ్మానందము - విషయానంద ప్రకరణము *

అ॥ బ్రహ్మానందమునకు విషయానందము ద్వారము వంటిదని 'అథ' అని ప్రకరణ ముపక్రమించుచున్నారు.

**అథాత్ర విషయానందో బ్రహ్మానన్దాంశరూపభాక్।**
**నిరూప్యతే ద్వారభూత స్తదంశత్వం శ్రుతిర్జగౌ॥ 1**

టీ॥ అథ= విద్యానన్దము తరువాత, అత్ర= ఈ ప్రకరణమునందు, బ్రహ్మానంద, అంశ, రూపభాక్= బ్రహ్మానందాంశస్వరూపమును బొందినదై, ద్వారభూతః= బ్రహ్మానందమునకు ద్వారమైన, విషయానన్దః= విషయానందము, నిరూప్యతే= నిర్వచింపబడుచున్నది. తత్ అంశత్వం= విద్యానందము బ్రహ్మానందాంశమగుటను, శ్రుతిః జగౌ= శ్రుతియే చెప్పుచున్నది.

తా॥ వి॥ ఆనందమంతయు నొకటియే జాతి. నిర్విషయము నిత్యము నగునది బ్రహ్మానందము. సవిషయములు అనిత్యము లగునవి ఇతరానందములు. ఈఆనందములన్నియు తై 2-7 అనువాక్యములో పేర్కొనబడినవి.

అ॥ 'ఏషః' అని పై శ్రుత్యర్థమును పఠించుచున్నారు.

**ఏషోऽస్య పరమానన్దో యోऽఖండైకరసాత్మకః,**
**అన్యాని భూతాన్యేతస్య మాత్రామేవోపభుంజతే॥ 2**

టీ॥ అస్య= ఈ పరబ్రహ్మముయొక్క, యః ఏషః పరమానందః= స్వరూపమగు ఏ యీ పరమానందము కలదో అది, అఖండ, ఏక. రస, ఆత్మకః= అఖండమగు రసఘనస్వరూపము. అన్యాని భూతాని= ఇతర ప్రాణులన్నియు, ఏతస్య= ఈ బ్రహ్మానందముయొక్క, మాత్రాం ఏవ= అంశమును మాత్రమే, ఉపభుంజతే= అనుభవించుచున్నారు.

తా॥ వి॥ ఏషోऽస్య పరమానన్దః ఏతస్యైవానందస్యాన్యాని భూతాని మాత్రాముపజీవన్తి (బృ 4-3-32) అనునది పైశ్రుతి.



అ॥ బ్రహ్మానందమునకు విషయానందము ద్వార మెటులయినదో ప్రదర్శింపదలచి ముందు విషయానందస్వరూపమును 'శాన్తాః' అని నిరూపించుచున్నారు.

**శాన్తా ఘోరాస్తథా మూఢా మనసో వృత్తయస్త్రిధా,**
**వైరాగ్యం క్షాంతిరౌదార్యమిత్యాద్యాః శాన్తవృత్తయః॥ 3**

**తృష్ణా స్నేహో రాగలోభావిత్యాద్యా ఘోరవృత్తయః।**
**సంమోహో భయమిత్యాద్యాః కథితా మూఢవృత్తయః॥ 4**

టీ॥ మనసః వృత్తయః= మనసు యొక్క వృత్తులు, శాన్తాః= సత్త్వగుణప్రధానములు, ఘోరాః= రాజసగుణ ప్రధానములు, తథా= అట్లే మూఢాః= తమోగుణప్రధానము లని, త్రిధా= మూడువిధములు. వైరాగ్యం= వైరాగ్యము, క్షాన్తిః= వివేకముచే దుఃఖమును సహించుట, ఔదార్యం= త్యాగము, ఇతి ఆద్యాః= ఈ మొదలగునవి, శాన్తవృత్తయః= శాంతవృత్తులు

తృష్ణా= విషయాభిలాష, స్నేహః= ప్రేమ, రాగలోభౌ= మిక్కుటమగు కోరిక ధనలాలస, ఇత్యాద్యాః= ఈ మొదలగునవి, ఘోరవృత్తయః= ఘోరవృత్తులు, సంమోహః= విస్మృతి, భయం= భయము ఇత్యాద్యాః= ఈ మొదలగునవి, మూఢవృత్తయః= మూఢవృత్తులని, కథితాః= చెప్పబడినది.

అ॥ భిన్నములగు నీవృత్తులన్నిటియందును బ్రహ్మచైతన్యము భాసించుచున్నదని 'వృత్తిషు' అని చెప్పుచున్నారు.

**వృత్తిష్వేతాసు సర్వాసు బ్రహ్మణశ్చిత్స్వభావతా।**
**ప్రతిబింబతి శాంతాసు సుఖం చ ప్రతిబింబతి॥ 5**

ఏతానుసర్వాసు వృత్తిషు= ఈ అన్నివృత్తులయందును బ్రహ్మణః= బ్రహ్మముయొక్క, చిత్స్వభావతా= చైతన్యము ప్రతిబింబతి= ప్రతిఫలించును. శాంతాసు= శాంతవృత్తులయందు, సుఖం చ= సుఖము గూడ, ప్రతిబింబతి= ప్రతిఫలించును,

ఇందుకు 'రూపం' అని ప్రమాణము నుదాహరింపుచున్నారు.

**రూపం రూపం బభూవాऽసౌ ప్రతిరూప ఇతి శ్రుతిః।**
**ఉపమా సూర్యకేత్యాది సూత్రయామాస సూత్రకృత్॥ 6**

అసౌ= ఈ బ్రహ్మచైతన్యము, రూపం రూపం= ప్రతిరూపములోను, ప్రతిరూపః= ప్రతిబింబితమైనది. ఇతి= అని, శ్రుతిః= రూపం రూపం ప్రతిరూపో బభూవ (కఠ 2-5-10) అను శ్రుతి పలుకుచున్నది. సూత్రకృత్= బ్రహ్మసూత్ర రచయిత యగు వ్యాసమహర్షి, ఉపమా సూర్యకేత్యాది (సూ 3-2-18) అను సూత్రమును, సూత్రయామాస= రచించెను.

తా॥ వి॥ ప్రతిరూపములోను బ్రహ్మచైతన్యము ప్రతిఫలించుచున్నది యని పై శ్రుత్యర్థము. ఆత్మ నిర్విశేషము. ఉపాధికృతములగు నద్దాని వివిధ రూపములు జలములో ప్రతిఫలించు సూర్యబింబములవలె నసత్యము లని పైసూత్రార్థము

అ॥ ఇచట ఏక ఏవ యని బ్రహ్మబిందూపనిషత్ప్రమాణము (12) నుదాహరించుచున్నారు.

**ఏక ఏవ హి భూతాత్మా భూతే భూతే వ్యవస్థితః।**
**ఏకధా బహుధా చైవ దృశ్యతే జలచంద్రవత్॥ 7**

టీ॥ ఏకః ఏవ హి= ఒక్కడే, భూత, ఆత్మా= సర్వభూతస్వరూపుడు, భూతే భూతే= ప్రతిభూతమునందు, వ్యవస్థితః= నిలిచి యున్నాడు జల చంద్రవత్= జలములోని చంద్రుని వలె, ఏకధా బహుధా చ ఏవ= ఒకటిగాను అనేకములుగాను, దృశ్యతే= కనబడుచున్నాడు.

అ॥ పైశ్రుతిలోని దృష్టాంతములను 'జలే' యని వివరించుచున్నారు.

**జలే ప్రవిష్టశ్చన్ద్రోఽయమస్పష్టః కలుషే జలే।**
**విస్పష్టో నిర్మలే తద్వద్ద్వేధా బ్రహ్మాఽపి వృత్తిషు॥ 8**

టీ॥ జలే ప్రవిష్టః= జలమునందు ప్రవేశించిన, అయం చంద్రః= ఈ చంద్రుడు, కలుషేజలే= మలినమగు జలమునందు, అస్పష్టః= స్పష్టముగా నుండడు. నిర్మలే= నిర్మలమగు జలము నందు, విస్పష్టః= బాగా స్పష్టముగా నుండును. తద్వత్= అదేప్రకారము, బ్రహ్మ అపి= బ్రహ్మయు, వృత్తిషు= శాంతాదిత్రివిధబుద్ధివృత్తులయందు, ద్వేధా= రెండు విధములుగా నుండును.

అ॥ ఈ యర్థమునే ఘోర యని విస్తరించుచున్నారు.



**ఘోరమూఢాసు మాలిన్యాత్సుఖాంశశ్చ తిరోహితః।**
**ఈషన్నైర్మల్యత స్తత్ర చిదంశప్రతిబింబనమ్॥ 9**

టీ॥ ఘోరమూఢాసు= ఘోరమూఢవృత్తులయందు, మాలిన్యాత్= మలినముగా నుండుటవలన, సుఖ, అంశః= ఆనందాంశ, తిరోహితః= కప్పబడినది. కాని, ఈషత్, నైర్మల్యతః= కొంచెము నిర్మలముగా నుండుట చేత, చిత్ అంశప్రతిబింబనం= చైతన్యము ప్రతిబింబించుట.

అ॥ 'యద్వాపి' యని మరియొక దృష్టాంతము నిచ్చుచున్నారు.

**యద్వాపి నిర్మలే నీరే వహ్నేరౌష్ణ్యస్య సంక్రమః।**
**న ప్రకాశస్య తద్వత్ స్యాచ్చిన్మాత్రోద్భూతిరేవ చ॥ 10**

టీ॥ యద్వా అపి= అటులకాకపోయినచో నిర్మలే నీరే= నిర్మల జలమునందు, వహ్నేః= వహ్నియొక్క, ఔష్ణ్యస్య సంక్రమః= వేడిమాత్రమే ప్రవేశించుటయు, ప్రకాశస్య న= ప్రకాశము ప్రవేశించకుండుటయు, తద్వత్= అటులనే, చిత్ మాత్ర, ఉద్భూతిః ఏవ స్యాత్= చైతన్యముయొక్క ప్రవేశము మాత్రము కలుగును.

**కాష్ఠే త్వౌష్ణ్యప్రకాశౌ ద్వావుద్భవం గచ్ఛతో యథా।**
**శాన్తాసు సుఖచైతన్యే తథై వోద్భూతిమాప్నుతః॥ 11**

టీ॥ కాష్ఠే తు= వంట చెఱకునందైతే, ఔష్ణ్యప్రకాశౌ ద్వౌ= ఉష్ణము ప్రకాశము, రెండును, యథా= ఏ ప్రకాశము ఉద్భవం= పుట్టుకను, గచ్ఛతః = పొందుచున్నవో, తథా ఏవ= ఆ ప్రకారముగానే, శాన్తాసు= శాంతవృత్తుల యందు, సుఖచైతన్యే= ఆనందము చైతన్యము గూఢ ఉద్భూతిం ఆప్నుతః= పుట్టుచున్నవి.

అ॥ 'వస్తు' యని యిందుకు కారణము చెప్పుచున్నారు.

**వస్తుస్వభావమాశ్రిత్య వ్యవస్థా తూభయోః సమా।**
**అనుభూత్యనుసారేణ కల్ప్యతే హి నియామకమ్॥ 12**

టీ॥ వస్తుస్వభావం= మనోవృత్తులస్వభావమును, ఆశ్రిత్య= అనుసరించి, ఉభయోః= సుఖచైతన్యముల రెంటికిని. వ్యవస్థాసమా= నియమము సమానమే. అనుభూతి. అనుసారేణ= అనుభవము ననుసరించి, నియామకం= నియమము, కల్ప్యతే హి= కల్పింపబడును.

అ॥ 'న ఘోరాసు' అని అనుభవమును చూపుచున్నారు.

**న ఘోరాసు న మూఢాసు సుఖానుభవ ఈక్ష్యతే।**
**శాన్తాస్వపి క్వచిత్కశ్చిత్సుఖాతిశయ ఈక్ష్యతామ్॥ 13**

టీ॥ సుఖానుభవః= ఆనందానుభవము, ఘోరాసు= ఘోరవృత్తుల యందు, న ఈక్ష్యతే= కనబడదు. మూఢాసు న= మూఢవృత్తులయందును కనబడదు. శాన్తాసు అపి= శాన్తవృత్తులయందు గూడ, సుఖ అతిశయః= ఆనందాతిశయము, క్వచిత్= ఒకానొకపుడు, కశ్చిత్= ఒకానొకడు, ఈక్ష్యతాం= చూచుగాక.

తా॥ వి॥ జ్ఞానములేక సంపూర్ణసుఖ మబ్బనేరదు. సత్త్వవృత్తి మాత్రముచే జ్ఞానము లభించదు. సత్త్వవృత్తి, జ్ఞానము రెండును గలవానికి సంపూర్ణానందానుభవము, సత్త్వవృత్తిమాత్రమున్న చోట వృత్తినైర్మల్యము, స్వల్పభానము, ఘోరమూఢవృత్తులయందు భానమే లేకుండుట, ఇట్లు వృత్తిస్వభావమునుబట్టి ఆనందానుభవవ్యవస్థ కలుగుచున్నది. జ్ఞానికి సత్త్వవృత్తి యుండక తప్పదు. సత్త్వవృత్తి యున్నచోట నెల్ల జ్ఞానముండునను నియమము లేదు,

అ॥ ఘోరవృత్తులయందు సుఖానుభవము లేకపోవుటకు 'గృహ' యని కారణమును చూపుచున్నారు.

**గృహక్షేత్రాదివిషయే యథా కామో భవేత్తథా।**
**రాజసస్యాస్య కామస్య ఘోరత్వాత్తత్ర నో సుఖమ్॥ 14**

టీ॥ గృహ, క్షేత్ర, ఆది విషయే= గృహములు క్షేత్రములు మొదలగు వానియందు, యథా కామః భవేత్= కోరిక ఎపుడుండునో, తథా= అపుడు రాజసస్య అస్య కామస్య ఘోరత్వాత్= రజోగుణప్రధానమగు నీ కామము ఘోరస్వరూప మగుటచేత, తత్ర నో సుఖం= అచ్చట సుఖము లేదు.

అ॥ గృహక్షేత్రాదులు కామ్యము లగుటచేత ద్వేషకారణములు గూడ కావచ్చునని 'సిధ్యేత్' అని చెప్పుచున్నారు.

**సిధ్యేన్న వేత్యస్తి దుఃఖమసిద్ధౌ తద్వివర్ధతే।**
**ప్రతిబంధే భవేత్క్రోధో ద్వేషో వా ప్రతికూలతః॥ 15**



టీ॥ గృహక్షేత్రములను గూర్చిన కోర్కె, సిధ్యేత్ న వా ఇతి= సిద్ధించునా లేదా యని, దుఃఖం అస్తి= దుఃఖము కలుగును, అసిద్ధౌ= సిద్ధించ నపుడు, తత్= ఆ దుఃఖము, వివర్ధతే= హెచ్చగును. ప్రతిబన్ధే= దాని కాటంకము నందు, క్రోధః భవేత్= క్రోధ మగును. వా= లేక, ప్రతికూలతః = దానిచే సుఖము కలుగనపుడు, ద్వేషః వా= ద్వేషమైనను కలుగును. కనుక ఘోరవృత్తులయందు చిత్తకాలుష్యము హెచ్చుటకు కారణములు కలవు.

అ॥ ద్వేషము తమోగుణప్రధానము గనుక అమిత దుఃఖకారణమగు చున్నదని 'అవశ్యః' అని చూపుచున్నారు.

**అశక్యశ్చేత్ప్రతీకారో విషాదః స్యాత్స తామసః।**
**క్రోధాదిషు మహద్దుఃఖం సుఖశంకాపి దూరతః॥ 16**

టీ॥ ప్రతీకారః= ప్రతికూలమునకు ప్రతీకారము, అశక్యః చేత్= చేతకానిచో, విషాదః స్యాత్= ద్వేషము విషాద మగును. సః= ఆ విషాదము, తామసః= తమఃప్రధానము. క్రోధాదిషు= క్రోధద్వేషవిషాదములయందు, మహత్ దుఃఖం= అమితమగు దుఃఖము కలుగును. సుఖశంకా అపి= సుఖము కలుగునా యనుఅనుమానము గూడ, దూరతః= దూరమగును.

అ॥ ఈ కామ్యవృత్తులే శాంతవృత్త్యుపకారకము లగు పరిస్థితిని 'కామ్యలాభే' అని చూపుచున్నారు,

**కామ్యలాభే హర్షవృత్తిః శాన్తా తత్ర మహత్సుఖమ్।**
**భోగే మహత్తరం లాభప్రసక్తావీషదేవ హి॥ 17**

కామ్యలాభే= కోరిక లభించునపుడు, హర్షవృత్తిః= ఆనందాభి ముఖమగు మనోవృత్తి కలుగును. అది, శాన్తా= శాన్తవృత్తి. తత్ర= ఆ వృత్తియందు, మహత్ సుఖం= విస్తారము సుఖము. భోగే= లభ్యమైన దాని, యనుభవమునందు, మహత్ తరం= అంతకంటె నెక్కుడు సుఖము. లాభ ప్రసక్తౌ= కోరిక లభించు ప్రసక్తియందు ఈషత్ ఏవ హి= సుఖము స్వల్పము.

అ॥ ఇట్టి సుఖము కామనిమిత్తమగుటచేత నది యుత్తమము కానేరదు. సర్వకామనావిదూరమగు వైరాగ్య సుఖమితర సుఖము లన్నిటి కంటె నుత్తమతమ మని 'మహత్తమం' అని చెప్పుచున్నారు.

**మహత్తమం విరక్తౌతు తు విద్యానందే తదీరితమ్।**
**ఏవం క్షాంతౌ తథౌదార్యే క్రోధలోభనివారణాత్॥** 18

టీ॥ విరక్తౌతు= వైరాగ్యమునందైతే ఆనందము, మహత్ తమం= అన్నిటికంటె నుత్తమైనది. తత్= ఆవిషయము, విద్యానందే= విద్యానందప్రకరణము 10 శ్లోకమున, ఈరితం= చెప్పబడినది. క్షాన్తౌ తథా ఔదార్యే= శాంతవృత్తులగు క్షాంత్యౌదార్యములయందుగూడ, క్రోధలోభనివారణాత్= క్రోధలోభాదులు లేకపోవుటచేత, ఏవం= ఈప్రకారమే మహత్తమసుఖము లభించును. వైరాగ్యాదిశాంత వృత్తులు సత్త్వప్రధానములు గనుక వానియందలి యానందము మహత్తరమని ప్రస్తావింపబడినది. అంత మాత్రముచే నది నిర్విషయబ్రహ్మానందసుఖమని తలంపకూడదు.

అ॥ సుఖమంతయు బ్రహ్మానందప్రతిబింబనమే గనుక బ్రహ్మమే యగుచున్నదని 'యద్యత్' అని చూపుచున్నారు.

**యద్యత్సుఖం భవేత్తత్తద్బ్రహ్మైవ ప్రతిబింబనాత్।**
**వృత్తిష్వన్తర్ముఖా స్వస్య నిర్విఘ్నం ప్రతిబింబనమ్॥** 19

టీ॥ యత్ యత్ = ఏది యేది, సుఖం భవేత్= సుఖ మనిపించుకొనునో, తత్ తత్= అది యది, ప్రతిబింబనాత్= బ్రహ్మానందము బుద్ధివృత్తులయందు ప్రతిఫలించుట చేత, బ్రహ్మ ఏవ= బ్రహ్మమే యగును. అన్తర్ముఖాసు వృత్తిషు= భోగానంతరము మనోవృత్తు లన్తర్ముఖములైనపుడు, నిర్విఘ్నం= నిర్విఘ్నముగా, అస్య= ఈ బ్రహ్మానందముయొక్క, ప్రతిబింబనం = ప్రతిబింబనము కలుగును. ఇచట 11-86 శ్లోకము చూడుడు.

అ॥ శాంతవృత్తులయందు సుఖానుభవప్రకారము వర్ణింపబడినది. సుఖస్వరూపము వృత్త్యనురూపము. అట్టిసుఖ స్వరూపమును 'సత్తా' యని వివరించుచున్నారు.

**సత్తా చితిః సుఖం చేతి స్వభావా బ్రహ్మణస్త్రయః॥** 191/2

టీ॥ సత్తా= ఉనికి, చితిః= చైతన్యము, సుఖం చ ఇతి= ఆనందము అని, బ్రహ్మణః స్వభావాః= బ్రహ్మ స్వభావములు, త్రయః= మూడు అనగా బ్రహ్మసచ్చిదానంద స్వరూపము.



అ॥ ఈమూడుస్వభావము లెచటెచట స్ఫురించునో 'మృచ్ఛిలాదిషు' అని తెలియజేయుచున్నారు.

**మృచ్ఛిలాదిషు సత్తైవ వ్యజ్యతే నేతరద్వయమ్॥** 20

॥టీ॥ మృత్, శిలా, ఆదిషు= జడములగు మృత్తు శిల మొదలగువానియందు, సత్తా. ఏవ, వ్యజ్యతే= సత్తాస్వభావము మాత్రమే అభివ్యక్తమగుచున్నది. ఇతరద్వయం= తదితరములగు రెండును, న= అభివ్యక్తము కావు.

**సత్తా చితిర్ద్వయం వ్యక్తం ధీవృత్త్యోర్ఘోరమూఢయోః।**
**శాన్త వృత్తౌ త్రయం వ్యక్తం మిశ్రం బ్రహ్మేత్థమీరితమ్॥** 21

॥టీ॥ ఘోర మూఢయోఃధీవృత్త్యోః= ఘోరమూఢవృత్తులయందు, సత్తాచితిః ద్వయం= సత్తా చైతన్యము ఈ రెండును, వ్యక్తం= అభివ్యక్తమగును. శాన్తవృత్తౌ= శాన్తవృత్తియందు, త్రయం= సత్తాచిత్సుఖములు మూడును, వ్యక్తం= అభివ్యక్తమగును. ఇత్థం= ఈవిధముగా, బ్రహ్మ= బ్రహ్మము, మిశ్రం= మాయా మిశ్రమని, ఈరితం= చెప్పబడినది. 20-21

అ॥ ఇక నమిశ్రబ్రహ్మవృత్తిస్థానమును 'అమిశ్రం' అని చూపుచున్నారు.

**అమిశ్రం జ్ఞానయోగాభ్యాం తౌ చ పూర్వముదీరితౌ।**
**ఆద్యేఽధ్యాయే యోగచిన్తా జ్ఞానమధ్యాయయోర్ద్వయోః॥** 22

టీ॥ అమిశ్రం బ్రహ్మ= మనోవృత్తిసంబంధములేని పరబ్రహ్మానందము, జ్ఞానయోగాభ్యాం= జ్ఞానముచేతను యోగముచేతను లభించును. తౌ చ= ఆ రెండును, పూర్వం 11-12-13 అధ్యాయములలో, ఉదీరితౌ= చెప్పబడినది, ఆద్యే అధ్యాయే= మొదటిదగు యోగానందమునందు, యోగచిన్తా= యోగమును గూర్చిన విచారణము, ద్వయోః అధ్యాయయోః= ఆత్మానందాద్వైతానందములందు, జ్ఞానం= జ్ఞానము వివరింపబడినది.

అ॥ బ్రహ్మము యొక్క సచ్చిత్సుఖస్వభావములకు భిన్నములగు అసత్తాజాడ్యదుఃఖములు మాయారూపమని 'అసత్తా' యని చెప్పుచున్నారు.

**అసత్తా జాడ్యదుఃఖే ద్వే మాయారూపత్రయం త్విదమ్॥** 221/2

టీ॥ అసత్తా= అవాస్తవభావము, జాడ్యదుఃఖే ద్వే= జాడ్యము దుఃఖము ఈ రెండును, ఇదం తు= ఇవి అయితే, మాయారూపత్రయం= మాయయొక్క మూడురూపములు

అ॥ ఈ మాయారూపత్రయము స్ఫురించు స్థానములను 'అసత్తా' యని చెప్పుచున్నారు.

**అసత్తా నరశృంగాదౌ జాడ్యం కాష్ఠశిలాదిషు।** 23
**ఘోరమూఢధియోర్దుఃఖమేవం మాయావిజృంభితా॥** 23 1/2

టీ॥ అసత్తా= అసత్త, నరశృంగాదౌ= మనుష్యుల కొమ్ములయందు, జాడ్యం= జడత్వము, కాష్ఠశిలాదిషు= కాష్ఠశిలాదులయందు, దుఃఖం= దుఃఖము, ఘోరమూఢధియోః= ఘోరమూఢబుద్ధులయందు, ఏవం= ఈవిధముగా, మాయా= మాయ, విజృంభితా= ప్రపంచమంతయు వ్యాపించినది.

అ॥ 21 శ్లోకములో నుదాహరింపబడిన మిశ్రబ్రహ్మను 'శాంతాది' అని నిర్వచనము చేయుచున్నారు.

**శాంతాదిబుద్ధివృత్త్యైక్యాన్మిశ్రం బ్రహ్మేతి కీర్తితమ్॥** 24

టీ॥ శాంతాదిబుద్ధివృత్తి ఐక్యాత్= శాంతఘోరతా మసబుద్ధివృత్తుల యొక్క వివేచన లేక పోవుటవలన, బ్రహ్మ మిశ్రం ఇతి= బ్రహ్మానందము మిశ్రమని 21 శ్లోకమునందు, కీర్తితం= చెప్పబడినది.

అ॥ దీని ప్రయోజనమును, ఏవం, అని చూపుచున్నారు.

**ఏవం స్థితేఽత్ర యో బ్రహ్మ ధ్యాతుమిచ్ఛేత్పుమానసౌ।**
**నృశృంగాదిమపేక్షేత శిష్టం ధ్యాయేద్యథాయథం॥** 25

టీ॥ ఏవం స్థితే= మాయాబ్రహ్మల రూపత్రయ మిట్లుండ, యః= ఎవడు, బ్రహ్మ ధ్యాతుం ఇచ్ఛేత్= బ్రహ్మను ధ్యానింపగోరుచున్నాడో అటువంటి, అసౌపుమాన్= ఈ పురుషుడు, నృశృంగాదిం= నరశృంగముల వంటి యసత్యములగు మాయోపాధులను, ఉపేక్షేత= ఉపేక్ష చేయవలెను. శిష్టం= మిగిలిన బ్రహ్మను, యథా యథం= యోగ్యమగు రీతిని, ధ్యాయేత్= ధ్యానింపవలెను.



అ॥ యథా యథం అను పదమును 'శిలాదౌ' అని వివరించు చున్నారు.

**శిలాదౌ నామరూపే ద్వే త్యక్త్వా సన్మాత్రచిన్తనమ్।**
**త్యక్త్వా దుఃఖం ఘోరమూఢధియోః సచ్చిద్విచిన్తనమ్॥** 26

**శాన్తాసు సచ్చిదానందాంస్త్రీనప్యేవం విచిన్తయేత్॥** 26 1/2

టీ॥ శిలాదౌ= శిలాదులయందు, నామరూపే, ద్వే త్యక్త్వా= నామ రూపము లవాస్తవములు గనుక వానిని వదిలివేసి, సత్ మాత్ర. చింతనం= వానియందున్న సత్తాధర్మమును మాత్రము చింతించుట, ఘోర, మూఢధియోః= ఘోరమూఢబుద్ధివృత్తులయందు, దుఃఖం= దుఃఖమును, త్యక్త్వా= వదలి, సత్, చిత్ విచిన్తనం= సత్తాచైతన్యముల విచారణము, శాంతాసు = శాన్తవృత్తులయందు, సత్, చిత్ ఆనందాన్ త్రీ౯ = సత్తాచిత్సుఖములమూడింటిని, ఏవం చింతయేత్ = ఈ విధముగా చింతనము చేయవలెను. 20-21 శ్లోకములు చూడుడు.

అ॥ ఈ ధ్యానము త్రివిధమని 'కనిష్ట' మని చెప్పుచున్నారు.

**కనిష్ఠమధ్యమోత్కృష్టాస్తిస్రశ్చిన్తాః క్రమాదిమాః॥** 27

టీ॥ ఇమాః చిన్తాః= ఈ మూడు విధముల చింతనము, క్రమాత్= సత్తామాత్రము సత్తాచైతన్యములు, సచ్చిత్సుఖములు ఇట్లు వరుసగా తిస్రః = మూడును, కనిష్ఠ మధ్యమ, ఉత్కృష్టాః= కనిష్ఠము, మధ్యమము, ఉత్కృష్టము లగుచున్నవి.

అ॥ నిర్గుణబ్రహ్మానధికారులకు మిశ్రబ్రహ్మచింతనమును 'మన్దస్య' అని నిర్దేశించుచున్నారు.

**మన్దస్య వ్యవహారేఽపి మిశ్రబ్రహ్మణి చింతనమ్।**
**ఉత్కృష్టం వక్తుమేవాఽత్ర విషయానంద ఈరితః॥** 28

టీ॥ మన్దస్య= మందబుద్ధి గలవానికి, వ్యవహారే అపి= లౌకికము నందు ప్రసక్తుడైనపుడుగూడ, మిశ్రబ్రహ్మణి చింతనం= మిశ్రబ్రహ్మను సంధానము, ఉత్కృష్టం = శ్రేష్ఠమైనదని, వక్తుం ఏవ= బోధించుటకై, విషయానన్దః ఈరితః= విషయానందము చెప్పబడినది.

తా॥ వి॥ అత్యన్త బుద్ధిమాంద్యము మొదలగు విప్రతిపత్తులు గల వానికి నిర్గుణబ్రహ్మోపాసన 9-54-132 శ్లోకములయందు బోధింపబడినది. విషయానందమునందు చూపబడిన ప్రక్రియ, మాయాబ్రహ్మముల మిశ్రిత రూపములనుండి అనగా అసత్తు జాడ్యము, దుఃఖములనుంచి సచ్చిత్సుఖ ములను వివేకముచేసి చింతనము చేయుట అగును. ఇచట సగుణ బ్రహ్మోపాసనము చెప్పబడినది.

అ॥ బుద్ధివృత్తి విరహితావస్థయందు చేయు ధ్యానముత్కృష్టమని ఔదాసీన్యే అని తెలుపుచున్నారు.

**ఔదాసీన్యే తు ధీవృత్తేశ్శైథిల్యాదుత్తమోత్తమమ్।**
**చింతనం వాసనానందే ధ్యానముక్తం చతుర్విధమ్॥** 29

టీ॥ ఔదాసీన్యే తు= సుఖదుఃఖాంతరాలములయందు వృత్తులు లేక తూష్ణీం భావమున నున్న మానసికావస్థయందు, ధీవృత్తేః శైథిల్యాత్= బుద్ధివృత్తు లుండకుండుటచేత, ఆ సమయమున, చింతనం ఉత్తమ ఉత్తమం = బ్రహ్మస్వభావచింతనము శ్రేష్ఠతమము. వాసనానందే = వాసనానందసందర్భమున, ధ్యానం ఉక్తం= ధ్యానము చెప్పబడినది.ఇట్లు ధ్యానము, చతుర్విధం= నాలుగు విధములు.

తా॥ వి॥ సత్తామాత్రమును ధ్యానించుట కనిష్ఠము సత్తాచిత్తుల ధ్యానించుట మధ్యమము సత్తాచిత్సుఖముల మూటిని ధ్యానించుట ఉత్తమమని ధ్యేయవిషయమునుబట్టి ధ్యానము మూడువిధములుగ పై 27 శ్లోకమున విభజింపబడినది. మందునికి వ్యవహారకాలమునందు గూడ ధ్యానము చెప్పబడినను, ముఖ్యకాల మౌదాసీన్యావస్థ యగును. ఈయౌదాసీన్యావస్థ 11-94-96 శ్లోకములలో వివరింపబడినది. కనుక ధ్యానము ధ్యేయవిషయమును బుట్టి మూడు విధములు, ధ్యానకాలమును బట్టి యొక విధము మొత్తము నాల్గు విధములుగ నిచట వివరింపబడినది.

అ॥ 9 వప్రకరణమున వివరింపబడిన ధ్యానమునకు వృత్తి విరహితముగ నిచట ఉత్తమోత్తమముగా ప్రస్తావింపబడిన ధ్యానమునకు భేదమును 'న ధ్యానం' అని చూపుచున్నారు.



**న ధ్యానం జ్ఞానయోగాభ్యాం బ్రహ్మవిద్యైవ సా ఖలు।**
**ధ్యానేనైకాగ్ర్యమాపన్నే చిత్తే విద్యా స్థిరీభవేత్॥** 30

టీ॥ జ్ఞానయోగాభ్యాం = 11-12-13 ప్రకరణముల యందు వివరింపబడిన జ్ఞానయోగముల వలన గలుగు జ్ఞానము, ధ్యానం న= ధ్యానము కాదు. సా= అది, బ్రహ్మవిద్యా ఏవఖలు= బ్రహ్మవిద్యయే కదా! ధ్యానము వలన నేమి ప్రయోజనమను శంకకు సమాధానము చెప్పుచున్నారు, ధ్యానేన= ధ్యానముచేత, చిత్తే= చిత్తము, ఏకాగ్ర్యం ఆపన్నే= ఏకాగ్రతను పొందుచుండగా, విద్యా= బ్రహ్మజ్ఞానము, స్థిరీభవేత్= స్థిరమగును.

తా॥ వి॥ 11-12-13 ప్రకరణములలో వృత్తివిరహితమగు బ్రహ్మ విద్యయే యుపదేశింపబడినది కాని ధ్యాన ముపదేశింపబడలేదు. ధ్యానము మనోవృత్తివిశేషము. అది 9వ ప్రకరణవిషయము. దానివలన చిత్తైకాగ్ర్యము అందువలన విద్యాస్థైర్యము కలుగుచున్నది. 9-126-142 శ్లోకములు చూడవలెను. ఇట్లు ధ్యానము బ్రహ్మవిద్య కుపకారకమగుచున్నది.

అ॥ అఖండైకానందరససాక్షాత్కారమున కుపయోగించుటవలన బ్రహ్మవిద్యకు విద్యాత్వము కలిగినదని 'విద్యాయాం' అని చెప్పుచున్నారు.

**విద్యాయాం సచ్చిదానందా అఖండైకరసాత్మతామ్,**
**ప్రాప్య భాంతి న భేదేన భేదకోపాధివర్జనాత్॥** 31

టీ॥ విద్యాయాం= జ్ఞానదశయందు, సచ్చిదానన్దాః= సచ్చిదానంద ములు మూడును, అఖండ, ఏక రస ఆత్మతాం= విభాగములు లేని యేకస్వరూపమును, ప్రాప్య= పొంది, భాన్తి= ప్రకాశించుచున్నవి, భేదక, ఉపాధి, వర్జనాత్= భేదమును కల్పించు నుపాధులు లేకుండుటచే, భేదేన= భేదముతో, న= ప్రకాశింపవు. ఈశ్లోకమును మరియొకరీతిగా నన్వయింప వచ్చును, విద్యాయాం= బ్రహ్మవిద్యయందు సచ్చిదానన్దాః= సచ్చిదానంద ములు, అఖండైకర్మసాత్మతాం= ఏకస్వరూపమును, ప్రాప్య భాన్తి= పొంది ప్రకాశించుచున్నవి. భేదకోపాధివర్జనాత్ భేదేన న భాన్తి= భేదములు కల్పించు నుపాధులు లేకుండుటచే భేదము కనబడదు.

తా॥ వి॥ తత్త్వజ్ఞానికి ఉపాధిభేదము లేదు. కనుక నతనికి నిరుపాధికము నిర్విషయము నగు సచ్చిదానందరూప మఖండైకరసముగ

గాన్పించును. ధ్యానమునం దీమూడును భానమగుచున్నను భిన్నముగా భానమగుచుండును. విద్యయందు వలె నేకరూపమును పొందనేరవు. ఇట్లు బ్రహ్మవిద్య ధ్యానముకంటె విలక్షణము.

అ॥ ఇట్టి భేదకోపాధులను తొలగించుట కుపాయములను శాన్తాః అని చూపుచున్నారు.

**శాన్తా ఘోరాః శిలాద్యాశ్చ భేదకోపాధయో మతాః।**
**యోగాద్వివేకతో వైషాముపాధీనామపాకృతిః॥ 32**

టీ॥ శాన్తాః ఘోరాః= శాన్తములు ఘోరములను బుద్ధివృత్తులు, భేదకోపాధయః మతాః= భేదములు కలుగచేయు నుపాధులని యంగీకరింప బడినవి. యోగాత్= యోగముచేతనో, వా= లేక, వివేకతః= వివేచనము చేతగాని, ఏషాం ఉపాధీనాం= ఈ యుపాధులయొక్క, అపాకృతిః= నిరాకరణము కలుగుచున్నది.

తా॥ వి॥ సచ్చిదానందములు మూడు ఘోరశాంత వృత్తులయందు క్రమముగా భానమగుటచే భిన్నములుగ స్ఫురించుచున్నవి. భేదకారణము లగు నుపాధులను చిత్త నిరోధము చేతగాని వివేచనముచేగాని ప్రత్యేకించి తొలగించినచో నిర్వి శేషములగు సచ్చిత్సుఖము లేకాకారమున భానమగును. ఇట్లు విషయానందము బ్రహ్మానందమునకు ద్వారభూతమగు చున్నది.

అ॥ ఉపాధులు తొలగిపోయినపుడు భూమానందము లభించునని నిరుపాధి యని చెప్పుచున్నారు.

**నిరుపాధిబ్రహ్మతత్త్వే భాసమానే స్వయంప్రభే।**
**అద్వైతే త్రిపుటీ నాస్తి భూమాఽఽనన్దోఽత ఉచ్యతే॥ 33**

టీ॥ స్వయంప్రభే= స్వయంప్రకాశమై, భాసమానే= ప్రకాశించుచున్న, అద్వైతే=అద్వయమగు, నిరుపాధిబ్రహ్మతత్త్వే= నిరుపాధికమగు బ్రహ్మతత్త్వమునందు, త్రిపుటీ= జ్ఞాతృజ్ఞానజ్ఞేయస్వరూపమగు త్రిపుటీ, న అస్తి= లేదు. అతః= అందుచేత నా బ్రహ్మానందము, భూమానన్దః ఉచ్యతే= భూమానందమని చెప్పబడుచున్నది.

తా॥ వి॥ భూమబ్రహ్మశబ్దములు రెంటికిని అత్యంతము పెద్దదియని యర్థము అనగా దీనికంటె మరియొకటిపెద్దది లేదని భావము.



అద్వితీయము అనంతము గనుక బ్రహ్మకిట్టి భూమలక్షణము కుదురు చున్నది. సవై భూమా (ఛాం 7-) యను శ్రుతి ఇచట ప్రస్తుతము. పదునొకండవ ప్రకరణము మొదలు పదునైదవప్రకరణము వరకుగలవై దుప్రకరణములు బ్రహ్మానందమను పేర వ్యవహరింపబడుచున్నవి. బ్రహ్మానందము నిరుపాధికము నిర్విశేషము. ఉపలబ్ధిమార్గభేదమును బట్టి బ్రహ్మానందమే యోగానందాత్మానందాద్వైతానందములను నామముల ప్రకరణత్రయమున వివరింపబడినవి. ఈ ప్రకరణ త్రయవిషయము బ్రహ్మవిద్య గాని ధ్యానముకాదని స్పష్టముచేయబడినది. విద్యానంద మభ్యాసపాటవముచేత బ్రహ్మానందము కాగలదని పదునాల్గవ ప్రకరణాంత మున చెప్పబడినది. విషయానందము భౌమానందము కాగల ఉపాయము ఇచట చూపబడినది గనుక నీనైదు ప్రకరణములకు బ్రహ్మానందమొకటియే విషయమని యేకవాక్యత ఘటిల్లుచున్నది.పూర్వగ్రంథముతో నీనైదు ప్రకరణముల కేకవాక్యత ఘటించుచున్నట్లు పదునొకండవ ప్రకరణారంభ మున చూపబడినది. బ్రహ్మభూమపదము లేకార్థకములని చూపబడినది.

అ॥ ప్రకరణమును 'బహ్మానన్ద' యని యుపసంహరించుచున్నారు.

**బ్రహ్మానందాభిధే గ్రన్థే పఞ్చమోఽధ్యాయ ఈరితః।**
**విషయానన్ద ఏతేన ద్వారేణాన్తః ప్రవిశ్యతామ్॥ 34**

టీ॥ బ్రహ్మానంద, అభిధే గ్రన్థే= బ్రహ్మానందమను పేరుగల ఈ గ్రంథభాగమునందు విషయానన్దః= విషయానందమను పంచమః అధ్యాయః = ఐదవ ఆధ్యాయము, ఈరితః= చెప్పబడినది. ఏతేన ద్వారేణ= ఈ విషయా నన్దముద్వారా, అన్తః ప్రవిశ్యతాం= బ్రహ్మానందమున ప్రవేశింతురు గాక.

తా॥ వి॥ గుహాన్తఃపరివేష్టితమగు ప్రత్యగభిన్నపరమాత్మసార్వభౌముని దర్శనమునకు సర్వజనసామాన్యమైనట్టియు, అద్వైతరహస్యదుర్గమునకు బాహ్యద్వారమైనట్టియు విషయానందముఖమున అంతఃపురప్రవేశము గలుగుగాక!

అ॥ ముముక్షుజనానుగ్రహముకొరకు కారంభింపబడిన నీ మహా గ్రంథముయొక్క యారంభమునందువలెనే అంతమునందుగూడ మంగళా చరణము చేయుచు ప్రత్యగభిన్నపరమాత్మచేయు సృష్టిస్థితి లయము లయం

దధికృతులగు హరిహరాద్యనేకాకారముల, నవతరించిన పరమేశ్వరుని పాదపంకజములయందు తన కృతిని 'ప్రీయాత్' అని సమర్పించుచున్నారు.

**ప్రీయాద్ధరిర్హరో౽నేన బ్రహ్మానన్దేన సర్వదా।**
**పాయాచ్చ ప్రాణినః సర్వాన్ స్వాశ్రితాన్ శుద్ధమానసాన్॥ 35**

టీ॥ హరిః హరః= హరిహరాత్మకుడగు పరమేశ్వరుడు, అనేన బ్రహ్మానన్దేన= ఈ బ్రహ్మానందముచేత ప్రీయాత్= సంతోషించుగాక స్వాశ్రితా ॥ = నిజభక్తులును, శుద్ధమానసాన్= నిర్మలమనస్కులును నగు, సర్వా ॥ ప్రాణి నః= సర్వప్రాణులను, సర్వదా= ఎల్లపుడును పాయాత్ చ= రక్షించును గాక.

తా॥ వి॥ హరిహరశబ్దములచేత వివిధదేవతలయందభేదబుద్ధి సూచింపబడుచున్నది, హరిహరః యని పాఠాంతరమును కొంతమం దిచట కల్పించుచున్నారు. బుక్కభూపాల పుత్రుడగు హరిహరుడు శ్రీవిద్యారణ్య చరణులచేత విజయనగర సామ్రాజ్యమునందు క్రీ.శ. 1366 సం॥ లో పట్టాభిషిక్తుడు గావింపబడెను. అతనికి తత్త్వజ్ఞానసిద్ధి నీ శ్లోకమున ఆశీః పూర్వకముగ ప్రసాదించుచున్నారని ధ్వని.

శ్రీభారతీసంప్రదాయసార్వభౌమ, జగద్గురు శ్రీ కళ్యాణానంద
భారతీమాంతాచార్యాత్యంత ప్రియాంతేవాసియు అత్రి
గోత్ర సముద్భూతుడును ఉభయకులపవిత్రుడును
నగు లింగన సోమయాజిచే విరచిత
మగు వేదాంతపంచదశి కళ్యాణామృత
మను ఆంధ్రవ్యాఖ్యాసమేతమగు
బ్రహ్మానందనందు విషయానందము
సమాప్తము.
వేదాంత పంచదశి - సంపూర్ణము.

**బ్రహ్మార్పణం బ్రహ్మహవి ర్బ్రహ్మాగ్నౌ బ్రహ్మణా హుతమ్।**
**బ్రహ్మైవ తేన గన్తవ్యం బ్రహ్మకర్మసమాధినా॥**